**THIRUVACHAGAM IN TELUGU**

## శ్రీ మాణిక్యవాచగర్

# తిరువాచగం

**(తమిళ మూలమునకు తెలుగు తాత్పర్యము)**

అనువాద కర్త

క్రిష్ణ శెవ్వాన

# Sri Manickkavachagar
# THIRUVACHAGAM IN TELUGU
# For Tamil Moolam – Telugu Meaning

Telugu Translation by
**Krishna Sevvana**

First Edition:

Address: S.R. Krishna Rao
H 303, Aparna Cyber Commune
Nallagandla, Hyderabad 500019.
sevvanakrishna@yahoo.com
Mobile: 97046 55002

Price: Rs. **150/-**

పూజ్య మాతా, పితలకు

**కీ॥శే॥ శెవ్వాన నాగరత్నమ్మ** గారికి

**కీ॥శే॥ శెవ్వాన రంగనాయకులు** గారికి

హృదయ పూర్వక పాదాభి వందనములు

# ఓం గం గణపతయేనమః

## గురు స్తుతి

గురుర్బ్రహ్మాః గురుర్విష్ణుః గురుర్దేవోః మహేశ్వరః గురుస్సాక్షాత్ పరబ్రహ్మా తస్మై శ్రీ గురవేనమః
అజ్ఞాన తిమిరాంధస్య జ్ఞానాంజన శలాకయా చక్షురున్మీలితం యేన తస్మై శ్రీ గురవేనమః

షోడశాక్షరీ మంత్రోపదేశము చేసి
అనువాదము చేయుటకు ఆజ్ఞ ఇచ్చి
శిష్యునిపై తాబేలు వంటి దృష్టి సలిపి
హిరణ్య గర్భమున పరబ్రహ్మను దర్శించిన
సాంఖ్యయోగి, మృదుభాషి, మితభాషి
అన్ని ధర్మముల కన్న గృహస్థాశ్రమమే గొప్పదని
చాటి చెప్పి, తనూ అదే అనుసరించుచున్న

**కీ॥శే॥ పూజ్య శ్రీశ్రీశ్రీ నిత్యానంద్ గురువుగారికి**

కపిల కృష్ణ మఠము

చూలై, చెన్నై-600112

హృదయ పూర్వక పాదాభివందనములు

## దైవ స్తుతి

ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపల నుండు లీనమై
ఎవ్వని యందుడిందు, పరమేశ్వరుడెవ్వడు
మూల కారణం బెవ్వడ నాది మధ్యలయుడెవ్వడు
సర్వముతానయైన వాడెవ్వడు, వాని, నాత్మ
భవునీశ్వరు నేశరణంబు వేడెదన్!!

# రక్ష

షోడశాక్షరీ మంత్రోపదేశము చేసి
అనువాదము చేయుటకు ఆశీర్వదించిన
నా జ్ఞాన గురుదేవులును,
ప్రపంచమును రక్షించుచున్న
ధర్మము యొక్క నాలుగు పాదములైన
సత్యము, అహింస, దయ, శాంతి
ఈ పుస్తకమునకు శ్రీరామరక్ష.

# అంకితము

నా బాల్య మిత్రుడు, సత్సంగ శ్రేయోభిలాషి
మృదుభాషి, మితభాషి,
సద్గుణవంతుడు, శుద్ధ బ్రహ్మాచారి,
ధ్యానమున భాస్కరుని దర్శించి,
జ్ఞాన గురుదేవుల మెప్పు పొంది,
ముప్పది రెండవ ఏటనే మింటికేగి
శివ సాయుజ్యము పొందిన
పూజ్య కీ॥శే॥ **శ్రీ బత్తుల రామగోపాలు** గారికి
హృదయ పూర్వక పాదాభివందనములతో
సవినయ సమర్పణ.

# కృతజ్ఞతలు

ఈ పుస్తకము డి.టి.పి. మరియు ప్రచురణకు ఆర్థిక సహాయము చేసిన పుత్రుడు శెవ్వాన సురేంద్రనాథ్ మరియు పుత్రిక శెవ్వాన/సిద్ధాబత్తుల శోభన వారికి, వారి కుటుంబసభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతూ వారికి ఆయురారోగ్యములతో సర్వఐశ్వర్యములు, ఆధ్యాత్మిక చింతన, జ్ఞానప్రాప్తి కలగాలని, సర్వాభీష్టములు నెరవేరాలని దేవాదిదేవుణ్ణి ప్రార్థిస్తున్నాము.

కొన్ని విశేషార్థముల కొరకు ఇంగ్లీష్, తమిళ వివరణలను పరిశీలించబడినవని, వారి ఒక్కొక్కరికి కృతజ్ఞతా హృదయపూర్వక పాదాభివందనములు తెలుపుతూ...

ఈ పుస్తకమున తెలుగు అక్షర, పద, వ్యాకరణ దోషములను సరిదిద్దిన ప్రభుత్వ హైస్కూలు సీనియర్ ఉపాధ్యాయిని శ్రీమతి ముత్తిరెడ్డి లక్ష్మీ,ఎమ్.ఎ., ఎమ్.ఇ.డి., ఎమ్.ఎ., ఎమ్.ఎ. కి, అనువాద పర్యవేక్షణ భాగములో వ్యాకరణ దోషములను సరిదిద్దిన అపర్ణా సరోవర్, హైదరాబాద్ నివాసియైన శ్రీ పి.వి.ఎస్.ఎస్. శాస్త్రి గారికి మరియు డా|| జి.ఎస్.ఎన్. మూర్తి గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతూ...

డి.టి.పి. ప్రూఫ్ రీడింగ్, దోషములు సరిదిద్దిన కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతూ...

శాస్త్రపరిజ్ఞానము, భాషాపాండిత్యము గణింపక భావన మాత్రము గ్రహింపవలెనని మనవి చేయుచూ...

ఏవైనా తప్పులు ఉన్నచో ఈ అనువాదకర్తయే కారణమని తెలుపుతూ, వాటిని మన్నింపగోరి, పున:ప్రచురణలో చేర్పులు మార్పులు చేసెదమని సవినయముగా తెలుపుచున్నాము.

ఇట్లు

సుధీజన విధేయుడు

క్రిష్ణ శెవ్వాన

# స్పందన

శ్రీ మాణిక్యవాచగర్ వ్రాసిన తమిళగ్రంథం యొక్క తెలుగు అనువాదం ఈ పుస్తకం. మధురై పట్టణానికి దగ్గరలో శ్రీ మాణిక్యవాచగర్ 9వ శతాబ్దంలో జన్మించారని చెప్తారు. మహాభక్తుడు, ఎల్లప్పుడు శివధ్యానంలోనే వుండే యోగి అయిన శ్రీ మాణిక్యవాచగర్ లౌకికంగా ఉన్నత పదవులు అలంకరించినవారే. వారి ఒక్కొక్క స్తుతి, స్తోత్రం, కీర్తన ఎంతో అర్థవంతమయినవి. అటువంటి లోతైనవాటిని సరళమైన భాషలో భావం చెడకుండా శ్రీ కృష్ణ శెవ్వానగారు తెలుగులో అనువదించారు. ఇదే కాకుండా శ్రీ కృష్ణగారు కపిలమహర్షి సాంఖ్యయోగం, తిరుక్కురళ్, తిరుప్పావై–తిరుపల్లాండు, తిరుమంత్రము కూడా తెలుగు అనువాదం చేశారు. ఇవన్నీ అమూల్యమైన తమిళ సంపద.

ఈ పుస్తకం తమిళంలో ఒక పారాయణ గ్రంథం వంటిది. శివతత్త్వాన్ని స్పష్టంగా తెలియజేస్తుంది. తెలుగులో ఈ స్తుతులు, కీర్తనలు 51 అధ్యాయాలుగా వివరించారు. పదిపది చొప్పున కొన్ని దశకాలు ఉన్నాయి. తెలుగు పాఠకులు తేలికగా చదివి అర్థం చేసుకోవచ్చు. నమఃశివాయతో మొదలుపెట్టి జ్ఞాన, భక్తి, వైరాగ్యాలు కొరకు ఈశ్వరకృప అవసరం తెలియచేశారు. దీనికి ఈశ్వరప్రసన్నం కొరకు స్తోత్రాలు, కీర్తనలు భక్తునికి అత్యంత ఆవశ్యకం.

తెలుగువారయిన శ్రీ కృష్ణ శెవ్వాన గారు ఉన్నత ఉద్యోగరీత్యా మద్రాసులో ఉంటూ, వారి గురువుగారి ఆదేశం మేరకు తమిళగ్రంథాల పరిశీలనతో బాటు, తమిళంలో పట్టు సాధించి తమిళగ్రంథాల అనువాదం చేశారు. ఇది ఎంతో గొప్ప విషయం. కొన్ని సందర్భాలలో తమిళ పదానికి సరైన తెలుగు అర్థం కొరకు ఆయన పడిన శ్రమ, తాపత్రయం నేను ప్రత్యక్షంగా చూశాను. శరీరం సహకరించకపోయినా ఈ గ్రంథాలు తెలుగులో అనువదించడం ఆయన పట్టుదలకీ, ఈశ్వర అనుగ్రహానికీ, ఆయన గురువుల ఆశీర్వచనానికీ నిదర్శనం.

వారు మరింత ఆధ్యాత్మిక ప్రగతి పొందాలని ఆశిస్తూ ....

సర్వం శివార్పణం

ఇట్లు
బుధజన విధేయుడు
**డా॥ జి.ఎస్.ఎన్ మూర్తి**
అపర్ణ సైబర్ కమ్యూన్, హైదరాబాద్

నల్లగండ్ల
27-12-2022

# సంగ్రహ జీవిత చరిత్ర

"తిరువాచగం" రచించిన శ్రీ మాణిక్యవాచగర్ తమిళనాట పాండ్యదేశమైన మదురై పట్టణమునకు 7 మైళ్ల దూరములోనున్న తిరువాదపూర్‌లో తెలుగు బ్రహ్మణ కుటుంబములో జన్మించిరి. తండ్రి శంభు పాదశిరుత్తర్, తల్లి శివజ్ఞానావతి. రాజు పరిపాలించిన కాలముబట్టి ఇతని జన్మ సం॥ క్రీ॥శ 9వ శాతాబ్దిలోని ది (852AD-885AD) గా నిర్ణయించబడినది. జేష్టమాసమున మఖనక్షత్రమునందు జన్మించిరి. తిరువాదవూర్‌లో జన్మించినందువలన అతనికి జన్మనామము కూడా తిరువాదవూరార్ అని పిలువబడిరి. 16 సం॥ వచ్చేసరికి సకల శాస్త్ర పారంగతుడై అన్నింటా పాండిత్యము పొందిరి. 9వ శతాబ్దిన పరిపాలించిన హరిమర్తన పాండ్యుడు ఈతని విషయమెరిగి ఆహ్వానించి మంత్రి పదవి ఇచ్చి గౌరవించుటచే పేరు ప్రఖ్యాతి గడించిరి. అతని శాస్త్ర ప్రావీణ్యత, శక్తి సామర్థ్యములకు ముగ్దులైన పాండ్యరాజు అతనికి "తెన్నవన్", "బ్రహ్మరాయుడు" అని బిరుదులను నొసంగి గౌరవించిరి. ధర్మనియతి తప్పక తన మంత్రి పదవిని నిర్వహించుచూ వచ్చిరి. లౌకిక జీవితముకన్నా అధ్యాత్మిక, భక్తి మార్గమునకే వెళ్లుటకు ఆయన మనస్సు ఉవ్విళ్లూరుతలాడసాగెను.

చోళదేశపు సముద్రతీరమున మంచియుద్ద గుర్రములు అరేబియా నుండి వచ్చి, విక్రయించుచున్నట్లు పాండ్యరాజునకు తెలియవచ్చినది. తన దేశ రక్షణనకు యుద్ధ గుర్రములను కొనుగోలు చేయనెంచి, అందులకు తగిన వ్యక్తిని ఎంచగోరి, తుదకు తన మంత్రి తిరువాదవూరార్ యే తగినవాడని ఎంచి, నియమించి, కొనుగోలునకు కావలసిన సొమ్మును అతనికిచ్చి పంపిరి.

తిరువాదవూరార్ సొమ్ము, పరివారముతో యుద్ధ గుర్రములు కొనుగోలుకు బయలుదేరిరి. మార్గమధ్యమున తిరుపెరుందురై ఊరు చేరుకొనిరి. చక్కటి పచ్చదనము, ఉద్యాన వనములతో దట్టముగా అల్లుకొనియున్న ఆ తిరుపెరుందురైలో, ఒక జ్ఞాన గురువు తన శిష్యబృందమునకు శివజ్ఞానమును బోధించుచుండిరి. దానిని విని, తిలకించిన తిరువాదవూరార్ పరవశించి, తన వశము మరచి తనను శిష్యునిగా చేర్చుకొనవలెనని వేడుకొనెను.

(పరమశివుడే జ్ఞాన గురువుగా వచ్చి శివబోధ చేసినట్లు ఐతిహ్యాము)

తను కోరినట్లే జ్ఞానగురువు అతని 'శివజ్ఞానం' బోధించి శిష్యునిగా చేసుకొనిరి.

తన, ఆత్మ, శరీరము, తన వస్తువులనన్నింటిని దైవమునకు అర్పించి, హృదయము ద్రవించునట్లు, శరీరము శుష్కించునట్లు, ఆనందపరవళ్లు త్రొక్కునట్లు, శివస్తోత్రములు, దివ్యవాచకములు పాడి శివుని కీర్తించిరి. జ్ఞానగురువు (శివుడు) వీటినన్నింటిని విని, సంతసించి, పద్యములు రత్నమాణిక్యములవలె నుండుటచే అతనికి "మాణిక్యవాచగర్"

అను నామమును నుడివి, ఇకపై దైవసేవ చేయుమని చెప్పి తన శిష్యబృందముతో అంతర్ధానమైరి.

మహాదేవుని (శివుని) ఆజ్ఞానుసారముగా సన్యాసము స్వీకరించిన మాణిక్యవాచగర్, తన వద్దనున్న సొమ్మంతయూ తిరుపెందురైలోని దేవాలయ నిర్మాణమునకే ఖర్చుచేసిరి. గుర్రములు కొనుగోలుకి ఇచ్చిన సొమ్మంతయు ఖర్చుచేసినదిగాక, తనను శైవుల సేవకే అర్పించుకొనెను. తన మంత్రి పదవిని మరచిరి.

జరిగినదంతయు పాండ్యరాజుకి తెలియవచ్చినది. ఆగ్రహించిన రాజు, వెంటనే గుర్రములతో రావలెనని ఆజ్ఞాపత్రము పంపిరి.

ఆజ్ఞా సందేశము చూచిన మాణిక్యవాచగర్ భయపడి దైవము ముందు మొరపెట్టుకొనెను.

"శ్రావణమాసము, మూలానక్షత్రము నాడు యుద్ధ గుర్రములతో, వచ్చెదనని రాజుకి సందేశము పంపి శాంతముగా నుండు" మని శివుడు అనుగ్రహించెను. అట్లే మాణిక్యవాచగర్ రాజునకు సందేశము పంపి మిన్నకుండిరి.

గడువు ఆసన్నమైనది. గుర్రములు జాడ తెలియలేదు.

రాజు మాణిక్యవాచగర్ యొక్క ఉన్నతిని, ధర్మనియతిని తలంచక ఆగ్రహించి, అతనికి శిక్ష వేయుటకు సిద్ధమైనాడు.

అంతలో దైవము (శివుడు) మూలానక్షత్రములో అడవిలోనున్న నక్కలన్నింటిని, యుద్ధ గుర్రములుగా గంభీరముగా రూపుమార్చి, తానే గుర్రములకాపరి వేషము ధరించి, మధురకి వచ్చి వాటిని రాజుకి సమర్పించి, మాణిక్యవాచగర్‌ను శిక్షనుండి తప్పించెను. కాపరి, రాజు నుండి సన్మానము కూడ పొంది వెళ్లిపోయెను.

ఆ రోజు రాత్రి గుర్రపుశాలలో కట్టియుంచిన యుద్ధ గుర్రములన్నియూ అడవి నక్కలుగా రూపు మారిపోయి మరలా అడవికే అరుస్తూ వెళ్లిపోయినవి.

పాండ్యరాజు ఆగ్రహమునకు అంతులేకుండా పోయినది. మహా కోపముతో మాణిక్యవాచగర్‌ను ఊరి మధ్యలో ప్రవహించు వైగై నదిలో తీవ్రమైన ఎండలో బాగా కాలియున్న ఇసుక తిన్నెలపై నిలబెట్టించి శిక్షించెను.

మాణిక్యవాచగర్ శిక్ష భరింలేక శివుని గాఢముగా స్తోత్రించెను. ఇక శివలీలా వినోదమే. శివుడు భక్తుని బాధ ఓర్వలేక వైగై నదిని వరదలతో నింపి నీరు పారింపజేసెను. మండు వేసవిలో వరద లేమిటని ఊరి ప్రజలందరు విస్మయముచెందిరి. వరద నీరు పొంగి ఊరిని కూడ ముంచెత్తెను. రాజు ఇది చూచి తత్తరపడి ఇంటికొకడు చొప్పున పాల్గొని వరదలకు గట్లుకట్టి కట్టడి చేయవలెనని ఆజ్ఞాపించెను.

ప్రతి దినమూ పుట్టు (పుట్టు అంటే మెత్తటి బియ్యపు పిండిని ఆవిరిలో ఉడికించి, కొబ్బరికోరు, బెల్లముతో కలిపి ఉపాహారముగా తీసుకొనునది) అమ్ముకొని జీవించు స్రవంతి

అను ముదుసలికి సంతతి లేనందున, శివుడే పనివాడుగా వెళ్లి కూలికి మట్టి తట్టలను మోసెను. అన్ని గట్లు కట్టబడినవి. కాని స్రవంతి వంతున్న గట్టు కట్టడిచేయలేదని, రాజు పరివారము ఆగ్రహించి ఆమె కొరకు కూలిపనికి వచ్చిన వానిని బెత్తము దెబ్బలతో చావబాదిరి. స్రవంతికొరకు శివుడే బెత్తము దెబ్బలు వీపుపై కాచెను.

కాని శివలీలా వినోదముచే ఆ బెత్తము దెబ్బలు జీవరాశులన్నింటిపై పడి, రాజు వీపున కూడ పడినవి. రాజు వెంటనే శివలీలను గ్రహించి స్తుతించి, క్షమించగోరి మాణిక్యవాచగర్ పాదములపై పడెను.

శివలీలను గ్రహించిన మాణిక్యవాచగర్ రాజును క్షమించి, తన దైవసేవ కొరకు మదురై పట్టణమును వీడి తిరుపెరుందురైకు వెళ్లెను. అచ్చట కొన్నాళ్లుండి ఉత్తర కొసమంగై, తిరువారూర్, తిరువిడైమదూర్, శీర్గాళి, తిరువణ్ణామలై, తిరుక్కయికుండ్రమ్, మొ॥ శైవ పుణ్యక్షేత్రములు దర్శించి, అన్నిచోట్ల శివస్తోత్రములు పాడుచూ, చివరకు తిల్లై (చిదంబరమును) వచ్చి చేరెను.

తిల్లై చేరి, నాట్యమాడు శివుని దర్శించి ఎల్లలు లేని అపరిమితానందము, పరవశము పొందిరి. తాను పాడిన శివస్తోత్రములకు ఉప్పొంగిన శివుడు వైదికునివలె వచ్చి 'నీవు పాడుము, నేను వ్రాసెదనని' చెప్పెను. మాణిక్యవాచగర్ పాడగా దైవము తానే ప్రత్యక్షముగా వివరించి వ్రాసెను. "ఆత్మజ్ఞాని మాణిక్యవాచగర్ చెప్పగా నటరాజుడు వ్రాసిన వ్రాత" అని చివరి వాక్యముగా వ్రాసి తాళ పత్ర కట్టలను చిదంబరములోని నటరాజుని గర్భ సన్నిధి ప్రధాన ద్వారపు గడపపై యుంచి అంతర్ధానమయ్యెను.

మరుసటి రోజున దేవాలయ గర్భగృహ పూజా కార్యక్రమములకు వచ్చిన పురోహితులు, వైదికులంతా తాళ పత్రములు చూచి సంభ్రమాశ్చర్యములతో, వివరములు విని తెలుసుకొని, మాణిక్యవాచగర్ వద్దకు వెళ్లి స్తుతించి, ప్రణమిల్లి, ప్రశంసించి, అర్థములు చెప్పమని ప్రార్థించిరి. అందులకు ఆయన "దేవాలయములోనికి రండి, రండి, వ్రాసిన వారినే అడుగుదాం" అని వారందరిని దేవాలయములోని నటరాజుని గర్భగృహమునకు తీసుకువెళ్లి "ఈ తమిళ గ్రంథమునకు మూలము ఈయనే. ఆయననే అడగండి" నని చెప్పి నటరాజుని విగ్రహము వద్దకు తాను వెళ్లి శివునిలో ఐక్యమై అంతర్ధానమైనాడు.

శ్రీ మాణిక్యవాచగర్ జీవించిన కాలము ముప్పది రెండు సంవత్సరములే. దైవత్వముతో నిండిన ఆత్మజ్ఞానిగా పేరొంది, శివజ్ఞానము బోధించి, శివునిలోనే ఐక్యమైపోయిరి.

**– జీవిత చరిత్ర సమాప్తం –**

# తిరువాచకం

తిరు+వాచకము=దివ్య వాచకము. శ్రీ మాణిక్యవాచగర్ దక్షిణ భారతదేశమున పలు శైవ క్షేత్రములు దర్శించి అచ్చట పాడిన కీర్తనలే, స్తుతులే దివ్య వాచకముగా పేరొందినది.

“తిరువాచకమునకు కరగని వారు మరే వాచకమునకు కరగజాలరు”. అన్న తమిళ సామెత కలదు. ఈ ఆత్మజ్ఞాని అనుభవ, విశదీకరణ అంతటి అమూల్యమైనదిగా ప్రసిద్ధికెక్కినది. యాబది ఒక్క అధ్యాయములతో కూడియున్న ఈ గ్రంథము ఆరు వందల యాబది ఆరు పద్య రత్నములతో ఇమిడియున్నది.

శ్రీ మాణిక్యవాచగర్ తాను పాండ్య మహారాజు వద్ద ముఖ్యమంత్రి పదవిలో యున్ననూ, తానొక ఆత్మజ్ఞాని. తన ఆధ్యాత్మిక ప్రయాణములో ఎదురైన క్లిష్ట అనుభవములు, మానసికక్షోభ, వాటిని జయించిన విధివిధానములు విశదీకరణయే ఈ “తిరువాచగము” గ్రంథము.

తత్వజ్ఞాన సూచికలతో, పరిపక్వమునకు ఒక చక్కటి నిదర్శనముగా, ఆత్మజ్ఞాన సాధకులకు ఒక మార్గదర్శిగా పేర్కొనబడినది ఈ “తిరువాచకము.”

సాధారణముగా, సామాన్య మానవులందు కనిపించు సహజ చపల తత్వము, అల్పబుద్ధి, నిగ్రహ లేమితనమును తన గుణములుగా పరిగణించిన శ్రీ మాణిక్యవాచగర్ తనకు తానే “కుక్కనైతినే...., అధముడనైతినే..., అల్పుడనైతినే...,” అన్న మాటలతో అక్కడక్కడ తన పద్యములలో చెప్పుతూ తన వినమ్రతను, వినయమును చాటుకొనిరి.

పద్య వరుసలలో చెప్పిన విషయార్థములను మరలా, మరలా పలు అధ్యాయములో చెప్పిననూ, దానిని తాను నొక్కి వక్కాణించుటయేకాక, చదువరులకు ఒక్కొక్కసారి ఒక్కొక్క గుడార్థములను బోధించునట్లు అమరి, దైవీకమును ఉట్టి పడునట్లు చేసినవే తప్ప మనస్సుకు చిరాకు కల్పించినవిగా లేవు.

తమిళ పద్యపద అమరిక, అర్థ అమరిక, చక్కటి తమిళ ప్రాసలతో నిండియున్నది. ఈ తిరువాచకమునకు ఇవి ప్రత్యేక శ్రేష్టములు. ఆత్మజ్ఞాన సాధకులకు దాహ తృష్ణ ఏర్పరచునదియు, దాహ తృష్ణ తీర్చునదియు ఈ తిరువాచకమే అగును. పరమాత్మ గురించి విశదీకరించుటలోను, విషయానుభములను వివరించి చెప్పుటలోను ఈ గ్రంథము ప్రసిద్ధి.

సామాన్య మానవుని యొక్క తత్వము, చపలముతో నిండిన అల్ప చేష్టలు, చపలములను నివారించు పద్ధతులు, ఉన్నతను పొందగోరు వారి యొక్క ఉన్నత ఆశయములు, ఆ ఉన్నత ఆశయములు పొందుటకు వలయు విధానములు, పరమాత్ముని ఆశీస్సులు పొందుట, శరణుపొందుట, దివ్య దృశ్యములు, అనుభూతులు చూచి ఆనందించుట, తన స్వీయానుభవముల సుపరిణామములనే శ్రీ మాణిక్యవాచగర్ చాలా చక్కగా ఇందు పొందుపరచియున్నారు.

సాధారణ తెలుగు పాఠకులకు అర్థమగునట్లు వీలైనంతవరకు సంస్కృత పదములను విడనాడి, బహుసులభ శైలిలో, పద్యములను మరలా తెనుగున పునర్నిర్మితము చేయక, తాత్పర్యము మాత్రము ఉండవలెనన్న కోరికతో అనువాదము చేసి అందజేయవలెనను సదుద్దేశముతో ఈ "తిరువాచకము" ప్రయత్నము చేసితిమని మనవిజేయుచున్నాను.

ఇక గ్రంథములోనికి వెళ్లుదుము గాక.....

ఇట్లు
సుధీజన విధేయుడు
క్రిష్ణ శెవ్వాన

# విషయ సూచిక


**అంకె విభాగము**

మాతా, పితలకు
గురుస్తుతి
దైవ స్తుతి
రక్ష
అంకితము
కృతజ్ఞతలు
స్పందన
సంగ్రహ జీవిత చరిత్ర
తిరువాచకం
1. శివ పురాణం
2. కీర్తించు దివ్య పద్యములు
3. దివ్యాండ విభాగము
4. స్తుతించు స్తోత్రములు
5. దివ్యశతకము
6. విముక్తి మొర
7. తిరు వెంబావై
8. తిరు వమ్మానై
9. దివ్య బంగారు పొడి
10. దివ్య రాజ తుమ్మెద
11. దివ్య తిళ్లేణము
12. దివ్య ప్రశ్నోత్తరములు
13. దివ్య కలువ పూవులు
14. దివ్య విజయము
15. దివ్య త్తోన్నోక్కం
16. దివ్య స్వర్ణ ఊయల
17. మాతృ దశకము
18. కోయిల దశకము
19. దివ్య దశాంగము
20. తిరుపళ్లి ఎయుచ్చి
21. దేవాలయ పురాతన కీర్తనలు
22. దేవాలయ కీర్తనలు

**అంకె విభాగము**

23. మృత్యువాంఛ
24. శరణాగతి దశకము
25. సంకల్ప దశకము
26. ఆశ్చర్య దశకము
27. ఐక్య దశకము
28. నిర్జీవన దశకము
29. అనుగ్రహ దశకము
30. తిరుక్కయ్‌కుండ్ర దశకము
31. దర్శన దశకము
32. పార్థనా దశకము
33. పరిత్యాగ దశకము
34. శివాత్మ దశకము
35. భీతి దశకము
36. దివ్యపాండ్య దశకము
37. దైవ పట్టు దశకము
38. దివ్య క్షోభ
39. దివ్య ఘోష
40. మహానంద దశకము
41. అద్భుత దశకము
42. మేధో దశకము
43. దివ్యోపదేశము
44. దైవ చింతన
45. యాత్రా దశకము
46. దివ్య సేనాయుత్తం
47. దివ్య వెన్బా
48. పురాతన చతుర్వేదము
49. దివ్య సేనతో పరిపాలన
50. ఆనంద మాల
51. అద్భుత దశకము
క్లుప్తముగా శివతత్వము
అనువాదకర్త స్వీయ పరిచయము

# 1. శివ పురాణము

"నమ:శివాయ" అను మంత్ర స్వరూపుని స్తుతించుచున్నాను. ప్రపంచమంతటిని అందులో లయముపొందించి దానినే పరిపాలించు నాయకుని స్తుతించుచున్నాను.

క్షణకాలమైన నా మదినుండి వీడని అతని దివ్యపాదములు వర్ధిల్లుగాక"

శరీరమునకు హృదయము ఎట్లు ముఖ్యమో, అట్లే "నమ:శివాయ" అను పంచాక్షరీ, వేదములకు ముఖ్యము.

వేదములు చదువుట అందరికి సాధ్యము కాకపోవుటచే, వేదముల యొక్క పూర్తి ఫలము ఈ పంచాక్షరీ కలిగియుండుట వలన పామరులు కూడ స్తుతించుటకు సులభ సాధ్యమైనది.

తల్లిని పిలుచు బిడ్డడి వలె లోకనాయకుడైన తండ్రిని పిలుచుటకు అన్ని జీవరాసులకు అర్హత గలదు.

మంత్రశబ్దములు పరమాత్మవి కనుక, అతని వద్దకు తీసుకువెళ్లు శక్తి కలిగినవి. ఆ శబ్దములన్నింటికి ముఖ్యమైనది, ఆదిమూలమైనది "నమ:శివాయ" అన్నదే. కావున దీనిని గ్రహించే శ్రీ మాణిక్యవాచగర్ మూలమంత్రముగా ఉపయోగించిరి.

పరమాత్మ జ్యోతి స్వరూపుడనునది ఎంతటి సత్యమో అంతటి సత్యమే తను శబ్ద స్వరూపుడనునది కూడ.

క్రిందనున్న జడతత్త్వ పదార్థములైననూ, పైనున్న జీవరాశులైనను అన్నింటియందు పరమాత్మ ఉన్నాడు.

శరీరములోని కంటికి కనిపించునట్లే, భావనలోను ఒదిగి ఇమిడియున్నాడు. రాతినుండి మానవ జన్మ వరకు ప్రాణము లేనిది, ప్రాణము గలది అను అన్నింటియందునూ నిండి ఇమిడియున్నదే అతని సామర్థ్యము, తత్వము.

బ్రహ్మాండ ప్రపంచములో నున్నవాడే, చిన్న హృదయములో ఇమిడియున్నాడు. అతని మహిమను గ్రహించు శక్తియే ఉపాసనలో మొదటి కర్తవ్యము.

ఏది అంత:ర్లీనమై ఉన్నదో, అదే బాహ్యముగా ఉండి సుఖశాంతిని ఇచ్చునను తత్త్వమెరిగిన వాడే బ్రహ్మజ్ఞాని.

పరమాత్మను స్తుతించు గ్రంథములను పరమాత్మతో సమానముగా గౌరవించబడవలెను.

"ఏక స్వరూపిగా నున్నవాడును, ఏకము నుండి బహురూపములను దాల్చువాడునైన ఆ పరమాత్మ దివ్యపాదములు వర్ధిల్లుగాక."

నా మనో:వేగమునకు ఆనకట్ట వేసి, నన్ను తన వానిగా చేసుకొన్న ఆ పరమాత్మ దివ్యపాదములు అన్నింటిని జయించుచున్నది.

మానవ మనస్సు మహాసముద్రము. తలంపులనెడి అలల రాపిడికి ఉద్రిక్తత ఏర్పరచునది "ఆశ" యే అగును.

జ్ఞానమున్నచోట ఆశ ఉండదు. ఆశ ఉన్నచోట జ్ఞానముండదు. పరమాత్ముని ఆశ్శీస్సులు ఆశను తొలగించును. అజ్ఞాన మను చీకటిని పారద్రోలును.

పరమాత్మ మహా జ్యోతి స్వరూపుడు, మహాజ్ఞాని

ఆశ తగ్గినచో తలంపులు శాంతించును.

తలంపులు శాంతించినచో మనస్సులయమగును.

మనోలయము పొందినవానికి అన్నీ సాధ్యమగును.

పరమాత్మ మూలకారకుడుగా ఏకత్వము, ప్రపంచ రూపమున బహురూపములలోను దర్శనమిచ్చుచున్నారు. వారిని తలంచుట, వారి దివ్యపాదములను స్తుతించుట వలన మన మనోవేగమునకు అడ్డుకట్ట వేయగలము. శివుని ప్రార్థింప, జీవుడు జీవించును.

జననమరణ విన్యాస ఫలితముల వలన ఏర్పడు సంసార సాగరమును విచ్ఛిన్నము చేయు వీరుల కాలి అందె ధరించిన శివుని దివ్యపాదములకే గెలుపు (జయము)

ప్రపంచ మోహములపై ఆశ ఉండి మరలా, మరలా జన్మించి దు:ఖించువారు, శివుని యందు బంధమేర్పరచుకొనినచో జన్మరహిత, అక్షరమైన శివసాయుజ్యం పొందవచ్చును.

తన్ను కోరి అక్కున చేర్చుకొను వారి వద్దకే బిడ్డ వెళ్ళుటకు ఇష్టపడును. దైవము కూడా అట్లే. మనలోపలి నున్న దైవమును గ్రహించక బాహ్యముగా వెతుకుచున్నంత వరకు అది మనకు దృగ్గోచరము కాక బాహ్యవిషయముగానే ఉండును.

వర్షము నీరు, అది చేరు మట్టి రంగును బట్టి రంగుమారును. మానవునికి తానున్న చోటును బట్టి నడవడికలో మార్పువచ్చును. సద్గుణవంతులతో చేరిక సుఖము ఇచ్చునట్లు, దైవముతో బాంధవ్యము ఆనందదాయకమే అగును.

తనను ఆశ్రయించిన వారిని ఒడ్డుకు చేర్చడము దైవము యొక్క ప్రణాళిక. ఆయన తప్పక మిమ్మల్ని రక్షించును. మిమ్మల్ని ఆయనకు ఒప్పగించుకోండి.

"ఈశుని దివ్యపాదములకు నమస్కారములు

నా తండ్రి దివ్యపాదములకు నమస్కారములు

జ్ఞాన ప్రకాశుని దివ్యపాదములకు నమస్కారములు

ఎర్రనైన తామర పద్మములుగల శివునికి నమస్కారములు."

"ప్రేమ సాగరమైన ఆ పవిత్రుని పాదపద్మములకు నమస్కారములు

జనన, మరణముల మాయా చక్రభ్రమణములనుండి విముక్తి

కల్పించు వాని దివ్యపాదములకు నమస్కారములు."

"పనికి రాని వస్తువు నలక. ఏది మనకు పనికిరాదో దానిని మననుండి వాడు వీడదీయుట వలన మన ప్రేమకు పాత్రుడగుచున్నాడు"

"క్షణ మాత్రమున ఎన్నో మార్పులు పొందుతున్న ఈ ప్రపంచమున, కనిపించు మార్పులన్నియు 'మాయ' యే అగును".

"ఉన్నతమైన ఆశయముతో తిరుప్పెరుందురైలో ఉత్పన్నమైన ఆ 'ఈశుని' (ఈశ్వరుని లేక శివుని) దివ్య పాదములకు నమస్కారములు."

"అంతులేని మహానందమును ఇచ్చి మనల్ని రక్షించు శివునికి, పరమాత్ముని వలె కరుణించు ఆ మహేశునికి నమస్కారములు."

"ఎల్లప్పుడు నా చిత్తములో నిలచియున్న ఆ శివుని ఆశీస్సులతో అతని పాదపద్మములకు ప్రణమిల్లెదను."

"శివుని ఆరాధించుట అను ఉన్నత భాగ్యము కూడా, ఆయన ఆశీస్సుల వలననే ఏర్పడును".

"వాసనతో పూవును, ప్రకాశముతో చంద్రుని, ఆశీస్సులతో దైవమును గుర్తించుచున్నాము. ఎంతవరకు గుర్తించి అర్థమెరిగి ఉన్నామో అంతకంత వాడికి దగ్గర అయ్యామనబడును."

"నా కర్మలను తొలగించి పరమానందమును అనుగ్రహింపగల ఆ శివతత్త్వములను శ్రద్ధగా చదివెదను."

"ప్రపంచ వాసనలు కోరికలను అధికముజేయును. ప్రారంభములో సంతోషముగా ఉన్ననూ ఆఖరున దు:ఖమును కల్గించును. శివునియందు చిత్తముంచినచో, కీడు లేని సంతోషమునే మిగుల్చును".

పైగా కర్మఫలితములున్ననూ వాటి కఠినత్వము, తీవ్రత యుండదు.''

"త్రినేత్రుడైన శివుడు తన కరుణాకటాక్షముతో వీక్షించుటచే అతనిని నేను శరణుపొందితిని. లెక్కించుటకు వీలుకాని ఎన్నో మహిమలు గల అతని దివ్యపాదములకు నమస్కారములు".

"త్రినేత్రములలో మూడవ కన్ను "జ్ఞాన కన్ను" అగును. అది షట్చక్రములలో ఒకటైన "ఆజ్ఞ" చక్రమును సూచించునది. సాధారణ కళ్లతో ప్రపంచ దృష్టియు, జ్ఞాన కన్నుతో దైవదృష్టి ప్రాప్తించును. దైవగుణములు లెక్కలేనన్నివి. ఎవ్వరివల్ల గణించదగనిదియు, లెక్కలకు సాధ్యము కానిదియు అగును."

"ఊర్ధ్వలోకములోను, భూలోకములోను సర్వత్రా అతను నిండియున్నాడు. కంటికి జ్యోతిగా కనబడుచున్నాడు. అంచనాలకు మించినవాడు. అతని వ్యాపకమును, కర్మలలో చిక్కియున్న నాలాంటి వాడు ఎట్లు వర్ణింపగలడు?"

వ్యాపించి యున్నది బ్రహ్మాండమగుటచే బ్రహ్మపదార్థమనియు, దూరముగా నుండుటచే దైవమనియు గుర్తింపబడియున్నది. అతనిని అరూపి అందురు. అయినను లక్షోప లక్షలైన

నక్షత్రముల ద్వారా తన ఉనికిని చాటుకుంటున్నాడు. కోటాను కోట్ల జీవరాశులను పొందియున్న ఈ విశాల ప్రపంచము, ఒక చక్కటి క్రమానుసారంగా ఒక నియమమునకు లోబడి భ్రమించుచున్న విషయము చాలా ఆశ్చర్యకరమైనదే! కర్మ ఫలితముల వలన శరీర జన్మమెత్తి, పంచభూతముల కట్టుబాట్లకు లోబడి అందుచిక్కియున్న నాలాంటి వాడు ఆ దైవమును ఎట్లు ఎరిగి, స్తుతించుట?

"జడత్వము అను రాతిగాను, అల్పమైన గడ్డి పరకగాను, ఉల్లిగా, చిరు మొక్కలుగాను, చెట్లుగాను, పురుగులు గాను, జంతువులుగాను, పక్షిగాను, పాములు గాను, మనిషిగాను, భూత గణములుగాను, రారాజులుగాను, ఋషులుగాను, దేవతలుగాను ఎన్నో జన్మలు ఎత్తి విసుగు చెందియున్నాను."

"ఓ పరమాత్మా! నీ దివ్య పాదములను దర్శించుట వలననే అన్నింటిని నేను దాటగలిగితిననుటకు సందేహము లేదు.

నాలో ఓంకారముగా నీవు ధ్వనించుచున్నావని నేను గ్రహించినప్పుడే నేను విమోచనము పొందితిని. నీవు నాయందు శాశ్వతమైన వాడు కావున "సనాతనుడు", ఏ మలము అంటని పరమ పవిత్రుడైన వాడు కావున "విమలుడు", దృగ్గోచరము కానివాడు కావున "అగోచరుడవు"

"ఊష్ణముగాను, శీతలముగాను, ప్రాణతత్త్వముగా నున్న ఓ పవిత్రుడా! నాలోని మాలిన్యములన్నింటిని తొలగించి, నన్ను ఆశీర్వదించుము. ఆత్మజ్యోతిగా వెలుగుచున్న వాడా! జ్ఞానరహితుడైన నాకు ఆనందము ప్రసాదింపకోరుచున్నాను."

"దీపము తాను జ్యోతిగా ప్రకాశించిననూ చుట్టుయున్న వాటంతటికి వెలుగు ఇచ్చుచున్నది. బాహ్యవెలుగు, వెలిగి ఆరిపోవును. కాని అంతర్జ్యోతియైన ఆత్మ ఆరిపోదు. అది జ్ఞానరూపి. అది తనను తాను ఎరిగి బాహ్యమును ఎరిగించును. చంద్రుడు ఎట్లు సూర్యుని నుండి ప్రకాశము పొందుచున్నదో, అట్లే జీవాత్మ అన్నది పరమాత్మనుండి జ్ఞానము పొంది యున్నది.

"ఏది శాశ్వతమని తలంచెదమో అది అశాశ్వతమే. ఏది మనదని ఎంచెదమో అది మనది కాదు. గుర్తించునది జ్ఞానము. గుర్తించలేనిది అజ్ఞానమే".

"ఉత్పన్నము, పరిణామం అంతులేని ఈ ప్రపంచమును జనింపజేసి, పోషించి, లయమును చేసెదవు. మధ్యన జీవరాశులను నీయందు లయము చేసుకొందువు".

"జన్మమను సంకెళ్ళను త్రెంచి, నన్ను నీ దాసునిగా చేసుకొన్నది కూడా నీ యొక్క కరుణే కదా!"

"సువాసన గల పుష్పము వంటి వాడా! నిన్ను సేవించు వారు ప్రక్కనున్ననూ, దూరముగా నున్ననూ అందరికి సమానమైన, మార్పులేని సువాసనను వెదజల్లువాడవు కదా నీవు!"

"ఎటునుండి చూచిననూ పుష్పము అందమే. అయితే దగ్గరకు వెళ్లితే కదా సువాసనను పసికట్టగలము. గుర్తించిన వారికి దగ్గర గాను, గుర్తించని వారికి దూరముగా నుండి అనుగ్రహించు వాడు దైవము".

"మనస్సు సదా చలనము చెందునదే. మనస్సుతో చూచునపుడు దైవము బాహ్యవస్తువులలో మరిగి కనిపించును. మనస్సును ప్రారద్రోలితే దైవము ఉన్నది ఉన్నట్లే ప్రకాశించును. ఆత్మ సాధనలో అత్యున్నత దశలో మనస్సు తొలగిపోవును."

పితికిన ఆవు పాలతో చక్కెర పాకము, నెయ్యి కలిపి తినునట్లు ఆనందము ఇచ్చునది దైవానుభవము. ఆ అనుభవము దాసాను దాసులకు మనస్సు తేనె వలె రుచించునది.

(తీపికి, రుచికి సరైన ఉదాహరణలతో శ్రీ మాణిక్యవాచగర్ పోలియున్నారు. ఏలనగా దైవానుభవమును అందరు గుర్తించలేరు, పొందియుండలేరు. కావున అనుభవము గురించి చెప్పునపుడు అందరికి తెలిసిన  ఉదాహరణ లే తను వాడియున్నారు.)

తేనె నాలుక రుచికి మాత్రమే కాక శరీరమునకు కూడ ఉపయోగమైనది. అట్లే దైవానుభవం తేనె కన్నా మధురం.

"జన్మతో వచ్చిన ప్రారబ్ధ కర్మను దు:ఖమును తొలగించు ఓ నాయకా"

దేవతలు నిన్ను స్తుతించు విధములలో ఐదు తన్మాత్రలతో కూడిన వాడుగా యున్నావు."

పురాణములలో గల దేవతలనుట కన్నా పంచేంద్రియములను, పంచభూతములను దేవతులనుట ఉత్తమము.

శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు ఐదును తన్మాత్రలగును.

ఆకాశము, వాయు, అగ్ని, అప్పు, పృధివి అను ఐదును పంచ భూతములగును.

"నన్ను నేను తెలుసుకొనుటకు సాధ్యము కాని విధముగా అజ్ఞానము నన్ను కమ్ముకొని యున్నది. దేవతలకే అర్థముకానిది ఈ ప్రారబ్ధ కర్మముల ఫలితములను నేను ఎట్లు అర్థము చేసుకోగలను!. కర్మఫలితములు, అజ్ఞానమనెడి చీకటి రెండునూ వెర్వేరు కూపములు. నిరంతరము మార్పు చెందుచున్న ఈ ప్రపంచము ఒక మాయ."

"ప్రారబ్ధ కర్మ ఫలితములనెడి తాడుతో గట్టిగా కట్టబడిన ఈ శరీరములో, లోపలి నున్న ధాతువుల తత్త్వమో ఒక సాధారణ పురుగుతో సమానమైనది. ఈ అల్పమైన విషయమును దాచి మరిపించుటకు చర్మము అను దుప్పటితో మూయబడియున్నది."

"శరీరమను ఈ విడిదిలో నవద్వారములు. దాని గుండా సదా సర్వకాలము మలినములు విసర్జించబడుచున్నది. పంచేంద్రియములు నన్ను వంచించి పీడిస్తున్నవి."

పంచేంద్రియముల వల్ల పొందు సుఖములు, జ్ఞానము నిలకడలేనివే, పరిపూర్ణత లేనివే. ఇది ఎరిగిన వారు సుఖములందు ఆశ పెట్టుకొనరు.

" ఓ విమలా! నా మనస్సు మృగతత్త్వముగా ఉన్నది. కాని నీ యందు శరణు పొందునట్లు ఆశీర్వదించియున్నావు. ఈ భువిలో నీ దివ్యపాద దర్శనము నేను చేయుట నీ కరుణ వల్లనే కదా!

అల్పత్వముతో నిండియున్న ఈ మనస్సులో మృగము నిదురించుచుండును. అదే మనస్సు

దైవ చింతనతో కూడియున్నచో మంచితో సౌమ్యమగును. పవిత్ర హృదయములకు ఈ భూలోకమే ఈశుని (ఈశ్వరుని) రూపమై కనిపించును.

పుష్పము ఒక్కటే. ఒక బాలుడు దానిని తన పుస్తకములో భద్రపరచును. ప్రేమికుడు ప్రేయసికి ఇచ్చును. భక్తుడు దైవమునకు సమర్పించును. పుష్పము ఒక్కటే కాని భావనలు వేరు.

దైవమును ప్రకృతిలో చూచుటకు, ప్రకృతిలో దైవమును చూచుటకు మనకు వీలగును.

"ఓ ఆత్మజ్ఞాని! దేవదేవా! కుక్క కన్నా అల్పుడైన నావంటి వాడిని తల్లినిమించిన కరుణతో అనుగ్రహింతివి కదా!

"అన్నిటియందును, ఎల్లవేళలలా, క్షీణతలేని ప్రకాశముతో ప్రకాశించు వాడా! వెగటులేని తేనెవంటివాడా! కోరివచ్చిన వారికి అమృతముగా నున్నవాడా! శివలోకనాథా!"

అమృతమును స్వీకరించినవారికి మరణము లేదు. అమృతమే రూపముగా నున్నవాడికి నాశనమేది?

"ఆశయను బంధము నుండి నన్ను విముక్తుని జేసి రక్షించిన ఆచార్యుడు నీవు! ప్రేమించి ఆశీర్వదించి నా మనస్సులోని నీచతత్త్వము తొలగించెదవు గాక!"

"ఆశ స్వార్థముతో నిండినది. దానికి ఎల్లలున్నవి. కాని ప్రేమ నిస్వార్థము. ఎల్లలు లేక సర్వదా వ్యాపించినది."

"ఆశ, కాలి సంకెళ్లు వలె మనల్ని పై స్థితికి పోనీయక అడ్డుపడును. కాని ప్రేమ ఉన్నత స్థితికి తీసుకువెళ్లి అన్నింటిని ఏకత్వము చేయును."

"నేను కొరతగలవాడైనను నాలో నీవు పూర్తిగా కొలువైయున్నావు. నీ కరుణాకటాక్షము గంగవలె పారియున్నది. వెగటులేని అమృతము నీవు. లెక్కలేనన్ని కల్యాణ గుణములు గలిగినవాడవు నీవు."

"గుర్తించలేని వారి హృదయములో ప్రకాశముగా మరుగునయున్న నీవు, నాలో గొప్ప జీవిగా నిలచియున్నావు. ఎల్లపుడు నా మనస్సు నీయందే నీరువలె ద్రవించుచున్నది."

"నీవు పరమాత్మవు, కనుక సుఖము, దుఃఖము నీకు లేవు. కాని ఈ ప్రపంచ జీవరాసులన్నింటి యందు నీవున్నందున, వాటి సుఖదుఃఖములన్నియూ నీవియేయగును."

"ఆత్మలన్నింటిలోను ప్రకాశించు జ్యోతివి నీవు. తెలుసుకోలేనంత చీకటి కూడ నీవే. గొప్పలన్నియు నీకేసొంతము. ప్రపంచ ఉత్పన్నతకు ఆదిమూలము నీవే కదా! మధ్యన స్థితి కారకము, కడపట లయ కారకము నీవేకదా! నీకు మాత్రము ఎటువంటి మార్పు లేదే!"

"దేవదేవా! నన్ను నీలో వశము చేసుకొంటివి. నా తండ్రి, దైవము నీవేకదా! చాలా సూక్ష్మ జ్ఞానము ఉన్నవారే నిన్ను తెలుసుకొనగలరు.

(శ్రీ మాణిక్యవాచగర్ మాటలలోని గూడార్థము: "జ్ఞానము" అనునది మంచి తపస్సుతోను, బ్రహ్మచర్యముతోను పొందదగినది. తేటనైన మనో:వికాశమే "జ్ఞానము'' అగును.)

"చూడదగిన వారికే చూడదగును, నీ సూక్ష్మాతి సూక్ష్మమైన జ్ఞాన ప్రకాశము".

బాహ్యమైన ఈ కళ్లకు దృగ్గోచరము కానిది అంత:ర్ దృష్టికి చూడ శక్యమగును. గుర్తించుట అనునది వారి వారి అనుభవ స్థితి స్థానముల బట్టి యుండును.

"మలినములు తొలగిన మనస్సే సూక్ష్మమును గుర్తించగలదు."

"వచ్చుట, పోవుట అన్నది నీకు లేదు. మరొక దానితో సంగమము అన్నది నీకు లేదు. నీవు పరిపూర్ణుడవు. దేవా! సర్వ అంతర్యామివి. దేనిలోను చేరవు. కనుక పవిత్రతకు భంగము లేని పుణ్యాత్ముడవై ఉన్నావు."

"రక్షించు నాయకా! దృగ్గోచరము కాని ప్రకాశవంతుడా! నా మనస్సాక్షిగా ఉన్న జ్ఞాన ప్రకాశమే నీవు! మనస్సాక్షిని ఎవరైన బాహ్య కళ్లతో చూడగలరా? అన్నిటియందు సాక్షిగా యుండి నన్ను రక్షించు నాయకుడు నీవు!

"సద్గుణములతో నిండి మహానందము నొసగు నా తండ్రివి నీవు."

చెడ్డ గుణములు ప్రారంభమున సుఖమును ఇచ్చినను తుదకు దు:ఖముతో ముగియును. కాని సద్గుణములు ఎప్పుడు, ఎల్లవేళలయందును సుఖమునే ఇచ్చి సద్గతికి దారిచూపును. ప్రపంచ జీవరాశులంతటికి మూలముగా ఉన్న ఈశుడు (దైవము) "తండ్రీ" అని పిలువబడుచున్నాడు. తరువాత ఉత్పత్తి కారణములకు ఎటువంటి సంబంధము లేనివాడుగా యుండుటచే "విమలా" అని పిలువబడుచున్నాడు.

(ఎటువంటి మలినములు అంటనివాడు కనుక దైవము "విమలుడు")

"తనకు తానే ప్రకాశించుచున్న ఓ స్వయం ప్రకాశ స్వరూప!! మాటలతో వివరించలేని బ్రహ్మాండమైన ఓ పరతత్త్వమే నీవు!!"

పరమాత్ముని జ్యోతి నిరంతరమైనది. పరమాత్ముని గురించి ఆత్మ గుర్తించుటకు మాటలలో సాధ్యము కాదు.

"నిరంతరము మార్పు చెందుతున్న ఈ ప్రపంచములో నీవు అవతరించు అన్ని రూపముల యందును జ్ఞానముగా వెలుగుచున్నావు.

అన్ని జ్ఞానములకు మూలాధారమైనది నీ జ్ఞానము

అన్ని రూపములకు మూలమైనది నీ స్వరూపము."

"తేటనైన జ్ఞానముతో నా హృదయమునందు ఊటనీరుగా స్రవించి, సేవించుటకు అమృతమై, నన్ను నీ వశము చేసుకొన్నది నీవే కదా!

దైవము ఈ ప్రపంచమును ఉత్పత్తి చేసి జనుల హృదయములలో నిలచియున్నాడు. తనలో ఉన్న వానిని గుర్తించిన వారు అమృత స్వరూపులగుదురు.

తేటనైన, పరిశుభ్రమైన వివేకమునే శుద్ధ చైతన్యము లేక "ప్రజ్ఞానము" అందురు. ఇది సాధన ద్వారా ఏర్పడి మనస్సులోని మలినములను తొలగించిన స్థితిలో తన్మయత్వంతో ప్రకాశించునది.

హృదయములో పరమాత్మ నెలకొనినపుడు వివేకము మరింత ఉన్నతమగును.

"బాల్యము, యవ్వనము, వయోధికము అనుదశలలో మార్పు చెందుచున్న ఈ శరీరములో నున్న ఓ సఖా! నీ దాసానుదాసులు "మహాదేవా"! "హరా"! అని నిన్ను మనసార స్తుతించి, పాడి, కీర్తించి ఈ తోలు తిత్తి శరీరమును వీడి శివైక్యము చెందిరి. నేను అట్లు పొందగోరుచున్నాను."

(హరా! అన్నది హరించువాడు, లయమునకు మూలకారకుడను అర్థము)

"నేను" అనునది "ఆత్మ" అను అర్థము. ఆత్మజ్ఞానము పెంపొందించు కొలది శరీర కాంక్ష తొలగును.

"శరీరములో నున్న పంచేంద్రియములు ఆత్మజ్ఞానమును విచ్ఛిన్నము చేయు శక్తి గలవి. పంచ భూతాత్మకమైన ఈ శరీరములో హృదయమున నీ శివబోధనను పెంపొదించుటచే విధి వశము వలన ఏర్పడు పునర్జన్మము నుండి తప్పించుకోగలను."

"ప్రపంచమంతయు నిదురించు వేళయందు మేలుకొని యుండు నాయకుడు నీవే కదా ప్రభూ!"

(శివుని నాట్యకారుడుగా (నటరాజు) చిత్రీకరించియున్నారు. నాట్యమునకు మూలము జాగృత. జాగృతావస్థ లోనే తాను ప్రపంచమును రక్షించుచున్నాడు. రక్షకుడు ఎల్లవేళలు మెలుకవతో ఉండుటచే సకల జీవరాశులను రక్షింపనగును.)

("మీరు దైవము యొక్క శక్తిని హృదయములో సంపూర్ణముగా పొందవలెనన్న నిశిరాత్రి సమయమున లేచి ధ్యానము చేయండి.")

"అఖిలాండమును నీ ఇష్టము వచ్చినట్లు ఆడించు ఓ నాట్యకాడా! నీవు చిదంబరమను దక్షిణ భూభాగమైన పాండ్య దేశమున కీర్తితో వెలసిఉన్నావు."

"పునర్జన్మను, దాని నుండి ఏర్పడు దుఃఖమును తొలగించునది నీవే కదా!"

దైవము సముద్రమైయున్నాడు. జన్మలతో సతమతమవుతున్న మనము నదిగా యున్నాము. సముద్రమున చేరిన నదికి తానన్న గుర్తింపు మరియుండదు గదా! పరిపూర్ణమును పొందిన హృదయమున అల్ప సమాచారములకు ఇక స్థానమేది?

తలంపులకు, మాటలకు అందని వాడు పరమాత్మ. మాటలతో చోద్యం చేయజాలము, అనుభవ పూరకమైన చక్కటి సాధనతో "ఈశుని" స్వరూపమును గుర్తించగలము గాని మరి దేనితోనూ వీలుగాదు.

# 2. కీర్తించు దివ్యపద్యములు

"పురాతన, పుణ్యస్థలమైన చిదంబరమున నాట్యము చేయు శివుడు "నటరాజునిగా" ప్రసిద్ధి గాంచి అన్ని జీవరాశుల యుందును తన ఉనికిని చాటుకొనియున్నాడు."

"తిల్లై" అను చిదంబరము "చిత్" ఆకాశము అంశమగును. మనకు కనిపించు ఆకాశము స్థూలముగా "చిత్ఆకాశమున" ఇమిడియున్నది. "చిత్ ఆకాశము" పూర్ణత్వముతో నిండినది. (తమిళనాడులోని శివక్షేత్రములైన పంచభూత పంచారామములలో చిదంబరము "ఆకాశ" తత్త్వముతో పోల్చబడియున్నది. సత్, చిత్ ఆనందముతో సచ్చిదానందుడుగాను, నటరాజునిగాను శివుడు దర్శన మిచ్చు స్థలము చిదంబరము.)

"ఊర్ధ్వలోకములోనైనను, అధోలోకములోనైనను సరిసమానముగా పోల్చలేని లెక్కలేనన్ని గొప్ప గుణములతో, అందముగా దర్శనమిచ్చుచున్నాడు."

విద్య, కళలను ఉత్పన్నము చేయుట, లేక మురిపించుట అన్నది దైవము యొక్క దివ్యలీలలు. కావున అదే దైవము నా యొక్క అజ్ఞానమును పూర్తిగా తొలగించుటకు నిర్ణయించుకొని యున్నాడు."

మార్పుచెందుతున్న ఈ ప్రపంచమున ఎన్నో లెక్కలేనన్ని కళలు కథలుగా మారినను, విజ్ఞానములో కొత్త కొత్త ఆవిష్కరణలు వచ్చినను, ఆత్మజ్ఞానము పొంది విమోచనము పొందుట అనునది ఎప్పటికి మారక అట్లేయున్నది. దీనికి కారణము దైవ తత్త్వము ఆశిస్సులే!!

"హృదయములో భక్తి భావనను పెంపొందించిన వారి వద్ద దైవము ఇమిడి, దేవాలయము వలె తన దైవత్వమును చాటుకొనును!!

"శాశ్వతముగా నిలచియున్న మహేంద్ర పర్వతము నుండి నీవు 'ఆగమ' మును శాసించితివి."

(ఆగమ శాస్త్రమును శివుడు పార్వతి దేవికి మహేంద్ర పర్వతము నుండి ఉపదేశించె ననునది పురాణము).

"కళ్లాడం" అను పుణ్యస్థలమున అవతరించితివి. ఉమా దేవితో ఆనంద భరితముగా కొలువుతీరితివి!

అంబిక (ఉమాదేవి) జీవరాశుల శ్రేయస్సు కోరు తల్లి. ఆమె ఉనికి బ్రహ్మాండ మంతయు వ్యాపించి యున్నది.

"పంచపల్లి" అను స్థలములో ఉద్భవించిన శివశక్తియే అన్ని విధములైన ఆశీస్సులను నొసంగి మమ్మల్ని రక్షించుచున్నది."

"వేటగాడి వేషమున వచ్చి, పల్చటి పెదవులు గలదియు, విశాలమైన, ఎత్తైన వక్షోజములు గలదియునగు ఉమాదేవి యందు లీనమైన వాడవు గదా నీవు!!"

“ఆత్మలను వశపరచుకొను ఆగమముల వలె సొర చేపలను వల పన్ని సేకరించు మత్స్యకారునిగా మారితివి కదా!!” (శివలీలల చరిత్ర)

మహేంద్ర పర్వతముపై వెలసిన నీవు నీ పంచముఖములతో ఆగమములను ఉపదేశించి ఆశీర్వదించితివి.”

(శివునికి పంచముఖములు. అవి: తత్పురుష, అఘోర, సద్యోజాత, వామదేవ, ఈశానా)

“నాలుగు వేదములను పఠించిన మహావైదికుడవై వచ్చి మహాజ్ఞానముగల ఆచార్యుడవై, “నత్తంబాడి” స్థలమందు వెలసితివి.”

“లెక్క లేనన్ని రూపములతో, సద్గుణములతో, ప్రకృతి రూపములో వచ్చియున్నావు. ఈ ప్రపంచము వేరు, దైవము వేరుకాదు. ఈ శరీర నేత్రములకు ప్రపంచమును, జ్ఞాననేత్రములకు దైవము కనిపించునది, రెండు ఒక్కటే!”

“వృషభ వాహనము గలిగిన శివుడు ఈ లోకమును రక్షింప గోరి అనేక రూపములలో వచ్చి ఆశీర్వదించి యున్నాడు.”

“విదేశముల నుండి తీసుకువచ్చిన గుర్రములను తర్ఫీదు చేయుటలో నేర్పరివై విలసిల్లితివి.”

“వృషభ వాహనమును విడనాడి నీవు నీ దివ్య స్వరూపముతో వేళంపుదూర్‌లో విలసిల్లితివి.”

“అందమైన ప్రకాశము వెదజల్లు అగ్నికణముల రూపముతో మెక్కనీశ్వరములో దర్శనమిచ్చితివి.”

“అడవి నక్కలను గుర్రములుగా మార్చి సహాయము చేసిన నిన్ను బ్రహ్మ, విష్ణువులు పూర్తిగా ఎరుగరేమో!”

“అందమైన దివ్యస్వరూపము గల శివుడు, పాండ్యరాజుని తన వశపరచుకొనుటలో గుర్రములు, కనక రాశులనిచ్చుటతో కాక తన తేజోమయమైన ప్రకాశరూపమను ఆశీస్సులతో వశపరచు కొనెను.”

“వేదికుడవై వచ్చి నన్ను ఆకళింపు చేసుకోనుటయే కాక, ఈ ప్రపంచము ఒక ఇంద్రజాలముతో పోలినదని హెచ్చరించినది నీ ఆశీస్సులే కదా!!”

నీడ నీడయే. నిజం నిజమే. ప్రపంచ దర్శనమంతయు మాయగా మారి దైవ దర్శనమగునపుడు సత్యమైన బ్రహ్మమును ఎరుగనగును.

“సర్వసంపదలతో తులతూగు మదురానగరిలో నీవు గుర్రముల కాపరిగా దర్శన మిచ్చితివే! అదే మధురానగరిలో “వంది” అను వృద్ధురాలికి సహాయపడనెంచి నీ తలపై మట్టితట్ట మోసి కూలీకాసులు పొందిన గొప్పదనము నీది కదా!!”

(తన ప్రియ భక్తులకు దాసాను దాసుడై వారి వారి పనులయందు సేవ చేయుటకు కాచుకొని యుండు దైవము యొక్క నమ్రత ఎంతో కీర్తింపదగినది.)

"ఉత్తరకోశమంగై అను దివ్యప్రదేశమున నీవు జ్ఞానగురువై వెలసిల్లినందుకు ఏమని చెప్పను దేవా!!"

"తిరుప్పూవనములో మచ్చలేని ఛాయతో, సన్నగిల్లని దివ్య జ్యోతి ప్రకాశముతో నీవు శరీరముతో ప్రత్యక్షమైనది, నీ ఎల్లలు లేని ప్రేమ స్వరూపమే కదా!!"

"తిరువాదవూరిలో నీవు ప్రత్యక్షమైనపుడు, నీ దివ్య పాదములలో అలంకరించ బడిన పసిడి కడియముల శబ్దములు మ్రోగునట్లు చేసితివే!"

"సంపద నిండిన తిరుపెరుందురైలో జ్ఞానసంపదతో వచ్చి నీవు దర్శన మిచ్చితివి."

(దైవము వివిద భక్తులకు వారి వారి భక్తి అనుభవసారము తగినట్లు వచ్చి మర్మముగా దర్శన మిచ్చును.)

"సకల పాపములను హరింపజేసి, పూవలం అను ఊరియందు దర్శన మిచ్చిన భాగ్యము నీదే కదా!"

"యుద్ధము నందు గెలుచుటకు తగినట్లుగా పాండ్యరాజునకు, ఆతని సైన్యమునకు తగినరీతిని త్రాగునీటి సరఫరా చేసి సహాయ మొనర్చినది నీ కృపయే కదా!!"

"తిరువెంగాడు అను ఊరికి అతిధిగా విచ్చేసి, చిన్న చెట్టుక్రింద అమరి విశ్రాంతి తీసుకొన్నది నీ కరుణయే కదా!!"

తిరుపట్టమంగై అను దివ్యస్థలమున చక్కగా పద్మాసనము వేసుకొని కూర్చుండి అష్టమసిద్ధులను వివరించినది నీ గొప్పతనమే కదా!!"

అష్ట మహా సిద్ధులన బడునవి ఏవనగా :

1. అణిమా : చాలా సూక్ష్మముగా తన శరీరమును చేసుకొనుట.
2. లఘిమా : చాలా తేలికగా, బరువులేకుండా తన శరీరమును చేసుకొనుట.
3. మహిమా : పర్వతమువలె బ్రహ్మాండ రూపము పొందుట.
4. గరిమా : చాలా బరువుగా మార్పు పొందుట.
5. ప్రాప్తి : సూర్య, చంద్రులను వశపరచుకొనుట.
6. ప్రాకామ్యము : దేనినైన పొందుటకు, ఎట్టైన ఎక్కడనైన ప్రత్యక్షమగుటకు, మరొకరి శరీరములో ప్రవేశించుట.
7. వశీత్వము : అన్నింటిని తన వశము చేసుకొనుట.
8. ఈశత్వము : ఈశుని (ఈశ్వరుడు) వలె అన్నింటిని, పరిపాలించుతత్వము.

(తగిన సాధనలతో శరీరమును ఉన్నత స్థితికి మార్చుకొనుట యే సిద్ధిపొందుట)

"నీవు వేటగాడిగా దర్శన మిచ్చిన తరువాత అడవిలో అదృశ్యమైనది నీ గొప్పదనమే కదా!"

భక్తులకు ఎన్నో విధములుగా దర్శనమిచ్చుట, వెంటనే అదృశ్యమగుట అనునది దైవము

యొక్క వినోదలీలలు. ఇది ఆతనికే తగును. మరెవరికి సాధ్యము కాదు. అందులకే అతనికి (దైవమునకు) "మాయా వినోది" అనిపేరుగలదు.

"అందరిని రక్షించు దయాగుణము గలిగి, దానిని నిరూపించుటకు తగినట్లు మానవ అవతారమెత్తిన గొప్పదనము అయనకే చెల్లుబాటగును."

"బాల కుమారునిగా తిరువోరూర్‌లో ప్రసన్న వదనముతో దర్శన మిచ్చినది నీ ఆశీర్వాదములే కదా!"

"తిరుప్పాండు అను స్థలమున పూర్తిగా ప్రత్యక్షమై తరుత్తేవూరులో ఉన్న ద్వీపములో అందముగా ప్రసన్నుడవైనది నీ దివ్యఆశీస్సులే కదా!"

"తెన్ చేరిలోను, పూలతోటలతో నిండిన తిరువారూర్‌లోనూ, మేటియైన జ్ఞానమును ఒసంగడం శివునికే తగును."

తిరువిడైమరుదూర్‌లో దర్శన మిచ్చినది, తనయొక్క దివ్యపాదముల యొక్క గొప్పతనము, ఆ దైవమునకే తగును."

"కాంచీపురములో (ఏకాంబర నాధుడుగా) శివశక్తితో ప్రత్యక్షమైనది శివుని గొప్పదనమే అగును."

"తిరువాంజియం అను స్థలములో దివ్యస్వరూపిగా వాసన కురులతో ప్రత్యక్షమైన పార్వతిదేవిని సంతోష పరిచినది నీ మహిమనే కదా!!"

"దృఢమైన ధనుస్సును చేబూని యుద్ధవీరుని వలె ప్రత్యక్షమైనది, వివిధ రూపములతో దర్శనమిచ్చినది నీ గొప్పతనమే కదా!!"

"తిరుక్కడంబూర్, తిరువీంగోయిమలై, తిరువారూర్ అను దివ్యస్థలములలో ఎన్నో విభూతులతో ప్రత్యక్షమైతివి!"

"తిరుతురుత్తీ, తిరుప్పానైవూర్ అనుస్థలములలో ఎంతో సంతోషముతో ప్రసన్నుడవైతివి."

"శీర్గాయిలోనూ, తిరుపరంకుంద్రమ్‌లోను దర్శనమిచ్చినది నీ యొక్క విజ్ఞానమే."

"తిరుప్పరంపయమ్ అను స్థలములో నాకు గ్రంథములను సమర్పించి, తిరుకుట్రాలమ్‌లో నిన్ను గుర్తించునట్లు అనుగ్రహించితివి."

"ప్రళయము నుండి సృష్టి ఏర్పడునపుడు నీవు అగ్ని స్వరూపుడవై బంగారు చాయతో ఉంటివి. నీవు ధరించిన రూపములు లెక్క లేనన్ని. నీ మాయా శక్తిలో ఉద్భవించినదే కదా ఈ ప్రపంచము. జీవరాశులన్నింటిలోనూ కనిపించు గుణములన్నియూ నీవే! ఓ మహాదేవా! నీ ఆశీస్సులతోనే కదా ఇవన్నియూ ఏర్పడినవి!!"

"చంద్రద్వీపము అను స్థలములో నీవు వేదములు చదివి పండితుడవైతివి. ఆకాశమునుండి భువికి దిగిన ఓ అందగాడా! పాలై స్థలములో దివ్య రూపముతో దర్శనమిచ్చితివి."

"వేద తత్వమును వివరించిన మహేంద్ర గిరి యుందు నివాసము చేయువాడవు నీవు.

లెక్కలేనన్ని గొప్ప మహిమలు, ఎల్లలు లేని శక్తులు గలిగిన ఓ నాయకుడా! నీవు మమ్ములను అనుగ్రహించితివి. నీ గురించి ఏ విధముగా పొగడగలము!

"సామర్థ్యమును, అందమును గలిగిన మహా పురుషుడా! నుదుట విబూది చారలతో నీ అందమును మరింత ప్రకాశంపజేసుకొంటివే!"

"మా తప్పులు సరిచేసి మొత్తముగా దాని నుండి విమోచనము గలుగునట్లు చేసి, నీ ఆనందమును మాలో ప్రవేశింపజేసితివే!"

ఉన్నతమైన ఆశయములు ఏర్పడునపుడు అల్పతలంపులు తలెత్తవు. ఆనంద దివ్య ప్రకాశముతో అంతర్ చీకటి తొలగిపోవును. దైవము ఆనందమయుడు. వాని నుండే అన్ని ఉద్భవించినదనుట, ఆనందము వేరు వేరు గాదు. ఉద్భవించుట, లీనము రెండూ ఆనందములోనికే.

"నీలో సగ భాగము, ఉమాదేవికి ఇచ్చి, నీ కరుణారసమును తేట తెల్లము చేసితివి. నీ నాదబ్రహ్మమును ఎడతెరిపి లేక శబ్దించుచునే యున్నావు."

కొలచుటకు గాని, ఊహించుటకు కాని శక్యముగానిది బ్రహ్మతత్వము. సూక్ష్మములలో అతి సూక్ష్మము. అది శరీరములోనున్నది. మనస్సున నున్నది, లోపల, వెలుపల నున్నది. కాలాతీతముగా నాదబ్రహ్మముగా ప్రపంచమంతయూ శబ్దించుచునేయున్నది.

"నీ దయవలనే కదా శైవులను మలినములనుండి విడిపించి నీవశము చేసుకొంటివి. జీవరాశులను పరిపక్వ మొనర్చుటకే కదా నీవు త్రిశూలమును చేత బూనితివి!"

మనస్సు మలినములతో కలిసి చెత్తగా మారుచున్నది. అదే మలినములు తొలగినచో శివమయమగును. త్రిశూలము ఒక గుర్తు. ఇచ్ఛా, జ్ఞానము, క్రియా ఈ త్రిశ్శక్తే త్రిశూలము. ఈ త్రిశ్శక్తిని ఉపయోగించే శైవులు పరిపక్వమొందవలెను.

ఓ ఈశ్వరా! నీకు జ్ఞానమే ప్రకాశింపజేయు శరీరమైనది. జ్ఞానమున్న చోట అజ్ఞానమునకు తావేది? (చోటేది) అజ్ఞానము తొలగిన మలినములు తొలగినట్టే కదా! నీవు సకల జీవరాశులకు రక్షకుడవు. నీ కంఠము చుట్టు నాగమల్లి పూల దండతో నీ శోభ మరింత వర్ధిల్లుచున్నది.

"నారాయణుడు, చతుర్ముఖుడు నిన్ను గుర్తించ శక్యము కాలేదు. నాలాంటి వాడు నిన్ను ఎట్లు తెలుసుకొన జాలును. కాని నీవు చాలా మార్లు గుఱ్ఱముపై వచ్చి దర్శన మిచ్చితివి."

అందుకోలేని ఎత్తున దైవమున్ననూ తన భక్తులకోసము క్రిందకు దిగి వచ్చును. మనస్సు కరిగి వచ్చును.

శివుడే బ్రహ్మ, శివుడే విష్ణు, తనను విస్మరించుట తప్పు అనియు, తనను గుర్తించుటయే అవశ్యమనియు ప్రపంచమునకు చాటి చెప్పుటకే కొన్ని రూపములను ధరించెను.

(నీ జ్ఞానముతో దైవమును ఇదని నిర్ణయించ వద్దు. నీ మనో ద్వారమును సదా తెరచి ఉంచుము. తానే నిన్ను వెతకి వచ్చునా దయాళుమూర్తి! అని చెప్పుచున్నారు శ్రీ మాణిక్యవాచగర్,)

"నీవు మాకు మరొక జన్మమును లేకుండాజేసి ముక్తిని ప్రసాదింపుము. పాండ్య దేశమే నీ సొంత ఊరగును."

"నిన్ను భక్తితో కొలిచిన వారికి ముక్తినిచ్చెదవు. ఉత్తర కోశమంగైని నీ సొంత ఊరుగాజేసుకొంటివి భక్తిని ఇచ్చినవారికే ముక్తిని ఇచ్చెదవు."

"ఈశ్వరా! నీ దరి చేర మనస్సులేని వారు అగ్నిగుండములో పడి మాడ వలసినదే!"

ఉన్నత ఆశయములతో జ్ఞానము పొందలేని పక్షమున, ఇచ్చటి జన్మంతయు వ్యర్థమగును.

ఆశల మత్తులో జ్ఞానము క్షీణించును. వివేకమును కోల్పోయినచో పతనమే జరుగును.

ఈ ప్రపంచములో మానవులు జన్మించి, జీవించుటకు పడరాని కష్టములు పడుచున్నదే, ఇప్పటకీ జూడదగుచున్నది.

జన్మము, జీవనము, మరణము మానవుని వదలక వెంటాడుచున్నవి. పునర్జన్మముల యందు చిక్కక, పోరాడి. దాని నుండి తప్పించుకొని, దూరముగా వెళ్లి, రక్షకా! సర్వేశ్వరా! అని ఏడ్చి, ఏడ్చి నీయందు శరణు పొందిన వారినే నేను అనుసరించ కోరుచున్నాను.

విపరీతముగా ఎగిసిపడు సముద్ర అలలపై కక్ష సాధించలేము. దాని లోపల దాగుండ లేము. పరుగెత్తి పరుగెత్తి అలసిపోయిన వారికి దైవము ఒక్కటే శరణు

దుఃఖములతో నిండినది ఈ లౌకిక జీవితము. దానిలో క్షీణించి ఉన్నది మానవ జన్మము. దీనియందు విరక్తినొంది దైవములో శరణు నొందిన పిదప మరొక జీవితము గలదని గ్రహింతురు. అదే మహత్తర జీవితము. ఆనంద జీవితము దానిని పొందుట యే ఈ జన్మ పరమార్థము.

"పతంజలి మహర్షిని అనుగ్రహించిన తిల్లై నటరాజా!! అని హృదయ తపనతో పైబడి పైబడి కరిగి పోవునట్లు అనుగ్రహించుము.

"ఈశ్వరా!! ప్రపంచము అవతరించినపుడే పుట్టిన దేవతలందరికి దేవదేవునిగా ఉండి మహత్తులను చూపి అనుగ్రహించుటచే నీవు మహాదేవునిగా ప్రఖ్యాతి గాంచితివి."

ఇంద్రుడు, వరుణుడు, యముడు, అగ్ని, వాయువు, సూర్యుడు చంద్రుడు, బృహస్పతి మొదలగు వారందరికి వారి పనులు చేయు సామర్థ్యమును, శక్తిని ఈశ్వరుడే ఇచ్చియున్నాడు.

"ఆనంద మహాజ్యోతినే వాహనముగా గైకొన్న దేవ దేవా!! నిన్ను వేడుకొని నీయందు శరణు పొందిన వారికి ఆనందము పొంగి పరవశించునపుడు వారివారి అజ్ఞానమను చీకటి తొలగిపోవుచున్నది. నీ ఆశీస్సుతో చీకటి కొండ కూడా ఆశీస్సుల కొండగా ప్రకాశముగా మారి పోయినదే."

"మానవుల గొప్పతనము, సామర్థ్యము, సచ్ఛీలత నీ నుండి కదా గలిగినది!"

"నీ మూలము నుండి ప్రపంచము పుట్టినది. ప్రపంచములోనికి జీవరాశులు పుట్టినవి. జీవరాశులకు శక్తులు సమకూరినవి. జీవరాశులకు ఆత్మశక్తి పరమాత్మనుండే గలిగినది."

"తనను చిదంబరము వచ్చి దర్శించమని నాకు ఆజ్ఞ ఇచ్చి వెళ్లిన తను, ఆశీస్సులతో తనలో ఐక్యము చేసుకొను వారిని మాత్రము తనతో తీసుకువెళ్లిపోయెను. తన లీలను ఎవరు అర్ధము చేసుకోగలరు?"

"ఈ భువి యందు ఎవరెవరికి ఎన్ని పనులు నిర్ణయించ బడినవో అంత వరకు ఉండ వలసినదే అవి ముగిసిన పిదప పూర్వాశ్రమమునకు మరలవలసినదే."

('తిల్లనా' అనునది భరత నాట్యములోని ఒక భంగిమ. శివుడు నాట్యములో రసజ్ఞుడు, మేధావి కనుక నటరాజా అని బిరుదు తనకు కలదు. తనకు ఇష్టమైన నాట్యభంగిమలో 'తిల్లనా' లో భక్తులకు దర్శన మిచ్చుటచే 'తిల్లై నటరాజా' అని పిలువబడినది.)

("దైవము నందు హృదయ ముంచి కరిగిపోమ్ము" అని శ్రీ మాణిక్యవాచగర్ భక్తులకు ఉపదేశించుచున్నారు.)

"మంచుతో కప్పబడిన హిమాలయ పర్వత శిఖరము బంగారం వర్ణముతో జ్వలించుచున్నది. అట్లే చిదంబరము నటరాజుని సన్నిధిలోనూ బంగారు చాయతో దైవము మెరిసిపోతున్నాడు.

"దొండపండు వంటి ఎర్రటి పెదిమెలు గలిగిన ఉమాదేవికి ఘోరమైన రూపము నిచ్చిన కాళీదేవికి వేర్వేరు గుణములనొసంగి నీవు మాత్రము చిరునవ్వుతో దర్శనమిచ్చుచున్నావే!!"

"కైలాసమునకు అధిపతి వైన నీవు అచ్చట నాదబ్రహ్మము. అటువంటిది నీవు చిదంబరము నందు ఉద్భవించి భక్తులకు తగ్గట్లు ప్రేమతో దర్శన మిచ్చుచున్నావు."

కైలాసములో ఈశ్వరుడు పర్వతముగా దర్శన మిచ్చుటచే జ్ఞాన దృష్టి గలవారికే చూడ శక్యమగును. చిదంబరము నందు చర్మచక్షువులు గలవారందరూ చూచుటకు తగినట్లు దర్శన మిచ్చుచున్నాడు. కైలాసములో పరబ్రహ్మగా ప్రకాశించుటకు తగినట్లు చిదంబరములో భక్తులకు ఆరాధనా మూర్తిగా ప్రకాశించుచున్నాడు.

(దక్షిణ భారతదేశములో చెన్నైకి దక్షిణముగా సుమారు 230 కి.మీ. దూరములో మహాప్రసిద్ధి చెందిన శైవ క్షేత్రము 'చిదంబరము' శివ పంచా రామములలో 'ఆకాశ' అంశముగా పేరుగాంచినది. ఈ చిదంబర క్షేత్రమున నాట్య భంగిమతో 'చిదంబర నటరాజు'గా పిలుబడుచున్నది.)

## 3. దివ్యాండ విభాగము

అండము అను పదమునకు గుండ్రము లేక గ్రుడ్డు రూపముతో పోల్చబడినది. గుండ్రటి రూపముతో గట్టి పదార్థముగా అమరినది ఈ భూమండలము. భూమండలమునే తన శరీరముగా గైకొన్నవాడు పరమేశ్వరుడు.

ఆకాశము, అగాధము, ఇక అనేక అండములన్నియూ పరమేశ్వరుని మహత్తులకు నిరూపణలు.

ఆ అండములన్నియు ఒకదానితో ఒకటి ఆదార పడకుండా తమ తమ స్థిరీకరణముతో మెలగుచున్నవి. అండములను కొలుచుటకు వీలుకాని మనకు వాటిని సృష్టించిన పరమేశ్వరుణ్ణి కొలుచుట ఎట్లు వీలుపడును?

ఆ పరమేశ్వరుడు ఆకాశములో గుండ్రటి రూపములో ఎన్నో అండములు నెలకొనునట్లు చేసెను. వాటి తత్వములను ఎరిగిన వారు లేరు. వాటి అందము, క్రమానుసారము చాలా ఆశ్చర్యకరమైనది.

ఒక్కొక్కటి ఒక్కో అందము వివరించి చెప్పునపుడు అని కోటానుకోట్లుగా వ్యాపించుకొని పోవును

ఒకటికాదు, రెండుకాదు, వందకోట్లుకాదు. పైగా ఇంకా పైబడి అవి లెక్కకు సాధ్యము కానట్లు ఎల్లలకు మించి యున్నది.

దైవము సృష్టించిన ఈ అండములన్నియూ ఒక దాని కొకటి ఆధారము లేని వైనను వాటి భ్రమణము, క్రమానుసారము యొక్క తత్వములను మాటలతో వివరింప వీలుగాదు.

ఇంటిపైకప్పునున్న ఒక చిన్న కన్నము ద్వారా ఇంటిలోపలికి ప్రవేశించిన సూర్యకిరణముల వెలుతురులో ఎన్నో ధూళి పరమాణువులు కంటికి కనిపించును. అట్లే ఆకాశమున ఎన్నో గోళములు తేలియాడు చున్నవి. చిన్న అణువునూ, బ్రహ్మాండమైన అండమునూ, తత్వమున ఒక్కటే అగును. పరిశీలించి చూచిన వారికి ఈ సత్యము గోచరమగును. మనకు ధూళి అల్పము.

అట్లే దైవమునకు అండములు అల్పమైన ధూళి అగును.

"సర్వేశ్వరా!!

లెక్కలేనన్ని బ్రహ్మలు, వారందరికి ఆధారమైన విష్ణువు, సృష్టి, స్థితి, లయ అను త్రికర్మలు, మహా ప్రళయము, దాని ఉనికి, ముగింపు అన్నియూ నీ భాగములేకదా!!"

పుట్టించుట, కాపాడుట, లయము అనునవి త్రికర్మలు. ప్రళయము అనునది, ఒక్కొక్క బ్రహ్మ దేవుడు ముక్తి పొందునపుడు ఏర్పడునది. ఇక మహా ప్రళయమనునది ఈశ్వరుని లీలలో ఏర్పడు ఒక ఆటవిడుపు.

దేనినైనను ప్రారంబించుచున్న విష్ణువే దాని అంతమునకు కారణముగా యున్నాడు. శివుడు కూడ అట్లే అగును. శివ విష్ణువు లిద్దరూ స్వరూపమున ఒక్కరే. వీరికి ఆరంభము లేదు, ముగింపు లేదు.

పెద్దగాలి వీచునపుడు చిన్న చిన్న పిల్లవాయువులు కూడా దానితోనే కూడి భ్రమించును. ఈశ్వరుని మాయా తత్వములో చిన్న చిన్న దేవతలు కూడ చేరి క్రియచేయుచున్నారు. వారి

పనితనము స్థూలములోను సూక్ష్మములోను కలదు. అన్నింటికి మూలముగా యున్న ఈశ్వరుడు ఎప్పటికి మారుట లేదు.తను ఎన్నటికి యవ్వనముగానే యున్నాడు. సృష్టి కర్త బ్రహ్మ, రక్షకుడు విష్ణువు, సంహారకుడు రుద్రుడు. ఈ త్రికర్మలలో మనస్సును లయము చేయక పై స్థితిలో నున్నవాడు శివం.

శివం జన్మరహితుడు, నిరాకారుడు, అతి పవిత్రుడు, సర్వ వ్యాపకుడు, అన్నింటినీ అతిక్రమించిన వాడు.

ఆరు రకములైన మతతత్వములు వేదములను అనుసరించినవి. వాటిలో ఏ ఒక్కటిని అనుసరించినా దైవము ముక్తి అనుగ్రహించు చున్నాడు. దేవతలు మొదలు కొని అన్ని జీవులు యెడ ఆతనిది సమానమైన ధృక్పధమే.

శైవము, వైష్ణవము, శాక్తము, కౌమారము, గాణా పత్యము, సౌరము, మొదలగు ఆరు మతములు దైవమునకు అన్నీ సామాన్యమే, అన్నీ ఒక్కటే. అన్ని మానవులకు ఒక్కటే దైవము. దేనియందునూ, ఎవరియందునూ పక్షపాతము చూపించుట లేదు.

"ఈశ్వరా!! సూర్యుని యందు ప్రకాశమును, వేడిని అమర్చితివి. అందము నిండిన చంద్రుని యందు చల్లదనమును ఉంచితివి. సమర్థవంతుడైన అగ్ని యందు వేడిని పుట్టించితివి. ఎచ్చటనూ నిలకడగా నున్న ఆకాశమున సర్వవ్యాపకము ఉంచితివి. ఉన్నత గుణమున్న వాయువునకు అన్నింటా వీచు బలమున్న వేగమును ఇచ్చితివి."

భూమి, నీరు, అగ్ని, గాలి మార్పుచెందును. కాని ఆకాశము మాత్రము మారుట లేదు. దాని తత్వము, క్రమము అట్లే యున్నది.

"ఈశ్వరా! నీటిలో రుచి ఉంచినది నీవే. భూమి యందు బలమును నింపినది నీవు. నీ యొక్క మహిమలు కోరినట్లు వివరించుతూ పోవచ్చును. అవి కోటాను కోట్లగును. వాటినంతటిని తగిన రీతిలో తగిన స్థానములో నుంచితివి. నీ మహిమలు మాటలతో సరిపోల్చలేము."

"నీటికి మంచి రుచియున్ననూ అది మట్టితో (భూమి) కలిసి పోవు తత్వము గలది. అట్లు నీటిలో కరిగిపోకుండా ఉండుటకే భూమికి బలమను తత్వమునుంచెను."

మహత్తర శక్తులను రూపొందించినది ఆ ఈశ్వరుడే! వాడే ప్రపంచమొత్తమునకు ఆదిమూలముగా నున్నవాడు. సనాతనుడు, మొట్టమొదటివాడు, సంపూర్ణుడు. ఆతనికి సాటి ఎవరూ లేరనిపించుకొనే నాయకుడు. వానిని తెలుసుకొనుటకు ప్రయత్నించెదము గాక! ఆతను అక్షరుడు, సనాతనుడని ఎరగవలెను.

"అడవి పంది యొక్క ముదిరిన దంతములు ధరించినవాడునూ, పులి చర్మమును ధరించిన ఆతనిని దర్శించుకొందుము."

ఈ ప్రపంచ మానవులకు అన్ని వసతులు, అన్ని వస్తువులు సమకూర్చి ఇచ్చిన ఆ

ఈశ్వరుడు తనకు మాత్రము ఏది కల్పించుకో కుండా పంది దంతములు, పులి చర్మమును ధరించి తిరుగాడుతూ తన దాన గుణమునకు ప్రతీకగా ఉన్నాడు.

'భోగ వస్తువులపై ఆశను విడచి, నిరాండబరముగా ఉండండి' అని తను చెప్పకనే చెప్పి దానితో గూడ 'ఇతరులకు ఇచ్చి, ఇతరులను సంతసించు నట్లు చేయుట' లో నున్న సేవా ఆనందమును తను ప్రదర్శించు చున్నాడు.

"దివ్య విబూదిని రాసుకొన్నవాడిని దర్శించుకొనుము. ఆతనిని తలంచినంత మాత్రముననే వానియందు భక్తి వృద్ధియగుచున్నది. ఆనందము పొంగుచున్నది. వానిని మరచి యుండుటకు నా మనస్సు సహించదు. ఒకవేళ ఆతనిని మరచితినా నేను చెడి నశించెదను."

"సువాసనతో నిండిన ఎన్నో పరిమళ ద్రవ్యములుండగా ఆ పరమేశ్వరుడు విబూది అను బూడిదను తన శరీరమంతయూ రాసుకొనుట తన నిరాడంబరతనూ, ఆశలను త్యజించిన తత్వమును కదా చాటుచున్నది."

(విబూది అన్నది ఒక దానిని కాల్చిన తర్వాత ఏర్పడినది (భస్మము) కావున ఆశలన్నింటిని కాల్చివేయుమన్న సందేశమునిచ్చుచున్నది. ఈశ్వరుని కోలాహలమును చూచిన పిదప కూడ లౌకికి కాంక్ష వీడక జీవించునది తగునా? ఆతని కోలాహలమును వీక్షించుచుట తలంచుట, తప్పినవారు 'చెడి నశించెదరని' తను (శ్రీ మాణిక్యవాచగర్) వాపోవుచున్నారు.)

"వీణ యందు వచ్చు లయశబ్దరూపుడు ఈశుడు. ఆ సంగీత స్వర రసజ్ఞుడు తనే అని గ్రహింపవలెను."

లయశబ్ద ఉన్నతను చాటునది సంగీతము. సంగీతము ఎంత ఉన్నతమో అంత ఉన్నతము ఆ ఈశుడు. నాదమునకు నాయకుడు. సంగీతములో లయమైనచో ఈశుని యందు లయమగును. ఆత్మ సాధనలో సంగీతము ఒక కొలసాధనము.

దృష్టికి సులభ లభ్యుడైనను, దానికి మించిన అనాది, ఆ ఈశ్వరుడు. సనాతనమునకు సనాతనుడు. ప్రపంచ ప్రధముడు. వాని పుట్టుక ఇదని గుర్తించలేము కావున వాడు పురాణ పురుషుడు. సృష్టికర్త అయిన బ్రహ్మ, స్థితి కారకుడైన విష్ణువులు కూడ ఆతనిని పూర్తిగా ఎరుగని వారే అని గుర్తించవలెను.

తమకు తామే గొప్పని భావించుకొనుట మానవ నైజం. ఇతరుల వద్దలేనిది తన వద్ద యున్నట్లు భావించుకొని, తమకు తామే మెచ్చుకొందురు. ఇటువంటిది దేవతలకు కూడ తప్పలేదు. బ్రహ్మకు తానే సృష్టికర్త అనియు, తను లేనిదే ప్రపంచము లేదనియు, జగత్తు అంతటికి తన సృష్టియే మూలకారణ మనియు భావన యుండెను.

మహావిష్ణువు నకు తానే ఈ జగద్రక్షుడనియు, తను లేనిదే ఈ జగత్తు రక్షణ లేక అన్ని జీవరాశులు నశించుననియు, కావున తానే పెద్దనియు తలంచుచుండెను.

వీరిద్దరు కలిసి ఈశ్వరుని వద్దకు వెల్లిరి. వీరి గర్వము అణగద్రొక్కుటకే ఈశుడు

గ్రహాండములోనికి వెళ్లిపోయి ఊర్ధ్వ, అధోలోకములో బ్రహ్మాండమైన అగ్నిజ్వాలగా మారిపోయెను.

ఎన్నో అంశములందు చాతుర్యము, పాండిత్యమున్ననూ అంతటికి దైవమే శక్తియుక్తుడని ఎంచి అణిగి మణిగి వినయముతో నడచుకొనవలెను.

"ఈశ్వరుడే అన్నింటిని భ్రమింపజేయు పరబ్రహ్మము. లెక్క లేనన్ని రూపములు గల పురాణ పురుషుడు, ఎన్నో అద్భుతములు చేయుటచే ఆతనిని 'అద్భుతుడు' అని ఎందరో కొనియాడిరి. ప్రపంచశ్రేయస్సు కోరి తాను ఎన్నో అవతారములు ఎత్తి అనేకములైన మహిమలు చేసి అందరిచే మహాపురుషుడని పించుకొనెను.

ఊహకు అందని దూరములో ఉండునట్లు అగపడును. కాని భక్తి మూలమున ఆతనిని మనము సొంతము చేసుకొనవచ్చునని అందరూ గుర్తించవలెను.

"సాధారణముగా మనస్సు చాలా దూరము వెళ్లగలదు. సుదూర ప్రాంత వస్తువులపై కూడ సఖ్యము చేసుకొన గలదు. అటువంటి మనస్సుకు కూడ అవతలివాడు దైవము. మనస్సుకు అందని వాడైనను భక్తి వలలో చిక్కుకొను వాడుగా యున్నాడు."

తనను (దైవమును) ప్రేమించు వారికి అండగా నిలబడియున్నాడు. కఠినమైన సాధనల మూలముగా వానిని పొందగోర అవసరములేదని ఇచ్చట శ్రీ మాణిక్యవాచగర్ క్రింది వరుసల మూలముగా నొక్కి చెప్పు చున్నారు.

"వాడు లేక సృష్టించిన వస్తువు ఏదీలేదు. వాడే ప్రపంచమై ప్రపంచములో అన్నీ తానై వ్యాపించియున్నాడు. దీనిని గుర్తించవలెను."

"ఈశుని తత్వము అతి సూక్ష్మము. అయితే ఆతని విరాట్ (విశ్వ) మహత్వము దేనితోను పోల్చేలేమని ఎరుగవలెను."

"నోటితో చెప్పుటకు, మనస్సుతో గ్రహించుటకు వీలుకానిది ఈశ్వరతత్వము; ప్రపంచ వస్తులన్నింటిలోనూ తానై ఉండి వాటిని దయా గుణముతో రక్షించు చున్నాడని గ్రహించవలెను."

"వానిని చూడలేము, అయితే, చూచు అన్నింటియందునూ ఉన్నవాడే. అట్లున్ననూ వానిని చూచుటకు ఈ ప్రపంచమునకు అవశ్యమయినది. అంతరము, అంతర్థానమైన వస్తువును తెలుసుకొనుటకు సాదారణ తెలివి చాలునా? తపస్సు మూలమున పరి పక్వమొందిన మనస్సు కదా కావలెను.

"గ్రంథ పఠనముతో చూడలేని సూక్ష్మ వస్తువుగా దైవమున్నాడు. అతను సర్వాంతర్యామిగా అన్నింటా వ్యాపించియున్నాడు"

దైవమును పొందుటకు ఎన్నో మార్గములున్నవి. అయితే మంచిమార్గముల వలె అడ్డదారులు కూడా యున్నవి. పుస్తక పఠనము వల్ల ఆతనిని పొందగలమా? మనము

నేర్చినవన్నీ విద్యకు స్ఫూర్తి గలిగించునవే కాని ఆతని ఆశీస్సును, అనుగ్రహమును పొందించలేనివే. ప్రేమతో ఆతనిని (దైవమును) పొందగలమనగా భక్తితో ప్రేమించుటకు పుస్తక పఠనమక్కరలేదు కదా!

"ఈశునికి ఆది, అంతము లేదు. అయితే తను జీవరాశులకు బంధము, ఆశలు, ఇచ్చి జనన, మరణములను ఏర్పరచున్నాడని గ్రహించవలెను."

ఎల్లకాలములలోనూ, అన్ని చోట్ల యందు ఉన్న ఈశుడు మానవులకు మాత్రము కష్టసుఖములనిచ్చినను ఒకఘట్టము (స్థితి) నందు వారిని జన్మ రహితులుగా చేయుచున్నాడు. మోక్షమను శాశ్వత పరిహారమును చూపుచున్నాడు.

(ఆహారమే ఔషధమగును. ఏ ఆహారము రోగమును కల్పించినదో ఆ ఆహారమే ఔషధమగుచున్నది కదా! అట్లే కష్టములు కల్పించిన దైవమే కష్టములను నివృత్తిచేయుచున్నాడు. ఇచ్చట జనన, మరణ తత్వములు మన ఇష్టాఇష్టములకు జరుగుట లేదు. అవన్నీయూ దైవ చిత్తమని వక్కాణించు చున్నారు శ్రీ మాణిక్యవాచగర్.)

క్రియా, నిష్క్రియా ఈశుని లీలలు. కాలము ఎరిగి కాలాతీతునిగా ఉన్నాడా ఈశుడు. స్త్రీ, పురుష, లింగ బేధము లేక తానే అన్ని జీవరాశులందును ఇమిడిన ఆతనిని జ్ఞానచక్షువులతో గుర్తించిన పిదప, చర్మచక్షువులతో కూడ చూడ సాధ్యమగును."

"ఈశ్వరుడు ఆశీస్సులను అమితముగా ఇచ్చుటచే అమృత రూపుడనియు, కరుణామూర్తి అనియు నా అనుభవము చెప్పుచున్నదే!"

"ఈశుడు తన ఎర్రనైన దివ్య పాదములను ఈ భువియందు పదిలము చేసెను. అతడే శివుడని ఎరిగితిని, ఆశీస్సులను పొందితిని."

అంతరంగములో దర్శన మిచ్చు ఆ దైవము, మన:పరిపక్వమైనచో బాహ్యములో కూడ మనకు దర్శనమిచ్చును.

"నల్ల కలువలు వంటి కన్నులు గల అంబిక యొక్క భాగస్వామి శివుడు. ఇద్దరు స్వరూపములో ఒకరే అని గుర్తించుము."

శివుడు లేక శక్తి లేదు, శక్తి లేక శివుడు లేడు. ఆడ, మగ సరిసమానమన్నది తెలుపుటకే 'అర్ధనారీశ్వర' తత్వము వచ్చినది. సముద్రము శివతత్వము, అలలు శక్తి తత్వముగా పోల్చవచ్చును.

లోతైన సముద్రము వంటిది దివ్యానందము. అది శివశక్తి ఐక్యముతో ఏర్పడినది. ఈ ప్రపంచమును పెద్దనైన నల్లటి మేఘములు ఆవరించినట్లు, తిరుప్పెరుందురై పర్వతముపై ప్రసన్నమైన దైవము (ఈశ్వరుడు) జ్ఞాన ప్రకాశమును అన్ని చోట్లలోను వ్యాపింప జేయుచున్నాడు.

"లౌకికములో మనల్ని బంధించు పంచజ్ఞానేంద్రియములను పాము, మనకు భయపడి పారిపోవుచున్నది!"

పామును చేరదీయుటచే వినాశము తప్పదు. అట్లే జ్ఞానేంద్రియముల వాసనపట్టు మనల్ని పట్టి పీడించుటకు ముందే వాటిని పారద్రోలవలెను సుమా! ఋతువులు మారుటచే తీవ్రమైన వేసవి తాపము తొలగిపోవునట్లు మన తీవ్ర కష్టము లన్నియూ తొలగిపోవును!"

దైవముపై చిత్తముంచిన వారికి లౌకిక జీవితములో కష్టములు తెలియవు మనస్సు 'పరము'పై లయమైనచో 'ఇహము' ను ఏల తలంచును? ఏల తలంచి కలత పొందును?

"ముఖమున సహజ సౌందర్యములతో దైవైక్య తేజస్సు కలిసి ప్రకాశించు చున్నది."

మనస్సులోని అందము ముఖములో కనిపించును. పవిత్రత నిండిన మనస్సు ధర్మబద్ధతతో కూడిన జీవితమును గడుపును. ఎప్పుడూ మనస్సు దైవ చింతనలో మునిగి యుండుటచే ఆ ప్రకాశము ముఖమున వికసించును.

"మరల మరలా జన్మము పొందుట ఒక చిరాకైనదిగా తలంచెదను."

ఎత్తిన జన్మము చాలునని ఎపుడు తలంపు కలుగును! పరమాత్ముని దివ్యపాదములను పొందగోరు కోరిక కలుగునపుడే కదా!"

"ప్రపంచమెరుగునట్లు నీవు నన్ను బహిరంగముగా ఆకట్టుకొని ఆశీర్వదించితివే! "ఈశ్వరా!!

'వీడు నావాడు వీనిని నేను ఆకట్టుకొంటిని.' అని బహిరంగముగా డప్పు వాయించి దైవము చాటుకొను చున్నాడని శ్రీ మాణిక్యవాచగర్ వాపోవుచున్నారు.

"తామర పుష్పపు మొగ్గ వలె అరిచేతులను జోడించి మ్రొక్కిన తీరు, దైవము యొక్క అపార ఆశీస్సులకు ఆనందబాష్పములు కారునట్లు చేసినవి."

"కొండపై వెలిగించిన దీపము దేదీపమాన్యముగా ప్రకాశించు నట్లు, దైవము యొక్క సుభిక్షముతో నిండిన జ్ఞాన ప్రకాశము నలు దిక్కులకు వ్యాపించి నదే!"

"కించపరచెడి దు:ఖము తొలగిపోయినది. ఒక పరమానందము పొంగి ఎరులై పారినది"

దైవానుగ్రహము పొందిన పిదప దు:ఖమేది? ఎప్పటికి పరమానందమే కదా!

"విశాలమైన కన్నులు గల జింకల గుంపు తీవ్రమైన దాహముతో ఎండమావి వద్దకు వెళ్లినవి. అనుగ్రహ దాహము గలిగిన ఇతర మతముల వారు సైతము దైవ అనుగ్రహము పొందలేక ఇక్కట్లు పడ్డవారే."

(ఇతర మతస్తులని శ్రీ మాణిక్యవాచగర్ పేర్కొనడము ఆరు మతస్తుల వారిని. వారు వేదముల యందునూ, ఆత్మజ్ఞానములోనూ నమ్మకము లేనివారే!)

"ఎత్తైన పర్వతము నుండి పెద్దనది ప్రవహించినట్లు అమితానందము నిచ్చు నీటిసుడులు క్రిందికి పారినది."

"ఎక్కువ సుడులతో నిండి ప్రవహించిన జన్మము, దాని కర్మఫలము అను ఒడ్డుకు అడ్డుతగిలి నిలచినది"

" ఆ ప్రవహించిన దైవ అనుగ్రహమను నీరు, కాలానుగుణంగా మనల్ని పీడిస్తున్న

కర్మఫలములను వేరుతో పెకలించివేసినది.”

“ఈశ్వరా! నీ అనుగ్రహము ప్రవహించు నీరువంటిది. అందమైన కొండ లోయలో ఆనకట్ట కట్టి నీటిని నిలువజేసితివి అందు తేనె కారుతూ సువాసనతో నిండిన పుష్పముల తోటను ఏర్పాటు చేసితివి. అన్నియూ నీ అనుగ్రహమే కదా!”

ఈశ్వరా! నీ భక్తులు ఆరాధన అను పంట భూమి లో ప్రేమ యను విత్తనములు నాటి అమృతమగు శివబోధను పండించిరి. అది వారికి జ్ఞానతృష్ణ తీర్చు షడ్రుచులుగల ఆహారమైనది.”

(యోగులు కుండలినీ యోగములో శక్తిని వెన్నెముక ద్వారా పైకి ప్రవహింప జేయునపుడు ఏడవ స్థానమైన సహస్రదళములో అమృతము నోటిలోనికి పాలవలె ధారగా వర్షించును. అపుడు పరమానంద భరితమగును. దీనినే అనుభవించి శ్రీ మాణిక్యవాచగర్ వక్కాణించుచున్నారు.)

“నల్లటి పడగతో నున్న త్రాచుపామును నడుమునకు చుట్టుకొని యున్న ఈశ్వరా వర్థిల్లుగాక! కఠిన తపస్సు చేయు గొప్పవారికి అనుగ్రహించు నాయకా! నీవు వర్థిల్లుగాక!”

(తమిళములో “వాయ్గ” అను పదమునకు ‘జీవించుగాక!’ ‘ఆయుష్మాన్ భవ’ నీ మహిమలు వర్థిల్లుగాక! నీ గొప్పతనము వర్థిల్లుగాక! అని పెక్కు అర్థములతో భక్తుడు దైవము ముందు పరవశించి వేడుకొనుట. దైవము బాగుండి మనల్ని రక్షించుగాక అనునది భక్తుని కోరిక.)

“మరణ భయము పోగొట్టు మహావీరా! వర్థిల్లుగాక! ఎల్లపుడు భక్తిదాసులను నీ వశము చేసుకొని ఆకట్టుకొన్న దైవమే! వర్థిల్లుగాక!”

“వితండ వాదము చేయు మూర్ఖుల పట్టునుండి విడిపించిన వాడా! వర్థిల్లుగాక! నీ శరణుజొచ్చిన వారికి దయతో అమృతమొసగువాడా! వర్థిల్లుగాక!”

“కారు చీకటిలో ఆనంద తాండవమాడు ఈశ్వరా! వర్థిల్లు గాక. అందమైన భుజములు గలిగిన ఉమాదేవి ప్రేమకు పాత్రుడా! వర్థిల్లుగాక.”

“నీ యందు భక్తిలేని వారికి కూడా ఎటువంటి కీడు జరుగక రక్షించువాడా శివా! వర్థిల్లుగాక. కూడబెట్టిన సంపద కష్టకాలములో ఉపయోగపడునట్లు, నిన్ను ప్రేమతో భక్తి సలుపు వారిని రక్షించు దైవమే! వర్థిల్లుగాక.”

తనను తలంచని వారికి కీడు రానీయడు. తనను తలచిన వారికి దు:ఖము నివారించి సుఖమును అందించును.

“విషసర్పమును మెడలో ధరించి, ఆడించు చున్న దైవమునకు నమస్కారములు. నన్ను భక్తి పరవశముతో పిచ్చివానిగా చేసిన ఆ గొప్పవానికి నమస్కారములు.”

జీవరాశులన్నిటిని తన వశము చేసుకొనుటలో శివుడు ఉన్మత్తుడయ్యెను. అట్లే తన

భక్తులను కూడ ఉన్మత్తులుగా చేసివేసెను.

"చలనము, నిశ్చలనము శివలీలలే. విబూది ధరించి దర్శనమిచ్చు ఆ మహనీయునికి నమస్కారములు."

"అనాదియైన వానిని మాటలతో వివరించలేము. అస్థిరమైన వాటికి స్థిరము కల్పించునది వాడేకదా!"

"మనస్సుకి, బుద్ధికి అందనివాడు శివుడు. వాడిని కళ్లు మొదలగు జ్ఞానేంద్రియముల ద్వారా తెలుసుకొనజాలము."

"ఆకాశము మొదలగు పంచ భూతముల అన్నింటిలోనూ శివుడు తన ఉనికిని చాటుకొని యున్నాడు."

చూడలేని మానవులు తనను గుర్తించుటకొరకే దైవము పంచభూతములలో దర్శన మిచ్చుచున్నాడు.

"పుష్పములోని సువాసన వలె దైవము యొక్క మహిమ భూమండల మంతటనూ నిండి యున్నది."

"నీవు సులభముగా వచ్చి నన్ను ఆకట్టుకొంటివి. కాని నశించదగిన ఈ దేహముపై నాకున్న ప్రేమను తొలగించినది నీ కరుణేకదా!"

"ఈ రోజు నా కొరకే సులభసాధ్యుడవై దర్శనమిచ్చు దైవమునకు – ప్రణమిల్లుచున్నాను."

"భక్తిని పెంపొందించుట కొరకే ఈ శరీరమును పవిత్రము చేసినందుకు నా నమస్కారములు."

"ప్రేమనే రూపముగా నున్న శివుడు, తన భక్తుల హృదయము లోనూ ప్రేమయను ఊట నీరును కల్పించి ఆనందమును పెంపొందించి నందులకు – నమస్కారములు."

"పరమానందమే అలలుగా పెరిగి, నన్ను తనలో ఐక్యము చేసుకొన్నపుడు, దానిని అంగీకరించని శరీరముతో నేనెట్లు ఇష్టపడి నిలువగలను?"

"ఈశ్వరా! మరకతములు, మాణిక్యములు కుప్పలుగా పోసి ప్రకాశించుటలోను, ఆకాశ మెరుపులలోనూ, బంగారు మెరుపులలోనూ నీవు కలిసిపోయి ప్రకాశించుచున్నావు. అయితే ఈ శరీర చక్షువులతో చూచి వెతుకు వారికి నీవు కనపడవు కదా!"

"సరిపోల్చలేని దానితో దైవమును పోల్చిచూడడము మానవనైజము. దీని వలన మానవులు బాహ్యచక్షువులతో ప్రపంచమంతయూ వెతుకుచున్నారు. కాని అంతర్‌కళ్ళలో అంతర్ముఖులైనచో లోపల ఉన్న నిన్ను చూడగలరు."

"శాస్త్ర పఠన, పారంగతులకు కూడ చూడ శక్యము కాని వాడు పరందాముడు."

తెలివి, సత్ప్రవర్తన ఉన్నంత మాత్రమున దైవానుభూతి పొందలేరు. దైవ అనుగ్రహము కావలెను.

"ఒకడు తన బంధువులను, స్నేహితులను, చుట్టూ ఉన్నవారిని దు:ఖించునట్లు చేసి, కఠిన తపస్సు చేసినను దైవమును జూడజాలడు."

శరీరమును శుష్కింపజేసి దైవమును జూడ గోరుటయూ ఒక విధమైన అహంభావము, అజ్ఞానమే అగును. దేవుని చూపులో ఇది తగని పని. అహంభావము లేనితనమే ఒక విధమైన ఆరాధన. అదే దేవునికి ప్రీతి.

"శాస్త్ర జ్ఞానముతో తనను జూచుటకు ప్రయత్నించు వారికి దైవము కనిపించుట లేదు."

"ఏదోక ఉపాయము పన్ని, దాని చేత దైవమును చూచివేయుదమని ప్రయత్నించువారికి, దైవము ఆ ఉపాయములోనే తను దాగుండి పోయి జూడ శక్యము గాకుండా చేయచున్నాడు.

"నిన్ను దృఢనిశ్చయముతో గుర్తించినవాడికి నీవు మగవాడిగాను, నపుంసకుడుగాను, మోము ప్రకాశించు స్త్రీగాను కనిపించుచున్నావు. అసలు నీవు దీనికంతటికి అతీతుడవు కదా!"

"పంచేంద్రియముల వృత్తులను కట్టడి చేసి, ఆహారము త్యజించి, కొండల్లో, కోనల్లో కొసఊపిరితో తపస్సు చేసేవారికి ఈశుడు దొరకడము లేదు."

వృత్తులను నియంత్రించుట, త్యజించుట, ఆహారమును విడచుట, అనునవి దైవము యొక్క ఉద్దేశ్యములు కావు. తమకు నిర్ణయించబడిన జీవితమును సంపూర్ణముగా జీవించిన పిదపనే జీవరాశులన్నియూ తన వద్దకు వచ్చి చేరవలెననునదే దేవుని ఇష్టము. శరీరమును శుష్కింపజేసి ప్రాణత్యాగం చేయడము ఆత్మసాధన కానేరదు.

"అన్నింటికి అనాదిగా, మూలముగా ఒకటి ఉన్నదని గుర్తించని అల్పబుద్ధి గలవారికి దైవము అందుబాటులో రాజాలడు."

"ఇంద్రియము లన్నింటిని జయించిననూ, మంత్రోచ్ఛారణతో కొంతమంది దేవతలను వశపరచుకొన్ననూ, తాజా పుష్పమాలలతో దైవము యొక్క కాలికి తలకు చుట్టివేసినను, ఈశుడు వారికి వశమగుట లేదు. దొంగను పట్టుకొని రీతిలో దైవమును పట్టుకొన గలమా? ఎప్పటికి కానేరదు."

"సర్వేశ్వరా! నీకు నీవే సాటి. నీకు సమానులు వేరెవరు? వైదికుని వేషము బూని నీ గొప్పతనము చాటుకొన్నది నాలాంటి వారి ఉన్నతి కొరకే కదా! నీవు కోరివచ్చి నన్ను ఆకట్టుకొంటివి. నీప్రేమను తలంచి నా ఎముకలు కరుగునట్లు కేకపెట్టి ఏడ్చితిని."

"సముద్రపు అలల వలె నేను శబ్దించి ఏడ్చుచున్నాను. ఆ అలల వలె నేను తలక్రిందులై పడి జారిపోవుచున్నాను."

"ఊరి ప్రజలందరు ఆశ్చర్యపడునట్లు, విన్నవారు నమ్మలేనట్లు నేను పిచ్చివాని వలె మతి భ్రమించి తిరిగితిని. వెర్రిపనులు, చిలిపి పనులు చేసి నా ఉద్రేకమును బయట పెట్టితిని."

"మదమెక్కిన మగగజము మావటి వాని సంజ్ఞలను వినక తన నిలకడ తప్పి తిరుగాడును.

నా పరిస్థితి కూడా అటువంటిదే అయినది. కాని నీ ప్రేమా కటాక్షము వలన నా శరీరమంతయూ తేనేతో నానబెట్టినట్లు మధురమైనది.”

“ఆ రోజులలో నీ చూపులతో త్రిపురమను పర్వతమును కాల్చివేసితివి. నిన్ను నిర్లక్ష్యము చేసిన వారిని సమూలముగా నాశనము చేసితివి. కాని అదే నీ ముక్కంటి జ్ఞానాగ్నితో మాలాంటి దాసుల యొక్క త్రిగుణములతో నున్న (సత్వ, రజో, తమో) దోషములను నివారించి నీవశము చేసుకొంటివి.”

“అరచేతిలోని ఉసిరి వలె దైవము నాకు స్పష్టముగా దివ్యదర్శన మిచ్చుచున్నాడే!”

“నేను అనుభవించిన శివానంద భోగము ఎట్లు వివరించి చెప్పుటయో నాకు తెలియకున్నది. నీవు నన్ను ఎట్లు ఆకట్టుకొన్నది నేను ఎరుగుదును. దేవదేవా! నాకేమి అర్థము కావడము లేదు సుమీ! అల్పుడను నేను! నీవు అనుగ్రహించిన విధానము నా బుద్ధికి అందనిది. కాని అది త్రాగగా త్రాగగా వెగటు కాజాలదు. తినగా, తినగా చాలునని పించదు.”

(మానవులు తాము అనుభవించిన సాధారణ సుఖానుభవములనే వివరించి చెప్పలేనపుడు, పరమానంద భరితము పొందినది, దివ్యత్వమును, ఎట్లు వివరింపదగును. దీనినే శ్రీ మాణిక్యవాచగర్ ‘చెప్పలేక పోతున్నా’ అని వాపోవుచున్నారు.)

“స్వచ్ఛమైన, పుష్టియైన పాలసముద్రములోని చల్లని అలలు వంటిది దైవ పరమానందము. పౌర్ణమి దినములో ఎగసిపడు అలలవలె నా హృదయములో ఆనందము ఎగసిపడుచున్నదే!”

“చెప్పుటకు అలవికాని ఆనందము అమృత స్వరూపము. అది శరీరము పులకరించి పోవునట్లు చేయు దివ్యత్వము.”

“కర్మఫలితములు, రక్త మాంసములతో కూడిన ఈ శరీరము బహు అల్పమైనను, దైవము నాలో తన ఉనికిని ఏర్పరచుకొని శివానందమను తేనెతో నింపెను.”

“ఆ దైవము, ఆశ్చర్య పడునట్లు అమృతధారలను నా ఎముక మజ్జల ద్వారా శరీరంలో ఎక్కించెను. అది కరిగి నా మనస్సు ద్వారా ప్రవహింపచేయునట్లు దైవము చేసెను.”

“ఏనుగు ఎట్లు తియ్యటి చెఱకును, ఫలాదులను వెతకునో అట్లే దైవము వెతికి, పట్టుకొని అల్పుడైన నన్ను పరమానందములో ముంచి వేసెను..

శివానందముతో తేలియాడి నేను అమృత స్వరూపము పొందునట్లు ఆ దైవము చేసెను. హరికి.. బ్రహ్మకు దొరకని ఆ దేవదేవుడు (ఈశుడు) నాకు అందిన వాడయ్యెను.

గర్వపడ్డ దేవతలను సిగ్గుపడునట్లు చేసిన ఆ దైవము ఈశుడు, ప్రేమ నిండిన మనస్సును మాత్రము తన వశము చేసుకొనెనని శ్రీ మాణిక్యవాచగర్ నొక్కి చెప్పుచున్నారు.

(‘తిరువాచగం’ అంతయు ‘తేనె’ అను పదమును ఎక్కువ సార్లు వాడబడియున్నది. దీనికి కారణము శ్రీ మాణిక్యవాచగర్ తన స్వీయ దైవ అనుభూతిని ఇతరులకు మధురము గురించి వివరించునపుడు పామరులకు అర్థమగునట్లు చెప్పుటలో ఎంత తినినా, చాలు అని చెప్పని, వెగటు పుట్టని, ‘తేనెను’ తలంచి చెప్పిరని అభిప్రాయము.)

# 4. స్తుతించు స్తోత్రములు

"చతుర్ముఖుడైన బ్రహ్మ మొదలగు దేవతలందరు మ్రొక్కి స్తుతించు చున్న సమయములో నారాయణుడు తన రెండు అడుగులతో ముల్లోకములను కొలిచి వేసెను. అప్పుడు నాలుగు దిక్కులలో నున్న మునులు తమ పంచేంద్రియములను ఏకీభవించి, ప్రకాశించుచున్న కిరీటము గల శ్రీ మన్నారాయణుని నమస్కరించిరి. శ్రీమన్నారాయణుడు ఈశ్వరుని దివ్యపాదములను చూచు చుండెను."

"మహావేగము, బలమును పొందిన వరాహము (పంది)గా రూపొంది, ఏడు పాతాళలోకములను ఛేదించి వెతుకుటలో నారాయణుడు ఓడిపోయెను. అన్ని లోకములకు నాయకుడా! నీకు జయమగుగాక! అని శివుని స్తుతించి పాడినను తను కైలాస నాథుని పాదములను జూడ శక్యము కాలేదు."

"దేవలోకములో నున్న వారుకూడ దర్శించలేని తన పాద పద్మములను, ఈ భూలోక జీవులు చూచి స్తుతించునట్లు శివుని రూపము ఆదుకొను చున్నది. తమ తమ కర్మ పలితములు తగినట్లు ఆ జీవులు చీమ నుండి ఏనుగు వరకు జన్మము పొంది, చివరగా మానవ యోని యందు మనిషిగా జన్మించుచున్నవి. యోని వాసములో పెక్కు జీవకణముల మధ్య పోరాటము జరిగి చివరగా ఒక కణము మాత్రం జయించి ఐక్యమై అందు పిండముగా పెరుగుటకు ప్రారంభించును.

"ఒక మాసము పూర్తియగు సమయమున పిండము తనకంటూ ఒక ప్రత్యేక రూపమును పొంది, రెండవ మాసము ముగుయు నపుడు బలము పొందును."

"మూడవ మాసమున తల్లి గర్భసంచిలోని ఉమ్మనీరు అదిమి పోకుండా జీవించి, నాల్గవ మాసములో చీకటి గర్భసంచిలో ఆ పిండము కాలము వెళ్ళబుచ్చి, ఐదవ మాసములో పిండచ్ఛేదము కాకుండా జాగ్రత్తపడి, ఆరవమాసమున అంగములతో సక్రమముగా తయారై వృద్ధి చెంది జీవించి."

"ఏడు, ఎనిమిది, తొమ్మిది మాసములలో ఏర్పడు ఇక్కట్లన్నింటినీ దాటుకొని,"

"పది మాసముల వరకు గర్భములో ఉండి పూర్తి పరిణామము పొంది, జన్మించు సమయమున తల్లి, శివువు, ఇద్దరూ భరించలేని బాధ అనుభవించుచున్నారు.

"సంవత్సరములు అగుసరికి శరీరము దృఢమగుచున్నది."

"ఉదయకాల కృత్యములు, ఆహారము, నిద్ర మొదలగు దినచర్యలతో జీవితము గడుపుతూ."

"స్త్రీల యొక్క దట్టమైన నల్లటి కురుల అందము, మంగళకరమైన చిరునవ్వులు, ఎత్తైన వక్షోజములు, లేడివంటి కను వంపుల, సొంపులలో చిక్కి కామవశుడు కాకుండా,"

"భూలోక జీవితముపై మమకారము, పిచ్చితో నున్న మానవుల మధ్య జీవించుటచే వచ్చు పేరాశ అను మదపుటేనుగు నుండి తప్పించుకొని,"

"విద్యాధికమను గర్వము నుండి తప్పించుకొని, సిరిసంపదలను దుఃఖము నుండి బయటపడి,"

"దారిద్రమను పీడిత నుండి బయటపడి, కొన్ని చెడ్డ అలవాట్లతో పాడైపోకుండా ఉన్నత స్థితిని పొందినది,"

"వెగటుపుట్టని పరమానందమే రూపముగాగల పరబ్రహ్మము ఒకటి గలదను వివేకము ఎన్నేన్నో జన్మములు ఎత్తిన పిదపే జీవాత్మకు ఏర్పడుచున్నది. కాని ఆ వివేకము అభివృద్ధి కాకుండా అడ్డగించుటకు ఎన్నో మాయలను ప్రకృతి ఏర్పరచుచున్నది."

బంధువులు, తోటివారు చెప్పునట్లు వారి నాలుకలు దైవము లేదను నాస్తిక వాదము పలుకుచున్నది. ఇది కూడ మాయ చేయు ఒక విధమైన లీల. మాయ అనగా ఒక విధమైన మసి. అది మనస్సుని ఆవరించును. జ్ఞానమును మందగించును."

"బంధువులను బడుగు జీవాత్మలు వచ్చి చుట్టూ గుమిగూడి పరమార్ధ మార్గమున వెళ్ళవద్దని ఏడ్చి వేడుకొనిరి."

"కర్మసిద్ధాంత విధులను అనుసరించినచో మంచి ప్రతి ఫలము పొందవచ్చునని వేదశాస్త్ర, రుజువులను చూపించి, ఆత్మజ్ఞాన, ఉపాసన సాధనకు అడ్డంకులు కల్పింప ప్రయత్నించిరి."

"పాటించుటకు తమ మత సిద్ధాంతమే గొప్పదని వేరువేరు మతస్తులును వారి వారి గొప్పలు చాటుకొనిరి."

"గాలి అలలను సృష్టించు గొప్ప సుడిగాలివలె, మాయగాళ్ల వాదము మనో:కళంకితము ఏర్పరచును. అందులకే ఆత్మసాధనలో నున్న వారు, వీరి బారిన పడకుండా జాగ్రత్తపడవలెను."

"పరమునందు నమ్మకము లేని లౌకికవాది భయంకరమైన పాము వంటివాడు. వాని తత్వము లన్నియూ ఘోరవిషము వంటిది."

"ఏది ఒప్పు? ఏది తప్పు అని గుర్తించ లేని అటువంటి తత్వములన్నియూ అజ్ఞానమునకు దారి చూపును."

"ఎటువంటి మతిభ్రమకు చిక్కని తెలివిగల సాధకుడు భాగ్యవంతుడు. వాడు మండు చున్న క్రొవ్వత్తి వలె మనస్సు కరిగి దైవమును ప్రార్థించును. వాని శరీరము ఏడ్చి, ఏడ్చి బడలి, పులకించును."

ఆడి పరవశమొంది, పాడి పులకరించి, భక్తుడు అజ్ఞానమను పాతాళమునకు చేరక తాబూనిన దీక్ష నుండి తప్పక ఉండుటచే తన భక్తి ప్రేమగా మారును.''

"పచ్చటి చెట్టునందు మేకు సులభముగా దిగునట్లు, దైవ అనుభూతి హృదయము కరుగునట్లును శరీరము భ్రమించునట్లునూ చేయును."

"హృదయము కరిగి, శరీరము భ్రమించును. కాని లౌకిక ప్రపంచము భక్తుని దెయ్యముగా తలంచి నవ్వును."

“ఆత్మసాధకునికి సిగ్గుపోవును. వాడు లౌకికుల నిందను ఆభరణముగా గైకొనును. దాని గురించిఇసుమంతైనను మనో:క్లేశము చెందుట లేదు.”

“జ్ఞాన మార్గమునకు గర్వము ఒక అడ్డంకి. ఆత్మజ్ఞానమును పైపైకి వృద్ధి చేసుకొనవలెను. మోక్షమునకు సమాన మేదియూ లేనందున దాని మహిమ గురించి ఆశ్చర్యపడునదే శ్రేష్టము.”

“తల్లి ఆవు తన దూడ కొరకు పరితపించిపోవుట వలె, భక్తుని మనస్సు దైవము గురించి నానా విధములుగా కరిగి పరితపించి పోవలెను. తమ చిత్తమునందు దైవము తప్ప మరేదియూ పొసగదు, కలలోనూ రాదు.”

“ప్రపంచమునకు అతీతుడై గొప్పస్థానములో నున్న ఆ పరమాత్ముడు, ప్రపంచములోని ఒక భూప్రదేశమైన ఇచ్చుటకు పరమ గురువుగా వచ్చి నన్ను ఆకళింపు చేసుకొన్నది వాని గొప్పతనము చాటుకొన్నట్లే కదా!”

“దైవ లీలను సాధారణమైనవిగా భావించరాదు. శరీరము నుండి నీడ ఎట్లు వేరుకాదో అట్లే దైవ దివ్యపాదముల నుండి భక్తుని చిత్తము వేరుకారాదు.”

“ఆత్మజ్ఞానికి ఉన్నతమైన భక్తి, స్థితప్రజ్ఞత లోపించడమో, తగ్గడమో జరుగదు. ఏలననగా వాని దీక్ష ఒక నది, తీరమును అంటిపెట్టుకొని ప్రవహించునట్లు, లక్ష్యము దిశగా పయనించి ఎముకలు కరుగునట్లు ప్రేమ వృద్ధి అగును.”

ఇంద్రియము లన్నింటిని కట్టిడిచేసి, తన నాలుక మాత్రము సదా దైవ నామమును స్మరణ చేయుచుండును.

“భక్తిభావన పెరుగుట వలన మాటలు తగ్గును, రోమములు పులకాంకితమగును. చేతులు జోడించును, హృదయము పరవశించును, కళ్లు ఆనందబాష్పములు కార్చును.”

“దైవము ఎడ ప్రేమ తగ్గక దినదినము దానిని వృద్ధి చేయువారికి దైవము వారికి తల్లిగా మారి పెంచి పోషించును. అటువంటి ఆది దేవునకు నా నమస్కారములు.”

“దేవా! ఈశ్వరా! ఆత్మజ్ఞానమును వివరించు వైదికునిగా వచ్చి నా కర్మ ఫలితములను తొలగించితివి. నీకు నమస్కారములు.

“మధుర నగరమును నాట్యస్థలముగా చేసుకొన్న దేవా! నమస్కారములు.” నా పరమ గురువా! నీకు నా నమస్కారములు.”

“దక్షిణమున నున్న చిదంబరములో నాట్యమాడిన దేవా! నమస్కారములు. నన్ను అమృత స్వరూపుని గా చేసిన నాయకా! నమస్కారములు.”

“శాశ్వతమైన నాలుగు వేదములకు నాయకా! నమస్కారములు. వృషభ వాహనుడవై అలరించిన ఈశ్వరా! నమస్కారములు.”

“వివిధ రూపములను దాల్చిన ప్రకాశరూపా! నమస్కారములు. రాతి నుండి దారము వడుకునట్లు అసాధారణమైన జ్ఞానఫలమే! నమస్కారములు.

"మేరు (బంగారు) పర్వతమునుండి నన్ను రక్షించువాడా! నమస్కారములు. అల్పుడనైన నేను నిన్ను పిలిచినందుకు అనుగ్రహించిన వాడా! నమస్కారములు."

"సృష్టి, స్థితి, లయ లను త్రికర్మ నొనర్చువాడా! నమస్కారములు. జీవరాశులందు దుఃఖములను పోగొట్టు మా తండ్రీ! నమస్కారములు"

"సర్వేశా! దేవదేవా! నమస్కారములు. ప్రకాశము, అందము నిండిన ఆత్మజ్యోతియే నీవు, నమస్కారములు."

"మహారాజా! అమృత స్వరూపా! నమస్కారములు. సువాసనలు నిండిన రూపము భూప్రపంచమునకు వివిధ కోణములలో దర్శన మిచ్చువాడా! ఈశ్వరా! నమస్కారములు."

"సకలము ఎరిగిన వాడా! పరమ పవిత్రుడా! నమస్కారములు. అన్నింటికీ ఆదిమూలమై, జ్ఞానమునకు జ్ఞానిగా అమరినవాడా! నమస్కారములు."

"మోక్షముతో జన్మము నుండి ముక్తి ఇచ్చువాడా నమస్కారములు. జ్ఞాన ఫలముగా నుండువాడా! గంగను కురులయందు ధరించిన వాడా! శివా! నమస్కారములు."

"సకలము నీదిగా చేసుకొన్న వాడా! సత్యప్రదాతా! అధముడనైన నన్ను నీ వశము చేసుకొని ఆకట్టుకొన్నవాడా! నమస్కారములు"

"బ్రహ్మాండ రూపా! అణువుకు పరమాణువైన వాడా! మంగళ స్వరూపా! అన్నింటికి నాయకా! నమస్కారములు."

"జీవనమును నిర్దేశించువాడా! సద్గుణా! ధర్మాత్ముడా! ఓ ప్రజ్ఞా! నీకు నమస్కారములు."

"దేవతలకు దక్కిన అరూపమైన అమృతమా నమస్కారములు. నాలాంటి వారిని శీఘ్రముగా రక్షించు దేవా! నమస్కారములు."

సుఖఃభోగములు దేవతల లక్ష్యము. మోక్షసాధన మానవుల లక్ష్యము. ఎవరికేది కావలెయునో దానిని ప్రసాదించు దేవాది దేవుడు కదా! ఆనాడు దేవతలకు అమృతమొసగెను. మానవులకు జ్ఞానమును, ముక్తినొసగెను. విషయ జ్ఞానము కన్నా ప్రయత్నమే మేలైనది కదా!

"జీవుడు ఒకడు మోక్షము పొందిన యెడల వాని వెనుక వచ్చు ఇరువది ఒక్క సంతతికి నరకము వలన ఇక్కట్లు పొందక రక్షించు చక్రవర్తివే! నీకు నమస్కారములు."

"స్నేహము గలిగిన పవిత్రుడా నమస్కారములు. నాకు గొప్ప తోడుగా నిలబడిన వాడా! నా జీవిత మూలమా! ఎప్పుడూ నాలో నెలకొన్నవాడా! నమస్కారములు."

"ముక్తి ప్రదాతగా స్థిరీకరణము చెందిన వాడా! అన్నిటికీ మూలాధారముగా నున్నవాడా! అందరికి తండ్రియైన వాడా! ఆత్మలోని దోషములను హరించువాడా! నీకు నమస్కారములు."

"మాటలకు, మనస్సుకు అందని అనంతా! నమస్కారములు. సముద్రము ఆవరించి యున్న భూమి యందున్న ప్రజలను రక్షించువాడా! నీకు నమస్కారములు.

"గొప్పదనములో గొప్పదిగా, నిరాడంబరములో నిరాడంబరముగా నున్న అందగాడా!

జీవరాశులన్నింటినీ రక్షించు కార్మేఘమా (నల్లటి మేఘమా) నీకు నమస్కారములు."

"కరుణించుటలో మేరు పర్వతమా! నాలాంటి అనర్హుడుని అర్హుడుగా చేసి నీ దివ్యపాదములను నా శిరస్సుపై నుంచి నీ వానిగా చేసుకొన్న ప్రభువా! నీకు నమస్కారములు."

"నిన్ను కొలుచువారి దు:ఖములను పోగొట్టువాడా! కాలములకు అతీతముగా నున్న కాలుడా! ఆనంద సముద్రమా నీకు నమస్కారములు."

"ప్రపంచ సృష్టి, లయములకు అతీతముగా నున్న వాడా! ప్రపంచ వస్తువులన్నియూ లయమైనను, వానిలోని మూల వస్తువుగా నున్న వాడా! నీకు నమస్కారములు."

"లేడి కన్నులు వంటి కన్నుల గల ఉమాదేవి యొక్క భర్తా! అన్నిలోకములో నుండువారికి తల్లిగా ఉండి కాపాడువాడా! నమస్కారములు."

"పంచభూతములలో ఐదవ భూతముగా పిలవబడు పృధివిగాను (భూమి), నాల్గవ భూతముగా పిలవబడు అప్పుగాను (నీరు), మూడవ భూతమైన అగ్నిలోను, రెండవ భూతమైన వాయువులోను, మొదటి భూతమైన ఆకాశముగాను కొలువైన నా స్వామీ! నమస్కారములు."

(పంచభూతాల శివస్థలములని పిలవబడు, తమిళనాడులోని పంచారామములు చిదంబరములో ఆకాశ లింగము; శ్రీకాళహస్తిలో వాయు లింగము; తిరువన్నామలైలో అగ్ని లింగము; తిరువానైక్కావళ్ (శ్రీరంగము సమీపమున) అప్పు (నీరు) లింగము, కాంచీపురములో పృధివి (భూమి) లింగము)

"దేవతలకు కలలో కూడ దక్కని అపూర్వ దివ్య దర్శనము అల్పుడైన నాకు స్థూల స్థితిలో దక్కినదే. నీ అనుగ్రహము తలంచి నమస్కరించుచున్నాను."

"తిరువిడైమదూర్ గుడిలో అమరిన దైవమా! గంగాధరునిగా కొలువైన స్వామి! నమస్కారములు."

"తిరువన్నామలైలో స్వయంభునిగా ఉద్భవించిన స్వామి! జ్ఞానము నిండిన అమృత సాగరమా! నీకు నమస్కారములు."

శివుని ఆరాధించు వారికి రెండు జ్ఞానములు (ఇహం, పరము) లభించును; కనుకనేవాడు ముక్కంటి అయ్యెను. వాడిని శరణు పొందిన వారికి అక్షర స్థితి (క్షీణముకాని) దక్కుటచే వాడు అమృత సాగరమాయెను.

"తిరువేగంబత్తూర్ కొలువైన ఓ అర్ధనారీశ్వరా! నీకు నమస్కారములు."

"తిరుప్పాయర్తురైలో కొలువైన జ్ఞానేశ్వరా! తిరుచారపల్లిలో కొలువైన నాయకా! నీకు నమస్కారములు."

"లోకములో నిన్ను తప్ప ఎటువంటి ఆధారమును నేను ఎరుగును. తిరుకుట్రాలమ్‌లో కొలువైన ఈశ్వరా! నీకు నమస్కారములు."

"తిరువాడుతురైలో కొలువైన రాజా! నీకు నమస్కారములు. తిరువీంగోయి కొండపై

కొలువైన నాతండ్రీ; తిరుపయనంలో దర్శనమిచ్చు అందగాడా నీకు నమస్కారములు."

"తిరుకడంభూరిలో ఉత్పన్నమైన సుందరేశ్వరా! నిన్ను కోరి వచ్చిన వారిని రక్షించువాడా! నీకు నమస్కారములు."

"కూర్చున్న కొమ్మనే నరుకు మూర్ఖునిని, ఇక్కట్లలో నున్న ఏనుగుని రక్షించి కాపాడిన వాడా! నమస్కారములు.

"బ్రహ్మాండములన్నియు నీవే అయినను ఈ దక్షిణ దేశములో నిన్ను శ్రేష్టముగా దర్శించుచున్నాను! అన్ని దేశస్థుల వారి నుండి పొగడ్త పొందు నీకు నా నమస్కారములు."

"పందిపిల్లలకు పాలు త్రాగించిన నీ దయాగుణమునకు నమస్కారములు. కైలాస పర్వత శిఖరాగ్రమున ఉన్నతముగా బోధించు నీకు నమస్కారములు. (శివ లీలలోని కొన్ని కథాంశములు)

"తల్లి పోలిన ఓ దేవా! నన్ను అనుగ్రహించుము. అజ్ఞాన చీకటిని పారద్రోలు దైవమా! నిన్ను అందరూ స్తుతించుటకు అర్హుడవు."

"ఈ లౌకిక జీవితములో నేను ఒంటరిగా విసిగి వేసారినై తిరిగి తిరిగి అలసిపోతిని. నాకు శాశ్వతముగా నిన్నే కోరునట్లు అనుగ్రహింపుమా!"

"శరణాలయము ఇచ్చినవాడా నమస్కారములు. విషమును కోరి త్రాగి అమృతముగా చేసినవాడా! నమస్కారములు.

"తండ్రివై, గురువై, అక్షరుడవై, విమలుడవై, అన్ని జీవరాసులకు జన్మస్థలమై, విలసిల్లువాడా! నమస్కారములు.

"అన్నింటిలో ఉత్తముడా! జీవులను కాపాడువాడా! ఇంద్రియ అగోచర! నిర్మలా! నీకు నా నమస్కారములు."

"ధర్మమునుండి ఇసుమంతైనా కదలనివాడా! నీవు వేధికుని రూపములో వచ్చితివి. ఇక జన్మ కర్మల బాధ నేను పడలేను. ఇక నేను నిన్ను పొందక ఉండలేను. ఆదిమూలమా నిను స్తుతించుచున్నాను."

"నా బంధువు నీవు! నా ప్రాణమునీవు! నా సుఖము నీవు! మంగళకరమైనవి అన్నియూనీవే! అటువంటినీకు నేను స్తుతించుచున్నాను."

"అందమైన ప్రకృతికి, జీవులకు నాయకుడు నీవు. బూరుగు దూదివంటి అందమైన మెత్తటి పాదములు గల ఉమాదేవికి భాగస్వామివి నీవు! అటువంటి నిన్ను స్తుతించుచున్నాను."

"నిన్నే శరణుపొందిన నా కష్టము లన్నియూ తొలగిపోయినవి. స్వయంప్రకాశుడవైన నిన్ను స్తుతించు చున్నాను."

"కవత్తలై అను ఊరిలో ముక్కంటితో (జ్ఞాననేత్రం) ప్రకాశించువాడా! నీకు నమస్కరించుచున్నాను. కువైపది అను ఊరిలో మహారాజుగా దర్శనమిచ్చువాడా!

నమస్కారములు.

"కొండజాతి వారికి (కోయలు) నాయకా! పెక్కు కళలతో పేరొందిన అరికేశరి అను ఊరికి సొంతమైనవాడా! నీకు నమస్కారములు."

"తిరుకళికుండ్రమ్‌లోనూ, పర్వతములతో నిండిన తిరుప్పూవనంలో దర్శనమిచ్చుచున్న ఈశ్వరా! నీకు నమస్కారములు."

"ఆకారుడు గాను, నిరాకారుడుగాను నీవు, పర్వతమంత కరుణతో ప్రజలను రక్షించు వాడా! నిన్ను స్తుతించుచున్నాను."

(సహజస్థితిలో నిరాకారుడైన దైవము, లోక కల్యాణ అవసరముల కొరకు ఆకారము దాల్చుచున్నాడు.)

"తుర్యాతీతమైన మహాప్రకాశమా! శివ చైతన్యముగా వెలుగొందు పరమ పురుషా! నిన్ను స్తుతించు చున్నాను."

(నిద్ర, కల, మెలకువ ఈ మూడింటికి అతీతమైనదే బ్రహ్మ చైతన్యమనబడు 'తుర్యం'. సత్వగుణములో ప్రకాశించు ఆత్మప్రకాశమే 'తుర్యం' అందురు. దీనిని కూడ అనగా సత్వగుణమును కూడ అదిగమించినదే 'తుర్యాతీతం'. ఇది తేటనైన జ్ఞాన స్థితి.)

"కన్నము పొడవబడని ప్రకాశించు సుద్ద (తెల్లటి) ముత్యమా! దరి చేరిన వారిని రక్షించు దయానిధీ నీకు నమస్కారములు." అన్నింటా ప్రకాశించిననూ, నీ జ్యోతి ఛిద్రముకాలేదు. కావుననే నిన్ను ప్రకాశించు ముత్యమా అని పొగడి కొనియాడిరి."

"వెగటు పుట్టని అమృతము వలె ఒప్పారు అనుగ్రహనునికి నా నమస్కారములు. సహస్రనాముడైన ఆ మహామహుడికి నా నమస్కారములు."

దర్భలు, గడ్డిపోచలు మాలలు ధరించినవాడా! బ్రహ్మాండ జ్యోతిగా ప్రకాశించుచూ చిదంబరములో నాట్యమాడు నాయకా! నీకు నమస్కారములు."

"చందన ముద్దలతో అలంకరించుకొని యున్న అందగాడా! చిత్తమునకు అందని మంగళ స్వరూపా! నిన్ను స్తుతించు చున్నాను."

(మనస్సుకి, బుద్ధికి అధిగమించిన వాడు దైవము. మనస్సు లౌకిక విషయవాంచలతో మలినమగును, కొన్ని సమయములలో మహత్వమునూ పొందును. మనస్సును జయించినచో మంగళమగును. మంగళమైనచో మలినములకు చోటుండదు.)

"వేదములను విశదీకరించుటకు మహేంద్రగిరి నందు ప్రత్యక్షమైన నాయకా! నిన్ను స్తుతించు చున్నాను. మమ్ములను ఆదుకొనే ప్రత్యక్షమైన దేవా! నీకు నమస్కారములు."

"క్రూరమైన పులి లేడిపిల్లకు పాలు ఇచ్చునట్లు చేసిన కరుణానిధీ! సముద్ర అలలపై నడచి వచ్చిన నాథా! నమస్కారములు."

"మైనా పక్షికి ముక్తినొసగిన దేవా! ఇంద్రియములకు తగు వివిధ చర్యలు నిర్ణయించిన దేవా! నమస్కారములు."

"నాలాంటి వారిని రక్షించుటకు భువికి దిగి వచ్చినను నీ పవిత్రతను కోల్పోలేదు. భువియందు సృష్టి, స్థితి లయ కారకుడా! నిన్ను స్తుతించు చున్నాను."

"నరకము, స్వర్గము, భువి యందు జన్మల వలన క్రిందికే దిగజారు నట్లు చేయక పాండ్యరాజునకు మోక్షమును ప్రాప్తింపజేసిన మహాదేవా! నిన్ను స్తుతించుచున్నాను."

"పూర్ణముగా సర్వత్రా ప్రకాశించు వాడా! వివిధ పుష్పములతో నొప్పారు 'శివపురము' నాయకా! నీకు నమస్కారములు."

"ఎర్ర తామర మాలను ధరించిన వాడా! నిన్ను స్తుతించు వారి అజ్ఞానమును పోగొట్టు వాడా! నీకు నమస్కారములు.

"ఏది తప్పు, ఏది ఒప్పో ఎరుగని అల్పుడనైన నా పద, పద్య వరుసమాలను ధరించి అనుగ్రహించిన ఓ జ్ఞానదీపా! నీకు నమస్కారములు."

"బాహ్య సంచార విషయ వాంఛనలను అణచి, ప్రపంచమునకు అవతల పరబ్రహ్మ జ్యోతిగా ప్రకాశించు దివ్య మహేశా! నీకు నమస్కారములు."

"మెడయందు సర్పము ధరించినవాడా! సకలమునకు ఆదిమూలము నీవే! గొప్పదైన నీ దివ్య అవతారములకు నా నమస్కారములు."

# 5. దివ్యశతకము

## (1) ఆత్మజ్ఞానము

1. "నీ దివ్యపాదములను కోరు నా శరీరము పులకాంకితం చెంది వణుకుచున్నది. శిరస్సుపై చేతులు జోడించి నమస్కరించుచున్నాను. నా కళ్లు కన్నీటి పర్యంతమైనవి. మనస్సు భక్తి అనే అగ్నిరవ్వలచే ఉష్ణము పొందుచున్నది. అసత్యము తొలగి జ్ఞానము నిలబడుటచే నా నాలుక నిన్ను స్మరించు చున్నది. శిరస్సు పై జోడించిన చేతులు, అన్నీ మరచి జోడించినట్టే ఉండిపోయినది సుమా! గుర్తించుమా!"

   (దైవమును దర్శించునపుడు భక్తి భావనతో శరీరము వణికి, హృదయము ద్రవించి, కన్నీరు కార్చి, ప్రేమనిండిన మనస్సుతో చేతులు జోడించి, నాలుకతో కీర్తించి ఎవరు భక్తి సలుపుచున్నారో వారే నిజమైన భక్తులు సుమీ! గుర్తించుమని శ్రీ మాణిక్యవాచగర్ వేడుకొనుచున్నారు. ఏలననగా మిగతా వారందరు దైవము వద్ద కోరికలు, వరములు కోరు భక్తులని అర్థము.)

2. "ఈశ్వరా! నీ దివ్య అనుగ్రహము ఒక్కటే దొరికిన చాలును. ఇంద్రుడు, విష్ణు, బ్రహ్మ పదవులు దొరికిననూ నాకు వద్దు. నా జీవనము చెడిననూ, నీ దాసుడను, నిన్ను తప్ప మరెవరి స్నేహమును కోరను. నరకమే విధించిననూ దానిని వదులుకోను. మహామహుడా!

నిన్ను తప్ప వేరే దైవములను నేను తలంచి కూడ చూడలేదు."

(మనకు ప్రియమైన వారికొరకు ఎన్ని కష్టములు వచ్చిననూ ఒర్చుకొనెదము కదా! మనస్సు నిజముగా ఎవరిని ప్రేమించు చున్నదో వారియందే అది పూర్తిగా లగ్నమై, లయమగును. అట్లే భక్తితో పండి పరవశించిన భక్తుని స్థితిని ఇచ్చట శ్రీ మాణిక్యవాచగర్ చాలా అందముగా వక్కాణించి యున్నారు.)

3. "ఈశ్వరా! నిన్ను మహామహుడని, తండ్రి అని, నా సర్వము నీవే అని, నేను ప్రశంసించుచూ అనేక స్థలములకు వెళ్లవలెను! నా తలంపులన్ని తొలగి సదా నీ యందే తలంపులు ఉండుగాక! ఊరి వారందరూ తమ తమ మనస్సుకు తోచినట్లు నన్ను పిచ్చివాడని నానా విధములుగా మాట్లాడుకొనిరి. నేను చచ్చిన వాడివలె వాటినంతటిని పట్టించుకొనక శివానుభవములో తేలియాడునట్లు అనుగ్రహింపుమా!"

4. "దేవతలు, దక్షుడు జరిపిన యాగములో బలి ఇచ్చిన గొర్రిపోతు మాంసమును తిని సంతసించిరి. వీరభద్రుని ఎడ తన్నులు కాచితిమని దైవము వద్ద మొర పెట్టుకొనిరి. పాల సముద్రములో చిలికిన అమృతమును తమ వశముచేసికొని పరవశించిరి. విషమును చూచి భయపడి నారాయణుని వద్ద బ్రతిమాలిరి. భువిలోని మానవుల వలె లౌకిక పాట్లు పడిన వీరు కూడ పరితాపమునకు అర్హులే అగుదురు."

5. "సర్వేశ్వరా! నేను జపతపములు చేసి ఎరుగను, చల్లటి పుష్పములను నీకు అర్పించి, అర్చించి ఎరుగను. కర్మవశమున పుట్టిన పాతకుడను నేను! శివబోధయను సంపదను మిగతా శైవులు పొందినట్లు నేను పొందలేదు. నిన్ను పొందుటకు గాను మంచి జన్మము నా కొసగుమా!"

6. నీ దాసానుదాసులు రకరకములైన పుష్పములను ఏరి కోరి నీకు అర్పించి క్రమానుసారముగా ప్రార్థించు చున్నారు. నీ అనుగ్రహముతో వారు కోరిన వన్నీ పొందగలుగు చున్నారు. వారి హృదయములో బాహ్యముగా ఉండు నీవు మిగతా వారి హృదయములలో రహస్యంగా దాగియున్నావు. ప్రతి దినము నిన్ను వదలక స్తుతించు భాగ్యము నాకు అనుగ్రహింపుమా!"

7. "ప్రపంచము మొత్తమును సృష్టించిన నారాయణుడు మునుపొకమారు మహా ఉద్రిక్తముగా పాతాళము వరకు వెళ్లి వెతికినను నీ దివ్యపాదములను గుర్తింప శక్యము కాలేదు. అటువంటి నీవు స్మశానములో దెయ్యములతో తాండవమాడి మాకు దర్శనము కలుగచేసితివి. ఏదీ లేని వాడివలె పులిచర్మము ధరించి నీవు పిచ్చివాని వలె తిరుగుట చాలా ఆశ్చర్యకరమే!"

8. "వాయువు, అగ్ని, నీరు, పృథివి, ఆకాశము అన్నియునూ ప్రళయకాలములో లయమగును. సృష్టికి, లయములకు కాలములను నిర్ణయించు ఈశ్వరా! నీవే పరిపాలించు చున్నావు.

నా కర్మ ఫలితములకు కాలుడవై నీవున్నావు. విధి, కాలములు మమ్ములను బాధించకుండా, అనుగ్రహింపుమా!"

(సృష్టి, లయము, మాయ యొక్క కార్యములు. అవి కాల నియమములతో జరుగును. తమ తమ కర్మల ప్రకారము ఫలములు ఏర్పడును. పరమేశ్వరుడు కాలాతీతుడు! కాలములను జయించిన వాడు, అనాదియైన వాడు కనుక జీవులను తమ విధినుండి జయింపజేసి గట్టెక్కించును.)

9. "ప్రపంచ జీవరాసులను సృష్టించిన వాడు, చంద్రశేఖరుడు, దేవతలకంతా దేవుడు, మంగళకరుడు, వివేక మహాప్రకాశుడు, అల్పుడైన నన్ను తను ఆకట్టుకొనెను. తను నాలాంటి వానిని ఆదుకొన్నది తన గొప్పదనమే కదా!"

10. "పరిపూర్ణుడా! నీ దాసుడగుటకు అర్హత కొంచమైన లేకున్ననూ నన్ను అర్హుని చేసి నీలో చేర్చుకొన్నది నీ మహత్యము చాటుటకే కదా! ఈ లోకులకు శివజ్ఞానము బోధించి గొప్పవారిగా చేసితిరి. ఊర్ధ్వలోకములో నున్ననూ శివజ్ఞానము లేకపోయినచో అల్పులే అగుదురు! తండ్రీ! అమృతమా! దేవా! నీ లీలలు ఆశ్చర్యకమైనవి సుమా!

## (2) బోధించుట (వివేకమగుట)

11. "నా గుణములలో ఒక్కటి భక్తి నాటకములో నటించునట్లే. అట్లున్ననూ ముక్తి పొందుటకు నేను అవస్తలుపడుచున్నాను. ఎల్లపుడు నిన్ను తలంచుట వలె ఉండుట వలన నా హృదయము పవిత్రమగుచున్నది. జ్యోతి స్వరూపుడవైన నిన్ను అప్పుడు నేను స్వీయానుభవముతో చూచెదను. ఈశ్వరా! నా నటనను లెక్కచేయక, నీక్రమానుసారముగా నన్ను పరి పక్వమొందించుము."

(మనము దైవమువద్ద దేనిని ఆశించి కోరెదమో, దానిని పొందుటకు గాను అర్హత ముందు సాధించు కొనవలెను.)

12. "జననము, మరణము గురించి నాకు ఇసుమంతయూ సందేహము లేదు. ఆ స్వర్గమే దొరికిననూ నేను ఇష్టపడను. లౌకిక గొప్పలు నా కొద్దు. తేనెకార్చు అడవిపూలు ధరించిన వాడా! శివా! ఓ మహామహుడా! నాదైవమా నీ అనుగ్రహము పొందు దినము ఎపుడు వచ్చునా? అని దుఃఖించి కాచుకొని యున్నాను."

13. మేరుపర్వతమును ధనుస్సు వలె వంచినవాడా! పుష్పము వంటి మెత్తటి నీ పాదములను చూడకోరుచున్నాను. సువాసనలతో నిండిన పుష్పములతో నిన్ను నేను అలంకరించలేదు. నా నాలుక ఎండునట్లు నిన్ను స్తుతించి పాడలేదు. అమృతమనెడి నీ అనుగ్రహము నాకు గిట్టనిచో చాలా దు:ఖించుదును. నేను ఇక చేయదగినది మరేమియూ లేదు, సుమా!

14. ఓ మహాదేవా! యోగ సాధనకు లభ్యుడా! నేను విమోచనము కోరి నీ పాదములందు ప్రణమిల్ల లేదు. ప్రేమానుభూతి నిండి ఉప్పొంగలేదు. పూలమాలతో నీ శరీరమును నింపలేదు. నీ దేవాలయములను కడిగి శుభ్రము చేయలేదు. నిన్ను స్తుతించి పాడలేదు. నీ నామము లను స్మరించి గెంతు లేయలేదు. మరణము నకు ఆయుత్తమగుచున్నాను."

15. "ఈశ్వరా! ఆకాశము, వాయు, అగ్ని, అప్పు (నీరు), పృధివి (భూమి) అను పంచభూతములుగా అయినది నీవే. శరీరము, ప్రాణము అయినది నీవే. సృష్టిలో నున్నది, సృష్టి లేనపుడు నున్నది నీవే. నాయకుడవైన నీవే నీ ప్రజలలో అజ్ఞానమను చీకటిని నింపి, సత్యమును ఎరుగనీయక, తానే అన్నియునన్న గర్వమును వారిలో నింపి, బంధము ఏర్పరచి జీవించునట్లు చేసి ఆడించుచున్నావు. వీటినంతటికి కారకుడు నీవే కనుక నీ మహిమ లెన్నని వర్ణింతును, ఎట్లు వివరించి చెప్పుదును."

(జీవులు స్వేచ్ఛగా కర్మచేయుట లేదు. శివాజ్ఞ లేనిదే క్రియచేయుటకు వీలుకాదు. దైవము యొక్క క్రియలో నటించు నటులం మనము. ప్రపంచ జీవులకు గలుగు విధి వాని యొక్క చిత్తము.)

16. "తేనెటీగలు ఝుంకారము చేయుచున్న పూలమాలను ధరించిన ఈశ్వరా! దేవతలు మృత్యుంజయులుగా జీవించుటకు గాను, ఇతరులు తమను పూజించ దగ్గ పదవిని పొందవలెననియు, తమ మనస్సులో నిన్ను తలంచి ప్రార్థించు చున్నారు. చిన్నవాడనైన నేను ఈ జన్మ పాపం నుండి విముక్తి పొందుటకు గాను నిన్ను ప్రార్థించు చున్నాను."

(స్వార్థము నిండిన తేనెటీగలు పూలపై వాలును. అదే స్వార్థము దేవతలకు కూడ ఉన్నది. లాభము ఉపేక్షించి చేయునది కామ్యము, లాభము ఉపేక్షించక చేయునది నిష్కామ్యము. విషయవాంఛ లేని వారే నిష్కామ్య పూజలో పాల్గొందురు. వారు పొందుగోరునది అక్షరము అయిన (క్షీణము లేని) దైవానుభూతి.)

17. "దేవతలు నిన్ను ప్రత్యక్షముగా స్తుతించుచున్నారు. వేదములు నిన్ను పరోక్షముగా స్తుతించుచున్నవి. పారిజాత పుష్పము ధరించి పొడవైన వాలుజడ గలిగిన ఉమాదేవి నీ ఎడమ భాగమును ఆవరించి యున్నది. ఎల్లలు లేని ప్రేమ, భక్తి భావన గలిగిన నీ భక్తులు నీ చుట్టూ ప్రదక్షిణము చేయుచున్నారు. కడియము ధరించిన నీ దివ్య పాద పద్మములను పూర్తిగా చూచి గుర్తించిన వారెవరు? ఎవరులేరు."

18. "చిత్తాకాశము' అను 'చిదంబర' రహస్యముగా నీవున్నది ఎవ్వరికీ అర్థము కాదు. పసుపుగా స్వర్ణకాంతులీను చంద్రుని అంశము గలిగిన మహామహుడా! అల్పుడనైన నన్ను ఆదుకొంటివి. అది శాశ్వత మగుటకు నీ పాదపద్మముల యందు నేను పుష్పము లతో అర్పించ లేదు. నీ మహత్యము యొక్క గొప్ప తనమును ఎవరికి చాటలేదు. ప్రేమతో హృదయము కరుగలేదు. కుదరని ఈ జీవితమును ఎట్లు గడుపుదును. దీని

నుండి వీడుటకు దారి ఏది? నేను కృంగిపోవుచున్నాను."

19. "మన్మథ బాణమునకు, కామమునకు వశమైయున్న ఓ మనస్సా! నీవు పాడై పోతున్నావు. లైంగికముగా కోరి స్త్రీలను పొందుటకు అల్లాడుచున్నావు, తిరుగుచున్నావు, కరిగిపోతున్నావు. ఇది నిన్ను చెడుపునదేకదా! ఈ నీచ పనులను మానివేయుము." (తన భక్తులను కాపాడుటకు మానవ శరీరము దాల్చిన ఈశ్వరుడు, నిరాకారుడుగా దేవలోకములో నున్నవాడు. వానిని పొందుటకు నీవు ద్రవించి, స్తుతించిన యెడల అది నీకు ప్రయోజన మగుననియు, ఈ మాయా ప్రపంచ లీలలో చిక్కి పాడైపోవు మనస్సుకు హెచ్చరికను బోధించుచున్నారు శ్రీ మాణిక్యవాచగర్.)

20. "ఓ మనస్సా! నీవు జీవితమను పేరుతో జీవించుచున్నావు. కాని నీ జీవితము ఓ జీవితము కాజాలదు. ఏలననగా నీ జీవితములో ధర్మము లేదు. ఇక మాటుగా కొన్ని పాపములు చేసి దుఃఖసముద్రములో చిక్కియున్నావు. ఇది ఒక ప్రక్క ఉండగా, నిన్ను నీ కర్మఫలితములనుండి గట్టెక్కించి, రక్షించు ఈశ్వరుని కొలచి, స్తుతించెదవా? అన్నచో అదియునూ లేదు. దీని వలన నీకు నీవే కీడును వృద్ధి చేసుకుంటున్నావు. ఎన్నో మార్లు హెచ్చరించిననూ వినక మరలా, మరలా పాపములు చేసి దు:ఖ సముద్రములో చిక్కి అల్లాడు చున్నావు."

## (3) బాంధవ్యము తెంచుట

## (వైరాగ్యము పొందుట)

21. "గంగాధరా అనియు, జటాధరా అనియు, వృషభవాహనా అనియు మహాదేవా అనియు నీ భక్తుల వేడుకొనుటకు తగ్గట్లు, వారిని జలపాతము నీటిలో ముంచి తేల్చినట్లు రక్షించుటకు సిద్ధంగా ఉన్నావు. అటువంటి నీవు వారిని విడచి నన్ను ఆకట్టుకొంటివి. వారి హృదయ స్పందన తీరు నాకెక్కడిది? నాకు ఆపాదమస్తకము వరకు హృదయము ద్రవించ వలెను. వారి వలె ప్రేమతో పులకాంకితుని గావలెనన్నచో ఈ రెండు కన్నులు చాలక శరీరమంతయు కళ్లు ఏర్పడి కన్నీరు కార్చవలె. కాని నా హృదయము కరగని రాతి హృదయ మాయెను. కన్నీరు కార్చని నా కళ్లు కర్రతో చేసినవేమో! పైబడి పాపఫలితములు నావే."

22. "జీవరాశుల ఉత్పత్తికి, విలీనమునకు కారకుడైన ఈశ్వరా! పాప ఫలితములతో కొట్టుమిట్టాడుతున్న నా ఎదుట వచ్చి, 'నీ పాప ఫలితములను తప్పించగల పరముడు నేను!' అని నిన్ను పరిచయము చేసుకొని నన్ను ఆదుకొంటివి. నా నాయకా! నేను ఇనుప శిల్పము వలె ఉండి పాడలేదు, ఆడలేదు, కృంగిపోలేదు, పరవసించి దేహమును త్యజించలేదు. ఇట్లు నేను ప్రవర్తించుట తగినదేనా? నా పరిస్థితి ఏమగునో నాకు అసలు అర్థము కాలేదు."

23. "పరిశీలించి చూచినచో వేదములన్నింటికి నీవు నాయకుడవనియు, నేను పరమ అల్పమానవుడని తేట తెల్లమగుచున్నది. అయినను నేను నీకు తగనివాడు మాత్రము కాదని పరిశోధనలో తెలిసినది. కుక్క వంటి వాడినైననూ, నీ ప్రేమికుడనన్న మాత్రమున నన్ను ఆదుకొంటివి. నీకు వేరే భక్తులు లేరని కాదుగా! నీ కరుణారసముతో చేసిన కార్యము కదా! ఈశ్వరా! నీ మహిమను ఎట్లు వివరించి చెప్పి స్తుతించెదను."

24. "ప్రకాశపురుషా! నాతండ్రీ! నీ భక్తులు నిన్ను కొలుచునపుడు ఈశ్వరా! నాతండ్రీ! నా తల్లీ! మహాదేవా! అని ఎడతెరిపి లేక స్తుతించి, విబూది రాసుకొని, నీయందు ఉంచిన ప్రేమాను భూతి వలన తమ తమ జనన, మరణములను జయించిరి, వారిని నీ వశము చేసుకొంటివి. లౌకిక ఆశలందు మునిగి తేలుతున్న నాలాంటివాడిని ఆదుకొన్నదే నీ విశేషము!

25. "ఈశ్వరా! నీవు తెల్లనివాడా, ఎర్రని వాడా, ఏకమా, అనేకమా, అణువా, పరమాణువా, అని తెలియక దేవతలందరు మతిభ్రమించి యున్నారు. నిన్ను ఎట్లు పొందుటయో తెలియక నున్న నన్ను ఆదుకొని నిజ స్వరూపమును చూపించితివి. దారి తెలియని వాడికి జన్మరహిత వరమునిచ్చి ఆదుకొంటివి. నిన్ను నేనెట్లు తలంచి చూడవలె! ఎట్లు ఏ మాటలతో నిన్ను స్తుతించవలె!

(ఇంద్రియులను, మనస్సును నియత్రించి శాసించ గలవారికి పరమాత్మను స్వీయానుభవములో గుర్తించ గలరు. కాని అదే స్వీయానుభూతిని వివరించి ఇతరులకు చెప్పజాలరు.)

26. "మహామృత! మహాసముద్రమా! పర్వతమా! తామర పుష్పవనము వంటి శరీరమును గలిగిన స్వయంప్రకాశా! నా మనస్సును నీదిగా చేసుకొంటివి. ఈ అల్పుని కళ్లు రెంటిని నీ దివ్య పాదములందు స్థిరపరచితివి. నా మాటలు నీ మహత్యమును వర్ణించుచున్నది." ఇంద్రియులు నీ ఆశీస్సులను అనుభవించు చున్నవి. కరణములను ఎట్లు ఉపయోగించు కొనవలెనని తెలియక ఉండిన నన్ను అన్ని విధములుగా ఆదుకొంటివి."

(మనస్సు (భావనతీరు) భాష (మాటల తీరు), శరీరము (నడవడిక తీరు) లైన కరణములు పరిశుద్ధమై తేటతెల్లం కావలెను. ఇది తేటనైనప్పుడే ఆత్మజ్యోతి ప్రకాశించును.)

(సాంఖ్యయోగమున చెప్పబడిన త్రికరణములైన మనోవాక్కాయకర్మలను ఇచ్చట చెప్పబడినది.)

27. "నేను జన్మమను మహాసముద్రములో చిక్కి ఒంటరిగా తల్లడిల్లుచున్నాను. దుఃఖమను మహా అలలు వచ్చి నన్ను భీకరముగా తాకుచున్నవి. ఎర్రటి పెదవులు గల స్త్రీల సాంగత్యమత్తునందు నా మనస్సు కళంకమైనది. ఆశయను సొరచేప నన్ను మ్రింగుటకు ఎదురు చూచుచున్నది. పంచాక్షరమను (నమఃశివాయ) రక్షణ కర్ర దూలము నీ

అనుగ్రహము వలన చిక్కినది. సర్వేశ్వరా! శాశ్వతమైన సురక్షితమైన ఒడ్డుకు నన్ను చేర్చుదువు గాక!"

28. "పరమాత్మ గురించి ఎవరు శ్రవణ జ్ఞానముతో (చెవితో విని) తెలుసుకొన జాలరు. వాడు మార్పులేనివాడు. పరిపూర్ణుడు. వినుపించు మొరలన్ని వినువాడు. ఇహలోక జీవితములో చిత్తముంచి, మానవులు జాగృతిగా ఉండవలెనని, నాకు శైవుల మధ్య ఆసనమిచ్చి మేలైన జ్ఞానమును బోధించెను. అనుభవపూర్వముగా తెలుసుకొంటిని. ఈశ్వరుడు నాకిచ్చిన 'శివజ్ఞానమును' ఎట్లు మాటలతో వర్ణించగలను."

29. "తండ్రి, తల్లి, ఆడ, మగ, అన్ని పంచభూతములు మొదలగువాని అన్నింటా ఉన్నవాడు శివుడు. అన్నియూ ఆతనియందే లయ మగును. వీటంతటికి అవతలి ఉన్నవాడు వాడే, ఎర్రనైన మేలి రంగు గలిగిన శరీరము కలవాడు, భక్త జన సమూహములో నన్ను చేర్చుకొని, అమృత రూపమై నా హృదయ స్థావరమాయెను. ఇటువంటి మేలైన స్థితి ఎవరికైన కలుగునని విన్నామా?"

30. "దేవతలకు దేవుడైన మహాదేవుని దేవేంద్రుడు ఎరుగజాలడు. మహాదేవుడే కదా ముమ్మూర్తులకు నాయకుడు. అన్నింటికి, అందరికి వాడే ఆదిమూలము. ఉమాదేవికి అర్థ భాగమును పంచి ఇచ్చి కోరినన్ను ఆదుకొనెను. వానిని తప్ప, వేరొకరి దరి చేరము. ఇక మరే సందేహమునకు చోటులేదు. ఇక వాని భక్తులందరము ఆనంద సముద్రమున తేలి ఆడుదము."

## (4) ఆత్మశుద్ధి

ఇచ్చట జీవుని మనస్సుగా చెప్పబడినది, మన:శ్శుద్ధి ఆత్మసాధనాభివృద్ధికి తోడ్పడును.

31. "ఎటువంటి కార్యక్రమము లేక శవము వలె పడియున్న ఓ మనస్సా! నీకు తిల్లై నటరాజుని దివ్యపాదములపై ఇసుమంతయు ప్రేమ లేదు. ప్రేమానుభూతితో ఆడుటలేదు, ఎముకలు కరుగునట్లు పాడుటలేదు. ఉద్రేకముతో ఉప్పొంగి తబ్బిబ్బు కాలేదు. ఈశ్వరునికి నమస్కరించుటలేదు. ఆతని ఎర్రనైన పాద పద్మములను శిరస్సుపై ధరించడము లేదు. ఆ దివ్యపాదములపై పుష్పములు జల్లి అలంకరించ లేదు. దైవ ధ్యాస లేదు. వాని నామస్మరణముతో వీధి, వీధి తిరగలేదు. ఈశ్వరుని యెడ భక్తి సలపని నిన్ను ఉంచుకొని నేనేమి చేతును."

(ఈశ్వర ధ్యాస (దైవమునందు ధ్యాస) లేని మనస్సు శవమునకు సమానము. అది దైవకృప లేక ఉన్నత స్థితిని పొందజాలదు.)

32. "నేను తెలుసుకొన దగినవి తెలుసుకోలేక అజ్ఞానములో నున్నపుడు ఈశ్వరుడు నా హృదయములో ఉండి తెలుసుకోదగినవి బోధించి జ్ఞానమునొసగెను. ఉన్నతమైన

ధర్మములన్నింటిని బోధించి తేటపరచెను. నా తండ్రి అతడు, జన్మసాఫల్యము చేసిన మహోమహుడు. ఆ మహోమహుని వీడక నుండు మధుర స్మృతులు ఎన్నోఉన్నవి. ఇవి నీకు సంబందితమున్న, ఓ అల్పమనస్సా! నీవు దిగజారి తబ్బిబ్బు అగుచున్నావు. కపట నడవడిక నీలో చాలా నున్నది. చెడు కుయుక్తులతో నన్ను చెఱచి దిగజార్చుచున్నావు. (మానవులు తమ ఓటమికి, దు:ఖములకు ఇతరులను కారణముగా చూపుదురు. అది వారి నైజము. "ఓ మనస్సా! నేను చెడిపోయినందుకు నీవే కారణము" అని చాడీలు చెప్పుట కూడ అట్లే అగును. మనస్సు మాయచే కప్పబడినది. దానిని శుద్ధ, సుగుణ బోధనలు అంటవు. మాయనుండి మనస్సును మరల్చి జయించుటయే బుద్ధి (తెలివి) యొక్క పని. మాయతో వెళ్లు మనస్సు తనను ఏయే సందర్భములలో, ఎపుడెపుడు చెఱప యత్నించుచున్నదని బుద్ధి బహు (తెలివి) జాగురూకతతో ఉండి గమనించవలెను.)

33. "అజ్ఞానముతో నిండిన మూఢ మనస్సా! నీవు నాలో ఉండియే నన్ను చెఱచుచున్నావు. ఇక నిన్ను నమ్మజాలను. విబూది ధరించిన శైవులతో సఖ్యత ఉన్ననూ నీకు లోపలి మార్పు రాకున్నది. శరీరవాంఛ తీరకున్నది. వినాశము కోరి వెళ్లుట నీ నైజము. ఇది వినుటకు కూడ సహించలేను."

(మనస్సు నీరు వంటిది. నీరు ఎచ్చట ప్రవహించు చున్నదో ఆ భూమి యొక్క రంగు పొందునట్లు, మనస్సు చేరు పదార్థము యొక్క గుణమును పొందును. మనస్సు లౌకిక విషయ వాంఛలతో చేరి తన శక్తిని కోల్పోవుచున్నది. అదే మనస్సు శివతత్వముతో చేరిన యెడల శివ మయమగును.

అగ్నిలో కాలిన పదార్థములన్నియు భస్మమగును. అదే ఆఖరి పదార్థము భస్మము దాని రూపు మారదు. శాశ్వతము. ఆభస్మమే విబూదిగా వాడబడుచున్నది. అదే శివుని చిహ్నము.

దిగజారుడు తనమున మనస్సు కీడును గలిగించును. అదే సత్ గుణములతో చేరినచో, మంచివి జరుగును. ఆత్మ పరిశుద్ధమగును.

34. "ఓ మనస్సా! లౌకిక సుఖములందే మొగ్గుచూపుటకు ఎప్పుడూ కోరుతూ ఉండుటచే, అది నీ నాశమునకు దారి తీయును. నవ యౌవ్వనముతో నొప్పారు ఈశ్వరుని పాదములకే నేను దాసుడైయున్నాను. ఆ దైవము నన్ను ఏమైనను చేసుకొనవచ్చును. నేను వాడికే సొంతము. అయితే నీవు దైవమును నిర్లక్ష్యము చేసి అల్ప సంతోషాదులకు మొగ్గు చూపుచున్నావు. ఇటులనే నీవు లెక్కలేనన్ని లౌకిక సుఖములను పొందితివి. దానికి తగ్గ అల్పజ్ఞానమే నీ వద్ద నున్నది. ఆ అల్పజ్ఞానమే ఈ లౌకిక సుఖముల గొప్పలను చాటుతున్నది, కాని క్షణములో ఆ గొప్పలన్నియూ మాయమై పోవును సుమా!"

(పరమాత్ముని వద్ద నుండి వచ్చు ఆనందము పరమానందము. అది శాశ్వతమైనది.

కాని ఇంద్రియముల వలన గలుగు సుఖము అల్పసుఖమే అగును. అశాశ్వతము శీఘ్రముగా కనుమరుగైపోవును. వివేకముతో దీనిని ఆలోచించి సత్యమును తెలుసుకొనవలెను. అపుడే ఆత్మ పరిశుద్ధమగును)

35. "ఓ మనస్సా! నీకొక నిజము చెప్పెదను. పరమేశ్వరుడు దేవతలకే చూడ శక్యము కాదు, కాని తన దాసులకు మాత్రము సులభ లభ్యుడు. వాడు మనయందున్న ప్రేమతో, మన కీడులను తొలగించి తన వశము చేసుకొను చిత్తము గలిగినవాడు. వాని కరుణను తలంచి నీవు ఇప్పటికే కరిగియుండవలెను. పంచేంద్రియములు గలిగించు అల్ప సంతోషాదులను ఇప్పటికే నీవు చీదరించుకొని యుండవలె. నీ కీడులను తొలగించి వాని దివ్యపాదములను నమస్కరించి యుండవలె. కాని నీవట్లు చేయలేదు. నీ తెలివి తక్కువ తనమును ఏమని చెప్పుదును?"

(ఇంద్రియ సుఖములతో ఏర్పడు మనోవికారములను తొలగించి వాటిపై విరక్తి ఏర్పడునట్లు దైవము చేయును. తనపై అపారమైన ప్రేమ, భక్తి కలిగి, కన్నీరు కార్చి, పాడి, స్తుతించు వారికి తానుఅట్లు చేయును. భక్తి అనునది బాహ్యముగా చేయునదే కాక హృదయ కలంకితములను పూర్తిగా తొలగింపచేయు భక్తియే అతను కోరునది. మోక్షమునకు నాయకుడైన వాడిని పొందుటకు వాని అనుగ్రహము అవసరమే. దైవానుగ్రహముతో మోక్షము పొందుటయే మానవ గమ్యమని దీనినే 'పరగతిసాధన' అని శ్రీ మాణిక్యవాచగర్ నొక్కి చెప్పుచున్నారు.)

36. "దైవ పరమానంద భరితమైన 'శివసాయుజ్యము' భక్తులకు ఒకసారి లభ్యమైనచో మరలా దాని నుండి వీడుట జరగదు. అదొక పరిపూర్ణస్థితి. దానిని పొందుట మాత్రము అంత సులభము కాదు. లౌకిక బంధములను విడనాడి, ప్రేమరసపూరితమై, దైవ చింతనతో ఆతని పాద పద్మములందు మనస్సు కరిగి స్తుతించినచో ఆ పరమానందము ఏరులై పారును. అటువంటి దివ్యత్వము నాకు లేకపోవడము నా కర్మ ఫలితములే అగును."

37. "నాలాంటి విధివంచకుడు ఎవరుండరు కాబోలు! దీని గురించి వివరణ ఇచ్చు ఉద్దేశము దైవమునకు లేదు. ఆదిమూలము నుండి నా విధి వంచనకు తగ్గట్లు నేనే దూరమైయున్నాను. దాని గురించి నేను చింతించుచూ, తప్పించుకొనుటకు ప్రయత్నించడము లేదు. నేనొక స్పర్శలేని ఇనుమును. నాది రాతి మనస్సు నా చెవులు ఇటువంటివని నాకు తెలయకున్నది."

38. "భక్తులు కానివారికి శివస్వరూపము ఇటువంటి దని నేనెరుగను. శివుని దరిచేరువారికి తేనె, ఆవునెయ్యి, చెఱకురసమిశ్రమము తిన్నట్లు 'శివానందము' ఉప్పొంగును. వాడు మంగళమును ఏర్పరచువాడు. శివలోకనాథుడు లేడికన్నులు వంటి కన్నులు గల ఉమాదేవికి కుడిభాగము నందున్నవాడు. ఆ మహనీయుని యందు నేను భక్తి చూపలేదు.

మారుగా శరీరవాంఛకు తగ్గట్లు ఉన్నాను. ఇట్లు ఉండుట కంటే మరణించుట మేలు."

39. "అక్షరమైనది (క్షీణము లేనిది). సరిపోల్చలేనిది, జ్ఞానజ్యోతిని ప్రకాశింపజేయునదియునైన స్వర్ణ పర్వతుని (కైలాసనాథుని) దివ్య పాదములను నాకు ఇచ్చి, ఆశీర్వదించిరి. అల్పుడైన నన్ను ఉన్నతునిగా చేసి అనుగ్రహించెను. మాతృత్వము నిండిన ప్రేమతో నన్ను ఆకట్టుకొనెను. వానిని చూచి ఆనందించుట కొరకు అగ్ని గుండములో దూకక, పర్వతముపై నుండి దొర్లక, లోతైన సముద్రములో దూకక ప్రాణము కాపాడుతూ వచ్చుచున్నాను."

(భక్తుడు జ్ఞానమును, దివ్యపాదములను పొందుట ఒక్కటిగానే తలంచును.)

40. "తేనెవంటి మధురమైన 'శివపురమును' నేను కోరివెళ్లలేదు. షడ్రుచులతో భుజించి, మంచి వస్త్రములు ధరించి, శరీర సుఖములను పొంది అనుభవించితిని. దాని ఫలితముగా మన్మథుని పుష్పకామవలయములో చిక్కుకొంటిని. అది నా మనస్సుని తొలచి, రాత్రి వెన్నెల వలె కాల్చుచున్నది. స్త్రీలు పన్నిన కామ వలయములో చిక్కుకొంటిని."

(శరీరవాంఛతో ఏర్పడు కామాగ్ని మనస్సును పెక్కు విధములుగా పరితపింపజేయును.)

## (5) ప్రత్యుపకారము

మానవులకు సహాయము చేసి ఇచ్చి పుచ్చుకోగలము. దేవునికి ఏది ఇవ్వగలము? ప్రత్యుపకారముగా ఏ వస్తువుని ఇవ్వలేనివారు కృతజ్ఞతను తెలుపునట్లు, దైవము నందు కృతజ్ఞతా భావముతో వానిని సదా తలచుటయే వానికి చేయు ప్రత్యుపకారము.

41. "భారీ శరీరము గలిగిన ఏనుగు ఉన్నతమైన జ్ఞానమునకు అర్హత గలిగినదా? కానేరదు. అట్లే నా జ్ఞానము యొక్క మూలము నేను ఎరుగనివాడినే అగుదును. జ్ఞానులు దుఃఖమను చెప్పు ఇంద్రియ సుఖములను నేను పరమానందమని తలంచి అనుభవించుచున్నాను. మహాదేవుడు అన్నిటికన్నా పరమానందమును అనుభవింప రమ్మని పిలిచి ఆజ్ఞ ఇచ్చినను, నేను దానికి అర్హుడను కాదేమోనని తలంచుచున్నాను."

42. "తమ తమ హృదయము ద్వారా పరమాత్ముడు ఒకడున్నాడని ఎరిగి ఉహించు కొనువారు నిన్ను పురుషుడనియు, స్త్రీ అనియు, నపుంశకుడుయనియు, గుర్తించ సాధ్యము కాక యున్నారు. అయితే నీ భక్తుడనైన నాకు యదార్థముగా నీ దర్శనభాగ్య మిచ్చితివి. కాని నేను చూడలేని స్థితిలో యున్నాను. ఇదేమి మత్తు! మాయ!!

43. "ఉన్నతులైన దేవతలు కూడ చూడ శక్యముగాని ఓ నటరాజా! మహాశయా! నీవు నన్ను ఆకట్టుకొంటివి. దేవలోకములో భూలోకములో జీవించు అన్నింటినీ భ్రమింపజేయుటకు సాక్షిగాయుండు నీవు కాలస్వరూపుడవు. నిన్ను నేను ఎట్లు ఎపుడు చూచెదను?"

44. "ఈశ్వరా! జ్ఞాననేత్రముతో మాత్రమే చూడ శక్యమగు అనుగ్రహజ్యోతివి నీవు. క్షీణింపదగు ఈ శరీరమును వీడి నీతో లీనమగు ధర్మమును ఎరుగని అజ్ఞానుడను నేను. గూటిని వీడి వెళ్లలేని పక్షి పిల్లల వంటి వాడిని నేను. ఇంద్రియములపై నాకుండు మోహమే దీని కంతటికి కారణము."

45. "ఈశ్వరా! నిన్ను నోటితో స్తుతించియు, శరీరముతో ప్రదక్షిణము చేసియు, ఎన్నో విధములుగా పాడి, స్తుతించి ఆహ్వానించుట లేదు. నేను భక్తిపూరితుని కాలేదు. బుద్ధి బలము నాకు లేదు. మార్కండేయుని యముడు ఆక్రమింప వచ్చినపుడు నీ దివ్యపాదములను పట్టుకొనెను. నా దారి అటువంటిదే అగును."

46. తేనెలో, దానిని జుర్రుకొను కందిరీగలో, పుష్పములో, మాలలో, భువిలో, మధ్యలో, క్రింద, పైన అన్నింటా సర్వవాపియై ఈశ్వరుడు యున్నాడు. ఆ తత్వము నువ్వులలో ఇమిడియున్న నూనె వంటిది. తన ప్రేమికులైన భక్తులను చేర్చి ఆదరించునట్లు నన్నూ తను చేర్చుకొని ఆదరించును.

(నువ్వుపప్పులో నూనె దాగున్నట్లు దైవము అన్నింటా ఇమిడి మనకు కనబడక దాగున్నాడు. వాడే ప్రపంచము. వాడే సృష్టి, స్థితి, లయ కర్త అన్నీ భ్రంశమునకు (విరుగుడు), నిర్మితములకు కారకుడు అగును.)

47. ఎట్లు నాకు దైవము తండ్రిగా, తల్లిగా నిలుచున్నాడో, అట్లే ప్రపంచ జీవరాశులన్నింటికి తండ్రిగా, తల్లిగా, నాయకునిగా ఉన్నాడు. తనకు ఎటువంటి బంధమునుగాని, హక్కుగాని పొందగోరడు. ఎవరు తనను మాటలతో గాని, మనస్సుతో గాని ఇదని ఎరగలేని జ్ఞాన గర్భుడు వాడు. నేను వానిని తెలుసు కొనుటకు ముందే నాలో వాడు చోటు ఆక్రమించుకొనెను.

48. ధనవంతులు, బీదలు, దేవతలు, పురుగుపుట్ర, గడ్డి వాములు, చెట్లు చేమలు వీటి మధ్యలో ఎటువంటి బేంభావము లేక శివతత్వము ఇమిడియున్నది. వాడి విరాట్ స్వరూపమును దర్శించిన పిదప, ఆ ఉన్నత స్థితి నుండి వీడిన వాడిని నేను. మనోపరిపక్వము లేకపోవడమే ఈ శ్రమ స్థితికి ముఖ్య కారణము.

(చర్మచక్షువులతో చూచువారికి ప్రపంచమంతయూ భేదమే కనిపించును. అదే జ్ఞానుల కన్నులకు అభేదము. మంచి మనస్సు ఉన్నతస్థితికి చేర్చును. కల్మషముతో కూడిన మనస్సు క్రిందకి దిగజార్చును. అన్నింటికీ మనస్సే కారణము. అధ్యాత్మికములో మనఃఅపరిపక్వము వృద్ధికి ఆటంకమే అగును.)

49. "తత్వము ఏది తెలియని నన్ను ప్రేమ పాశమునుండి విడిపించి నీవాడిగా చేసుకొంటివి. అంతే కాక శైవమతస్థులు, సకల శాస్త్ర పారంగతుల మధ్య నన్నొకడిగా చేసితివి."

(అష్టతత్వములను చెప్పబడునవి : పృథివి, నీరు, అగ్ని, వాయువు ఆకాశము, మనస్సు,

బుద్ధి, అహంకారము. దివ్యత్వము అనునది శివం, శక్తి కలిగిన అర్ధనారీశ్వర తత్త్వమును తెలుపునది.)

50. "ఉన్నతమైన జ్ఞానమా!, అమృత స్వరూపమా!, అల్పుడైన నన్ను ఒక జ్ఞానునిగా చేయుటకే కదా! నీ వాడిగా చేసుకొంటివి. నేను తెలివితక్కువ వాడినని అందరికి తెలిసినదే. ఈ రోజు నేను పూర్తిగా తెలివికలవాడినైతినా లేదా అని నాకు తెలియదు. సర్వేశ్వరా! నా పరిస్థితి ఏమిటో నీవే నాకు బోధించవలె!"

## (6) అనుభోగశుద్ధి

మనోవాక్కాయములు శుద్ధిగా ఉన్నచో ఆత్మ వికాసముతో జ్ఞానము కలుగును.

51. ఈశ్వరా! నా నాయకా! నా జన్మ సాఫల్యము చేసిన తండ్రీ! శశిశేఖరా! (నెలవంక ప్రకాశుడా!) కేవలము శరీర వాంఛతో మునిగితేలుతున్న నన్ను ఉన్నత బోధన పొందేటట్లు చేసితివే! వీడిపోవడము, తప్పిపోవడమే తెలిసిన నా మనస్సుకు ఇక ఏమి చేయడమో తెలియక ఉన్నాను."

(శరీర వాంఛకు ప్రాముఖ్యమిచ్చువారు కేవలస్థితిలోనే ఉందురు. ఆత్మజ్ఞానము పొందిన జ్ఞానులకు సైతము శరీరవాంఛ ఏర్పడి సంకటస్థితి కల్పించును. అది వారికి వేదనే అగును. శివధ్యాసయే ఆత్మని శుద్ధిచేసి జ్ఞానము గలుగజేయును.)

52. "ఈశ్వరా! మాయాలౌకిక మనస్సును నీపై మళ్లించుకొను విధానములు, మార్గములు నేనెరుగక యున్నాను. అల్ప సంతోషాదులు పొందుటలో కుక్కకన్నా అధముడై యున్నాను. జ్ఞానమే మూర్తీభవించి వచ్చిన నిన్ను స్తుతించక, శాశ్వతము లేని శరీరము కొరకు దాని ద్వారా ఏర్పడు అల్పసంతోషము కొరకు ప్రాకులాడు చున్నాను. శరీరము అసత్యమని తలచి, సత్య స్వరూపుడవైన నిన్ను స్తుతించు గొప్పవారిని చూచియు, వారి గురించి ఆలకించియూ, వారి దరి చేరక, వారివలె నిన్ను పొందక, భుజించి, ధరించి, శరీరమును సంతోషపెట్టడం లోనే కృషి సలుపుచున్నాను. నా చెడ్డ కార్యములను ఏమని చెప్పదును?"

(శ్రీమాణిక్యవాచగర్ తనను తాను తెలుసుకొనుటలో ఇట్లు వక్కాణించిరి:– మాయవశమైన మనస్సు మనిషిని భోగములో మళ్లించుచున్నదే తప్ప యోగము వైపు త్రిప్పుటలేదు. భోగము శరీరమునకు సంబంధించినది. యోగము ఆత్మకు సంబంధించినది. మాయా మనస్సు ఆత్మవైపుగాని ఆత్మగురించి గాని యోచింప చేయడము లేదు. దాని ఆలోచనలన్నియూ భోగము గురించియే. బుద్ధి అన్నింటినీ ఎరుగును. కాని సుఖభోగములందున్న మనస్సును మాత్రము మార్చుకొనుటకు దారి తెలియక తపించును. జీవితములో కొన్ని విషయములను త్యజించుటకో, ఎదుర్కొనుటకో ధైర్యము, నిగ్రహము కావలసియున్నది. శరీరముపై నున్న వాంఛను వదలుకొనుట, అజ్ఞానమును వదలుట,

వలన దైవమునకు మానవునికి యున్న దూరమును తగ్గించును.)

53. “అజ్ఞాన చీకటిని పారద్రోలు యుద్ధములో నీవు కొదమ సింహముగా ఉండి, నీవు ఎప్పటికి నవయౌవ్వనముతో ఉత్పన్నమైయున్నావు. మాకు అనుగ్రహించుటలో నీ దైవతత్వ స్థానము నుండి క్రింది భూలోకపు స్థానమునకు దిగివచ్చుచున్నావు. తపోధనులు పరిపక్వము పొందిన మనస్సుతో నీ దరి చేరుటకు చూచుచున్నారు. గ్రుడ్డి పందివలె నేను దారితప్పి పోవుచున్నాను. దీనికంటే నేను చావడమే మేలు.”

54. “ఈశ్వరా! నీ దర్శనము కొరకు మునులు తమ శరీరవాంఛను విడనాడి, మాయను జయించి కఠినమైన తపస్సు బూనిరి.

అట్లేమి చేయని నన్ను నీవు ఆదుకొంటివి. నేనో మలినములతో కొట్టుమిట్టాడు శరీరమును వీడడము లేదు. అనుగ్రహ జ్యోతి నీవే! నిన్నుచూచుటకు తగు భాగ్యమును ప్రేమను నేను ముందుగా పొందియుండ లేదు. నేను ఎట్లు నీ దరిచేరగలనో?”

(శరీర వాంఛను అధిగమించిన స్థితిని పొందుటయే అనుభోగసిద్ధి)

55. “ఉమాదేవి యొక్క రక్షకుడై నొప్పారు ఈశ్వరా! నీ దాసాను దాసులను రక్షించి వారికి అమృతుడవై యున్నావు. నీ దరిచేరి సుఖమునొందుట యే మానవ జీవిత ధ్యేయమని ఎరిగి నీవు చూపిన దారినే అనుసరించి, నీ భక్తులు నిన్ను తలంచి, నీ ధ్యాసలోనే నిన్ను పొందిరి. కాని నేనో పురుగులతో నిండిన ఈ భూత శరీరమును పట్టుకొని ఈ లౌకికములో వేలాడుచున్నాను.”

(పురుగులతో నిండిన శరీరముపై వాంఛను వీడి, దైవముపై భక్తి సలిపి వాడి అనుగ్రహమను అమృతమును పొంది మోక్షము పొందుటయే మానవ ధ్యేయం.)

56. “ఈశ్వరా! జీవరాశులన్నియూ నీకు సొంతమైన వస్తువులే అట్లున్ననూ అన్ని జీవరాశు లందును నీ అనుగ్రహ ప్రకాశము ఉండుటలేదు. నిన్ను మనసారా ప్రార్థించి, కరిగిపోయి, నిన్ను ప్రేమించి, ధర్మబద్ధతతో నడవడిక గలవారియందే నీ అనుగ్రహము నిండియున్నది. వారు నీ దరిచేరి సుఖమునొందుచున్నారు. దీనిని చూచి, ఎరిగికూడ వారివలె నీయందు నేను ప్రేమ చూపలేదు. నా హృదయము కరుగలేదు. మనస్సు పండలేదు. నాకు వివేకము రాలేదు. దుర్గంధము వీచు శరీరముపై మమత పెంచుకొని వీధి కుక్కల కన్నా అధముడుగా ఇచ్చట జీవించుచున్నాను.”

(కుక్కవలె మంచి, చెడ్డ చూడక ఎటువంటి లక్ష్యము లేక తిరుగునది మనస్సు. బుద్ధి మంచి దారి చూపిననూ, మనస్సు దానిని అడ్డగించుచున్నది, ఎలననగా మనస్సు మాయకు అధీనమైనది.)

57. “నిన్ను కొలుచుటకు గాను ఈ శరీరమును నాకు ఇచ్చితివి. ఇసుమంతైన మనోవికారములేక నీ భక్తుల యెడ నన్ను చేర్చితివి. అట్లున్ననూ ఈ శరీరము యొక్క

గమ్యము మరచి దానిని భోగమునకు ఉపయోగించినచో నేను తగని దొంగపని చేసినట్లగును. యోగము, భోగము ఒకదానినొకటి సరిగా పొసగవు.

58. "జ్ఞానప్రకాశుడు నీవు! మనోపరిపక్వము చెందినవారికి పరమానందము నొసంగు మహాపురుషుడవు నీవు! నేనో, వారివలె పరిపక్వము పొందని వాడను. "నేను నీకు బానిసను - నాకు నీవు నాయకుడవు." అని బంధము ఏర్పరచినచో నీ వొప్పక, ఒక చిరునవ్వు రువ్వెదవు. ఎటువంటి అర్హత లేనివాడి నైన నేను, నీ అనుగ్రహము పొందుటకు అర్హత లేదనినచో అది సమంజసమే అగును.!"

59. "ఈశ్వరా! నీ విరాట్‌ను పూర్తిగా ఎరిగిన వారెవరూ లేరు. నీవే నీ గురించి తెలుసుకున్నవాడవు అల్పుడైన నన్ను నీ భక్తులలో ఒకనిగా చేసుకొంటివి. నీవు నన్ను వదిలిపెట్టినచో, నేనెవరి దరిచేరలేను. స్వర్ణరూపి! నీవే నన్ను అనుగ్రహించవలె సుమీ!"

60. "నిన్ను స్తుతించు భక్త కోటి మధ్య నేనొకడినై ఉండుట వలన, నా బలము, నా తీరు చూచి నేనే ఆశ్చర్యచకితుడనైతిని. నీ స్వరూపము దర్శించి నేను పరమానందము చెందలేదు. నీవాదుకొన్ననూ నేను నీ భక్తుడగుటకు కావలసిన అర్హత గలదో? లేదో? అల్పుడనైతినే! ఎట్లు ఓర్చుదును? దేవా!"

## (7) కారుణ్యత పొందుట

దైవత్వము పొందుట మానవుని ప్రయత్నము ఒక ప్రక్కయున్ననూ, ఆ దేవుని కరుణా కటాక్షము అందుకొనుట మరింత ముఖ్యము.

61. "శంకరా! ఈ శరీర జీవితము చాలు చాలు. పురాతనకు పురాతనగా, నవీనమునకు నవీనముగా యున్న మూలపురుషా! ఆనంద నాట్యముచేయు నటరాజా! పవిత్రుడా! నీకు నమస్కరించుచున్నాను.

(ఉన్నత ఆశయములు - ఉన్నత జ్ఞానము నొసంగును.)

62. "ఓం నమఃశివాయ" అను మంత్రమున ఉద్భవించినవాడా! సర్పములను ఆభరణములుగా కలిగినవాడా! ఈ లౌకిక జీవితములో మునిగియున్న నాకు నీవే గతి. దాని నుండి నీవే రక్షించవలె సుమా! నిర్లక్ష్యము చేయవద్దు. నన్ను నీదరి చేర్చుటలో నీకు జయమగుగాక!" (మాయను విడుపించు కొనుటకు మానవ ప్రయత్నము మాత్రము చాలదు. దైవకృప కావలెనను చెప్పు ఉద్దేశమిది.)

63. "అజ్ఞానము నిండిన నాలాంటివారికి నీవు అనుగ్రహించుటచే నీవు దాతవగుచున్నావు. సరికొత్త తేనె కదా నీ కరుణా రసము! పంచభూతములు, సూర్యుడు, చంద్రుడు, జీవాత్మగా అష్టమూర్తులు గా నీవు ఉన్నావు. నిన్ను నేను మరలా, మరలా నమస్కరించుచున్నాను."

64. "అర్హత లేనివానైనను నన్ను నీవు ఆకట్టుకొంటివి. నాహృదయమును ద్రవీకరించి

దానిని విడదీయుము. శరీరమును విడనాడి నేను శీఘ్రముగా ముక్తి (మోక్షము)ని పొందవలె, గంగాదేవిని నీ జటయందు ధరించిన ఓ దేవా! ఓ శంకరా! నీకు మరలా మరలా నమస్కరించుచున్నాను."

(సద్గుణవంతులు ఇతరుల తప్పులను లెక్కించరు. తప్పుచేసిన వారికి కూడ వారు మంచినే చేయుదురు.)

65. "శంకరా! ఉమాదేవి భాగస్వామీ! నీ యందే శరణు పొందితిని. ఓ మందహాసా! నల్లని కన్నులు గలవాడా! ఈ లౌకిక సుఖము నాకు మరి వద్దు.నేను త్యజించుచున్నాను. వృషభవాహనా! నిన్ను వేడుకొని నమస్కరించుచున్నాను."

66. ఈశ్వరా! నా విధి వశమున నాకు నేనే చెడుపుకొంటిని. నేను అనుభవించుచున్న దు:ఖము గురించి నిన్ను నేను నిందించను. ఎప్పటికీ నన్ను ఆదుకొనియున్న నీకు నమస్కరించున్నాను. ఈ చిన్నవాడు చేసిన తప్పులను పెద్దవాడైన నీవు సహించుకొనుము. ఈ లౌకిక ప్రపంచము నుండి నన్ను విడిపించుదువు గాక. నీకు నేను విరామము లేక నమస్కరించుచుందును.

(పరిపక్వమొందిన భక్తుడు తన కష్టసుఖముల అంతటికి తన విధివిలాసమే కారణమని ఎరిగి దైవమును నిధించక తనను తాను నిందించుకొనును. పరిపక్వమొందిన భక్తుల కష్టము చూచి సహించక, వాటి నుండి వెంటనే దైవము రక్షించును.)

67. "నాదైవమా! దేవతల నాయకా! స్త్రీకి ఒక భాగమును ఇచ్చిన వాడా! విబూది ధరించిన వాడా! అన్ని సద్గుణములను గలిగిన వాడా! చిత్తాకాశ స్వరూపా! మోక్షదాయకా! నీవు తప్ప నాకు వేరే గతిలేదు. నన్ను రక్షించి అనుగ్రహించవలె!"

68. "ఎన్నో రూపములు ధరించిననూ నీవొక్కడివే! భూలోక జీవరాశులంతటకీ నీవుతండ్రివి! ఊర్ధ్వలోకస్తులకు నీవు మూలపురుషుడవు! జీవుల హృదయంలో నీవు నవయౌవనుడవైయున్నావు. నేను నీ వశము కావలెను! గతిలేని వాడిని నీవు కాపాడవలె".

69. "భక్తులు నీపై యుంచిన ప్రేమ చాల ఎక్కువ, కాని దానికంటే ఎక్కువ ప్రేమ నీవు నీ భక్తులయెడ ఉంచితివి. నా అజ్ఞానమును తొలగించి సత్యమును బోధించినది నీ గొప్పతనమే కదా! దేవతలు క్షీర సాగర మదనములో వచ్చిన అమృతమును వారికిచ్చి, కాలకూర విషమును నీవు త్రాగితివి. నీవు దానములో శ్రేష్టుదవు. సర్వంతర్యామిగా ఉన్ననీ స్వరూపములో నన్ను చేర్చుకొనుము."

(కరుణలో ఉచ్ఛస్థానము త్యాగము. త్యాగములన్నింటినీ తానే స్వయముగ చేసినందుకు శివుని "త్యాగరాజు" గా శైవులు స్తుతించుచున్నారు.)

70. "దేవ దేవా! పంచభూతములన్నీయూ నీ నుండే ఉద్భవించినవి. లోక జీవరాశు లన్నియూ నీ నుండే ఉత్పన్నమైనవి. కాని అవి ఏర్పడినందు వలన నీ రూపము మారలేదు.

ప్రళయ కాలములో జీవులన్నీయూ నీ యందే లయించుచున్నవి.కాని పూర్ణుడవైన నీవు ఎందులోనూ లయమగుట లేదు. పంచేద్రియములు నిన్ను ఎరుగక యుండ వచ్చు కాని వాటి తత్వములు మాత్రము నీ నుండే వచ్చుచున్నవి."

## (8) ఆనందలీనము

తన జీవితము ఆనందముగా సాగవలెనని అన్ని జీవులుకోరును. ఈ కోరిక సహజము. కారణము అవి ఆనందమునుండే పుట్టినది. అదే **"ఆనందోబ్రహ్మాం", "ఆనందమే సత్యము."**

71. "నా నాథా! నీతో నన్ను ఐక్యము చేసుకొందువని తలంచితిని. నీ అనుగ్రహ మటువంటిదిగా ఉండును. అయితే మరలా ఇది సరైన సమయము కాదేమోనని మనస్సు మార్చుకున్నావేమో! నేను నీ దివ్యపాదములపై ఉంచిన భక్తి మారక శివానందమును బోధించెదవని నమ్ముచున్నాను."

72. "ఏక నాథా! నాయకా! నా తండ్రి! సుఖములను అనుభవింప గోరి నేను ఇంద్రలోక పదవులు కోరలేదు. నీ దివ్య పాదముల దరి తప్ప నాకేమి ఇతర ఆధారములు లేవు. శరీరము శుష్కించి, వణుకు పుట్టి నా రెండు చేతులను శిరస్సు పై నుంచి నమస్కరించుచున్నాను. నా కన్నీళ్లు ఏరులై పారుచున్నది!"

73. "దేవాదిదేవా! ఉమాదేవి యొక్క కుడిభాగస్వామివే! నేను శరీర జీవితముపై మక్కువ పెంచుకున్న పాతకుడను. అజ్ఞానము తప్ప నా వద్ద ఏమియూ లేదు. భక్త కోటి యొక్క ప్రేమ పాత్రుడవు నీవు. అటువంటి ప్రేమ నాలో ఏర్పడి పెరగవలె!"

74. "ఈశ్వరా! నా శరీరవాంచ తొలగించి శివబోధనను(సత్యమును) వృద్ధిచేయుము. నా మీద కరుణ చూపి ప్రేమ నిలుపుము. నిన్ను పాడిస్తుతించు భాగ్యము దొరుకు పక్షమున ఇక్కడ ఎన్నిసార్లు జన్మమెత్తిననూ పరవాలేదు."

75. "ఈశ్వరా! సత్యమునీవే కనుక, మన్ను(భూమి), మిన్ను (ఆకాశం)నికే నమస్కరించి నిలుచున్నవి. నాలుగు వేదముల పఠనము ద్వారా నిన్ను పొందుటకు వీలుకాక తప్పిపోయినది. మేము నిన్ను పొందకుండా ఉండజాలమని గట్టి నమ్మకముతో ఉ ండగా, పార్వతి సమేతుడైన నీవు మాయందు పక్షపాతము వహించుట తగునా? (తెలివి, సామర్థ్యముతో దైవమును తెలుసుకొనుట సాధ్యము కాని పని. అనుభవ మార్గము ద్వారానే పొందుట ఉత్తమము.)

76. "ప్రపంచమంతయు తనే. ప్రపంచముతానే అయియున్ననూ, వానిని అనుభవపూర్వముగా తెలుసుకొనుటకు, మనస్సు, వాక్కు, పంచభూతములు సహాయపడవు. మనస్సు, బుద్ధి లౌకిక వాసనలకే సహాయపడును, తప్ప ప్రపంచమున కవతల నెలకొనియున్న పరబ్రహ్మము పోందుటకు అవి సహాయ పడవు."

77. "ఈశ్వరా! నిన్ను చేరుట ఎప్పుడు? కర్మఫలితములలో చిక్కియున్న నన్ను గట్టెంక్కిచుటకు నీవు తప్పవేరే మార్గము లేదు. దుఃఖములో చిక్కియున్న నన్ను కరుణ చూపి కాపాడుము. విధి విన్యాసములో చిక్కియున్న వాడిని. నీ దరిచేరుట కంటే వేరే ఉపాయము లేదు."

78. ఈశ్వరా! భూలోకమును, ఊర్ధ్వలోకములును నీవు లేకుండా ఏవియున్నవి? అన్ని నీవే అయినపుడు వేరేగా ఏ ఒక్కటి లేదు. అని నా అల్ప జ్ఞానముతో చెప్పితిని సుమా! నీనుండి నేను విడిపోయి చూచినచో నీచుడను అగుదును. నీవు ఎటువంటి మలినములు లేనివాడవు, నిర్మలుడు. నీ దివ్యజ్యోతియే ప్రపంచ మంతట వ్యాపించి యున్నది. వేరొక జ్యోతి లేదు, మా మనస్సులో ఉంచుకొనుటకు!"

79. "మనస్సు, కర్మ, వాక్కు, వీటిని నేను దైవారాధనకే ఉపయోగించియుండ వచ్చును. క్రమము తప్పక పంచేంద్రియములైన వాటితో ఎప్పుడో నిన్ను పొందియుండవలె. అట్లు చేయనది నా తప్పే అగును. నిన్ను పొందలేని పాపినై అగ్నిలో పడి చావలేదు. నా తండ్రివైన నిన్ను పొందగోరుటచే ఇంకా వ్యర్ధ మాటలతో కాలము వెలిబుచ్చుచున్నాను."

80. ఇనుమువంటి కఠిన మనస్సు కల వంచకుడను నేను. అయిననూ నీ వాడిగా చేసుకొంటివి. నీ దివ్య పాదముల దరి తియ్యటి చెరుకురసము త్రాగిన పరవశమునిచ్చుచున్నది. దీనిని తృణీకరించి వెళ్లిన నేను ఇంకనూ అగ్నికి అహుతి కాక యుండుట అవమానము. తిండికి, జీవనము కొరకు బ్రతికి యున్న నేను నీ మీద ఆసక్తి ఉన్నదని చెప్పుకొనుట ఒక ఆశ్చర్యమే!"

## (9) ఆనంద పరవశము

శివుని అనుగ్రహ లక్ష్యము అనంద పరవశుడగుటయే

81. "భిక్షాటకుడవై కొలువైన త్యాగరాజ మహానుభావా! నీవు భిక్షాటకుడుగా ఉండి కాంక్షను, బంధమును వీడవలెనని ఆత్మజ్ఞానము భోదించితివి. నేను మాత్రము లౌకిక బంధములలో చిక్కుకొని యుండుట ఎంతవరకు న్యాయము తండ్రీ!"

82. "నేనూ నీ భక్తులలో ఒకడినని ప్రశంశలను పొందితిని. జ్ఞాన గురువుచే విబూది ధరించితిని. లౌకికులచే నీ భక్తుడని అనిపించుకొంటిని. పొగడ్తలు, ప్రశంశలు చాలునిక. ఇక నేను నిన్ను పొందవలె. నేను నీ దాసాను దాసుడుకావలె!"

83. "శివలోక నాథా! నీ దాసానుదాసులు నీ ప్రేమకు పాత్రులై నీ దివ్య పాదములందు శరణుపొంది శైవులైరి. కఠిన మనస్సున్న నేనో దు:ఖమునకు దారితీయు శరీరంపై ప్రేమను విడుచుట లేదు. నీ దరిచేరు మార్గమును అనుసరించడము లేదు. నేను నీ భక్తుడనే? నీవు నన్ను ఆదరించడము లేదా?"

(హెచ్చు, తగ్గులు వారువారు ఏర్పరచుకొన్న నియమపద్ధతులే.)

84. "పురుషుడై, స్త్రీయై, అమృతమైన, పరంజ్యోతివై వెలుగొందు మహాప్రభో! నిన్ను ఎట్లు పొందుటయో తెలియకున్నాను. నిన్ను దర్శించిన పిదప ఒట్టి వ్యర్థ మాటలాడి ఒక లాభము పొందలేదు. ఇపుడు శవమువలె నున్నాను. నా అల్పత్వము గుర్తించి నేను సిగ్గు పడుతున్నాను. ఉన్నతిని పొందుటకు తగు ఉత్సాహము లేకపోయినది. నేనెట్లు నీ దరి చేరగలను?"

85. "లేడి కన్నుల వంటికళ్లుకల ఉమాదేవి యొక్క కుడి భాగస్వామీ! వేదములకు కూడ అందని, నీవు నిగూఢమా! తేనె!, అమృతము!, మనస్సుకు అందనివాడా! నా తప్పులు మన్నించి అనుగ్రహించు రాజాధిరాజా! నా లోపములను. నీ ముందు మొర పెట్టుకొంటిని. నీ దాసులు శివపురం చేరిరి. నేను, ఈ అజ్ఞాన లోకము వేరేవారైతిమా!"

(ఉన్నత జ్ఞానము గలిగిన వారు తమను దైవమునకు అర్పించు కొనుచున్నారు. లౌకిక కాంక్ష మెరిగిన వారో తమను భూలోక వాంఛలకు అర్పించు కొనుచున్నారు.)

86. శైవుడైన నేనూ, మాయా ప్రపంచము నీకు వేరేవారైతిమి. భక్తి చూపుటకు కావలసిన దృఢత్వము నాయందు లేదు. నీ దాసులు నిన్నుతప్ప వేరొకరిని ఎరుగరు. వారు తమ పరిపక్వమొందిన స్థితిలో నీతో ఐక్యమైరి. వారు అనుసరించిన మార్గము ఉన్నతమైనదే అగును."

87. నన్ను నీవానిగా చేసుకొన్న దైవమా! నీప్రేమ నాకిచ్చి అనుగ్రహించుము. నిన్ను క్రమానుసారముగా భక్తి చూపిన భక్తులకు మోక్షమును అనుగ్రహించితివి. నేను అన్యుడైతిని. తన దూడను చూచి తల్లి ఆవు అంబా అని అరచినది. అది విని గ్రుడ్డి ఆవుకూడ అరిచినదట. అట్లే నేను కూడ అనుభవము లేక, వివేకము లేక, ఆశలతో నీ ప్రేమ కొరకు పరితపించుచున్నాను."

(వివేకము లేని సాధన వ్యర్థమగును.)

88. "నీ భక్తులైన శైవులు, బంగారు చాయగల్గిన అఖండ జ్యోతివైన నీ దివ్య పాదములు దరి చేరి వేడిమికి కరుగు క్రొవ్వత్తి వలె నిన్ను అనుసరించుదురు. నేను వారిని అనుసరించక అల్పుడనై కన్నీళ్లు కార్చు చున్నాను. నిన్ను ఎట్లు పొందుటయో తెలియకున్నాను. నేను జన్మించినదే వ్యర్థము కాబోలు."

(అధ్యాత్మికములో స్వయంప్రకాశులుగా నొప్పినవారు కొందరే. మిగతావారందరు ఒక గురువు ద్వారా పొందుటయే ఉపాయము.)

89. "మహోన్నతుడా! పరిపక్వమొందిన నీ భక్తుల యొక్క కర్మఫలితములను పోగొట్టి, వారిని నీయందు చేర్చుకొంటివి. ఆ ఉన్నత స్థితికి నేను అనర్హుడైనచో నా బలమైన విధివిన్యాసములను వెదురువలె భస్మము చేసి నీ దివ్య పాదములందు చేర్చుకొనుమా!"

90. "జీవాత్మయైన నేను క్షీణించనిది (అక్షరము) కాదు. ఈ క్షీణించదగినవానిలో మనస్సు

మాత్రము ఎట్లు క్షీణత లేక యుండును? నిలకడలేని మనస్సులో ప్రశంస ప్రేమ కూడ నిలకడలేనిదే. కాని వీటిని ఉపయోగించి (నిలకడలేనివి) ఎప్పటికీ క్షీణత లేని నిన్ను పొందవచ్చును. తలంచినంత మాత్రమున అమృతము వలె తీపి గొలుపు నిన్ను, నీ దరి చేరుటయే పరమానందము. నిన్ను పొందు మార్గమును నాకు చూపి అనుగ్రహించుమా!"

## (10) ఆనందాతీతము

91. "మార్పులేని మహాకరుణా సముద్రమా! పరిపక్వపూర్ణులైన మహానుభావులెందరో నీ అనుగ్రహముతో నీలో ఐక్యమైరి. ఆదిమధ్యాంతుడవైన నీవు దివ్యజ్యోతి శరీరుడవై నాపై అనుగ్రహంతో కడగంటిచూపు చూసితివి. దాని కారణముగా నా చిత్తము పండినది. దానికి ముందు ఎన్నో జన్మల మాయ కారణముగా అల్పునిగా ఉంటిని."

92. "అంబికతో దర్శనమిచ్చు అర్ధనారీశ్వరా! తన చేతిలో నున్న బంగారుగిన్నె విలువను తెలియని బాలుని వలె, నేను నీ గొప్పతనము ఎరుగకయున్నాను. విభూది ధరించినవాడా! ఆత్మజ్ఞానమును తెలుసుకొన్న భక్తులందరు ఆత్మజ్ఞానమొందిరి. అజ్ఞాన, లౌకిక జీవితములో నన్ను జీవింపజేసి, తిరుగాడనిచ్చి నీ వేమి ఎరగనట్లు ఉండుట తగునా? చెప్పు. ఇది నీకు తగిన చర్యయేనా?

93. "ఎఱ్రతామరవంటి దివ్యపాదములు గలవాడా! ఎఱ్రనైన దివ్య శరీరము గలవాడా! నా నాయకా! నీ అనుగ్రహమునకు తగిన వాడిని కాను. నీడలాంటి జీవితమును నిజమను కొనువాడను. నీ అనుగ్రహమునకు ఆసక్తి చూపని వాడను. వంచకుడైన నేను లౌకిక కాంక్షను వీడుటలేదు. అక్కడ నీవు, నీ భక్తులందరూ నీ అనుగ్రహ పాత్రులై శాశ్వతస్థితిలో ఒకటైరి. ఇక్కడ నన్ను మాత్రము విడచి పెట్టుట తగునా? నా కర్మఫలితములకు ముగింపు లేదా?"

94. ముల్లోకములోని దేవతలు నిన్ను అర్థము చేసుకోలేదు. ఉపనిషత్తులు నిన్ను ఒకరోజులో పూర్తిగా వివరింప శక్యము కాలేదు. జీవులు నిన్ను ఎరుగరు. నేను నిన్ను తెలుసుకొన వలెననియే నన్ను ఆకట్టుకొంటివి. నేను పరిపక్వమొందవలె నను ఉద్దేశముతో నీ పనులలో నన్ను నియమించితివి.

95. "నీ దర్శనము చే నన్ను పరవశమగునట్లు చేసితివి. జ్ఞాన ధ్యాస నాలో కల్పించి అనుగ్రహించుటచే, దాని ఫలితముగా నా లౌకిక జ్ఞానము ఆత్మజ్ఞానముగా మారినది."

96. "విత్తనములు లేకయే లోకములను సృష్టించితివి. ఒక దానిని స్థిరీకరణము చేయుట, మరొకదానిని లయము చేయుట నీవేకదా! నేను నీ వాడినై యుండవలె. కాని నేను లౌకికుడనై, వంచకుడనై వట్టి చర్మము గప్పిన మాంసపు శరీరమును 'నేను' అని భావించి, నీచుడై, శరీర కాంక్షతో ఉండుటచే, నేనెట్లు నీదరి చేరుదును? నీవు నన్ను పరిపక్వము

చేయు ఉద్దేశముతో కదా! నీ దేవాలయ ద్వారమునందు పిచ్చివాని వలె నన్ను నిలబెట్టి నీ దాసులలో ఒకనిగా చేసుకొంటివి. ఇవి యన్నియూ నీ కరుణా రసము కదా! తాము నాటిన వృక్షము ప్రయోజన పడలేదని ఎవ్వరూ దానిని నరికి వేయరు. నేనూ అట్లేకదా! నన్ను త్రోసివేయవద్దు! ఈశ్వరా!"

97. "దేవతలందరికీ దేవా! నాకు నీవు తప్ప మరే ఆధారము లేదు. నన్ను నీ వాడిగా చేసుకొన్నందుకు నిన్ను నమస్కరించుచున్నాను. ఎవరికీ లొంగనివాడినైన నన్ను నీ కరుణతో దాసునిగా చేసుకొంటివి.నా ఉత్పన్నము, రక్షణ, ముగింపు నీవే! నా తండ్రీ నీకు నమస్కరించుచున్నాను."

(ఎచ్చట నుండి వచ్చితిమో అచ్చటికే తిరిగి వెళ్లుదుము, మధ్యన అన్నిటికి సూత్రపాయముగా దారమువలె ఉండునది పరమాత్మయే!)

98. నా తండ్రీ ఈశ్వరా! అమృతముగా, ఆనందముగా హృదయము పొంగి నోరూరుటకు కారణముగా ఉన్న తేనె వంటివాడా! నీయందు హక్కు సాధించిన నీ భక్తకోటివలె నేనూ హక్కుతో జీవించుటకు వసతి కల్పించువాడా! ప్రకాశ కిరణములు ప్రసరించు జడలు గలవాడా! ఎప్పుడూతోడై ఆపద కాలములో భక్తులకు తోడు వచ్చువాడా! ఈ లోకములోని మాయలో నన్ను ఉంచి తీవ్ర వ్యధ పడునట్లు చేయుట న్యాయమా? నీవే చెప్పుమా!"

99. "ఈశ్వరా! నాయకా! నన్ను రమ్మని ఆజ్ఞాపించుము. నారాయణునికి చతుర్ముఖునికి (బ్రహ్మ) మూలపురుషుడా! రమ్మని నన్ను వశము చేసుకొనుము. ప్రళయ కాలములో అన్నీ నీయందు లయమగు నపుడు, నన్ను ఆహ్వానించుదువు గాక! పాప విమోచకుడా! నీ గొప్పదనమును పాడి స్తుతించుట కొరకే నన్ను నీతో చేర్చుకొనుమా."

100. "హే పరబ్రహ్మా! నిన్ను నేను ప్రశంసించి పాడి స్తుతించవలె. మనస్సు కరిగిపోవునట్లు, మైమరచి నేను పాడి నాట్యమాడవలె. నీవు చిత్తాకాశములో నాట్యమాడునపుడు నీ స్వరూపముతో వెళ్లనివ్వు. ప్రపంచ తత్వములను దాటి నేను వెళ్లుదునుగాక. ఇచ్చట నుండి విడుదల (ముక్తి లేక మోక్షము) నేను పొందుగాక!"

## 6. విముక్తి మొర (ప్రపంచ వైరాగ్యము)

1. "వృషభమును వాహనముగా గలవాడును, పులిచర్మమును వస్త్రముగా ధరించినవాడును, జటాధారుడును అగు నీవు కరుణతో ఈ తెలివి తక్కువవాడిని ఆదుకొనుము. మరలా మరలా ప్రపంచ జీవితములో పడనీయక నన్ను ఆదుకొని రక్షించుదువు గాక!"

2. "అల్పసంతోషములకు నాకు నేనే అర్పించుకొన్నవాడిని. నీకు తెలియనిదేమి? అట్లున్ననూ నన్ను నీవు ఆకట్టుకొంటివి. దానికి కారణము గలదు. నేను ఒకప్పుడు నీ పాద సేవలో

నిమగ్నుడనైయుంటిని నీ భక్తులకు నేను వేరేవాడు కాదు. కావున నీవు నన్ను వదిలివేయకు సుమీ!"

3. నదీ తీరమున పెరుగు చెట్లు చేమలు వరదలకు కొట్టుకుపోవునట్లు, పంచజ్ఞానేంద్రియముల ప్రజ్ఞలు అందమైన స్త్రీల కామవలలో చిక్కి నాశమగును. నదుల ప్రవాహరాపిడి వలన తీరములు నశించునట్లు కామము అను రాపిడి వలన జీవులకు నాశనము కలదు. నన్ను మంచి మార్గమున నడిపించి నాకు రక్షకుడుగా ఉండుము. నన్ను వదిలివేయకు సుమీ!

(నాశము అనునది భోగికి మాత్రము కాదు, వానిని భోగములో పురికల్పించిన పంచేంద్రియములకు కూడ)

4. "బంగారమును, ఆకాశ మెరుపులను అధిగమించు జ్ఞాన ప్రకాశమును పొందినవాడా! నీ కరుణారసము నిండిన చేతులతో నన్ను పట్టుకొన్ననూ దానినుండి జారి వచ్చి ఈ లౌకిక జీవితములో ఉండి ఉన్నతి కోరువానిగానున్నాను. ఉన్ననూ నన్ను వదిలివేయకు సుమీ!"

5. "కీటకములు, రెక్కల పురుగులు దీపము మంటలో పడి మాడి పోవునట్లు, స్త్రీల మాయమాటలను కామాగ్నిలో పడి మాడి పోవుచున్నాను. నన్ను ఆకట్టుకొని నీ అనుగ్రహమను అమృత మొసగితివి. నేను దానిని అజ్ఞానముతో స్వీకరించలేదని, నన్ను విడిచిపెట్టకు సుమీ!"

(దీపములో పడి మాడిపోవు పురుగుల గతియే కామములో నిమగ్ను లైనవారికి.)

6. నా అజ్ఞానమేకదా! నీ అనుగ్రహమును స్వీకరించుటకు మరచినది. అందులకు నన్ను నీవు విడచిపెట్టెదవా! వద్దు! ఎన్నో జన్మలలో చేసిన కర్మములన్నీ తొలగించి నన్ను నీవు ఆకట్టుకొంటివి. ఉన్నతులు, జ్ఞానులు ఎప్పుడూ అజ్ఞానులమత్తును సహించుకొందురు సుమీ!

('నేను' అనునది శరీరమా? ప్రాణమా? మనస్సా? ఏది అన్న చర్చ ఎప్పటికీ ఉన్నదే. అల్పులు శరీరమునే నేననుకొందురు.)

7. "జీవరాశుల క్షేమమును రక్షింపగోరి విషమును త్రాగిన నీలకంఠా! ఎర్రనైన శరీరము గలవాడా! నా కర్మఫలితములను పోగొట్టువాడా! లౌకిక మాయతో మునిగియున్న నన్ను మార్పించి గొప్ప మార్పును నాలో తెప్పించిన సత్యశీలా! నన్ను విడిచి పెట్టకు సుమీ!"

8. నీ వాహనమైన వృషభము మెడ యందు ధరించిన గంటలు మ్రోగుటచే శత్రువులు భీతిల్లి చెల్లాచెదురైరి. ఇంద్రియములు నన్ను తగని దిశలో పురికొల్పుచున్నవి. ఆదిశలో అనుసరించుటకు మనస్సు మరోప్రక్క అల్లాడుచున్నది. నా తప్పులు నీవు ఓర్చుదువో!

ఒప్పుదువో! అని మనస్సు తబ్బిబ్బిలగుచున్నది. నన్ను నీవు వదిలివేయకు సుమీ!"

9. "ముల్లోకములకు నాయకుడా! యుద్ధములో త్రిశూలముతో జయమును చేపట్టినవాడా! రెండు ప్రక్కల అగ్ని గుండములో చిక్కుకున్న బర్రె పరిస్థితి వలె నేనున్నాను. నీతో వేరై అల్లాడుచున్న నన్ను నీవు వదిలిపెట్టకు సుమీ!"

10. "ఈశ్వరా! నీ దేశమైన ఉత్తర కోసమంగై ఉద్యానవనములో కందిరీగలు ఝుంకార నాదముతో సంగీతము పాడుచున్నవి. త్రిపురమును దహనము చేయుట కొరకు బలమైన మేరుపర్వతమును ధనుస్సుగా మార్చుకొంటివి. నీ దైవస్వరూపమున నా చిత్తము పెట్టక ఈ భౌతిక జీవితముపై కాంక్ష పెంచుకొంటిని అధముడైన నన్ను, నా చేతిని నీవు విడువకు సుమీ!"

11. "నా మనోనేత్రము నందు ఊటగా కార్చు తేనెవంటివాడా! శరీరమంతయు విభూది ధరించిన వాడా! నీ ఉన్నతమైన సత్యజ్యోతి స్వరూపమును అనుభవముతో పొందుటకు శక్యముగాక నేను చింతించుచున్నాను. నా పంచేంద్రియములకు నేను లోబడియున్నాను. అందులకు నీవు నన్ను నిర్లక్ష్యము చేయుట తగదు సుమీ!"

12. " సర్వేశ్వరా! నీవు నన్ను ఆదుకొన్ననూ, నేను నా పంచేంద్రియముల దారిలో వెళ్లి నీ నుండి తొలగితిని. నీ త్రిశూలము అజ్ఞానమును తొలగించ సామర్థ్యము గలది. నేను నా మనసార త్రాగగోరు అమృత సాగరమా! నిర్జీవముగాయున్న నన్ను విడిచిపెట్టకు సుమీ!"

13. "నిన్ను శరణుజొచ్చిన భక్తుల శరీరములను ఆలయముగా చేసుకొన్నవాడా! పుష్పములు కార్చు మకరందమా! జ్యోతి స్వరూపా! అమృతమా! ఉప్పొంగు తేనె సముద్రమా! నీ మహోన్నతమైన అనుగ్రహము ప్రసరించిననూ, నదిలో కుక్క తన నాలుకతో (నాకునట్లు) త్రాగునట్లు, ఉపయోగించడం తెలియనివాడిని నేను. నీ యందు మనస్సును లయపర్చ తెలియనివాడిని నేను. నన్ను విడిచి పెట్టకు సుమీ!"

14. "కన్నెదుట నీరు పారుచున్ననూ, చేతి నిండుగ తీసుకొని త్రాగుటకు వీలుకాక నాలుకెండిపోవునట్లు, నీ యొక్క అనుగ్రహ ప్రకాశము పొందియున్ననూ, లౌకిక దు:ఖములనుండి విడిపించుకొనుట శక్యము కాకున్నది. అయిననూ నీవు నన్ను త్రోసిపెట్టవద్దు. నిన్ను సదాచింతలో ఉంచుకొన్న భక్తుల హృదయములలో నీవున్నావు. ఇంద్రియములలో నిమగ్నమైన నన్ను నీ పరమానందము నిచ్చి అనుగ్రహించుదువుగాక."

15. "ప్రకాశించువాటికెల్ల ఆధారమైన మూలప్రకాశుడా! ఎప్పటికీ నా తండ్రీగా యుండి రక్షించువాడా! నన్ను నీ వశము చేసుకొన్నందుకు చాలా సంతసించితిని. కాని నీ దరి చేరుటలో ఈ లౌకిక బంధములను త్రెంచుకొనుటకు నేను వెనుకాడుచున్నాను. అందులకు నీవు నన్ను వదిలి పెట్టేయకు సుమీ!"

16. "సత్యపురుషుడా! పరిశీలించి చూచినచో నీకు సమానము నీవేసుమా! నా తల్లీ! నా తండ్రీ! నా అనుగ్రహ రూపా! నన్ను దయతో చూచి "నాయనా, నీవు భయపడవద్దు" అని చెప్పువారెవరూ లేక నేను తపించిపోతిని. కరుణించదగ్గ నన్ను నీవు విడిచిపెట్టకు సుమీ!"

17. "శాశ్వతమైన సత్యపురుషా! ఒంటరిగా ఉన్న నాలాంటి వానికి గొప్పతోడుగా యున్నవాడా! నిన్ను తిట్టువారి హృదయమును కూడా ద్రవింప జేయువాడా! సత్యజ్ఞానమును పొందిన వారికి తీపియైనది నీ అనుగ్రహఫలమే. అజ్ఞాన చీకటిని, జ్ఞానజ్యోతిని రెంటిని గలిగినవాడా! లోకనాధా! ఆదిమధ్యాంతుడా! నన్ను విడువకు సుమీ!"

18. "కాలకూట విషమునుకూడా అమృతముగా గైకొన్న వాడా! జన్మపీడలతో కొట్టు మిట్టాడు అల్పులకు అమృతమైన వాడా! నన్ను నీ వశము చేసుకొనుము. ఏదైనను నన్ను చేసుకొనుము. ఇంకేమి చెప్పుదును? ముందు ఆలోచనలు ఏదియూ లేక నీ అనుగ్రహము కోరి ఇప్పుడువచ్చిన నన్ను వదిలివేయకు సుమీ! ఇదే నా మొర. ఆలకింపుమా!

19. "క్రూరమైనదియు, పర్వతమువంటిదియునైన ఏనుగును నీవు చంపినది చూచి అంబిక భయమునొందినది. నా పాపకార్యములు దట్టమైన అడవిని పోలినది. దానిని నీ జ్ఞానాగ్నితో కాల్చి మాడ్చి వేయుము. నా జన్మరోగమును మొత్తముగా నాశనం చేయుము. మహా పురుషా! ఎప్పటికీ నన్ను విడిచి వేయకుమీ!"

20. "దేవతలకీ అందని ఎత్తులో నున్న చిత్తాకాశుడా! భువిగా, మిన్నుగా, అగ్నిగా, వాయువుగా, నీరుగా వెలుగొందువాడా! పట్టు, లక్ష్యముం ఏదిలేని నామనస్సు అలలువలె తల్లడిల్లుచున్నది. అల్లాడుచున్న నన్ను రక్షించవలె!"

21. "మదపుటేనుగు ఆవేశములో త్రొక్కబడి నాశనమైన చిరుచెట్లు, పొదల వలె, నా పంచేంద్రియముల బలములు నన్ను త్రొక్కి తల్లడిల్లునట్లు చేయుచున్నవి. ప్రకాశుడా! నా హృదయములో తేనె, పాలు, చెరకు రస సారములు ఉప్పొంగు నట్లు చేయుము. ఎముకలు, మాంసము కరుగునట్లు నన్ను నీ వశము చేసుకొమ్ము."

22. "జ్ఞానప్రకాశా! నీ భక్తుల హృదయములో కొలువైయున్నావు. ఇతరులకు తెలియదు. నిన్ను పూర్తిగా అర్థము చేసుకొన్న వారెవరూ లేరు. పురుషుడుగా, స్త్రీగా, నపుంసకుడుగా నున్న నీవు నేను తగినవాడను కానని త్రోసి వేయకు సుమీ!"

23. "శరీరతత్వ మెరుగక, ఈ లౌకిక కాంక్షలో తేలియాడి, దైవభక్తి లేకయున్న నన్ను వేషధారి అని విడిచి పెట్టెదవు కాబోలు. అట్లు విడిచినచో నేను నాశనమవుదును. నీవు తప్ప నాకే ఆధారము లేదు. నీ దరిచేరి నీలో ఐక్యమగుటకు అర్హుడను. నాలో నీవు ఎప్పుడూ యున్నావు."

24. మదపుటేనుగు చర్మమును వస్త్రముగా ధరించిన వాడా! శివనాధా! చీమలు నేతికుండ

చుట్టూ వాసనతో మూగినట్లు, నేను అనుగ్రహపాత్రుడనై నీ దరిచేర కోరుకున్ననూ, నా పంచేంద్రియములు నన్ను అడ్డగించి చెడు వాసనలతో త్రోయుచున్నది. నేనూ ఇటువంటి మాయకు లోబడి నీ సత్యజ్ఞానమను త్రోసిపుచ్చుచున్నాను. వ్యర్థ మాటలతో కాలము వెలిబుచ్చుచున్నాను. ఇటువంటి కీడు నుండి నీవే నన్ను కాపాడవలె. వదిలివేయకు సుమీ!"

(తమకు ఆనందమిచ్చునది ఎచ్చటనున్ననూ చీమలు వాసనపట్టి, వెళ్లి, దానిని అనుభవించుచున్నవి. కాని ఆరు జ్ఞానములు (ప్రజ్ఞలు)గల మానవుడు దైవము యొక్క దివ్యపాదములే శాశ్వతానంద, సత్యమని ఎరుగక యున్నాడు. ఎరిగిననూ దానిని పొందుటకు ప్రయత్నించడములేదు. అందువలన ఏ జీవితో పోల్చి చూచిననూ మానవుడు అధమస్థితిలోనివాడేనని శ్రీ మాణిక్యవాచగర్ నొక్కి వక్కాణించుచున్నారు.)

(పంచేంద్రియములు కల్పించు జ్ఞానములు ఐదు. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు. మానవునికి మాత్రము ప్రత్యేకమైనది ఆరవజ్ఞానము: విచక్షణాజ్ఞానము)

25. "ఈశ్వరా! చీమల గుంపులో చిక్కుకొన్న పురుగువలె నేను ఈ పంచేంద్రియముల వలతో చిక్కుకొని అల్లాడిపోతున్నాను. వాటినుండి రక్షించుమా! ప్రాణము తీయుటకు వచ్చిన యముడి నుండి తప్పించుకొని నీ దరిచేరిన మార్కండేయుని రక్షించి, యముదుని దండించినట్లు, నీవు నన్ను ఆదుకొని రక్షించవలె. పుష్పముల వంటి మృదువైన నీ దివ్యపాదముల దరి చేరినవాడిని. ఈ చిన్న వాడిని ఎప్పటికి త్రోసివేయకుమీ!"

26. "గంగానది పొంగి పొరలి వచ్చు వేగమును తట్టుకోలేక తూలియాడు తెప్పవలె కనిపించు నెలవంకను జటాధారణగా గలిగిన చిత్తాకాశుడా! పల్లములోని నీరు ఇంకిపోయినపుడు పరితపించు పోవు చిన్నచేపలవలె భీతిలో నేనున్నాను. అటువంటి అపాయములో నన్ను పడవేయుదువా? ఏమీ?"

27. జ్వలించు ముత్యములు రాల్చు నవ్వులు గల స్త్రీల మాటలకు భ్రమించి, వారి పర్వతములాంటి వక్షోజములపై విహరించు అజ్ఞానియైన నన్ను రక్షించవా? ప్రేమామృతము నిండి, శరీరము పులకించి, వణుకుతో నున్న భక్తుల సమూహములో నన్ను చేర్చుకొనుమా! ఓ నిర్మల ముత్యమా!! నీ దివ్య జ్ఞానమును నాకు జూపి అనుగ్రహించుమా!"

28. "దేవలోకవాసులు, భూలోకవాసులు, భయపడి వణికి నీదరి చేరినపుడు వారిని రక్షించుట కొరకు నీవు పాలసముద్రము చిలుకులో పుట్టిన విషమును త్రాగితివి. వారందరిని కాపాడిన నీవు, నన్ను అనుగ్రహించవా? నా ఇష్ట దైవమా! నీ వల్ల నా ఇంద్రియములలో మార్పు ఏర్పడినది. నాకు మంచి మార్గమును నిర్ధేశించవా!"

(దైవము వద్ద మొరపెట్టుకొని మాయయను అజ్ఞానమునుండి బయటపడవలెను. దైవము తన బిడ్డలందు పక్షపాతముగా ఉండజాలడు.)

29. "పసుపువర్ణ పుష్పమాల ధరించినవాడా! తామరపుష్పము వంటి శరీరఛాయగలవాడా! నీకు సరిసమానమెవరు లేరు. తిరుగుచున్న కవ్వముతో చిలుకు పెరుగు వలె నేను ప్రేమబంధములో చిక్కి అల్లాడుచున్నాను. నా బంధములను పోగొట్టు వాడు నీవే. మేరు పర్వతమును ధనుస్సు చేసుకొన్న నీవు నన్ను వేరే దారిన విడుచుట తగునా?"

30. "దివ్యవిభూది, చల్లనైన చందన కాపు (పూత) ధరించిన వాడా! కపాలములను మాలగా, ధరించిన వాడా! కవ్వముతో చిలుకునపుడు పెరుగు విరిగి, కరిగి చిలుకుటకు అటు ఇటు తత్తరిల్లునట్లు, నా పంచేంద్రియముల తాకిడికి నేను మండి తల్లడిల్లుచున్నాను, సుమీ! నన్ను చేరదీసి రక్షించవా?"

31. "అన్నింటికి మూలముగా నొప్పారు సత్యపురుషా! పంచభూతములుగా వెలుగొందువాడా! ఆశ్చర్యచరితుడా! పామును నడుముకు ఆభరణముగా ధరించినవాడా! బలమైన కాళ్ళు గల గజమును చంపినవాడా! నిలకడలేని ఈ లౌకిక జీవితములో నన్ను విడిచిపెట్టకు సుమీ!"

32. భక్తకోటి తప్ప ఇతరులు ఎరుగ శక్యము కానివాడా! మహాప్రకాశ మాణిక్యమా! సముద్రమును ఆవిరిచేయగల బడబాగ్నిని నాశము చేసి, సముద్రములో నుండి పెల్లుబికిన కాలకూటవిషమును అమృతమువలె స్వీకరించినవాడా! మదగజమువలె వచ్చు పంచేంద్రిములకు భయపడి మనస్సు చలించు నన్ను, విడిచిపెట్టకు సుమీ!"

33. నా దైవమా! దివ్యామృతము త్రాగి, గర్వపడి, మదమెక్కి మనస్సు సంచరించు దారిలో తిరుగాడునన్ను విడవకు సుమీ! ముందువలె నీ దివ్య పాదపద్మములందు సేవ చేయుభాగ్యము కల్పించి అనుగ్రహించుము. నన్ను నీ వాడిగా చేసుకొనుము. నాయందు నీ దివ్యత్వము కాని సంతోషమును వీడదీసి అనుగ్రహింపుమా!

(అణకువ, శాంతి, సంతోషములన్నియూ ఆత్మసాధకునికి సహాయపడును. కాని అల్పతనము, పరవశము సహాయపడవు. అప్పటికప్పుడు ఉప్పొంగి పోవునదన్నియూ రేపటికి దు:ఖమునే మిగుల్చును.)

34. "శివలోకనాథా! నా మనస్సుకు తగినట్లు నడచుకొని, సంతోషము పొందలేక నీ అనుగ్రహము పొందగోరుచున్నాను. నేను పద్ధతి తప్పి జరుగుతున్నానని నన్ను విడచిపెట్టకు సుమీ! అరటిపండు వలె పక్వమొందించుము. పక్వమొందుటకు గాను తర్ఫీదు ఇవ్వుమా!"

35. "నెలవంకను, పామును, జడయందు ధరించినవాడా! నన్ను నీవు వదిలిపెట్టకు సుమీ! పంచేంద్రియములను పాములు నన్ను భయపెడుతూ ఉన్నవి. పాము పుట్టలో దాగున్న ఎలుక వలె నా మనస్సు, ఐదుతలల నాగువలె బుసకొట్టు ఇంద్రియములకు భయపడి నీ యందు దాసుడననై యున్నాను. హరా! రక్షించుమా!

36. సువాసన, మకరందముతో నిండిన మందారపూవులపై తేలియాడు కందిరీగలతో

కూడియున్నవాడా! ఆ కందిరీగలు కూడ నీ అనుగ్రహము వలన గొప్ప జీవితముతో కొనసాగుచున్నవి. కర్రదూలములు అగ్ని మంటలో మాడిపోవునట్లు నా పంచేంద్రియములు నన్ను దహించి వేయుచున్నవి. కుమిలిపోవు నన్ను విడచివేయకు సుమీ!"

37. "తెల్లటి పలు వరుసతో కూడిన, సముద్రము వంటి కరుణారసముతో నిండిన కళ్లు గల ఉమాదేవి నమస్కరించు దేవాది దేవా! పర్వతములన్నియూ ఒక్కటైనట్లు నన్ను ప్రారబ్దకర్మలు వేదించుచున్నవి. నటరాజా! ఈ చిన్నవాడి తప్పులను మన్నించి "భయపడకుమని" చెప్పి అనుగ్రహింపుము. నన్ను విడచివేయకుమా!"
(ప్రారబ్ధకర్మలు వలన జన్మలు గలుగుతున్నవి. జ్ఞానులకు కూడా కర్మలు శత్రువే. పాపకర్మలు వలన జన్మము మాత్రముకాదు, జన్మమంతయూ దు:ఖమయమే.)

38. "సర్వవ్యాపకుడైయున్న జ్యోతి స్వరూపా! శ్మశాన రాజా! భక్తులకు అమృతమా! ప్రాణ బలముతో పొందలేనివాడా! ఏ దిక్కులేని వాడైన నాకు గొప్ప తోడైనవాడా! పంచేంద్రియముల కాంక్షతో స్త్రీ మాయలో చిక్కుకొనియున్న నన్ను వదిలివేయకు సుమీ!"

39. "దృఢముగా తోడు నున్నవాడును, జీవితమునకు మూలమైనవాడును, శేష జీవితమున కష్టకాలములో ఉపయోగపడువాడును, నిలకడగా ఉండు నీలాంటి వాడిని వీడి వేరే విధముగా నడచుకొను నన్ను విడిచిపెట్టకు సుమీ! శరీరమను దృఢమైన వలలో చిక్కుకొని దుఃఖమనుభవించుచూ సహించుకొని ఉండజాలను."

40. "కైలాశనాథా! చంద్రశేఖరా! కరుణాసముద్రమా! ఉమాపతీ! నా జీవిత కారకుడా! వలలో చిక్కుకున్న లేడి పిల్లవలె, మాయకళ్లు కలవారి కళ్లలో పడి చిక్కుకొని భ్రమించి తిరిగిన నన్ను, వదల జాలకు సుమీ!"

41. "అంబికాపతీ! ధర్మ స్వరూపా! శివా! పాపకార్యము వలన గలిగిన ఈ క్షీణింప దగిన శరీరము నేను ఇక మోయజాలను. కామ కాంక్షలతో నిండిన స్త్రీ సాంగత్యమను మొసలి నోటిలో పడి నీటిలో మునిగి దు:ఖపడుచున్న నన్ను వదిలివేయకు సుమీ!"

42. నీ దివ్యకొప్పులో తెల్లటి హిమ పర్వత గుహలో ఇమిడి యున్న పాము పడగవిప్పి ఆడి ముడుచుకొన్నది. దానిని చూచి భయపడి నెలవంక గంగలో దాగున్నాడు. నీవు జ్ఞానము నొసగియున్ననూ నేను శరీరమును విడవని విధి వశుడను. అందులకు గాను నన్ను విడిచి పెట్టకు సుమీ! రక్షించుమా!"

43. "ఉన్నతమైన వేదమను 'ఆత్మజ్ఞానము' శాస్త్రమును భోధించిన వాడా! మాటలకు అందనివాడా! భక్తులకు సులభలభ్యుడా! సర్వేశ్వరా! వెనుక ఉండి అన్నీ నడిపించువాడా! నేను నీతో ఐక్యమగుటకు ఏ విధానము తెలియని వాడను. నాకు ఆనందమును నొసంగి జ్వలించువాడా! నన్ను విడచివేయకు సుమీ!"

44. "తీవ్రమైన స్త్రీ సాంగత్యమను మండుచున్న అగ్నిలో పోసిన నేయివలె కరిగిపోవు నన్ను నీవు వదిలేయకు! అమృతము నిండిన నీ దివ్యపాదములను సదా నమస్కరించి వెళ్లు భక్త కోటిలో నన్ను చేర్చుకొనుము. మహాదేవా నమస్కారములు. నన్ను జారిపోనివ్వకు సుమీ!"

45. "మాణిక్యమా! నీ గొప్పలు, ప్రశంసలు, స్తుతించనైతిని. నీ సేవజేయలేదు. ప్రజ్వలించుచున్న నీ అంశము చూచిన పిదప కూడ నేనీ శరీరమును విడుచుట లేదు. నీ నుండి నేను వేరైన పిదప "నీవు ఎచ్చట ఉన్నావు" "నిన్నెవరుచూచిరి" అని నే నాశ్చర్యము పొంది వెతకనైతిని. వ్యర్థముగా ఉండి చింతించుచున్నాను."

46. "సువాసనతో నిండిన పనసపండుపై వ్రాలు ఈగవలె నేను, లేడికన్నులవలె మిరుమిట్లుగొల్పు స్త్రీల యొక్క సాంగత్యమను అల్ప సంతోషమును కోరి వెళ్లుచున్నాను. అందులకు నన్ను విడిచిపెట్టకు సుమీ! నన్ను నీవు విడిచిపెట్టినచో, నిన్ను "విషము త్రాగినవాడా", "గుణములేనివాడా", "సాధారణమనిషి", "తెలివితక్కువవాడు", "ముదుసలి" అని పెక్కువిదములుగా దూషించెదను సుమీ!"

(శ్రీ మాణిక్యవాచగర్ ఈ పద్యములో దైవమును దూషించి నట్లు చెప్పబడియున్నది. దీనినే "నిందాస్తుతి" అందురు. భక్తులు దైవానుభూతిలో పరవశులై పలికిన పలుకే తప్ప నిజమైన దూషణలు కానేరవు. ఇదీ ఒక విధమైన దైవ లీలలే అగును.)

47. "ముత్యములను, శంఖులను నీటితో దొర్లించుకొని వచ్చుచున్నది మందాకినీ నది (గంగానది). దానిలో మందార పుష్పములు తేలియాడు చున్నవి. నీ జటాఝూటము దానిని ఆపి ఆనకట్ట వలె చేసినది. దానిలో నెలవంక దూరి జ్వలించుచున్నాడు. కీడు తెలియని నీ దివ్యపాదముల దరిచేరి సేవజేసిన నేను, తరువాత దిగజారిపోతిని. దూషించిన, అల్పుడనైన ఈ పాపిని, నీవు నిర్లక్ష్యము చేసి వేయుదువా!"

48. "నక్షత్రము పోలిన కపాలమాల ధరించినవాడా! అగ్నివంటి పామును ఆభరణముగా ధరించినవాడా! నన్ను అధోగతిలో విడచివేయకుమీ! విడిచివేసినచో పెద్దలు నన్ను "నీవెవరు" అని అడిగినచో నీ దాసాను దాసుడని చెప్పి నిన్ను దూషించెదను."

(నిజమైన భక్తులు భక్తి పరవశముతో, హక్కుతో దైవముపై కోపించు కొందురు. ఇది స్నేహ పూరిత లయమని ఐక్యమని భావించవలె.)

49. నీవు నాపై విరక్తిచెంది నిర్లక్ష్యము చేసినచో నీ పనులు గురించి ఊరి వారందరికి చెప్పి నవ్వునట్లు చేసెదను. నా సేవ నీకని చెప్పి దానిని వేరే విధముగా చేసి చూపుదును. నన్ను త్రోసివేసినచో, "వీడు విషము త్రాగిన పిచ్చివాడు, కాటిలో, అగ్ని గుండములో తిరుగాడు పిచ్చివాడు, పులిచర్మము ధరించిన పిచ్చివాడు, భక్తుని విడచినవాడు" అని దూషించి నీపై నింద మోపెదను.

50. "నిన్ను నేను దూషించినను, స్తుతించినను, నా తప్పులు గురించి చింతించువాడిని. నన్ను వదిలివేయకుమీ! నా నాయకుడు నీవు, నీ భక్తుడనేను. పగడము వంటి శరీరచాయ గలవాడా! సకల జీవరాశులను రక్షించ గోరి విషము త్రాగి వాటిని రక్షింతివి. అజ్ఞానమును తొలగించునదైన ఆఖరి కార్యమును గైకొన్నవాడా! నా అజ్ఞానము తొలగించుము. నన్ను జ్ఞానిగా చేయుము!"

## 7. తిరువెంబావై (శ్రీవ్రతము)

"మాసములలో నేను మార్గశిర మాసముగా నున్నాను" అన్నాడు భగవానుడు. బ్రహ్మ ముహూర్తములో పూజించడము చాలా శ్రేష్ఠము. మార్గశిర మాసమున ప్రజలు ప్రాత:కాలములోనే లేచి దైవమును స్తుతించి, పాడబడిన ఈ "తిరువెంబావై" అను శ్రీవ్రతము (నోము) కీర్తనలు.

(వైష్ణవులలో ఈ నోము 'తిరుప్పావై'గా పేర్కొనబడి మార్గశిర/ధనుర్మాస వ్రతముగా పేరొంది, వైష్ణవ పరమ భక్తురాలైన గోదాదేవిచే (ఆండాళ్) ముప్పది రోజులకు ముప్పది కీర్తనలుగా ప్రాత:కాలమున (పాశురములుగా) స్తుతించి, పాడబడి, చివరకు (ఆండాళ్) తాను ప్రేమించిన దైవమునైన శ్రీరంగనాధుడిని పెండ్లాడి, అతనిలో శరీరముతో ఐక్యము చెందిరి.)

1. "ఆదియు, అంతము లేని జ్ఞానప్రకాశ స్వరూపుని స్తుతించి పాడితిమి. కాని ప్రకాశముతో కూడిన విశాలమైన నేత్రములు గల సఖీ నీ వేల ఇంకా నిదురపోవుచున్నావు. మేము మహాదేవుని కీర్తించు శబ్దము నీ చెవికి వినబడలేదా? అది వీదియంతటికి వినబడుచున్నదే! అది విన్న ఒక్కొక్క కన్య మేల్కొనినది, వెక్కి వెక్కి ఏడ్చినది, పడక నుండి జారిపడినది, మత్తు వీడినది. అయిననూ నీ పరిస్థితి ఏమిటి? ఇదే నీ తత్వమా? చెప్పినది బాగా ఆలోచించి చూడుము. (కన్యలందరు గుమిగూడి పడుకున్న వారిని ప్రాఃతకాల పూజకు లేపుట.)
2. ప్రకాశ స్వరూపుడైన దైవము గురించి మాట్లాడునపుడంతయూ నీ ప్రేమ వాడికే సొంతమని చెప్పుదువు. ఇప్పుడు ఈ పుష్పపానుపుపై మమకారము పెరిగిపోయినదా? "సఖులారా! ఇప్పుడు ఇట్లు పరిహసించి మాట్లాడుటకు సమయము, చోటూ కాదు. తెలివివంతులైన దేవతలే ఆతనిని స్తుతించు అర్హత తమకు లేదని వెనకంజ వేయుదురు. కాని శివలోక నాథుడు తిల్లై చిట్టంబలననే (తిల్లై=నటరాజు; చిట్టంబలన్ = నెలవంక ధరించినవాడు = చంద్రశేఖరుడు) అనుగ్రహింప తయారుగా ఉన్నాడు. వాని గురించి ఏమీ తెలియని మనము , వాని అనుగ్రహమునకు పాత్రులమా? మన పరిస్థితి ఏమిటి?

3. 'ముత్యములాంటి పలువరుస గలిగిన సఖీ! మునుపు మాకు ముందుగా ప్రాతఃకాలమున లేచి వచ్చి, నా తండ్రి! ప్రేమ స్వరూపుడా! అమృతమా! అని దైవము గురించి తేనె పలుకులు పలికితివి. ఇప్పుడో లేచివచ్చి ద్వారము కూడ తీయక నిదురపోవుచున్నావు." సఖులరా! ఈ కొత్త తప్పును మీరు సహించు కొన్నచో ఏమైన కీడు ఏర్పడునా?" (మేల్కొనిన సఖి)

"మమ్ములను మోసగించవద్దు దైవమునందు నీకున్న ప్రేమను మేమెరుగుదుము. మనోఃపరిపక్వమొందిన వారు నమఃశివాయని స్తుతించి పాడారా? ఇది మాకు కావలసినదే!

4. 'ముత్యములాంటి పలువరుస గలదానా! నీకింకా ఉదయం కాలేదా! "చిలుక పలుకులు పలుకు వారందరు వచ్చి వేసిరా? (మేల్కొనిన సఖి)

"లెక్కపెట్టి చూచుకొనుము అంతలో ఒక కునుకు తీయవద్దు. సాటిలేని అమృతుడును, వేదార్థము తానైయున్నవాడును శివుని పాడి స్తుతించి కరిగిపోవుదుము గాక! వచ్చిన వారిని చూడవలెనన్నచో నీవేలెక్క పెట్టుకొనుము. నీ లెక్కకు ఎవరైన తక్కువగా ఉన్నచో మరలా నీవు నిదురపోవచ్చును.

5. "గర్వించిన నారాయణుడు, చతుర్ముఖుడు (బ్రహ్మ) చూడ శక్యముకాని మహా పర్వతము వంటి అగ్ని జ్యోతిరూపుడైన శివుని మన మెరుగుదుము ఎల్లపుడు తేనె పలుకులు పలుకు వంచకి, తలుపులు తీయుము. భూలోకమువారు, ఊర్ధ్వలోకమువారు ఇతరులు ఎరుగలేని రూపము గలిగిన శివుడు మనల్ని ఆదుకొనవచ్చిన దివ్యతీరు, ఆకట్టుకొన్న గొప్ప తనము, వాని దివ్య అనుగ్రహ గుణమును పాడి స్తుతించుటకు తప్పిన వారైతిమి. మేల్కొని స్తుతించమైతిమి. సువాసనలు రాసుకొన్న కొప్పుగలదానా! ఇంకా నిదురించుచున్నావు మేము శివా! శివా! అని ఎలుగెత్తి అరచిననూ ఇసుమంతయూ వినక ఉన్నావే!''

6. 'లేడికన్నుల వంటి కన్నులు గలదానా! "రేపు నేను ముందువచ్చి మిమ్మల్ని లేపుదును" అని చాటుకొంటివే. సిగ్గు ఎచ్చట పోయినది? ఇంకా ఉదయించ లేదా? ఏ దేవతలు మానవులు ఎరుగని ఈశ్వరుడు తానే కోరి వచ్చి మనల్ని ఆదుకొని అనుగ్రహించెను. వానిని స్తుతించి పాడితిమి. మా కొరకై నీవు లేచి వచ్చిపాడుము. హృదయము ద్రవింపజేయము. ఇది నీకు తగునా? ఆలోచించుము!

7. "అమ్మా! ప్రేమతో ఆకట్టుకొన్నదైననూ, ప్రేమ లేనన్నట్లు నిదురపోవుటతగునా? దేవతలందరిచే కొలవబడువాడును, గొప్పవాడునునైన శివుడుని మేల్కొలుపుటకు తగిన రీతిలో చేయ శబ్దములు (ఢంకారములు) విని ముందంతయూ 'శివ, శివ' అని నోరెత్తుదువు. దక్షిణేశ్వరా! అన్న మాటకు నీవు అగ్నితో కాల్చిన మైనమువలె కరిగిపోవుదువు. ఇప్పుడు 'అమృతమా' 'మా మహారాజా' అని నీముందు వచ్చి పాడితిమి. ఇంక నీవు నిదుర వీడక కఠిన మనస్కురాలై, అజ్ఞానవంతురాలు వలె ఉద్రేకము లేకయున్నావు. నీ నిదుర తత్వమేమి?"

8 "ప్రాతఃసమయమున పుంజుకోళ్లు కూయును. సంగీతరాగము వలె పక్షులు కూయును. తెల్లని పాల శంఖు శంఖించును. అనంతమైన ప్రకాశుడును, మహా అనుగ్రహమును, మహా ప్రతిష్ఠ గలిగిన వాడునైన పరమేశ్వరుని పాడి స్తుతించితిమి. సఖీ! నీవు వినలేదా? ఇట్లు నిదురపోవుటయా? నీవు నోరు మెదపడము లేదు. శివుని వద్ద అర్పించు ప్రేమ ఇదేనా? ప్రళయకాలములో అన్నీ లయమైనపుడు మిగిలి యున్న వాడు అతను మాత్రమే. కరుణామయుడు, లేమి వారికి బంధువు. వానిని స్తుతించి పాడుదుము. సఖీ! నీవు పాడుము."

9. "పురాతనలో మరింత పురాతనముగా, క్రొత్తలో మరింత నవీనముగా యున్నవాడా! నిన్ను మా నాయకునిగా పొందిన దాసులము. నీ భక్తుల దివ్యపాదములకు తలొగ్గెదము. వారికి బంధువులగుదము. వారి ఇచ్చిన ఆనతి ప్రకారము నడచెదము ఈశ్వరా! ఇట్లు మాకు అనుగ్రహించినచో మాకేకొదువ ఉండదు."

10. "ఈశ్వరుని దివ్యపాదములు పాతాళమంతటిని దాటి అథఃపాతళములో చొచ్చుకొనినున్నది. పుష్పములతో అలంకరించినచో అన్నిటికీ మీద నున్నది. మహారూపము ఇదని నిర్ధయింపబడని వాడు. తను సర్వవ్యాపి. వేదములు, దేవతలు, మహారాజుల ప్రశంసలకు అతీతమైనవాడు, భక్తుల హృదయములో దాగున్నవాడు. నిష్క ళంకుడు, నిర్మలుడునైన హరుడు! వానిని ఆరాధించు కన్యలారా! వానికి ఊరు, పేరు, బంధము లేదు. వానిని పూర్తిగా వశము చేసుకొనజాలము. వాని మహిమ గుర్తించి నీకు నీవే ఆలోచించి చూడుము!"

11. "ఎర్రనైన చాయగలవాడా! స్నానము చేయుటకై మేమందరము తటాకములో దిగి నీటితో శబ్దించుచు నీటిని విసరి ఆడి, పాడి స్నానము చేసితిమి. నీ మహిమలను స్తుతించితిమి. పరంపరగా ఎన్నో జన్మలుగా నీ దివ్యపాదములందు శరణు పొందితిమి. ఉమాపతీ! మనోహరుడా! నీవు ఆడు దివ్యలీలలో అర్చులందరూ ముక్తిపొందిరి. నీకు సేవచేయుటలో మేము ఎటులైననూ సొమ్మసిల్ల కుండా అనుగ్రహింపుము. ఓ సఖీ! ఈ సారాంశములన్ని తలంచి చూడుము.

12. జన్మకర్మ ఫలితములు పోగొట్టునట్లు మనము పుణ్యతీర్థములో స్నానమాచరించెదము. తిల్లై చంద్రశేఖరుడు తన ఎడమ చేతిలో అగ్నిని దాల్చి నాట్యము చేయగలవాడు. వాని మహిమలు చెప్పి స్తుతించునట్లు గాజులు, వడ్యాణము శబ్దము చేయుట, అందమైన కురులుపై కందిరీగలు ఝంకారము చేయునట్లు, తటాకములో స్నానమాచరించి దైవమును కొలుచెదముగాక! తటాకములోని పెద్ద ఊట నీటిలో ఆడుదాము. సఖీ! చెప్పిన వన్నీ ఆలోచించుమా!"

13. "తటాకములో నల్లకలువలు, ఎర్రతామరలు నిండియున్నవి. నీటి పక్షులు శబ్దించుచున్నవి.

శరీరము శుభ్రము చేసుకొన గోరి అందరూ తటాకములో గుమిగూడిరి. మనయొక్క శంఖు గాజులు, కాలి అందెలు చేరి శబ్దించనీ. వక్షోజములు మెరయునట్లు, తటాకములోని నీరు పొంగునట్లునూ, తామరలు నిండిన నీటిలో ఈది స్నానమాచరించెదము."

14. చెవులకు ధరించిన ఝుంకాలు ఆడునట్లు, శ్రేష్టమైన బంగారు నగలు శబ్దించునట్లు తలలో ఇమిడ్చిన పుష్పమాలలు ఆడునట్లు, దానికి తోడైన కందిరీగలు పుష్పమాలలపై తిరుగాడు నట్లు మనము నీటిలో మునిగి ఆడుదాము. వేదములను వల్లించు చంద్రశేఖరుని స్తుతించెదము. జటాదారుడునైన శివుడు, జ్ఞాన ప్రకాశుడు, ఆదియు, అంతమైనవాడిని మనము పొందెదము గాక! మనల్ని జన్మరహితులుగా చేసి రక్షించగల తల్లి పరాశక్తిని స్తుతించి పాడెదము, ఆడెదము!"

15. "ఒకసఖి ఒక సమయమున పరమేశ్వరుని స్తోత్రించి నోరార పాడును. మన:కుతూహలముతో మరొక సమయము కన్నీటి పర్యంతమగును. మరొక సమయము భూమిపై పడి పొర్లును. క్షుద్ర దేవతలెవరికి నమస్కరించదు. ఈశ్వరుని యందే పిచ్చియై యుండును. ఇట్లంతయూ తనవశము చేసుకొన్నవారెవరై యుందురు? అందమైన వక్షోజములు గల కన్యలారా! మన దైవమును నోరార స్తుతించి పుష్పములు నిండిన తటాకములో స్నానమాడుదాము. సఖీ! చెప్పిన వన్నింటిని తలంచి ఆచరించిచూడుము."

16. "ఓ మేఘమా! ఈ సముద్రమును త్రాగి చైత్రమాసపు ఎండలకు ముందే నీరులేకుండా చేసితివి. ఆకాశమును ప్రార్థించి సదా సర్వకాలము రక్షించు ఉమాదేవి యొక్క నీలిరంగును పొందితివి. నీవు మెరుపుతీగ వలె మెరిసినది ఆమె చిన్న నడుమును పోలియుండెను. నీవు ఉరుమువలె ఉరుమినది ఆమె దివ్యకాలి అందే బోలి యుండెను. నీవు విసిరిన ఇంద్రధనుస్సు ఆమె కనుబొమ్మలు పోలియుండెను. మా సర్వేశ్వరుని భక్తులకు, మాకు అనుగ్రహమును వర్షము వలె కురిపించుము. సఖీ! వీటిని నీవు తలంచి చూడుము."

17. "సహజ సువాసన వెదజల్లు నల్లటి కురులు గలదానా! ఎర్రనైన కళ్లు గల నారాయణని వద్ద కాని చతుర్ముఖుని (బ్రహ్మ) వద్ద కాని వేరెవరి వద్ద లేని, సాటిలేని మహానందము మనకు దక్కునట్లు అందరికి, ఇంటింటికి, తన దివ్యపాదముల దర్శింపచేయువాడు ఆ సర్వేశ్వరుడు. వాని భక్తులము, దాసులైన మనకు మహామృతము. దానిని స్తుతించి పాడుచు ఈ తామర తటాకములో జలకాలాడుదుము గాక!"

18. "అన్నామలై (తమిళనాడులోని తిరువన్నామలై ఊరిలో కొలువైన శివుని పేరు అన్నామలై /అరుణాచలేశ్వరుడు) దివ్యపాదములను నమస్కరించు దేవతలు తాము ధరించిన రత్నముల మెరుపులను కోల్పోవుచున్నారు. సూర్యుడు తన కిరణ ప్రకాశమును కోల్పోవుచున్నాడు. నక్షత్రములు మసకబారును. దైవము పురుష, స్త్రీ, నపుంసకుడు అన్నింటిగా, వారికి వేరై యున్నాడు. పంచభూతములకు వేరైయున్నాడు. వాడు

క్షీణించనివాడు, సఖీ! కన్నెదుట అమృతమైయున్న వానిని పాడి, స్తుతించి, పుష్పతటాకమున స్నానమాచరించెదము గాక.

19. "మా నాయకా! రక్షకా! 'నీ చేతిలోని బిడ్డడు నీకే సొంతము; అన్న సామెతను చెప్పుటకు మాకు సంకోచముగా నున్నది. ఏలననగా అది అక్కరలేనిది. నీకు ప్రియమైన భక్తులను తప్ప మరెవరినీ మేము వివాహమాడజాలము. నీ దాసులకు తప్ప మరెవరికీ మా చేతులు సేవ జేయవు. నిన్ను తప్ప మరెవరిని మా కళ్లు చూడజాలదు. ఈశ్వరా! మాకు ఇటువంటి అనుభవము నీవనుగ్రహించినచో అదే చాలును. తరువాత సూర్యుడే దిశ మారి తిరిగిననూ, దాని గురించి మేము చింతించము.

20. "మమ్ములను రక్షించు మహాదేవా! అన్నింటికి ఆది మూలమైన వాడా! అనాదియే! నిన్ను స్తుతించుచున్నాము. అన్నింటికి ముగింపుగా (లయముగా) ఉన్న నిన్ను స్తుతించుచున్నాము. అన్ని జీవరాశుల ఉత్పత్తికి కారణభూతా! నిన్ను స్తుతించుచున్నాము. అన్ని జీవరాసుల ఆనంద జీవిత కారణభూతా! నిన్ను స్తుతించుచున్నాము. జీవులకు మోక్షమొసగు నీ దివ్యపాదములను స్తుతించుచున్నాము. నారాయణుడు, బ్రహ్మ చూడ శక్యము కాని నీ దివ్య పాద పద్మములకు నమస్కారములు. మేమందరము కలసి స్నానమాచరించెదము గాక! మార్గశిర మాస దివ్యస్నానమునకు నమస్కారములు."

# 8. తిరువమ్మానై (శ్రీ గొబ్బిల్ల పాట)

## (ఆనంద పరవశము)

తిరు + అమ్మానై = తిరువమ్మానై ; తిరు = 'దివ్య' లేక 'శ్రీ' "మంగళము" అను అర్థము. అమ్మానై = గొబ్బిల్ల ఆట, పాట.

9వ శతాబ్ధిలోని తమిళ వాఙ్మయములోని పదము. ఐదారుగురు పెండ్లి కాని కన్యలు గుమిగూడి పువ్వుల బంతులను ఒకరిపై ఒకరు విసురుకొని, ఆడుకొను, పాడుకొను పాటలు (గొబ్బిల్ల పాట, ఆట)గా ఇచ్చట వర్ణించబడినది. ఈ పాటలు మన తెలుగున ఆటవెలదిగా చెప్పవచ్చును 'అమ్మానై' పాటలను ప్రాచుర్యములోనికి తెచ్చినది శ్రీ మాణిక్యవాచగర్ అని చెప్పబడియున్నది. ఇంపైన, చక్కటి ప్రాసలతో నిండినది. (అమ్మానై: అన్నపదమునకు 'ఆ మహామహుడు', 'ఆ తండ్రి' అని కూడ అర్థములు కలవు.)

1. గొబ్బిల్లాడు కన్యా! ఎర్రనైన కళ్లు గలిగి విశ్వరూపము ధరించిన నారాయణుడు వరహమూర్తిగా అధ:పాతాళమునకు వెళ్లి ఈశ్వరుని దివ్యపాదములను చూడజాలక భూలోకమునకు తిరిగి వచ్చెను. నన్ను ఆదుకొనవచ్చి, నా జన్మకర్మలను తొలగించెను. కొబ్బరి తోటలతో నిండిన తిరుపెరుందురై నాయకుడు వాడు. జ్ఞాన నేత్రము గలిగిన

బ్రాహ్మణుడై, నన్ను కోరి వచ్చి ఆకట్టుకొని విడిపించిన ఆకరుణామూర్తి దివ్యపాదములను పాడి మనము గొబ్బిళ్ళు ఆడుదామా!

2. భూలోక వాసులు, ఊర్ధ్వలోకవాసులు, ఇతరులు ఎవరికి ధర్శనమునకు అందనివాడు, మనకు సులభలభ్యుడైన గొప్పదనము వాడికే చెందును. నాకు మహానందము నొసగి, జన్మరహితము చేసి, నా హృదయమందే నివాసియైన, వెగటులేని అమృతుడు. భయంకరముగా ఉప్పొంగు సముద్రములో అవలీలగా దూకి వలపన్ని సొర చేపను పట్టి చంపెను. భక్తుల కొరకు కరుణా సముద్రుడైన ఆ మహామహుని పాడి, ఆడుదామా! (శివ పురాణము: శివలీలలు (తిరువిళైయాడల్) శివ అవతారములో ఒకప్పుడు పార్వతి మత్స్యకన్యగా, శివుడు మత్స్యకారుడుగాను, అవతరించడము, ఉప్పొంగు మహాసముద్రములో పెద్ద సొరచేప చాల మత్స్యకారులను చంపి దిగమ్రింగడముచే శివుడు ఆ సొరచేపను చంపుట, బహుమానముగా ఇచ్చిన మత్స్యకన్యయైన పార్వతీదేవిని పెండ్లాడడము, తమ ఇద్దరి నిజరూపమును ప్రదర్శించడము అన్ని కథగా వివరించబడియున్నది.

3. "ఇంద్రుడు, నారాయణుడు, బ్రహ్మ మరెందరో దేవతలు ఊర్ధ్వలోకములోనే ఉండగా, శివుడు భూలోకమునకు వచ్చి విబూదిని శరీరమంతయూ పూసుకొని మమ్ములను ఆదుకొనెను. తిరుపెరుందురై నాయకుడు (కొలువైయున్న శివుడు) హృదయము నుండి మన గురించి ద్రవించుచున్నాడు. జన్మలను పోగొట్టు ఉద్దేశముతో గుర్రముపై ఎక్కి వచ్చి మనకు దర్శనమిచ్చిన వాడిని పాడి ఆదుదామా!
(గుర్రముపై వచ్చినది: శ్రీ మాణిక్యవాచగర్ మహారాజు ఆజ్ఞను నెరవేర్చకపోవడముచే శివుడే గుర్రములను త్రోలుకొని మహారాజు వద్దకు వచ్చి, గుర్రములను అప్పగించుట (జీవితచరిత్ర చదవవలెను.)

4. "తమపై పుట్టలు పెరుగునట్లు తపముచేసిన దేవతలు, ఇంద్రుడు, నారాయణుడు, బ్రహ్మలకు సైతము దృగ్గోచరము కాని వాడైన శివుడు, తనకు తానే వచ్చి నాపై కరుణ చూపెను. అతని తల్లివంటి కరుణతో పులకరించిపోతిని. లోపలికి పీల్చు శ్వాసమునకు హేతువైనవాడు, తేనెవంటివాడును, తేటనైన అమృతుడై, మహాప్రకాశుడై, నెలవంక ధరించినవాడును (చంద్రశేఖరుడు) దర్శింప గొప్పదగు వాని దివ్యపాదములను స్తుతించి పాడి ఆడుదామా!"

5. "దివ్యత్వము నేర్వని నేను అల్పుడనైతిని. సర్వశక్తివంతుడైన ఈశ్వరుడు నాయందు దయయుంచి అనుగ్రహ దాహమును నింపి నా రాతి హృదయమును కరిగించి, మృదువైన పండుగా మార్చివేసెను. తన కరుణా సముద్రములో నన్ను యుంచి నా కర్మలను తొలగించిన పరమజ్ఞాని అతను. చంద్రశేఖరుడై ప్రకాశవంతమైన గగన మార్గమున త్వరితముగా పయనించు వృషభవాహునిని స్తుతించి పాడి ఆడుదామా."

6. సఖీ! నాకు చేసిన మాయను నీ వెరుగుదువా? గోడలపై దైవ చిత్రములు గీయబడిన తిరుపెరుందురై ఊరి మహామహుని చూపుటకు గాను అడవి తీసుకువెళ్లి హరుని చూపెను. తన దివ్యపాదములను ఇవని చూపెను. అనుగ్రహమను తేనెని చవి చూపెను. 'శివపురం' యొక్క గొప్పతనమును చూపించి నన్ను తన బానిసగా చేసుకొన్నవానిని స్తుతించి పాడి ఆడుదామా!"
7. ఎడతెరిపి లేక సదా తనయందు తలంపు యుంచిన భక్తుని హృదయమందు తాను కొలువై యుండును. తలంచని వారి నుండి దూరముగా ఉండును. లోపల, వెలుపల ఉండి వాడు జీవులను పరిపక్వమొందించును. తల్లి వంటి సత్య స్వరూపము. తానే ఏడు లోకములలోనూ కలిసి, వాటి రూపములోనే యుండువాడు. అటువంటి వానిని స్తుతించి, పాడి, ఆడుదామా!"
8. "పాటలు రూపమున పరమాత్ముని గొప్పలు, మహిమలు మనకు మొదట కొంత అర్థమగును. చూచిన వన్నీ తన స్వరూపమే అను జ్ఞానము దానిని అనుసరించును. తిరుపెరుందురై వంటి క్షేత్రములలో వాని సన్నిధానములో దర్శించు భాగ్యము వలన మరింత పక్వము తరువాత వచ్చును. వాడు ఊర్ధ్వ అధో లోకమంతటికి తెలిసినంత గొప్పవాడనియు, త్రినేత్రమున్నవాడనియు, అన్నింటికీ మూలమైన నాయకుడని తెలియవచ్చును. వరదలు నిండిన మధుర నగరమున తలపై మట్టి తట్టె మోసి కూలి తీసుకొన్నవాడు, రాజు వద్ద బెత్తము దెబ్బల శిక్షతో వీపంతయు గాయపడినవాడు. వాని అందమైన శరీరమును స్తుతించి పాడి ఆడుదామా!"
9. "నెలవంక ధరించినవాడు, నాలుగు వేదములకు ఆదియైనవాడు, తిరుపెరుందురైలో కొలువైనవాడు, ముప్పిరి జంధ్యము ధరించినవాడు, అందమైన వృషభవాహనుడు, నీలకంఠుడు, ఎర్రతామర వంటి శరీర ఛాయ కలవాడు తెల్లటి విబూది ధరించినవాడు, అన్ని లోకములకు ఆదియైనవాడు, ఎల్లలులేని ఆనందమును సనాతన పద్ధతిలోనే తన భక్తులందరిని అనుగ్రహించువాడు. వాని గొప్పతనమును లోకము ఆశ్చర్యమొందునట్లు స్తుతించి పాడి ఆడుదమా!"
10. "ఊర్ధ్వలోక పాలకులైన దేవతలకు గొప్ప వైదికుడుగాను భూలోకము పాలించు రాజుకు గొప్పవాడైన, తేనెలాంటి తమిళభాషను పోషించు పాండ్యరాజుగాను, స్త్రీ, పురుష, సమతత్వమును బోధించు అర్థ నారీశ్వరునిగాను నొప్పారు, నేను కోరు తిరుపెరుందురైలో దర్శనమిచ్చి నన్ను ఆదుకొన్న అన్నామలైని స్తుతించి పాడి ఆడుదామా!"
(చెన్నైకి దక్షిణముగా 200 కి.మీ దూరములో నున్న తిరువన్నామలైలో కొలువైన శివుడు అన్నామలై లేక అరుణాచలేశ్వరుడుగా పిలువబడుచున్నాడు.)
11. "గిన్నెల వంటి వక్షోజములు గల ఉమాదేవి భాగస్వామి! తిరుపెరుందురై వాడా! తన

యందు శరణుపొందిన వారి హృదయమును ద్రవింపజేయువాడా! తన శక్తివలన పాండ్య దేశమంతటిని శివలోకము చేసినవాడా! గంగను జటాఝూటమున గలవాడా! (గంగాధరా) ఆనందస్వరూపా! తనను అర్పించుకొన్న వారి హృదయమున కొలువైన వాడా! నాయకా! అని స్తుతించి పాడి, ఆడుదామా!"

12. "కాటుక దిద్దిన కళ్లుగల కన్యలారా వినండి. దేవతలు తను ఒక్కొక్క జన్మమందును పరమాత్ముని వెతుకుచున్నారు. ఆ పరమాత్ముడు అర్హతలేని నన్ను ఈ జన్మలోనే ఆకట్టుకొని ఇక జన్మరహితమును నా కనుగ్రహించెను. నేను శాశ్వతముగా ఉన్నది వివరించెను. అన్ని వస్తువులు అతనినుండే ఏర్పడినవని, వాటంతటికీ విమోచనము నొసగునది కూడ తానే అని చూపించి అనుగ్రహించెను. అటువంటి పరమేశ్వరుని స్తుతించి పాడి ఆడుదామా!"

13. "గాజులు శబ్దించగ, చెవుల ఝుంకాలు ఆడగా, కురులందు ధరించిన పుష్పముల లోని తేనెను త్రాగవచ్చు తేనెటీగల ఝుంకారించుచున్న సమమున ఎర్రనైన శరీరచాయ గలిగి, తెల్లటి విబూది ధరించినవాడును, సన్నిహితులు కూడ ఎరుగలేని, గుర్తించలేని ప్రకృతి తత్త్వము గలిగిన వాడును, సర్వవ్యాపియునైన, భక్తులకు సత్యరూపిగాయున్నవాడును, ప్రేమలేని వారికి ఉండి లేనట్లున్న వాడునునైన ఆ తిరువైయారు (సంగీత బ్రహ్మం శ్రీ త్యాగరాజు స్వామి, జన్మస్థలము) నందు కొలువైన ఈశ్వరుని స్తుతించి పాడి ఆడుదామా!"

14. "పురుగు, ఏనుగు, మానవుడు, దేవతలుగా పెక్కు జన్మములతో, ఎన్నో జన్మములలో చిక్కి జన్మించి, మరణించి వచ్చిన నన్ను ఆకట్టుకొనెను. నా కర్మఫలితములను పోగొట్టు, అమృతానందము నొసంగి నన్ను తన వానిగా చేసుకొనెను. అటువంటి మహామహుని దివ్యపాదములను స్తుతించి పాడి ఆడుదామా!"

15. "దక్షుని యాగములో, చంద్రుని అరగదీసి, ఇంద్రుడు భుజములను విరచి, అగ్ని హోత్ర యాగకర్తయొక్క తలను ఖండించి దానినే హవిస్సుగా వేసి, ఆకాశమున వెళ్లు సూర్యుని పళ్లు పగలగొట్టి, మిగత దేవతలను చెరో దిక్కు పరుగెత్తునట్లు చేసి, ఈశ్వరుడు అమితానందము పొందెను. తోటలు, పచ్చికబయలు నిండిన తిరుపెరుందురై యొక్క మందార పుష్పమాల ధరించిన శివమహామహుని స్తుతించి, పాడి ఆడుదామా!"

16. "నా శరీరము, ప్రాణము, బుద్ధి పరమేశ్వరుని నుండే గలిగినవి. వాడు నా కళ్లలో కలిసి తేనె, అమృతముగా తీపినొసెగను. దేవతలు కూడ ఎరుగవలసిన గృహస్థ ధర్మమును నాకు చూపి అనుగ్రహించెను. ఉన్నతజ్ఞానమే స్వరూపముగా గలవాడును వాడే. అన్ని జీవరాశులందు ఉన్నతుడుగా ఉన్న వానిని స్తుతించి పాడి, ఆడుదామా!"

17. "అందమైన కొండజాతి పూలమాలను తలలో ధరించుదును. పరమేశ్వరుని ఎతైన భుజములను నిమురుదును. వాని దివ్య పాదములందు ఐక్యమై మహాపరవశముతో

మైమరచి పోవుదును. వాని ఎఱ్ఱనైన నోటికి, మనస్సుకి కరిగిపోవుదును, వెతుకుదును, వెతికి పులకరించి ఆనందించెదను. అగ్నిని ఒక చేతిలో పట్టుకొని శివతాండవము చేయు శివుని స్తుతించి ఆడి పాడుదామా!"

18. "చిలక పలుకులు వలె సున్నితముగా మాట్లాడు ఉమాదేవిని పొందిన శివుడు మహాప్రకాశవంతుడు. అతనిని ఎటులైన చూడగోరి బయలు దేరిన హరీ, బ్రహ్మలు చూడ శక్యముగాని జ్ఞాన స్వరూపుడు. తిరుపెరుందురైలో కొలువైన మహా కరుణామూర్తి. నా ప్రాణములో కలియు పరంజ్యోతిని అనుగ్రహించి, రక్షించు వాని దివ్యపాదములను స్తుతించి పాడి ఆడుదామా!"

19. "ముమ్మూర్తులకు పూర్వీకుడు, అన్ని అంశములకు మూలమైనను తాను అనాదియైన వాడును. అన్నింటికి ఆఖరి వాడును (లయకారకుడు) వాడే అగును. బంగారు చాయ గలిగిన వాడు. తిరుపెరుందురైలో కొలువైన స్వామి. అర్ధనారీశ్వరుడు. తిరువానైక్కావల్‌లో (జలమునందు) ఉద్భవించినవాడు. పాండ్యదేశస్తుడు. నా ఇష్టులకు ఇష్టుడు. అమృతము బోలిన వాడు. నాతండ్రి ఇటువంటి శివుని మనసార స్తుతించి పాడి ఆడుదమా!" (తిరువానైక్కావల్: తమిళనాడులోని తిరుచ్చినుండి శ్రీరంగమునకు వెళ్లు దారిలో (శ్రీరంగము నుండి 1 కి.మీ) నున్న తిరువానైక్కవల్ పంచభూతలింగములలో అప్పు (నీటి) అంశమైనదన్నట్లు, స్వామి నీటిలో ఉద్భవించి (స్వయంభువు) నీటిలో కొలువైయుందురు)

20. మన గొప్పలను ప్రేమలేనివారు, ఇతరులు ఎరగరు. వాడు తిరుపెరుందురైలో మాట్లాడు వాడు. జయభేరితో గుర్రముపై వచ్చి తన భక్తుల కష్టములను కొరతలను నివృత్తిచేసి, సద్గుణములను ప్రశంసించి తనలో చేర్చుకొనువాడు. కొన్ని జన్మల గుండా వచ్చు కాంక్ష వలయమును తొలగించువాడు. వాని గొప్ప గుణములను తలంచి ఈ లోక కాంక్షలను, బంధములను మనము పూర్తిగా విడచి వేయుదుముగాక! మనము అందులకు మహానందముతో పాడి ఆడుదామా!"

## 9. దివ్యబంగారు పొడి

కొన్నిబంగారు ముక్కలు, కొన్ని వాసనద్రవ్యములు, పసుపుకొమ్మలు కలిపి రోకలిలో దంచునపుడు కన్యలు పాడు జానపదపాటలను ఇచ్చట వివరించబడినది. ఇది బంగారుతో కలిపిన పసుపు రంగు పొడి. దీనిని దేవాలయ ఉత్సవములందు అతిముఖ్య అతిథులపై పుష్పములతో కలిపి జల్లి సువాసనలు ఏర్పడునట్లు చేయుదురు. ఇదొక మర్యాదపూరకమైన ఆహ్వాన ఆచారము. దేవుని సన్నిధానములోను జల్లుదురు. పవిత్రము, సువాసన, ఆహ్వానము, సన్మానము సమ్మేళనమునకు ఇదొక సూచన. కొన్ని తమిళ వాఙ్మయ గ్రంధములలో ఈ

బంగారుపొడిని కొత్త పెండ్లి కుమారుడు స్నాన మాచరించునపుడు నీటిలో కలిపి పెండ్లికూతురు, ఇతర కన్యలు జల్లినట్లుకూడ చెప్పబడియున్నది. ఈ బంగారు పొడి తయారు చేయుట కొరకు కన్యలు, ఇతర స్త్రీలు కలిసి రోకలితో దంచునపుడు పాడు పాటలు ఇచ్చట తమిళ ప్రాసలతో నిండి, అతి ఇంపుగా, దైవము కొరకు పాడినట్లు చెప్పబడియున్నది.

1. "మంచి ముత్యపుమాలలు, పుష్పమాలలను వ్రేలాడదీసి, మొలకలు మట్టికుండ (కొన్ని మంగళకరమైన కార్యములు జరుగునపుడు ఉదా: నోములు, హెూమములు, పెండ్లిలు, కుంభాభిషేకములు, ధాన్యములను పళ్ళెములో లేక కుండలో పోసి మొలకలు వచ్చునట్లు చేసి ఆ మొలకలను పూజకు వాడుదురు) ధూపకలశము, దీపములు పెట్టండి. శ్రీలక్ష్మికి, భూలక్ష్మికి, సరస్వతీదేవితో కూడ చేర్చి వర్ధిల్లమని పాడండి. చిత్తాదేవి, గౌరి పార్వతి, గంగ వచ్చి వింజామర వీచనీ. తిరువైయారు దైవమైన మన తండ్రిని పొగిడి సువాసన పొడిని దంచెదము."
2. "కొండజాతి పువ్వులమాల ధరించి, పొడవైన దివ్యజటాధారుడనైన మహేశ్వరునికి కదంబ (అన్నీకలిసిన) పొడిని దంచుదుము గాక! లేడికన్నుల వంటి కళ్లు గల కన్యలారా! వేగముగా వచ్చి కలిసి పాడండి. భక్తులు బయట కాచుకొని ఉండక లోపలికి ఆహ్వానించండి. గంతులేయండి, స్తుతించండి. మన నాయకుడును, నాట్యమాడువాడునైన ఈశ్వరుడు దేవితో కొలువైనవానిని, మనల్ని రక్షించువాడిని కీర్తించి స్వర్ణపొడిని (చూర్ణమును) దంచెదము గాక!"
3. "అందమైన తెల్లనైన విబూదిని ధరించి, నేలను అలికి, పవిత్రమైన బంగారు పొడిని జల్లి, నవధాన్యములు పరచి, ఇంద్రుడుకి తగిన కల్ప వృక్షమును నాటి, అన్ని చోట్లలో దీపమును వెలిగించండి. తోరణములు కట్టండి. ఇంద్రుడు, బ్రహ్మకి నాయకుడును, నారాయణకి తోడును, సుబ్రమణ్యునికి తండ్రియు, మాలాంటి వారిని ఆదుకొన్న ఉమాపతియునైన శివుని కొరకు ఈ స్వర్ణ పొడిని దంచుదుము గాక!"
4. "రోకలికి బంగారు కంకణము కట్టండి. రోలుకి పట్టుపావాడ (లంగా) కట్టండి. ప్రియమైన భక్తులు సుదీర్ఘముగా ఉండవలెనని ఆశీర్వదించండి. లోకమంతా పొగడు కాంచీపుర నాధుని, దేవాలయమును పొగడి పాడండి. విధిద్వందములను (జనన, మరణములు) నిర్వర్తించిన వానిని పాడి స్తుతించి బంగారుపొడిని దంచెదము గాక!"
5. "చిరునవ్వులు చిందు కన్యలారా! బ్రహ్మ, విష్ణు కుండదీపమును పట్టుదురు. ఇంద్రుడు మొదలైన దేవతల సమూహము, ఇతరులు మనకు ముందు దీపములు మోయుటకు మనము దారివ్వము త్రిపురమును కాల్చిన ధనుస్సు గలిగిన కాంచీపురనాధు (తిరువేంగబయుడైయాన్) డైన శివుని దేవాలయమును పొగడి పాడుదాము. పాడి, స్తుతించి స్వర్ణపొడిని దంచుదామా!"

6. "ప్రపంచమే రోలువలె, ఇచ్చట కొన్ని ఉన్న రోకళ్లు చాలవని మరికొన్ని కావలెనని పెద్దలు చెప్పుచున్నారు. ఈ కార్యక్రమములో పాల్గొన వచ్చిన భక్తులు నిలుచుటకు కూడ చోటు లేక ఈ లోకమున్నది. మనకి శుభమేర్పడుటకు గాను మనల్ని ఆదుకొని, తాజా పుష్పము వలె నొప్పారు ఆ దివ్యపాద పద్మములను మన శిరస్సుపై దాల్చుకొనుటకు అనుగ్రహించిన ఆ పరమేశ్వరుని మహిమలను స్తుతించి పాడి ఈ స్వర్ణ పొడిని దంచుదుము!"
7. "చేతి గాజులు, భుజదండలు కదిలి కదిలి శబ్దించుచున్నవి. భక్తుల సమూహము ఆనంద పరవశముతో 'శివ, శివ, శివా' అని విరామము లేక ఘోషించుచున్నారు. లౌకికులు మనల్ని చూచి 'వీరు ఉపయోగపడరు' అని హేళన చేయుచున్నారు. మనమూ వారి అజ్ఞానము చూచి నవ్వుదుము. తన మెత్తటి దివ్యపాదములకు పాదరక్షలు ధరించిన పార్వతీ దేవికి రక్షకుడైన, మేరుపర్వతమునే ధనుస్సుగా చేసుకొన్న ఘనుడైన పరమేశ్వరుని తలంచి, స్తుతించి, పాడి ఈ స్వర్ణపొడిని దంచెదము గాక!"
8. "మెరుపులు మెరయు వాలు కన్నులు గల యౌవ్వన కన్యలారా! చారలు గలిగిన గాజులు జ్వలించియు, ఎతైన వక్షోజములు ఉప్పొంగ, భుజములలో నుదుటలో విభూది చారలు మెరయునట్లు ఆ పరమేశ్వరుని నమస్కరించి వెళ్లుదము. తాజా పుష్పములవలె అందమైనవి అతని దివ్యపాద పద్మములు. ఆ దివ్యపాదములను చూపి, కుక్క కన్నా నీచమైన మనలను ఈ జన్మములోనే ఆదుకొనెను. ఆ మూల పురుషుడు, నాయకుడైన వాని గొప్పతనమును స్తుతించి పాడి, ఈ బంగారు చూర్ణము (పొడి)ను దంచుదుము గాక!"
9. " భూమి అంతయు రోలువలె, మేరుపర్వతము రోకలి వలె, సత్యమను పసుపును నింపి దంచుదుము. ఉన్నతమైన తిరుపెరుందురై స్వామి యొక్క ఎర్రనైన పాదపద్మములకు ఎడతెరిపి లేక స్తోత్రములు పాడుదాము. బంగారుతో చేయబడిన ఈ రోకలిని మన కుడి చేతిలో గైకొని తిల్లై నాథుని కొరకు (చిదంబరములో కొలువైన చిదంబరనాథునికి) బంగారు పొడి దంచుదుము గాక!"
10. ముత్యపు మాలలు ధరించిన వక్షోజములు కదిలియాడగా, తేనెటీగలు తేలియాడు పూలజడలు కదిలియాడగా, మనస్సు అంతయూ శివుడినందు లయమై ఉండగా, ఎర్రనైన మీనము (చేపవంటి) వంటి కన్నుల నుండి నీరు పారగా, కరుణాసాగరమైన శివుడుని స్తుతించి ఆడి పాడి బంగారు పొడిని దంచెదము!"
11. "అందమైన కన్యలారా! మీ ముత్యాల పళ్లు చంద్రుని వలె పాలవర్ణమున ప్రకాశించినపుడు, అందమైన పెదిమలు ఎర్రనై అదురనట్లు మహేశ్వరుడు మనల్ని ఆదుకొన్న విధమును పాడండి. మనల్ని తన భక్తులుగా చేసుకొన్నందుకు విరామము లేక పాడండి. మహామహుని వెతకండి. వెతికి చూడలేక పోయినచో కలతపొందండి. తరువాత వాడి

అనుగ్రహము పొంది సంతోషముతో పొంగి ఆడండి. వాని కొరకు మనము ఈ బంగారు పొడి దంచుదాము!"

12. "ఎర్రతామరవంటి ఎర్రనైనచారలు గల కళ్లను, బంగారు భుజ ఆభరణములతో, పడగ విప్పి ఆడు నాగుపాము బోలిన జఘనమును గల స్త్రీలారా! దేవతలందరికి అమృతంవంటివాడు నీల కంఠుడు, మాణిక్య నటరాజు నైన శివుడు మనల్ని కోరి ఆకట్టుకొనెను. వాడు అసత్యులకు అసత్యుడు. సత్యవంతులకు సత్యవంతుడు వానిని స్తుతించి మనమందరము బంగారు పొడిని దంచుదుము గాక!"

13. "చూచువారికి ఉన్నదో, లేదో అని విస్మయము గలుగునట్లు మెరుపు వంటి సన్నని నడుమును, పగడము వంటి ఎర్రనైన నోరు, నల్లటి కలువకళ్లను, తెల్లని ముత్యపు పళ్లను, సంగీతమువంటి సున్నిత పదజాలమును గల స్త్రీలారా! శివుడు నాకు అమృతము, నా తండ్రీ, తత్వరీతిగా పర్వతరాజు పుత్రిక (పార్వతి) కు భర్త. ఓ బంగారు ఆభరణములు ధరించిన కన్యలారా! వాని దివ్య పాదములను స్తుతించి పాడి బంగారు పొడిని దంచుదుము గాక!"

14. "ఎర్రని వస్త్రములు ధరించిన స్త్రీలారా! శంఖుగాజులు మ్రోగుచూ అందెలు శబ్దించగ, పొడవైన జడలయందు పూలమాలలు ఆడగా, ఎర్ర పెదిమలు అదరగా, వయ్యారులారా! ముందు వినండి. మనము మేరును, శివలోకమును పాడి స్తుతించెదము. గంగ గర్జించని! జటాధారణలో నున్న పాము బుసకొట్టనీ! మహాప్రేమానందముతో శివునికి మనమందరము కలిసి పాడి బంగారు పొడి దంచుదుము గాక!"

15. "అందమైన కలువ కన్నులుగల స్త్రీలారా! జ్ఞానము అను చెరుకురసము తేటయు, దాని వలన లభ్యమగు లాభములు, రుచిమారని తేనెయు, త్రిఫలముల రసముల (తమిళ వాఙ్మయ రసము; 'ముక్కని' = మూడు + కని; మామిడి, పనస, అరటి ఫల రసములు కలిసినది) రుచులు కలిసిన దైవము శివుడు. మన మనస్సున ప్రవేశింపగల నేర్పరి. జన్మరహితము చేసి ఆదుకోగల నటరాజుని స్తోత్రించి పాడి నమస్కరించుదుము గాక! మనము పాట పాడువైనములోనే బంగారు పొడిని దంచుదుము గాక!"

16. "దివ్యపాదములందు శరణు పొందుటకు మనము కూడ భక్తులతో కలిసి ఉప యుక్తులగుదుము. కలలో కూడ శివుని పాదములను చూడలేని దేవతలు, శివుడు మనకి దర్శింప అనుగ్రహించెను. బలమైన గొప్పదైన నందీశ్వరునితో కలిసి విజయ పతాకమును పొందియున్నాడు. తన నవ్వుతో సమూలముగా ముప్పురములను కాల్చి వేసిన ధీరుడు. వాని దివ్యనామములను విరామము లేక పాడి, బంగారు పొడిని దంచుదుము గాక!"

17. "తనయందే తేనెను ఇముడ్చుకొన్న గొప్ప కొండజాతి పుష్పమును పొగిడి, శివపురమును

పొగిడి, అందమైన జటయందు అమరిన నెలవంకను పొగిడి, రిషభ వాహనమును, ఈశ్వరుని కుడిచేతిలో అమరియున్న శత్రువులను భీతిల్లజేయు త్రిశూలమును పొగిడి, దేవతలను భూలోకులను రక్షించుట కొరకు విషమును గైకొన్న గొప్పవాడైన శివుని స్తుతించి పొగిడి బంగారు పొడిని దంచుదుముగాక!”

18. “సృష్టి కారకుడైన బ్రహ్మతలను త్రుంచి బంతాడెను. దక్షుని యజ్ఞములో సూర్యుని పంటిని పీకివేసెను. మదగజమును వధించి దాని చర్మమును ధరించెను. యముని కాలితో తన్నెను. త్రిపురములను కాల్చెను. కాని మనల్ని ఆకట్టు కొనెను. వీటినంతటిని తలంచి మనము పొగిడి, స్తుతించి మన మహామహుని కొరకు బంగారు పొడిని దంచుదము!”

19. “శివుడు ధరించిన గుండ్రనైన రుద్రాక్ష మాలను పొగిడి, బ్రహ్మముడి పుష్పమును పొగిడి, నెలవంకను పొగిడి, భక్తులువసించు అందమైన చిదంబరమును పొగిడి, తన భుజములలో, నడుముకు, కంఠమున అమరిన సర్ప ఆభరణములను పొగిడి, శివుని కొరకు ఈ బంగారు పొడిని దంచుదామా!

20. “వేదముగా, యజ్ఞముగా అయినవాడిని,
పరమాత్మగా, ప్రపంచముగా అయినవాడిని,
ప్రకాశముగా, చీకటిగా అయినవాడిని,
దు:ఖముగా, సంతోషముగా అయినవాడిని,
సగముగా, సంపూర్ణముగా అయినవాడిని,
బంధముగా, విమోచనముగా అయినవాడిని,
ఆదియుగా, అంతముగా అయినవాడిని స్తుతించి పాడి
ఆ మహా దేవునికి బంగారు పొడి దంచుదామా!”

(ప్రజలు జన్మబాధలు నుండి విముక్తి పొందుటకు, దుఃఖము వీడి సంతోషము పొందుటకు వేదములను దైవమే సృష్టించి, తానే వేదమయ్యెను. యజ్ఞము, ఇహ, పరలోకమలందును మహజ్జీవితమునకు ఉపయోగపడును. దైవమే యజ్ఞమై దాని ఫలితము తానైన వాడు.

నిలకడనైనది, నిలకడలేనిది ఈ ద్వందములో ఎప్పుడు, ఎచ్చట సర్వవ్యాపియై అన్నింటా సర్వరూపియై యున్నది పరమాత్మనే. నిలకడలేనది క్షరము, అసత్యము అదే ప్రపంచము. ఈ అసత్యమైన ప్రపంచములో నిలకడలేని భోగవస్తులను సృష్టించినదీ దైవమే. ఈ ద్వందములు వాడే.

ప్రపంచ జీవితమునకు ప్రకాశము, చీకటి రెండూ అవసరమైనట్లు జీవితములో జ్ఞానము, అజ్ఞానము, రెండూ గలవు. దైవము జీవులలో జ్ఞానముగా ఉండుటచే ప్రకాశకుడు అనియు, అజ్ఞానముచే కప్పబడిన వన్నీ ‘మాయ’ గా అదే కనువిప్పుని ‘చీకటిగా’ ను కొలువ బడినది!

సంతోషము, దుఃఖము ద్వందములు – దైవ నిర్మితములే. కారణములు మానవ కర్మలే అయిననూ దానిని కొనసాగించి ఏర్పరచేవాడు దైవమే. తన దివ్య సంకల్పబలమువలన తగ్గించవచ్చు, నిర్మూలింపవచ్చు! అది వాని అనుగ్రహమే!

స్త్రీ, పురుష రెండు శక్తులుగా కర్మించవలసియున్నది. ఈ ద్వందములలో స్త్రీ, పురుష సమ్మేళనమే సృష్టిగా మొత్తము ప్రపంచము కర్మచేయుచున్నది. శివుని ఒక భాగమే శక్తి అయినందున తాను 'సగముగాను' ఉమాదేవితో భాగస్వామియై 'సంపూర్ణము'గాను నొప్పారుచున్నాడు.

జీవులను జన్మబంధములో ఇరికింపచేసి, ఆ దైవమే మరలా ఆ కర్మల నుండి విముక్తి చేయుచున్నాడు. కావున 'బంధము' వాడే 'ముక్తి' నొసగునది వాడే. ప్రపంచము ఉత్పన్నతకు మూలముగా, 'ఆదిగా' యున్నవాడే, ప్రళయానంతరము లయకారకుడుగాను 'అంతముగా' కూడ ఉన్నాడు).

# 10. దివ్య రాజతుమ్మెద

తుమ్మెద తేనె కొరకు ఎట్లు పుష్పములను వెతకి, వెతకి వెళ్లునో అట్లే మనము కూడ ఈశ్వరుని దరి కొరకు వెతికి వెళ్లవలసిన వాళ్లమే. (తుమ్మెద వెళ్లు రీతిలో పద్యములు నిర్మించబడినది.)

1. "ఎర్రతామరలో కొలువైన బ్రహ్మయు, ఇంద్రుడునూ, అందమైన సరస్వతియు, నారాయణుడును, చంద్రసూర్య, అగ్నియు, ఇతర గొప్పవాళ్లందరూ, దేవతలందరునూ పరమేశ్వరుడుని సంపూర్ణముగా ఎరుగజాలరు. అటువంటి వృషభవాహనుడైన శివుని స్తుతించి పాడి ఓ రాజతుమ్మెద! నీ ఝుంకారము చేయుదువు గాక!" (పలురకములైన తుమ్మెదలలో, ఆకారములో పెద్దదియు, ఝుంకారములో గొప్పగా శబ్దించునదియునైన రాజతుమ్మెదను ఇక్కడ చెప్పబడినది.)
2. "శివుడు నన్ను ఆకట్టుకొనకుండినచో, నా పరిస్థితి ఏమగును? మనస్సు ఏమైపోవును? బుద్ధి ఎట్లుండును? చిత్తభ్రమణము చెందిన బ్రహ్మ యొక్క కపాలములో భిక్ష భోజనము చేయు చంద్రశేఖరుని స్వరూపమును స్తుతించి ఓ రాజతుమ్మెద పాడవలె!"
3. "ఓ రాజతుమ్మెదా! భూలోకములో నున్న పుష్పములలో గల తేనె చుక్కలు త్రాగకు! దివ్య నాట్యమాడు (నటరాజు = శివుని) పరమానంద తేనెలో లయమై వానిని స్తుతించు రీతిలో ఝుంకారము చేయుదువు గాక!"
4. "కన్నప్పుడు (శ్రీకాళహస్తి భక్త కన్నప్ప) తన గొప్ప సాహస చర్యతో, ప్రేమతో ఉచ్ఛస్థితి పొందెను. నేను ప్రేమ ఆరంభములోనే ఉన్ననూ, నాతండ్రి నన్నుకూడ ఆకట్టుకొనెను.

వాడు కరుణామయుడు. ఓ రాజ తుమ్మెదా! నీవు వాని దివ్యపాద పద్మములపై వ్రాలి ఝుంకారము చేయుదువు గాక!"

5. "తుమ్మెదా! దేవతలలో అతను పెద్ద, ఇతను చిన్న అని భూలోకములో నున్న సత్య మెరుగని వారు దేవతలను భగవంతుని (ఈశ్వరుని) స్థానములో ఉంచి మాట్లాడుదురు. నా బంధములను విడిపించి నన్ను ఆదుకొన్న జ్ఞాన దేవుడైన పరమేశ్వరునికే నీవు ఝుంకారము చేయుదువు గాక!"
6. "ఆర్జించిన సంపద, పొందిన భార్య, కన్నబిడ్డలు, పిలువబడిన కులము, నేర్చిన విద్య, జన్మ, మరణములు వీటి కారణములుగా ఏర్పడు మతిభ్రంశము మహా దు:ఖమును ఏర్పరచుచున్నది. "ఈ మనోభావములను వీడితే జన్మదుఃఖములను వీడి సుఖ పడుదువు" అన్న సత్యజ్ఞానమును తెలిపి నాకు జ్ఞానమును బోధించిన జ్ఞానరూపియైన శివుని స్తుతించి ఝుంకారించు తుమ్మెదా!"
7. "అమృతమువంటి శంకరుని చిత్తములో ఇసుమంత తలంచినచో ఏమిటి కొరతగును! ఏమీ లేదు. అక్షరుడైన శివుని పాదములు నేను మరువ జాలను. వానిని తలంచని పాపులను చూచుటకు కూడ నేను సమ్మతించను. ఉన్నతుడైన శివుని పాదముల వద్దకు నీవెళ్లి ఝుంకారించు తుమ్మెదా!"
8. "ప్రపంచము ఏకత్వమైన దైవమునుండి ఎన్నో శాఖలుగా విస్తరించియున్నది. కుక్క వంటి నన్ను పల్లకిలో ఎక్కించి మంచివాడిగా అందరి భక్తుల నడుమ ఉంచెను. వాడు నా తండ్రి, నా తల్లి, తల్లికి తండ్రి. నీవా అక్షరుడవైన శివుని స్తుతించి గీతాలాపము చేయుము తుమ్మెదా!"
9. "కారణాకరణములకెల్ల అతీతుడు ఆ నీలకంఠుడు. వాని దివ్యపాదములందు శరణు పొందిన నన్ను, నా జన్మ, మరణ మత్తు తొలగించెను ఓ రాజ తుమ్మెదా! నీ వాతని దివ్య పాద పద్మములదరిచేరి ఝుంకారించెదవు గాక!"
10. "నేను రోగస్థుడనై వృద్ధుడనై, నడవలేక ఆవుదూడవలె నున్నాను. సంపద మోహములో కుక్కవలె నేను అనుగ్రహ సంపదను గ్రహించ లేక పోతిని. అయిననూ జ్యోతి స్వరూపుడైన ఆదైవము నన్ను తల్లినిపోలిన కరుణతో ఆకట్టుకొనెను. ఓ రాజతుమ్మెద! చల్లని జ్యోతి స్వరూపుడైన ఆ మహమహునికై (శివునికై) ఝుంకారము చేయుదువు గాక!"
11. "నన్ను వంచకుడు, కఠిన మనస్కుడు, కఠిన చిత్తుడు అని తలంచి చీదరించి విడచివేయక, నా రాతి మనస్సును కరుగునట్లు చేసి నన్ను ఆదుకొన్న ఆ తిల్లై చంద్రశేఖరుని, వాని స్వర్ణ పాద పద్మములను స్తుతించి ఓ రాజ తుమ్మెదా! సంగీతము వినిపింతువు గాక!"
12. "కుక్క వంటి ఈ అల్పుని తన దివ్య పాదములను స్తుతించి పాడునట్లు చేసిన నాథుడు వాడు. పిశాచ గుణములు గల నా తప్పులను సహించు విశాల హృదయుడువాడు. నా

సేవలను తాను కించపరచక అంగీకరించెను. ఓ రాజతుమ్మెదా! తల్లిలాంటి వాని దరిచేరి నీ సంగీతమును వినిపించుము."

13. "శివుని యందు నాకు ప్రేమ లేదని నేను, తను మాత్రమే ఎరుగుదుము. కాని తను నన్ను ఆదుకొన్నది ప్రపంచమంతటకీ తెలుసును. ఇదే అతని కరుణ. నా నాయకుడు తానే వచ్చి నాతో చేరెను. ఓ రాజతుమ్మెదా! ఆతనికి నీ సంగీతమును వినిపించుదువు గాక!"

14. ప్రపంచమునకు మూల విత్తుగాను అతీతుడుగాను ఉన్నవాడు. ఉమాదేవితో కొలువైనవాడు. అనుగ్రహియించి ఆదుకొన్నవాడు వేదమును చదువు బ్రాహ్మణుడు వాడే. ఓ రాజతుమ్మెదా! నీవు వానివద్ద కెళ్లి పాడి ఝుంకారించుదువు గాక!"

15. "శివం, శక్తిగా వచ్చిన మహాదేవుడు నన్ను ఆదుకొన కుండినచో నేను నాశనమైయుందును. నా చిత్తము చెడి నశించియుందును. ఆకాశము, దిక్కులు, సముద్రముగా కొలువైయున్న ఈశ్వరుని యొక్క దివ్యపాదముల దరికివెళ్లి ఓ తుమ్మెదా! ఝుంకారము చేయుము."

16. "మనస్సుకందని శివుని, శివజ్ఞానముతో చూడదగును. మనము తలంచినంత మాత్రమున సుఖపరచగల ఎల్లలు లేని కరుణ వాడిది. నన్ను విడిగా వశపరచుకొన్న ఆ నాయకుని వద్దకు వెళ్లి ఓ తుమ్మెదా! పాడుము."

17. "శాశ్వతము లేని సంపదను శాశ్వతమని ఎల్లపుడు తలంచి ప్రయోజనము లేక పోయినవాడిని నేను. నన్ను వాడు మార్చివేసెను. ఓ రాజ తుమ్మెదా! నీవు వాని వద్దకు వెళ్లి 'ప్రియతమా, చంద్రశేఖరా" అని స్తుతించి ఎర్రటి పుష్పములలో ఝుంకారించునట్లు నాదముతో లేపుదువుగాక!"

18. "ఉమాదేవి పట్టు వస్త్రము, స్వర్ణకమ్మలు, నుదుట తీర్చిదిద్దిన విభూది, పచ్చటిచిలక, గాజులు ధరించగా, ఈశుడు చర్మవస్త్రము, కుండలములు, శరీరమంతా విభూది, త్రిశూలము ధరించి నిలుచున్నారు వీరిరువురి స్వరూపముల దరికి వెళ్లి ఓ రాజ తుమ్మెదా! దర్శించి ఇంపైన నాదమును పలికించుము."

19. వంచకుడు, కీడు చేయువాడు, అల్పగుణము గలవాడు అని తలంచి నన్ను త్రోసివేయక, అనుగ్రహ దాతయైన శివుడు నా హృదయమును కొంచెము, కొంచెముగా తన వశము చేసుకొనెను. నా మనోఃవేదనలన్నియూ ఆతని వద్ద తేటతెల్లముగా తెలియజేయ ఓ రాజ తుమ్మెదా! నీవాతని వద్ద ఝుంకారము చేయుము."

20. "శివుని కొలవలేక నారాయణుడు బ్రహ్మ చిత్తభ్రంశమై తబ్బిబ్బులై నిలబడిరి. నేను, కుక్కకు మేలైన ఆసనము దొరికినట్లు చాలా గొప్ప స్థానము లభించినదని మహానందము పొందుచున్నాను. నాకు తగిన జ్ఞానమొసగి ఉపకరించిన ఆ మహామహుడు ఈశ్వరునికి ఓ తుమ్మెదా! నీవు ఝుంకాము చేయుదువు గాక!"

# 11. దివ్య తెళ్లేణము

## (స్త్రీల పాటలు, ఆటలు)

స్త్రీలందరుకలిసి, జట్లుగా కూడి పాటలు పాడుచు ఆడుట. ఇది 'తిళ్లేణము' అను తమిళ వాఙ్మయ పదము (ఒక నాట్య విధానము) పాడుచున్న పాటలు దైవము గురించి కావున దైవత్వము నిండినదిగాను, దైవమును కీర్తించి పాడునదిగాను, ముఖ్యముగా తమిళ ప్రాసలతో నిండి అతి మధురముగా అమరియున్నది.

1. "శివుని దివ్య పాదములను చూడగోరిన నారాయణుడు వరాహావతారము పొంది భూమిని త్రవ్వి అధఃపాతాళమునకు వెళ్లి, చూడ శక్యముగాక, వెనుదిరిగి పోయెను. అటువంటి మనము చూడదగినట్లు శివుడు ఆచార్యుడు వలె వచ్చి ఆకట్టు కొనెను. నిరాకారుడును, అరూపుడు, అయిననూ వాని దివ్యనామములతో స్తుతించి పాడి చప్పట్లు కొట్టుదుము గాక!"
2. "తిరుపెరుందురైలో కొలువైన పరమేశ్వరుడు నా జన్మ పీడలను తొలగించెను. దాని తరువాత (ఆతను తప్ప) మరెవరిని నేను చూడగోరలేదు. రూపియై, అరూపియై, అంతర్, బాహ్యములో నుండి అనుగ్రహించు చున్నాడు. వానికి తగిన తిరువారూర్ (శ్రీత్యాగబ్రహ్మం పుట్టిన ఊరు) దివ్యస్థలమును ప్రశంసించి, పాడి చప్పట్లు గొట్టుదుము గాక!"
3. "నారాయణుడు, చతుర్ముఖుడును చూడలేనిదానిని శివుడు మనల్ని దర్శింపజేసి, ఆదుకొని, మనస్సు కరుగునట్లు చేసెను. ఇది లోకులకు పూర్తిగా విస్మయము పరచినది, కావున అటువంటి వానిని స్తుతించి, పాడి చప్పట్లు కొట్టి ఆడుదామా!"
4. "పనికి రాని దేవతలకు కూడ దొరకని దైవానుగ్రహము, జన్మమాయ నుండి నన్ను రక్షించి తన ఆత్మజ్యోతిని శివుడు నా కనుగ్రహించెను ఆ అనుగ్రహముతో నా కర్మలు కీడు తొలగినవి. ఆ శివతత్వమును స్తుతించి, పాడి, చప్పట్లు కొట్టుదామా!"
5. "ఊర్ధ్వలోకములో నున్న వారికి దర్శనమునకు నోచని శివుడు మానవులను సంతోషపరచనెంచి, మానవ రూపము దాల్చి భూమండలము వచ్చెను. వాని అనుగ్రహము నిండిన కడకంటి చూపుతో జన్మత కర్మలు తొలిగినవి. శివుడు నా హృదయములో ప్రవేశించినందున మహానందము పొందితిమి కావున, వానిని స్తుతించి పాడి ఆడుదామా!"
6. "పడగ విప్పి ఆడు పాముని నడుముకు ఆభరణమువలె ధరించి, ఉమాదేవితో ఈ లోకమునకు వచ్చి మనల్ని ఆదుకొనెను. దానిని వివరించి చెప్పుటకు మాటలురాక తబ్బిబ్బులగుచున్నాను. అంతర్జ్యోతి ప్రజ్వలించుచున్నది. కన్నీరు అలలై పొంగుచున్నది. దీనిని మనము పాడి తిళ్లేణము కొట్టుదుము గాక!"
7. "పైలోక వాసులకు దొరకని శివుని దివ్యపాద దర్శనము నన్ను కరుణించి తన దివ్య

పాద పద్మములను నాతలపై యుంచి నన్ను మనస్ఫూర్తిగా ఆదుకొనెను. నేనట్లు పొందిన దైవత్వము నెంచి పాడి, స్తుతించి ఆడుదామా!"

8. "గాలిపటము వలె తిరుగుచున్న ఈ శరీరము జననము, మరణము పొందుచున్నది. సుకర్మలు, దుష్కర్మలు లకు తగిన ఫలితము ఉండును. అట్లుగలుగు భయమును పోగొట్టి, నేనెప్పుడు తనని మరచిపోలేని విధముగా నన్ను ఆదుకొనెను. అటువంటి మహాత్ముని గొప్పతనమును స్తుతించి, పాడి, ఆడుదామా!"

9. "మెరుపుతీగవంటి నడుము, ఎర్రటి పగడపునోరు, తెల్లముత్యపు పళ్లువరుస గలిగిన కన్యలారా! రాతినుండి నార తీయునట్లు (చాలా అరుదైనది, కఠినమైనదని అర్థము) తన దివ్యపాదములందు నన్ను శరణు పొందినట్లు చేసి ఆదుకొనెను. ఆ మహామహుని స్తుతించి, పాడి, ఆడుదామా!"

10. "ఆ త్రినేత్రుని కాలి అందె శబ్దమును, దివ్యపాదములను దేవతలు తమ కలలో కూడ చూచియుండరు. వాడు ఉమాదేవితో భూలోకముకువచ్చి నాకు నిజరూపము ప్రదర్శించెను. ఆ అనుగ్రహదర్శనము చూచి నా కన్నీళ్లు ఏరులై పారగ, వానిని స్తుతించి పాడి ఆడుదామా!"

11. "ఈశ్వరుడు నన్ను తనవానిగా చేసుకొన్నపిదప లోకములో నున్న వారందరు, పక్కవారు, చుట్టములు, అను భేదము నశించినది. లౌకిక కాంక్ష వీడెను. నా మాటలు వానికి ప్రశంసలైనవి. నా చేష్టలు వానికి సేవగా మారినవి. ఈ గొప్పను మనము స్తుతించి, పాడి, ఆడుదామా!"

12. "ముక్తి పొందుటకు తపస్వులు చాలా పాట్లుపడిరి. జ్యోతిస్వరూపుడైన శివుడు ఏనుగును అనుగ్రహించినట్లు నన్ను కూడ ఆదుకొనెను. మహాకరుణా సముద్రము పొంగునట్లు చేసిన ఆ జ్యోతి స్వరూపుని గొప్పలను పాడి, స్తుతించి, ఆడుదామా!"

13. చంద్రమండలము, అధోలోకము, ఊర్ధ్వలోకము వేరే లోకములకు పోయి చేరిపోకుండా నన్ను ఆదుకొన్న శివుని న్యాయ గుణమును పాడి, స్తుతించి ఆడుదామా!"

14. "హరి, బ్రహ్మ, మిగత దేవతలు ఎరుగలేనిదియు, గొప్ప గ్రంథములు వలన కూడ ఎరుగలేని సూక్ష్మమైన వాడు శివుడు. వాడు నాయందు కరుణ ఉంచి, నాలో ప్రవేశించి నా మనస్సును ద్రవింపజేసెను. అటువంటి వాని తత్త్వమును పాడి, స్తుతించి, ఆడుదామా!"

15. శివయోగముతో హృదయము ద్రవించి, శరీరము పులకించి, శాంతి పొందుచున్నది. పరమేశ్వరుని ఎనలేని కరుణను అనుభవించి పరమానందము చెందుదుము. ఆ కైలాసనాధుని స్తుతించి మనము పాడి ఆడుదామా!"

16. శివుడు ఎప్పటికీ నూతనుడే. దేవతలే స్తుతించ దగ్గ పునీతుడు, పిచ్చివాడు. తిరుపెరుందురైలోనూ, చిదంబరములోనూ కొలువైన వాడే నాకు జన్మ రహితము చేసిన

తండ్రి. వాని దివ్య పాదములు నా హృదయములో ప్రవేశించినందుకు పాడి తిళ్లేణము ఆడుదామా!

17. "అజ్ఞాన మతబోధనలు, విలువ లేని శాస్త్ర పఠనాదుల వంటి సముద్రములో పడి కొట్టుమిట్టాడుతూ, మనో:కలవరము చెందిన నన్ను నా కలతను పోగొట్టి, తన దివ్యపాదముల చెంత నాకు అనుగ్రహించిన ఆ మహామహుని దివ్య చర్యను స్తుతించి పాడి తిళ్లేణము ఆడుదామా!"

18. "ఆకాశము, వాయు, అగ్ని, నీరు, భువి అన్నియూ ప్రళయములో లయమగునపుడు పరమేశ్వరుడు మాత్రము మిగిలి యుండును. వాని గురించి నా శరీరము, ఆత్మ, పంచేంద్రియములు, అంతఃకరణములన్నియూ శివుని యందు లయమగుటను పాడి, స్తుతించి ఆడుదామా!"

19. "ఏడు ఊర్ధ్వలోకములు, ఏడు అధోఃలోకము నున్నవారు చూచి ఎరుగని ఆదిమూలమైన శివుడు నాకు కళ్ల ముందు ప్రత్యక్షమై దర్శనమిచ్చెను. వాని గొప్పతనమును మనమందరము పాడి, స్తుతించి తిళ్లేణము కొట్టుదామా!"

20. "శైవ భక్తకోటిని స్తుతించి, ఉమాదేవి రత్నాభరణ అలంకారమును స్తుతించి, శివుడు ధరించిన కొంగ రెక్కను స్తుతించి, శివుడు కాలకూట విషమును త్రాగిన త్యాగశీలమును స్తుతించి, తిళ్లైలో (చిదంబరములో) నటరాజునిగా నాట్యమాడి శబ్దించిన వైనమును స్తుతించి మనమందరము తిళ్లేణము కొట్టుదామా!"

# 12. దివ్య ప్రశ్నోత్తరములు

స్త్రీల ఆటలలో ఇది ఒక విధమైనది. పాటల ద్వారా ఆక్షేపణ తెలపడము ఆ ఆక్షేపణకు జవాబు లేక కారణము చెప్పడము. ఇరువురు స్త్రీల మధ్య పాటల రూపమున జరుగు ప్రశ్న, జవాబుల వరుసలు. దీనిలో శ్రీ మాణిక్యవాచగర్ దైవము యొక్క లీలలను, మహిమలను, దారణలను, అపోహలను, దివ్యత్వము గురించి సాధారణ ప్రజలకు అర్థమగునట్లు తన పాటల రూపమున ఇంపైన తమిళ ప్రాసలతో నిండినదై పద్యములను కూర్పు చేసియున్నారు.

1. "ధారణ విబూది. ఆభరణమేమో పాము, మాటలో నాలుగు వేదముల కూర్పు. వీటి మధ్య ఏదైన పొత్తు గలదా? చూచావే సఖీ!
కలదు. ప్రకృతిగాను జీవరాశులన్నింటిలోనూ, జ్ఞానసారముగా వెలుగొందు వాడే దైవము."
(దైవము ముఖ్యముగా, నిజముగా ప్రకృతి రూపమే. మానవుడు తన కల్పనకు తగినట్లుగా కనిపించిన వన్నింటినీ దైవమునకు అలంకరించి అందము చూచెను.)

2. "అన్నింటికీ ఈశుడే అన్నట్లు శివునికి కుట్టిన వస్త్రమో మరియు దరించుటకు ఓ మంచి కౌపీనము (గోచి) కూడ దొరక లేదా? చూచావే సఖీ!

ఎందులకు లేదు? ఉన్నది. శాశ్వతమైన కళలన్నింటిని తన వస్త్రముగాను, ఆత్మ జ్ఞానమును మడిచి, చుట్టి కౌపీనము గాను ధరించి యున్నవాడు.

3. ఉంటున్నదేమో శ్మశానము, ధరించునది క్రూరమైన పులి చర్మము తల్లీతండ్రీ లేని ఒంటరి వీడు ఒక దైవమేనా? చూచావే సఖీ!
అన్నియూ నశించవలసినవే. నశించి, కాల్చబడి, భస్మము కావలసినవే. అదే ఆఖరిచోటు శ్మశానము. అహంకారము, క్రూరము అణచుటకే పులిచర్మవస్త్రము. జనన, మరణములు ఉంటే కదా తల్లియు, తండ్రియు! ఒంటరియే! కాని తాను కోపగించినచో అఖిల బ్రహ్మాండము పొడిపొడిగా మారిపోవును"
4. "బ్రహ్మ, మన్మథుడు, యముడు, చంద్రుడు అందరినీ దండించి అణచి వేసెను. వారందరికి తగిలిన దెబ్బల మచ్చలు శివునికి ఏర్పడిన మారని అపనిందలు కదా? చూడవే సఖీ!
దైవమునకు త్రినేత్రములు గలవు, మూడవది జ్ఞాన నేత్రము. దేవతలను దండించుట వలన వారి వారి తప్పులను తాను తెలియపరచెను. అంతేకదా!"
5. "తనని గౌరవించక యజ్ఞము చేసిన దక్షుని తలను శివుడు ఖండించెను. యజ్ఞము యొక్క యజమానుని, దేవతల సమూహమును నాశనము చేసినది ఏమి న్యాయమే! చెప్పవే సఖీ!
దక్షుని తలఖండించి మేకతల ఉంచినది, దేవతలను అణచినదన్నియూ వారివారి విధి ప్రకారమే జరిగినది."
6. "నారాయణుడు, బ్రహ్మ ఇరువురు శివుని శిరస్సు, పాదము చూడగోర, శివుడు బ్రహ్మాండ జ్యోతిరూపము దాల్చినది ఎందులకే సఖీ!
బ్రహ్మాండమునకు ఊర్ధ్వముగాను, బ్రహ్మాండమునకు అధో:తలముగాను, ఆదియు అంతములేని బ్రహ్మాండ లింగాకార జ్యోతిగా ప్రజ్వలించినది, నారాయణుడు, బ్రహ్మలో ఎవరు పెద్ద అను అహంకార భావమును అణగ ద్రొక్కుటకే మరి!"
7. పర్వత పుత్రియైన ఉమాదేవికి తన శరీరమునందు సగము భాగమును ఇచ్చిన శివుడు, గంగను మాత్రము తన తలపై అమర్చెను ఎందులకే సఖి!
గంగను తిన్నగా ప్రవహింపజేసినచో ప్రపంచమంతయూ నిండి పాతాళమునకు దిగి వృధా అగును దానిని అడ్డగించుటకే గంగను తన జటయందుంచి సక్రమముగా ప్రవహింపజేసెను.
8. "ఉప్పొంగు పాలసముద్రములో ఎగిసిపడి ఉద్భవించిన హాలాహలము విషమును తానేల (శివుడు) త్రాగెనే సఖీ!
మానవులు వెళ్లగ్రక్కు విషమును అమృతముగా మార్చి ఇచ్చునదియు, తను జీవరాశుల యొక్క యోగ క్షేమమును గోరి చేయు ఉపకారమే మరి!"

9. "దక్షిణామూర్తిగా ప్రసిద్ధి పొందిన తిల్లై చిదంబరనాథుడు స్త్రీని ఒక భాగమున ఉంచిన పిచ్చివాడు, ఎట్లు శుద్ధ శివుడగును చెప్పవే సఖీ!
వాని సంకల్పముతో అట్లు కాకున్నచో ప్రపంచమేది? సృష్టి ఏది? జీవరాసులేవి? శివ, శక్తి పరిణయము కాకున్నచో భూలోకవాసులు మనస్సు లేక చనిపోయిందురే!"

10. "ఆది అంతము లేని మహామహుడు అల్పుడైన మనల్ని పరమానందమను మహావరదలో ముంచెత్తెనే చూడవే సఖీ!
అట్లున్ననూ వాని దివ్యపాదములను దర్శించు భాగ్యము ఆ దేవతలకు కూడ దొరకని ఒక అపూర్వ వస్తువైనది కదా!"

11. "సఖీ! ఇది ఏమీ వేళాకోళము? నరము, ఎముకలు, పుర్రె చిప్పలు మాల వలె వేసుకొన్నది, కాక పూర్తి అస్తిపంజర గూటిని తన భుజములపై వేసుకొని మోయుచున్నాడే! చూచితివా?
ఇది గర్వభంగమైన పిదప నారాయణుడు, బ్రహ్మలు అంతమును చూపునది. ఈ గూడులు వారివని చెప్పక చెప్పునదే అగును." (ఈ శరీరము చెదలు పట్టు గూడు. కావున నీవు ముందే శివుని పొందుము అన్న తత్వమును చెప్పునదే!)

12. "పులి చర్మము వస్త్రముగాను, పుర్రె చిప్పను భిక్ష పాత్రగాను, శ్మశానమును నివసించు స్థలముగాను చేసుకొన్న వాడిని ఎవరు సొంతము చేసుకొందురే సఖీ! చెప్పుమా!
నారాయణుడు, బ్రహ్మ, ఇంద్రుడు మున్నగు వారందరు వాడికి బానిసలే సుమా!"
(నశించులోకమిది! ఇందులో దేనికొరకు, ఎవరికొరకు సొంతము చేసుకోడానికని? అని నొక్కి వక్కాణించు చున్నారు. శ్రీ మాణిక్యవాచగర్.)

13. పర్వత పుత్రియైన ఉమాదేవి కఠిన తపస్సు చేసి శివుని వివాహమాడెను, లోకులు గుర్తించునట్లు హోమ గుండము చుట్టు తిరిగి పెండ్లాడెనే ఏలయే సఖీ!
లోకమునకు తెలియునట్లు అగ్ని గుండమును ప్రదక్షిణము చేసి, పెండ్లాడకుండా ఉన్నచో ప్రపంచము యొక్క సంస్కృతి, ఆచారశాస్త్ర గ్రంథములు తారుమారై ఉండునే!"

14. "తేనెలొలుకు పలుకులు, గాజుల శబ్దించు నట్లు నాట్యము చేయు చంద్రశేఖరుడు (శివుడు) కాళీమాతతో కలిసి ఏల నాట్యమాడినే? సఖీ!
అట్లు కలిసి నాట్యము చేయకుండినచో భూమంతయు కాళీల సమూహమును, మాంసపు ముద్దలు నిండిన త్రిశూలములే ఆహారమయి యుండును," (ప్రపంచమును శూన్యమయముగాక ఆపినది శివతాండవమే!)

15. "మద గజము, గుఱ్ఱము, రథము, లన్నియూ ఉండగా శివుడేల వృషభ వాహనుడయ్యెనే సఖీ!
శివుడు త్రిపురములను తన నవ్వుతో కాల్చినపుడు నారాయణుడే వృషభము రూపమున వచ్చి శివుని మోసెను."

(హరి, హరుడు ఇద్దరు ఒక్కటే అన్న తత్వమును బోధించునదే.)

16. ఒకప్పుడు శివుడు మఱ్రిచెట్టు మొదల కూర్చుండి పలువురికి నాలుగు వేదములను బోధించెను ఏలయే? సఖీ!

లోక నడవడిక ధర్మమును తాను బోధించిననూ, త్రిపురములను తాను తన నవ్వుతో కాల్చిననూ సర్వవ్యాపియు, లయ కారకుడునియు, అన్నిటికీ అతీతుడనియు నిరూపించుకొనెను.

17. ఆకాశములో నాట్యమాడి, తన ఆకలికి భిక్షతో భోజనము చేయు శివుడు ఎట్లు అగ్రదేవుడనబడునే? సఖీ!

అన్ని బ్రహ్మాండములకు నాయకుడు వాడేకాదా! తానెంతగానో నిరాడంబరుడై, త్యాగశీలియై తన ప్రపంచ కర్తవ్యములను క్రమానుసారముగా జరుగునట్లు చూచు చున్నాడే!

18. "చాలా గర్వియైన రాక్షసుడు జలంధరుని చక్రాయుధముతో చంపిన శివుడేల ఆ చక్రాయుధమును నారాయణునికి ఇచ్చెనే? సఖీ!

శివుని, పూలతో పూజించుతూ వచ్చుచున్న నారాయణుడు ఒకప్పుడు ఒక పుష్పము తగ్గినదన్న కారణముగా తన కంటినే పీకి పుష్పముగా అర్చించెను. ఆ కారణముగా చక్రాయుధమును శివుడు నారాయణునికిచ్చెను!"

19. "మచ్చలతో కూడినదైన పులిచర్మము తన వస్త్రము హాలాహల విషము తాను తాగినది. ఏలయే? సఖీ!

ఏది ధరించిననూ, ఏది భుజించిననూ తన గొప్పలు తనకు తెలియని వాడు శివుడు. తన గొప్పలు ప్రశంసలు తనకే పూర్తిగా తెలియవు,"

20. "ధర్మము, సంపద, సుఖము, ఇల్లు అను భావనను మఱ్రి చెట్టు క్రింద కూర్చొని విశదీకరించెను శివుడు. ఏలయే? సఖీ!

ఎచ్చట నుండి విశదీకరించినూ లౌకిక ధర్మమునకు జీవితము కట్టుబడినదే కదా! విశదికరించ కుండినచో లోకమునకు పురుషార్థములనబడు లౌకిక ధర్మము తెలియక పోయుండునే!"

## 13. దివ్య కలువ పూవులు

గుమిగూడిన స్త్రీలు ఉదయమున లేచి దేవాలయముల, గృహ అవసరములకు పుష్పములను కోయుటను శ్రీ మాణిక్యవాచగర్ చూచెను. ఒకపని చేయునపుడు లౌకికులు దైవ స్మరణతో చేయుట ఉత్తమమని తలంచిన తను, ఆ గుమిగూడిన స్త్రీలతోనే దైవ సంకీర్తనలు, స్తుతులు పాడునట్లు చేసి పద్యములను అమర్చెను.

1. అంతములేని, తనకు తానే సరి సాటియైన దైవము తన దివ్యపాద పద్మములను నా శిరస్సు పై నుంచి అనుగ్రహించెను. బంధుత్వము యొక్క తత్వమెరిగి దాని నుండి ఎడబాసిని. జల సంపదతో నిండిన చిదంబరనాథుడు జన్మమను సాగరమునుండి దరి చేర్చు నావ వంటివాడు. వాని మహిమలను స్తుతించి, పాడి, పుష్పములు కోయుదమా!"
(ప్రపంచము మాయకు వశమైనది, శివజ్ఞానము ఏర్పడినచో మాయ తనంతటతానే పిందెనుండి పుష్ప రేకులు ఎండి పడి పోవునట్లు మరిగిపోవును.)
2. హృదయ కమలమున నుండి పరమాత్మని ఎరిగి, అనుభవించి గ్రహించునపుడు లౌకిక బంధములు ఉన్న చోటు తెలియకుండా పటాపంచలగును. తిరువిడైమరుదూర్ నాథుడే మనకు తండ్రి, తల్లియై మన కాంక్షలను తొలగించి ఆదుకొన్నవాడు. వాని స్తుతించి పాడురీతిన పువ్వుల కోయుదుమా!"
3. కుక్కకన్నా అధములమైన మమ్ము ఒక గౌరవమైన వారిగా తలంచు ఆ పరమేశ్వరుడు, తల్లికన్నా ఎక్కువగా కరుణ చూపెను. వాని అనుగ్రహ జ్ఞానముచే మన పాపములన్నీ తొలగిపోయినవి. అటువంటి జ్ఞానరూపిని తలంచి స్తుతించి పూవులు కోయుదుమా!"
4. "చిదంబర రారాజునైన శివుని కొలువక మాయాశక్తిచే ఆడించబడిన దక్షుడు, సూర్యుడు, చంద్రుడు, అగ్ని మొదలగు వారు భూత సేనాధిపతియైన వీరభద్రునిచే దండిచబడిన విధమును స్తుతించి పాడి, పూవులు కోయుదుమా!"
5. "మకరందము కారు పుష్పమాలలను వస్త్రముగా ధరించిన పరమేశ్వరుడు మానవ శరీర రూపము దాల్చి లోకులందరు ఎరుగునట్లు వచ్చి నన్ను ఆకట్టుకొనెను. నేనేమో వాని ఉనికి తెలియక అన్నింటా వెతకగా, వాడు నాయందు ఉండి అద్భుత నాట్యము చేసెను. వాని కొరకు పాడి పూవులు కోయుదుమా!"
6. జీవాత్మలు పరిపక్వము నొందుటకు నిర్ధేశింపబడిన మూడు అగ్నియైన హోమాగ్ని, శీలాగ్ని..., జ్ఞానాగ్నిలను శివుడు స్థిరముచేసెను. వాడు ముమ్మూర్తులకు అతీతుడు. వాడు త్రిగుణములను నాశము చేయునపుడు మూడు అవస్థలు కూడ మరిగిపోవును. అటువంటివాని కొరకు పాడి పూవులు కోయుదుమా!"
(పాతివ్రత్యము, శీలము నుండి గలుగు అగ్ని శీలాగ్ని, యజ్ఞమునకు, శీలమునకు, జ్ఞానము మూడింటికి మూలము పవిత్రతయే
   1. అగ్నులు మూడు: హోమాగ్ని, శీలాగ్ని, జ్ఞానాగ్ని
   2. ముమ్మూర్తులు: బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరుడు
   3. త్రిగుణములు: సత్వ, రజో, తమో
   4. మూడు అవస్థలు: మెలకువ, కల, నిద్ర.
7. జీవాత్మకు ఇంద్రియములు అమరియుండుటయు, మంచి వారందరు ఒకరినొకరు

సహాయకారకులుగా యుండుటయు, శివ శక్తి మయమై ఈ లోకము భ్రమించుటయు అన్నియూ ఈశ్వర మహిమయని గ్రహించవలెను. తిల్లైనటరాజుని వైభవమును పొగడి, స్తుతించి, పాడు రీతిన పూవులు కోయుదమా?"

8. "ఈశ్వరుడు తన భక్త సమూహములో నన్ను సేవచేయుటకు నియమించు కొనెను. నాకని ఒక మంచి మార్గమును ఎర్పరచి ఇచ్చెను. బానిసను చేయు నా పాపకర్మములను నా నుండి తొలగించెను. వాని అనుగ్రహించు వినయమును వర్థిల్లమని స్తుతించి, పాడి పూవులు కోయుదమా?
(దైవమును వర్థిల్లమని చెప్పడము, భక్తుని యొక్క మనోవికాశము, మనో పరవశమును సూచించునది, ఆ భక్తి పరవశములో దైవమును వర్థిల్లమని దీవించి ఆతని దయ వలన భక్తులందరికి సుఖప్రదమగుగాక! అను అర్థమును సూచించబడినది.)

9. "నేను చాలాకాలము వానిని స్తుతించి సేవ చేయుటకొరకు, నా మనస్సులో తన దివ్యపాదములను స్థాపించెను. మహాజ్యోతి స్వరూపమైన వాడు నాయందు ప్రవేశించినందున నా రాతి మనస్సు పరిపక్వము చెందినది. అటువంటి దివ్య స్వర్ణ పాదములను స్తుతించి పాడి పూవులు కోయుదమా!"

10. "నా శిరస్సు పై తన దివ్యపాదములను ఉంచిన ఆ దైవము నా శరీర కాంక్షను వీడునట్లు చేసెను. వాడు కాలకూట విషమును త్రాగినవాడు, కపాలీ, (కపాలమును భిక్షపాత్రగా గైకొన్నవాడు) త్రిపురములను కాల్చినవాడు. వాని మహిమలు స్తుతించి పాడి పూవులు కోయుదమా!"

11. "మరిగిన పాలు, అమృతము, తేనె అన్ని కలిసిన రుచివలె, హృదయము ద్రవింపజేయునది, ప్రపంచమునకు అతీతమైనదియు, జ్వలించు వీర అందెలు గలిగిన ఆ దివ్యపాద పద్మములు, జ్ఞానమును భక్తులపై ప్రశరింపజేయునదియు నైన వాని దివ్యపాదములను స్తుతించి పాడి పూవులు కోయుదమా!"

12. "బ్రహ్మ, నారాయణుడు, ఇంద్రాది దేవతలకందరికి నాయకుడునైనను, సాధారణముగా నిరాకారుడును, నిర్గుణుడును, విషమును అమృతముగా చేసిన వాడును, కీడులను నిర్మూంచి సుఖమును గలిగించు వాడునునైన శివుని ప్రశంసించి, పాడి, పూవులు కోయుదమా!"

13. "ముమ్ముందు మర్రిచెట్టు క్రింద కూర్చుండి ధర్మము, అర్థము, కామము, మోక్షములను నాలుగు తత్వములను బోధించినవాడును, ప్రతిరోజు దేవతలు, ముని ఋషి పుంగవులచే కొలువబడిన వాడును, కొండ జాతి పూలతో అలంకరించబడిన వాని దివ్య పాదపద్మములను కొలిచి, పాడి పూవులు కోయుదమా!"

14. "నా హృదయమున తన రూపమును చిత్రించిన దైవము నా శరీరమును తన ఉనికిగా

మార్చుకొనెను. తాను తిరు వేగంబత్తూరిలో కొలువై యున్నాడు. తిల్లై (చిదంబరమునకు మారుపేరు) ఆకాశములో నాట్యమాడగల నటరాజుని కీర్తించి, పాడి పూవులు కోయుదామా!"

15. "అగ్ని దేవుడు, సూర్యుడు, రావణుడు, అంగదుడు, యముడు నారాయణుడు, బ్రహ్మ, ఇంద్రుడు, చంద్రుడు, దక్షుడు వీళ్లందరు ఈశునికి మారుగా జరిగిన వారగుటచే వారందరి గౌరవము చెడునట్లు మహాదేవుడు కోపించిన వైనమును స్తుతించి, పాడి పూవులు కోయుదమా!"

16. "బలవంతుడైన వృషభమును వాహనముగా పొందినవాడును, శివపుర నాయకుడును, మధురానగరిలో పుట్టు (ఒక విధమైన అల్పాహార వంటకము: మెత్తటి బియ్యపు పిండిని ఆవిరిలో ఉడికించి, కొబ్బరికోరు, బెల్లపు పొడి కలిపినది) అమ్ముకొను స్త్రీకి కూలివానిగా మట్టి తట్టను తన శిరస్సున మోసిన తీరును, తన ప్రేమికుల (భక్తులు) కొరకు రాజుచే వీపున బెత్తపు దెబ్బలు కాసిన తీరును, సృష్టికి లయమునకు కారకుడైన వానిని స్తుతించి, పాడి పూవులు కోయుదుమా!"

17. "నారాయణుడు, బ్రహ్మ, ఇతర దేవతలు తమ గర్వము వలన శివుని దివ్య పాదములను దర్శింప జాలకుండిరి. మనమెట్లు దర్శించుట? అన్న ప్రశ్నకు దానిని మన చిత్తమునందుంచి స్తుతించినచో వానిని దర్శించుట సులభ సాధ్యమే అన్నది పాడి స్తుతించి పూవులు కోయుదమా!"

18. "రథములు పరుగెత్తు వీధులు గలిగిన తిరుపెరుందురై నాథుని దివ్యపాదముల అందెలు శబ్దించు లయమును కీర్తించి, అనుగ్రహము కొరకు వెతుకులాడు మనోతత్వముతో పాడి, స్తుతించి, పూవులు కోయుదమా!"

(ఆత్మసాధకులకు ధ్యాన సాధనలో హృదయమున లయముతో కూడిన సంగీతము వినబడును. ఈ అనుభవమునే ఇచ్చట అందెల శబ్ధముగా చెప్పబడియున్నది.)

19. "పరమానంద స్థితికి మూలపురుషుడైన ఈశుడు ఏనుగు చర్మమును వస్త్రముగా చేసుకొని తిరుపెరుందురైలో కొలువైనాడు. ఉత్తర కోశమంగై రారాజు అయ్యెను. ఉన్మత్త వేషధారి, శిశువేషధారి, నాలో వివేకము గలుగుటకు కారకుడైన వాని పాదపద్మములను నమస్కరించి పూవులు కోయుదమా!"

20. దివ్యత్వము పొందిన అశ్వముపై ఎక్కి మధురానగరికి వచ్చిన దైవము తన దివ్య దర్శనమును అందరూ చూచునట్లు చేసెను. తాను తిరుపెరుందురై నాయకునిగా ప్రసిద్ధిచెంది నన్ను ఆకట్టుకొని, తన కార్యములయందు నన్ను నిమగ్నుని చేసెను. అటువంటి వాని దివ్యపాదములను పూజింప పూవులు కోయుదుమా!"

# 14. దివ్యవిజయము

## (జ్ఞాన విజయము)

స్త్రీలు పూలబంతిని ఒకరిపై ఒకరు విసురుకొని ఆడుకొను ఒక విధమైన ఆటయే. దివ్య చిదంబరములో స్త్రీలు ఆడుకొనునపుడు చూచినదే దైవ పద్యములుగా ఇచ్చట శ్రీ మాణిక్యవాచగర్ వర్ణించియున్నారు.

1. "మేరు పర్వతమును ధనుస్సుగా వంచుటచే యుద్ధము ప్రకటించబడినది. త్రిపురములు కాల్చబడినవి. కాని ధనుస్సు పనికి రాకుండా పోయినదేలయే? సఖీ! పైకి విసరవే బంతిని!"
2. "ఏకాంబరనాథుని చేతిలో రెండు బాణములులేవే సఖీ! ఒక బాణముతో త్రిపురములు కాల్చబడినది. పైగా అదీ చిరునవ్వే. ఆ బాణమే ఆతని ఎక్కువేనని పొగడి విసరవే పూల బంతిని!"
3. "దేవతలెందరో కష్టించి తయారుచేసిన రథము అది. దైవము ఆరథముపై తన దివ్యపాదమును మోపెను. మోపిన వెంటనే దాని ఇరుసు విరిగినది. అయిననూ రథము ఎక్కక యే యుద్ధము (త్రిపుర సంహారము) ముగిసినదే! విసరవే బంతిని!"
4. "త్రిపుర రాక్షసులలో సుగుణ, పూజా సంస్కారములను విడువని రాక్షసులు ముగ్గురు. అర్హత గలవారిని శివుడు కైలాసమున తన ద్వారపాలకులుగా నియమించెను. యౌవ్వనము వీడని ఉమాదేవి యొక్క భాగస్వామిని పొగడి ఎగరవేయవే బంతిని!"
5. "వీరభద్రుని భూత సైనికుల తాకిడికి దక్షుడు చేయు యజ్ఞము కూలినది. దేవతలందరూ తప్పించుకొని పారిపోయిన రీతిని శివుని గొప్పతనమును పాడి విసరవే బంతిని!"
6. "శివుని నిర్లక్ష్యము చేసి దక్షుడు జరిపిన యజ్ఞములోని హవిస్పాకము (యజ్ఞములో సమర్పించిన భోజనము) అంగీకరించిన విష్ణువు మరణించలేదని పొగడి విసరవే బంతిని!"
7. "అదే యజ్ఞములో హవిస్సుని అందుకోబోయి చేయు జాపిన అగ్నిదేవుని చేయిని వీరభద్రుడు ఖండించెను. దక్షుని యజ్ఞము కూలి, సర్వము చిన్నాభిన్నమైనదని పాడి ఎగరవేయవే బంతిని!"
8. తన కూతురని చూడక, హరుని (శివుని) పత్నియని చూడక, పార్వతీదేవిని శత్రువుగా నెంచెను ఆ దక్షుడు. అటువంటి వానిని ప్రాణముతో విడిచి పెట్టుట, శివునికి మంచిది కాదని పాడవే సఖీ!
9. "దక్షుని యాగమును ముట్టడించినపుడు, భయపడిన ఇంద్రుడు ఒక కోయిల రూపము దాల్చి చెట్లుపై దాగుండి పోయెను. దేవతలందరికి రాజునైన తను ఇట్లు చేయుట తగునా అని పాడి ఎగరవేయవే బంతిని!"

10. “దక్షుని యాగములో అధిదైవమైన వాని తలను త్రుంచి చంపబడెను. ఆక్షణములో మనల్ని వెంటాడు జన్మ పీడలన్నీ తొలెగెనని పాడి విసరవే బంతిని!”
11. “దక్షుని శిరస్సు ఖండించబడినది, వాని మెడపై మేక తలను అమర్చబడిన తీరును పాడి, వక్షోజములు కదులునట్లు ఎత్తునకు ఎగిరి విసరవే బంతిని!”
12. “దక్షుని యాగమునకు వచ్చి, హవిస్సన్నము భుజింప జూచిన సూర్యుని కళ్లు పోగొట్టుకున్న విధమును పాడి, జన్మరహితులమైతిమని సంతసించి ఎగరవేయువే బంతిని!”
13. “సరస్వతిదేవికి ముక్కుపోయినది. చతుర్ముఖునికి (బ్రహ్మకు) ఒక తల తెగినది. చంద్రుని ముఖము విరిగినది. వీరందరూ దక్షుని యజ్ఞమునకు వచ్చి పాల్గొనినది తప్పుని ఎరుగవలెనని పాడి గంతులేయవే. సఖీ!”
14. “బ్రహ్మయు, యాగ అధిపతియైన దక్షుడు చంపబడిరి. ఇంద్రుడు తప్పించుకొని పోవుటకు దారి వెతుకు తీరును విని శివుని స్తుతించి, బంతి విసరవే సఖీ!
15. “సూర్యుని ఎర్రటి నోటిలో నున్న పళ్లు పగిలిన విధము, దక్షుని యజ్ఞము కూలిపోయిన విధమును విని శివుని ప్రశంసించి, పాడి ఆడవే సఖీ!”
16. “దక్షుడు శివుని అవమానము చేయుటకే ప్రారంభించిన యజ్ఞము ప్రారంభములోనే కూలిపోయిన విధము, దక్షుడు కోరి మరణము తెచ్చుకొన్నది, శివుని మహిమను స్తుతించి పాడి ఆడుదామా!”
17. “ముని కుమారుడైన ఉపమన్యునికి ఆకలి తీర్చుట కొరకు పాల సముద్రమునే ఏర్పరచి ఇచ్చిన శివుని మహిమను పొగడి, స్తుతించి, పాడి ఆడవే సఖీ!”
18. “తామర పుష్పమున ఆసనము ఏర్పరచుకొన్న బ్రహ్మ యొక్క ఒక్కొక్క తలను తన గోటితో ఆలస్యము చేయక త్రుంచిన విధమును ప్రశంసించి పాడి, ఆడుదామే!”
19. “రావణాసురుడు, తన మార్గములో అడ్డు తగిలినదని కైలాస పర్వతమును ఒక ప్రక్కకు త్రోసివేయ నెంచగా, శివుడు తన కాలి బొటన వ్రేలితో నొక్కి ఉంచుటచే రావణుని భుజము విరిగినదని శివుని ప్రశంసించి ఆడవే సఖీ!”
20. “ఆకాశములో సగము వస్త్రముతో తిరుగాడు, సూర్యుని ఉష్ణమునకు తల్లడిల్లిపోవు ఋషులు, మునులందరికీ అండగా ఉండి రక్షించువాడు శివుడు. వాడు అన్ని లోకములకు, అన్ని శీతోష్ణస్థితులకు అతీతుడు. అటువంటి వానిని స్తుతించి పాడి బంతి ఎగురవేయవే!

# 15. దివ్యత్తోనోక్కం

త్తోళ్ + నోక్కం = త్తోనోక్కం; భుజములు + చూచుకొని; స్త్రీలు గుమిగూడి ఒకరి భుజము ఒకరు చూచుకొని, భుజము చిక్కి, గిలిగింతలుపెట్టి, చెరచుకొని ఆడు ఆటలు. దక్షిణ భారత దేశములో స్త్రీల సమూహాముతో ఆడు ఆటలలో ఇదొకటి. ఆట్లాడునపుడే

దైవ చింతనలు, దైవ కథల ప్రసక్తి, దివ్యవిశేషములతో కూడినదిగా ఇందు వర్ణింపబడినది.

1. పూలవనములోని తటాకము నీరు ఇదే కదా అని ఎండమావిని చూచుటను అజ్ఞానము నా నుండి వేరుచేసి, అనుగ్రహించిన ఆ తిల్లై అంబళవానన్ (చిదంబరములోని చంద్రశేఖరుడు) యొక్క దివ్య నాట్యమును చూచి, ఆతని సేవకు మనము సంసిద్ధులమని పాడి ఆడుదామా!"
2. "జన్మపీడ నుండి మనల్ని విడిపించి, ఆదుకొన్నవాడును, ఆవుదూడను వెలగపండుపై విసిరిన నారాయణుడు, చతుర్ముఖుడు (బ్రహ్మ) చూడ శక్యము కాని తిల్లైనాథుని గుణాతిశయములను మనము పాడి త్తోనోక్కం ఆడుదామా!"
   (నారాయణుడు కృష్ణావతారములో రేపల్లెలో తనను చంపుటకు రాక్షసులిద్దరు మాయ వేషములో ఆవుదూడ రూపములో ఒకడు, వెలగపండు రూపములో మరొకడు వచ్చిరి. ఇది ఎరిగిన కృష్ణుడు ఆవుదూడ కాళ్లను పట్టుకొని గిరగిర త్రిప్పి, చెట్టుమీద వెలగపండు రూపములో నున్నవాడిపై విసిరి ఒక్క దెబ్బతో ఇద్దరు రాక్షసులను సంహరించెను.)
3. "శ్రీ భక్తకన్నప్ప చెప్పులు ధరించిన కాళ్లతో శివుని సన్నిధిలోనికి ప్రవేశించి తన నోటితో తెచ్చిన నీటితో శివుని అభిషేకించి, వేటాడి తెచ్చిన మాంసపు ముద్దలనే నైవేద్యముగా సమర్పించెను. అంతర్ ప్రేమ భక్తితో చేసినందుకు మహానుగ్రహము, ముక్తిని, పొందెనన్నది పాడి త్తోనోక్కం ఆడుదామా!!"
4. "రాతిలాంటి నా మనస్సును కరిగించి, కంటికెదురుగా దర్శనమిచ్చి, నా హృదయములో ప్రవేశించి, నాకు సన్మార్గము చూపి, లోకులందరూ ఎరుగునట్లు నాకు అనుగ్రహించిన విధమును పాడి త్తోనోక్కం ఆడుదామా!"
5. దైవము (శివుడు) అష్టమూర్తులుగాను, ఏడు లోకములుగాను, పది దిక్కులుగాను, ఒక్కడే అన్నిగాను, జ్ఞానరూపిగా అన్ని జీవాత్మలోను కలిసియున్నాడు. అట్టివానిని స్తుతించి త్తోనొక్కం ఆడుదామా!"
   (అష్టమూర్తులు: భువి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశము, చంద్రుడు, సూర్యుడు, ఆత్మగా యున్నారు.)
6. బౌద్ధులు మొదలగువారు గడ్డిపోచవంటి జ్ఞానముతో తబ్బిబ్బులగుతూ తమతమ మతములే అన్నిటికన్నా గొప్పదని చాటుకుంటున్న సమయములో, నా చిత్తము శివమయమై నా చర్యలన్నియూ తపస్సు అయిన విధమును పాడి ఆడుదామా!
7. చిదంబరములో బ్రహ్మచారియైన చండీశ్వర నాయన్మార్ శివుని పూజ చేయునపుడు, పూజకు ఉంచిన పాలను తన తండ్రి తన్ని, త్రోసి, పూజను చెఱపగా, చండీశ్వరుడు ఆగ్రహించి తండ్రి కాలినే నరికి వేసెను. అది పుణ్యకార్యమై, శివుడు చండీశ్వరునికి శివగతి అనుగ్రహించిన వైనమును పాడి ఆడుదామా!"

(నాయనార్, నాయన్మార్ రెండూ ఒకటే. వైష్ణవ భక్త శ్రేష్టులు పన్నెండుగురిని (12) ఆళ్వార్‌లు అందురు. అట్లే శివభక్త శ్రేష్టులను నాయన్మార్ లేక నాయనార్ అందురు. వీరు మొత్తము అరువది మూవురు (63) వీరందరు మహోన్నతమైన భక్తిచే శివ సాయుజ్యము పొందిరి.)

8. ఉన్నత ఆశయముగలిగిన స్త్రీలారా! తానన్న అహంభావన వీడి, తారతమ్యములు వీడి, మనమందరమూ ఏకమై ఆనందముగా నాట్యమాడువాని (శివుని) అనుగ్రహము పొందగోరి వాని దివ్యపాదములందే చిత్తము నుంచి స్తుతించి పాడి ఆడుదామా!"

9. "త్రిపురమును కాల్చి భస్మము చేసినపుడు, అందు శివుని మరవని ముగ్గురు రాక్షసులను శివుడు ఆదుకొనెను. ఆ మూవ్వురిని శివుడు తన కైలాసమున ద్వారపాలకులుగా నియమించుకొనెను. అనతి కాలములో ఎందరో ఇంద్రులు, బ్రహ్మలు పుట్టి కనుమరుగైరని ప్రశంసించి త్తొనోక్కం ఆడుదామా!"

10. "నారాయణుడు వెయ్యి తామర పుష్పములతో శివుని అర్చించినపుడు ఒక పుష్పము తగ్గుట వలన, తన కంటిని పెకలించి అర్చించెను. మిగుల సంతసించిన దైవము (శివుడు) తన చక్రాయుధమును నారాయణునికి కానుకగా ఇచ్చెనను విషయమును స్తుతించి పాడి త్తోనోక్కం ఆడుదామా!"

11. "తప్పుచేసిన కారణముగా మన్మథుని శరీరము, యముని ప్రాణము, సూర్యుని పళ్లు, సరస్వతీ దేవి ముక్కు, బ్రహ్మ శిరస్సు, అగ్ని చేయి, చంద్రుని శిరస్సు, దక్షుని శిరస్సు అన్నియూ ఖండించబడినవి. అట్లు చేయుటవలన వారికి కర్మవిమోచనము పొంది పరిశుద్ధులైన విధమును పొగడి, పాడి ఆడుదామా!"

12. తామే పెద్ద అను గర్వముతో మతిచెడిన నారాయణుడు, చతుర్ముఖుడు (బ్రహ్మ) లకు సత్యమును బోధింపనెంచి శివుడు బ్రహ్మాండములోని పదునాలుగు లోకములను తాకునట్లు, ఆది అంతములేని, అగ్నిలింగమై నిలుచుచున్నది పాడి త్తోనోక్కం ఆడుదామా!"

13. "దైవమును (శివుని) స్తుతించి పూజింపక కాలమును వెళ్లబుచ్చితిని. శాశ్వతమైనవాడు తానే. లోకములో మిగతావన్నియూ వృథా! అశాశ్వతములే. వాని దరి చేరుటకే వాడు మన జన్మవేరును కలుపు తీయునట్లు తీసి వేయుచున్నాడని పాడి త్తోనోక్కం ఆడుదామా!"

14. మాటలకందని జ్యోతిస్వరూపమైన శివుడు నాలో ప్రవేశించెను. ఎల్లలే లేని కామ సముద్రమును దాటితిని. ఇంద్రియములను పక్షులు విషయవాంఛ లేక నశించినవి. శివబోధనా మహిమను ప్రశంసించి పాడి ఆడుదామా!"

# 16. దివ్యస్వర్ణ ఊయల

పూలతోటలో స్త్రీలందరూ గుమిగూడి స్వర్ణ పూలతో ఊయల కట్టి ఆడిరి. శ్రీ మాణిక్యవాచగర్ అది గాంచి శైవ కీర్తనలు పాడుతూ, దైవ చింతనతో ఆడవలెనని స్త్రీలకు బోధించెను. వాటినే పద్యరూపమున శివుని మహిమలను, లీలలను పొగడి వర్ణింపబడినవి.

1. శూలము వంటి కళ్లు గలిగిన స్త్రీలారా! పగడము, ముత్యములు బంగారు నగీషిలు గల ఊయలలో నుండి, నారాయణుడు కూడా గుర్తెరగని ఉత్తరకోసమంగైలో కొలువైన మహామహుని (శివుడు) దివ్యపాదములను ప్రశంసించు చరితమును పాడిన వైనమున ఊయల ఊగుదమా!
2. నెమలి అందము, హంస నడకయు గలిగిన స్త్రీలారా ! త్రినేత్రముగలవాడును, ఊర్థ్వలోకదేవతలే గుర్తెరగని దివ్య పాదములు గలిగినవాడును, ఉత్తరకోసమంగై మహామహుడును, తేనె, అమృతము వంటి జ్ఞానమొసగి ప్రాణముతో కలసి కరిగించువాడును, తిరువిడైమరుదూర్‌లో కొలువైన స్వామిని ప్రశంసించి పాడి ఊయల ఊగుదమా!”
3. ప్రారంభము, ముగింపు లేనివాడు శివుడు. దేవతలు, మునులు, సులభముగా పొందలేని అనుగ్రహమును నాకొసెగెను. వాని కరుణా హృదయమును ఉత్తరకోసమంగై రారాజైన వాని మహిమలను ప్రశంసించి, పాడి, ఊయల ఊగుదమా!”
4. నన్ను అనుగ్రహించి, నా హృదయమును అమృతమయము చేసి, నన్ను జన్మరహితుని జేసి, అనుగ్రహ చిహ్నముగా నిలబడి నన్ను ఆకట్టుకొన్న వాని (శివుని) పాద పద్మములను కీర్తించి ఈ స్వర్ణ ఊయల ఊగుదమా!
5. స్త్రీయా, పురుషుడా, నపుంసకుడా అని ఎరుగలేని నిరాకారుడు, దేవతలను రక్షింపనెంచి సముద్ర మదనమున పుట్టిన హాలాహలమును (విషము) త్రాగిన మహామహుడు శివుడు. వాని దయార్ద్ర హృదయమును, నెలవంక ధరించి నాట్యమాడు తీరును పొగడి స్వర్ణ ఊయల ఊగుదమా!”
6. “స్త్రీలో సగము భాగమును, జటాధారుడునైన వాని శిరస్సుయందు పుష్పమాలయూ, మునుల సహృదయవాసియునై, నా జన్మమును తరింపజేసెను. నా పాప కర్మలను తొలగించి కాపాడినవాడును, వాని చెవులకు ఆడు కుండలములను పొగిడి ఊయల ఊగుదమా!”
7. “ఉత్తరకోసమంగై నాథుని (శివుని) జ్ఞానబోధను పఠించుట వలన మన పాపములన్నియూ తొలగిపోవును. హంసవంటి ఊయలపై ఎక్కి ఆడు నెమలివలె మనముండి ఆ కరుణామయుని పాడి స్వర్ణ ఊయల ఊగుదమా!”

8. “కైలాసమున తానున్ననూ ప్రపంచము కొరకు తాను ఉద్భవించి, అన్ని జీవరాశులను రక్షింపగోరి సముద్రపు విషమును అమృతముగా గైకొన్న వాడును, గుర్రముల కాపరివలె వచ్చి మమ్ములు రక్షించిన వాడును, నారాయణుడు మొదలగువారు దర్శింప శక్యముకాని వాడు నైన శివుని మనసార పాడి స్వర్ణ ఊయల ఊగుదమా!”
9. ఉద్యాన వనములతో నిండిన ఉత్తర కోసమంగైకి మహా జ్యోతి స్వరూపుడవై వచ్చి మమ్ములను ఆదుకొని జన్మరహితము జెసెను. ఉమాదేవికి తన శరీరములోని ఒక భాగమును ఇచ్చిన ఆ అర్ధనారీశ్వరుని దివ్యపాదములను కొలిచి, పాడి, ఈ స్వర్ణ ఊయల ఊగుదమా!”

# 17. మాతృ దశకము

కన్య ఒకరు తన తల్లికి దైవము యొక్క మహిమలను వివరించి చెప్పుటతో ఈ క్రింది పది పద్యములు అమరియున్నది:

1. “తల్లీ! శివజ్ఞాన ఉపదేశము చేయువాడును, తెల్లటి విబూది ధరించిన వాడును, ఎర్రని శరీరచాయ గలిగినవాడును, నాదతత్వమైన ఓంకార నాదమునే నాదబ్రహ్మంగా గలవాడును, నారాయణునికి, బ్రహ్మకు ఆదియైన వాడు శివుడే అగును.”
2. “హృదయమున వదలకుండా ఉండి నన్ను కరిగించువాడు, అట్లు కరిగించి పరమానందము నొసగువాడు. ఎడతెరిపిలేని నా కన్నీరు భరించగలిగినదే తల్లీ!”
3. “తల్లీ! నిత్య యౌవ్వనుడు వాడు, మరియు అందమైన వాడు ఎప్పుడు నా తలంపులలో నుండువాడు. అట్లుండిన నా తలంపులన్నీ ఆ పెరుందురై నాయకునిపై గలిగిన ఆనందమే! తల్లీ.”
4. “పులి చర్మమును వస్త్రముగాను, పాముని ఆభరణములుగాను విబూది ధారణను, చూచువారికి అసహ్యపరచవచ్చు. కాని నాకు మాత్రము ఎడతెరిపిలేని ఆనందమిచ్చుచున్నది తల్లీ!”
5. “పొడవైన చేతులును, సిద్ధిని తెలియపరచు పొడవైన జటాఝూటము గలిగి, ఊరంత తిరుగు వాని వలె కనిపించినను నాకు మాత్రము మనస్సు నియత్రించి దివ్య అనుగ్రహము ఇచ్చువాడేనని తోచుచున్నది తల్లీ!”
6. “లెక్కలేనన్ని మహిమలతో దైవము (శివుడు) నా హృదయమున నెలకొని యున్నాడు. అట్లుండుటచే నేనేల వాని కొరకు అంతటా (బాహ్యముగా) వెతకవలె తల్లీ!”
7. తెల్లనైన గుర్రముపై వచ్చిన వాడు, వాని శిరస్సుయు తెల్లనైనది (గంగాజలముతో పొంగునది). వాని దివ్య రూపము తెల్లనైనదే. వానిని తలంచి నా మనస్సు ఆకర్షించుచున్నదే తల్లీ!

8. "గడ్డిపోచలను మాలగా ధరించియు, చందనమును రాసుకొన్నవాడును మనల్ని కాపాడి రక్షించువాడు. రక్షించువానికి చేతిలో తాళవాద్యము ఏలయో? కాలమును రక్షించువానికి కాలము పై పెత్తనము చాటుటకే తల్లీ!"
9. "ఒకరికి భాగస్వామియు, (ఉమాదేవికి) తఘోభంగిమతో ఉన్నవాడు నా ఇంటికి భిక్షాటనకు వచ్చెను. లౌకికి జీవితము శాశ్వతము కాదని చెప్పుటకే భిక్షాటనతో వచ్చెనే తల్లీ!"
10. "కొండజాతి పూలమాలయు, నెలవంకయు, బిల్వపత్రములను బ్రహ్మముడి కాయలతో దర్శనమిచ్చువాడి (శివుని) తీరు చూచునపుడు, నాకు పిచ్చి (భక్తి పిచ్చి) ఎక్కువగుచున్నదే తల్లీ!"

# 18. కోయిల దశకము

శ్రీ మాణిక్యవాచగర్ తనను నాయకురాలుగాను, శివుని నాయకుడుగాను కల్పించుకొని, శివుని రమ్మని పిలుచుటకు కోయిల (కోకిల)ను కూయమని వేడుకుంటున్నట్లు, క్రింది పది పద్యములు అమరి యున్నవి. ఏది ఎటులున్ననూ అన్నింటా సదా దైవ చింతనలే ఆవశ్యమని చెప్పుటకు ఇవన్నియూ నిదర్శనములు.

1. "కూయుచున్న కోయిలా వినవే! మహామహుడు శివుని దివ్యపాదపద్మములు ఏడు లోకములు మించినవి. ఆతని జాటార్ఝూటదారణ మహిమ మాటలకు అందనిది, నిర్గుణుడు, ఆది అంతములేనివాడని కూయవే!"
2. "పెరుందురై నాధుని అన్ని లోకములు వారును పూజించదగ్గ వాడును, అన్ని రూపములను తనదైనదిగా చేసుకొన్న అందగాడు. భీకర సముద్రమధ్యమున ఉండు లంకానగరపు అందగత్తె అయిన మండోధరిని అనుగ్రహించి ఆనందపరచెను. వాని రాక కొరకు నీవు కూయవే కోయిలా?"
3. "కోయిలా! మణులు పొదిగిన భవనములతో నిండిన ఉత్తర కోశమంగైలో అందమైన ఉమాదేవితో ప్రపంచమంతా కొలుచుటకు కొలువైన వాడును, మూల పురుషుడునైన శివుని రమ్మని కూయవే!"
4. "మధురమైన పండ్లతోటలో తిరుగాడు చిన్న కోయిలా! వినవే! భూలోకమునకు వచ్చి భక్తకోటిని తన వశము చేసికొని, నా హృదయమున ప్రవేశించి, ప్రజ్ఞగా ఉండు ఒక్కడే నిజమైన పురుషుడు, భర్త. వాని రాక కొరకు కూయవే!"
5. "చిన్న అందమైన కోయిలా! చీకటిని తొలగించుకొని సూర్యుని వలె వచ్చి భక్తుల యొక్క అజ్ఞానమను చీకటిని పారద్రోలు రక్షకుడును, త్రికర్మలకు (సృష్టి, స్థితి, లయములు) మూలమైన వాడిని ఆహ్వానించు రీతిని నీవు కూయవే!"

6. "సుఖము నిచ్చు కోయిలా! ఏడు లోకములను పరిపాలించువాడు, అమృతము ఇచ్చు పరమానంద ఊటగా యుండువాడు, జ్ఞానజ్యోతి నుంచి వచ్చిన దైవము (శివుడు) భక్తులను పరిపాలించుట కొరకే మానవ రూపమున వచ్చెను. వాని రాక కొరకు నీవు కూయవే!"
7. "నా ప్రేమకు పాత్రమైన కోయిలా! నేనే నీ సఖీని. మనమొకరితో ఒకరు స్నేహంతో ఉందాము. శాశ్వతమైన దైవము యొక్క అందము శ్రేష్టమైనది, స్వర్ణమును మించునది. భక్తుని కొరకు గుర్రపు కాపరి గా వచ్చిన వానిని ఆహ్వానించి కూయవే!
(గుర్రపు కాపరిగా శివుడు వచ్చినది: శ్రీమాణిక్యవాచగర్ జీవిత చరిత్ర సంగ్రహము చదువవలెను.)
8. పిల్ల కోయిలా రావే ఇక్కడికి! నారాయణుడు, బ్రహ్మయు ఆశ్చర్యపడునట్లు బ్రహ్మాండ దివ్యజ్యోతిగా ప్రకాశించి నిలబడి దర్శన మిచ్చిన వాడు, గుర్రపు కాపరిగా వచ్చినాడు. భక్తుని కొరకే అట్లు వచ్చిన వానిని ఆహ్వానించి కూయవే!
9. నల్లటి రంగు, బంగారు మెరుపు రెండూ కలిసిన శరీరచాయగలిగి వనములో నుండు కోయిలా! ఎర్రనైన శరీర చాయగలిగిన దైవము (శివుడు) భూలోకములో తన దివ్య పాదములు చూపి నా బంధములను త్రెంచి నన్ను ఆదుకొనెను. వాని మహిమను అనుభవములో పొందిన వారికి లౌకిక కాంక్ష వీడినది. ఆ అమృతుని ఆహ్వానించి కూయవే!
10. ఇంపైన రాగము పాడు కోయిలా ఇటు వినవే! బ్రాహ్మణుడుగా ప్రపంచమునకు అందమైన రూపములో వచ్చిన శివుడు తన దివ్యపాద దర్శనము చూపి 'వీడు నా బంధువు' అని నన్ను చెప్పి తన దాసునిగా చేసికొనెను. అటువంటి వానిని రమ్మని కూయవే!

## 19. దివ్య దశాంగము

పది అంగముల కూర్పు అన్నది దశాంగము. ఒక రాజు గురించి చెప్పునపుడు వాని గుణముల కూర్పు చెప్పబడును. అవి ఏవనగా రాజు పేరు, దేశము, ఊరు, నది, పర్వతము, వాహనము, సైన్యము, విద్య, ధారణ, జండా మొదలగునవి పది అంగములనబడును. దీనినే శ్రీ మాణిక్య వాచగర్ దైవము యొక్క కూర్పుగా క్రింది పద్యములో శివుని యొక్క వివరణలను దశ అంగములుగా చిలుకతో సంభాషణగా వివరించి యున్నారు.

1. "ఓ చిలకా! పెరుందురైలోని ఎర్రనైన నాథుడు, మహామహుడు (శివుని), దేవతలందరికి దైవము, నాయకుడు అని శ్వేత పద్మమున అమరిన చతుర్ముఖుడు (బ్రహ్మ), పాలసముద్రముపై పవళించిన నారాయణుడును స్తుతించుదురు."

2. “ఓ చిలకా! ఏడులోకములకు నాయకుడైనను, భక్తులైన వారిని ప్రేమతో ఆదుకొని అనుగ్రహించు వానికి (శివునికి) ఉనికి దక్షిణ పాండ్యదేశమే అగును.’’
3. “మనల్ని ఆదుకొని అనుగ్రహించు వాని యొక్క తల్లిదండ్రి ఊరును, వాడు నివసించు ఊరును ఉత్తర కోశమంగై ఊరే అగును.”
4. “ఎర్రనైన ముక్కుగల చిలకా! మన మనస్సు దోచిన తండ్రి తిరుపెరుందురై వాని యొక్క నది ఏదనగా వాడి యొక్క పరమానంద అనుగ్రహమే నది అగును.”
5. “ఇంపైన మాటలు పలుకు చిలుకా! శాశ్వత అంశమైన తిరుపెరుందురై పెరుమాళ్ల (శివుని) పర్వతము ఏదని అడిగినచో, అహంభావమను చీకటిని పారద్రోలి జ్ఞాన జ్యోతిని వ్యాపింపజేయు కైలాస పర్వతమే అగును.”
6. “ఇప్పుడే గూటిలోపలికి వెళ్ళిపోవకే చిలుకా! శ్రేష్టమైన వాహన అధిరోహణము ఏదనగా, తేనె వంటి చిత్తాకాశము అంశమైన అశ్వమే అగును.
(శ్రీ మాణిక్యవాచగర్ జీవిత చరిత్రలో, శివుడు గుర్రపు కాపరిగా వచ్చి రాజుకు అప్పగించిన గుర్రములు ‘చిత్తాకాశ’ అంశమైనదని చెప్పబడినది. కాని శివుని కైలాస వాహనము వృషభమే అగును.)
7. చక్కటి పలుకులు పలుకు చిలకా! తప్పులెరుగని పెరుందురై పెరుమాళ్ల్ (శివుడు) కి ధర్మగుణములు లేని శత్రువులపై విసురు ఆయుధము ఏదనగా: తన భక్తుల యొక్క అజ్ఞానమును తొలగించు శూలములే ఆయుధ మగును.
8. ఇంపైన పలుకులు పలుకు చిలకా! పెరుందురై పెరుమాళ్ల (శివుడు)కి ఎదుట చదువు దివ్యవాచకము ఏదనగా: వానిని కొలుచు ‘ఓం’ కారత్వమే వాని విద్య (ఓంకారతత్వమే). బాహ్యా చిహ్నము డమరుక వాద్యము.
9. యోచించి పలుకు చిలుకా! హృదయము కరిగిన భక్తులను ఆదుకొను పెరుందురై వాడు ధరించు మాల ఏదనగా: ఎటువంటి కీడు గలుగజేయని, ప్రేమతో, కరుణతో నిండిన, కీడును పారద్రోలు పుష్ప మాలయే అగును.
10. ఓ పచ్చని ఉద్యానవన చిలుకా! పెరుందురైవాని (శివుని) అందమైనదిగా నొప్పారు జండా ఏదనగా: కీడు చేయువారికి భయభ్రాంతులు కల్పించు వృషభరూపమే వాని జండా అగును.

# 20. తిరుప్పళ్లిఎయుచ్చి

## (దివ్య మేలుకొలుపు)

(తిరోధానశుద్ధి; ప్రాత:కాలమున మేలుకొనుట; పానుపుపై నుండి లేచుట.) జ్ఞానము పొందుటకు అడ్డంకులుగా ఉండునది మందగుణము లేక సోమరి తనము. ప్రాత:కాలమున మేలుకొనుటవలన మంద గుణము పోవును. ఈ పద్యములు ప్రాత:కాలమున చదువుట వలన దైవ నమస్కారము చేసినట్లై, బుద్ధి తేటనై, జ్ఞానమునకు దారితీయును. ప్రాత:కాలమున మేలుకొనుటచే మానసిక ఉత్తేజము పొందనగును. (తిరు + పళ్లి + ఎయుచ్చి = దివ్య + పానుపు + లేచుట)

1. "నా జీవితపు మూలపురుషుడా! నీకు నమస్కారములు సూర్యుడు ఉదయించెను. నీ పాదములందు పుష్పలర్పించి నీ అనుగ్రహము పొందు సూచనగా నీ చిరునవ్వును పొందుచున్నాను. నీ దివ్యపాదములను నమస్కరించుచున్నాను. వృషభ జండా ఎత్తున ఎగురు తిరుపెరుందురై మహానుభావా! నీవు నా వాడవు. కమలములు వికసించియు, పచ్చటి చేనులు కలకలలాడుచు, అన్ని జీవరాశులు మేలుకొనుట కొరకు సిద్ధముగా ఉన్నవి. నీవు మేలుకొనుగాక!"
2. తూర్పున సూర్యుడు ఉదయించుటచే చీకటి తొలగిపోయినది. సూర్యుడు పైకి లేచుటచే నీ కరుణా వ్యాపకము చూడనగుచున్నది. సూర్యుని కిరణములతో తామర వికసించునట్లు నీ కళ్లు వికసించని! తుమ్మెదలు ఝుంకారము చేయునట్లు మేము నిన్ను ప్రశంసించెదము మాకు అనుగ్రహ సంపద నొసగు మహానంద పర్వతమా! అనుగ్రహ సముద్రమా! నీవు దివ్య పానుపునుండి లేచి అనుగ్రహింపుమా!
3. పక్షులు కూయుచున్నవి, నక్షత్రముల ప్రకాశము మందగించు చున్నది. ఉదయభానుని (సూర్యుని) ప్రకాశము వృద్ధియగుచున్నది. దైవమా! ఈశ్వరా! నీ దివ్య పాద పద్మములను ఇప్పుడే చూపించి అనుగ్రహింపుమా! నిన్ను ఉపాసించని వారికి నీవు అర్థము కావు. నీ భక్తులకు నీవు సులభసాధ్యుడు, కనిపించువాడు, తేటతెల్లము. నీ మహిమలు గొప్పవగుగాక!
4. వీణ వాద్యములు వాయించు వారొక ప్రక్క, వేద పఠనముతో కొందరు మరోప్రక్క, పుష్పమాలతో ఉన్నవారు, స్తుతించువారు, పరవశించి ఏడ్చువారు, పూనకమాడువారు, శిరస్సుపై చేతులు జోడించి ప్రేమతో ఉన్నవారు మరొక పక్కను, అందరూ నిన్ను స్తుతించి నిలుచున్నారు. సామాన్యుడను, నేను, నీ దాసుడనై మాపై అనుగ్రహింపు మహానుభావా! దివ్యపానుపుపై నుండి లేచుదువుగాక!
5. "నీవు పంచభూతములతో కలిసి ఉండువాడవనియు, వచ్చుట, పోవుట (జనన, మరణములు) లేనివాడని గొప్ప జ్ఞానులు చెప్పుదురు. నిన్ను శివజ్ఞానముతో చూచితిమే

కాని, అనుభవముతో చూడలేదు. మనస్సు కు అతీతమైన వాడా! మాలో నున్న తప్పులను సరిదిద్ది, పోగొట్టి, మా ఎదుట వచ్చి మమ్మల్ని ఆదుకొను మహానుభావా! పానుపుపై నుండి లేచి అనుగ్రహించుదువు గాక!"

6. "మనస్సులోని సంకోచములు తొలగి, స్థిమితమై, కాంక్షలను విడనాడిన సత్యజ్ఞానులు నీదరి చేరి ప్రేమబంధము నుండి విమోచనముపొందిరి. కాని వారు అలవాటుగా ప్రేమ కన్నీరు కార్చు స్త్రీలవలె నిన్ను విడువక నీవద్దే నిలుచుచున్నారు. తిరుపెరుందురై శివా! జన్మరహితము చేసి మమ్ములను ఆదుకొను నాయకా! దివ్యపానుపుపై నుండి లేవవయ్యా!"

7. నిన్ను తెలుసుకొనలేమని కొందరు, తెలుసుకోగలమని కొందరు వాదించుదురు. నిన్ను మనో:పరిపక్వము లేనివారు తెలుసుకోలేరు. కాని పరిపక్వము చెందిన భక్తులో మరి నిన్ను తెలుసుకొనుట సులభమందురు. మూలపురుషుడవనియు, మధురమైన ఫలమనియు, అమృతుడవనియు, పలు విధములుగా చెప్పుదురు. లోకములో లెక్క లేనన్ని రూపముగలవాడుగాను, నిరాకారుడుగాను, నీవున్నావు. నీలాంటి వానికి మేమెట్లు సేవ చేయవలెనని మార్గము చూపించి అనుగ్రహించుదువుగాక! లేవవయ్యా."

8. అందరికి దక్కని అమృతమా! ఆదియు, అంతమునైన వాడా! ముమ్మూర్తులు నిన్ను ఎరుగరు. నీ నిజ తత్వమును ఎరిగిన వారెవరు? అంబిక, నీవు భక్తుల ఇంటిలోనూ, హృదములందును కొలువైయున్నారు. అగ్ని జ్యోతిగా నీవు దర్శనమిచ్చి, తిరుపెరుందురై దేవాలయములో కొలువై అనుగ్రహమును చూపించిన అక్షరమైన (నాశనములేనిది) తత్వముగా ఉన్న బ్రహ్మాండరూపా! పానుపుపై నుండి లేచి అనుగ్రహింపవయ్యా!"

9. ఊర్థ్వలోక దేవతలు కూడ సమీపించ లేని పరబ్రహ్మామా! నీ భక్త దాసులమైన మేము భూలోకములో సుఖ జీవితము జీవింప అనుగ్రహించిన మహానుభావా! మా కంటిలో నిలచి, శరీరమును గిలిగింతలు పెట్టించు తేనే, అమృతమా! తియ్యటి చెరకా ప్రాణ మూలమా! లేచి అనుగ్రహించెదవు గాక!

10. శివుని అనుగ్రహమునకు పాత్రులమై, శివజ్ఞాన భోధన పొంది మనము కూడ భూలోకములో పుట్టి ఉండవచ్చుగదా! అని దేవతలు గూడ ఆశ పడియుందురు. మమ్ములను ఆదుకొని అనుగ్రహింప వచ్చియున్న ధీరుడా! దివ్యపానుపుపై నుండి లేచి అనుగ్రహింపవయ్యా!

# 21. దేవాలయ పురాతన కీర్తనలు

1. "ప్రపంచము ఏర్పడిన శక్తికి నీవు కేంద్రబిందువు, మూల తత్వముగా నున్నావు. ప్రపంచ లయములోను నీవు నీ భాగస్వామి ఉమాదేవితో కలిసి మూలతత్వముగా ఉన్నావు. మీరిద్దరూ నా హృదయమున నుండుట సత్యమైనచో నన్ను నీ భక్తదాసుల మధ్య ఉంచుము."
2. "బంగారు వన్నె చంద్రుని కోరి నాట్యమాడు నటరాజా! తగిన పరిపక్వము నేను పొందలేదని ఎంచి నన్ను త్రోసి వేయకు సుమీ! తరువాత నీ భక్త కోటికి నేను అన్యుడనై పోవుదును!"

   (యోగసాధనలో సాధకుడు పరిపక్వమొందినచో తనకు ధ్యానములో బంగారు వన్నెగల చంద్రుడు కనిపించును. ఆ బంగారు చంద్రుడు ఇచ్చట చెప్పబడినదే తప్ప ఆకాశములో కనిపించు చంద్రుడు కాదనియు, దానికి తగ్గట్లే శ్రీ మాణిక్యవాచగర్ "పొన్నంభళము" (పొన్ + అంభళము = బంగారు + చంద్రుడని అర్థము.) పదమువాడి యున్నారు.
3. "నా బానిస సేవను స్వీకరించిన ఓ మూలపురుషుడా! యజ్ఞయాగాదులు చేయువారిని అనుగ్రహించి ఆశీర్వదించు నీవు, నన్ను ఆదుకొననిచో, ఇది సరికాదని లోకమే నిన్ను నిందించును నేనూ మరణించవలసి వచ్చును. పొన్నంభళ మూలమా!"
4. "ఆదిమూలమా! అన్నింటిని నియంత్రించు వాడా! భక్తకోటిని అనుగ్రహించువాడా! నాకు నీ అనుగ్రహము కావలెనని ఏడ్చుట కంటే నేనేమి చేయగలను చెప్పుమా! పొన్నంభళరాజా!"
5. "రాజా! పొన్నంభళములో (బంగారు చంద్రునిలో) ఆడు అమృతమా! నీ అనుగ్రహము పొందగోరి ఒక కొంగవలె దినమూ అదే ధ్యాసతో ఉన్నాను. నీ దర్శనముతో దాసులందరు విమోచనము పొందుచున్నారు. నా వరకు నీవు పాలలోని నేతి వలె పరోక్షముగా ఉండినచో లోకము యొక్క నిందకు నేను మాటపడుదునే!"
6. "నేను నీ భక్తుడని నన్ను ప్రశంసించు వారు యున్నారు, దూషించువారు యున్నారు. వారి ప్రశంసలను, దూషణలను తుచ్ఛగా ఎంచువాడను నేను. నీ అనుగ్రహమే గొప్పదని భావించితిని. ఈశా! నీ సత్యమైన ప్రేమికుల తిరుసభలో (దివ్యసభలో) ఇకనైన కనికరించి అనుగ్రహింపుమా పొన్నంభళములో ఆడువాడా!"

   (శివుని యొక్క భక్త సమూహమును (శైవులు) తమిళ వాఙ్మయమునందు, కనకసభ (బంగారు సభ) తిరుసభ (దివ్యసభ), మైసభ (ఆత్మజ్ఞానుల సభ)గా వివిద నామములో పేర్కొనబడియున్నది. అన్నియూ తన భక్తకోటికి సంబంధించినదే. వినాయకుడు, కార్తికేయుడు, వీరభద్రుడు, నంది ఆసీనముకాగా గణనాధులు, ఋషులు, మునులు, భూత నాధులతో కూడిన సభను ఇచ్చట పేర్కొనబడినది.)

7. “అంబళనటరాజా! విమోచనము పొందెదము అన్న కాంక్షతో ఉన్న నన్ను వేరు విధముగా ఆదుకొంటివి. అది కొత్తరకమే. కాని నేను సంరక్షకుడు లేని ఆవు వలె పరుగెత్తుచున్నాను. నీవు, నీ భక్తులు సమీపించు మార్గమునకు నన్ను తీసుకువెళ్ల లేవా?”
8. నన్ను నీ భక్తునిగా ఎంచి ఆదుకొన్న మహానుభావా! ఈశా! నీ దివ్యచరణములు తప్ప వేరెచట నేను శరణు పొందుట? నా మనస్సులోని మలినము కదా నిన్ను విడదీసినది. నిన్ను వీడినచో నేను దుఃఖపడెదను. నీ భక్తుల సమూహములో నన్ను చేర్చుకొనుము. లేనిచో నేను మరణించి, లోకుల నవ్వుకి లోనగుదును.
9. “నీ భక్తులు నవ్వుదురు, సంతోషించుదురు, ధ్యానించుదురు. నీ మహిమలను హెచ్చించి మాట్లాడుదురు, చెప్పుట వినెదరు, నీ దివ్యనామములన్నియూ వారు ఉచ్చరించు మంత్రములే అగును. నేను వారి మధ్యన ఉండి ఏమీ ఎరగని వాని వలె హేలన పడుట సరియగునా!”
10. “ఆది మూలము శివా! నన్నునీవు త్రోసివేయవని ఎంచి నీ దివ్యనామములను జపించియు, కన్నీళ్లుకార్చియు, నిన్ను స్తుతించియు, నోటితో ప్రార్థించియు, మననం చేసియు, కరిగిపోయి, మరల మరలా ధ్యానించి, స్తోత్రించి అలసిపోయి నిలుచున్న నాయందు కరుణ చూపించవయ్యా!”

# 22. దేవాలయ కీర్తనలు

1. “అన్నింటిని అధిగమించిన బ్రహ్మానందమా! నా ప్రేమ స్వరూపమా! పంచేంద్రియముల వలన నిజమును అసత్యముగా చూపించు ఈ లోకము నిలకడలేనిది. పరమాత్మవు నీవు వీటంతటికి అతీతుడవు. ఈశా! కావున నా హృదయమును ఏర్పడు ఉన్నతమైన జ్యోతివే! శివా! నిత్య ఆనందము పొందు స్థితిని నా కనుగ్రహించెదవు గాక!”
2. “అన్నింటికి సనాతనముగా, ఆఖరుగాను, పూర్తిగాను, అనాదిగాను మూలముగాను వ్యాపకము చెందినవాడా! ఈశ్వరా! నా శరీరము, ప్రాణము సంతోషముతో కరిగి పోవునట్లు శుభప్రదమైన నీ అనుగ్రహమును నీవు నా కొసగితివి. కాని నేను నీకు ప్రతి ఫలముగా ఇచ్చుటకు ఏదియు లేదు సుమా!”
3. “ఈశ్వరా! నాతండ్రీ! బుద్ధిని మరిపించు అహంభావమును అణిచివేసిన బ్రహ్మాండ ప్రకాశుడా! చంచలములేని తేటనైన జ్ఞానామృత సముద్రమా! మాటలకందని మహాజ్ఞానమా! నాకు ఇంద్రియములకు గోచరముకాని జ్ఞానప్రజ్ఞను నా కనుగ్రహించుము.”

(జ్ఞానప్రజ్ఞ = మనస్సు, బుద్ధి, చిత్త, అహంకారములను అంతఃకరణములకు అతీతమైనది.)

4. "జ్ఞానులు, మునులు, దేవతలు కూడ సంపూర్ణముగా తెలిసుకోలేని పరమపురుషా! సాటిలేని వాడా! జీవరాశులన్నిటికి మూలకారకుడా! జన్మపీడలను తొలగించు అమృతమా! గర్వమును తొలగించు దివ్య అనుగ్రహమా! నీ దరి చేరినచో నాకేమి కొరత?"
5. "మహానుభావా! తిరుపెరుందురై ఈశ్వరా! నీ అనుగ్రహము వలన నీకు తగినట్లు నా శరీరము శ్రేష్టమైన స్థితిని పొందినది. ఆనకట్టలేని నీరు ప్రవహించు నట్లు నీ జ్ఞానా మృతము నాకు అనుగ్రహించి, వేద నిగూఢమును నా మదిలోనికి ఎక్కించి నన్ను తేటనైన వానిగా చేసితివి. ఇక నీవద్ద నేను దేనిని వేడుకొని పొందవలె?"
6. ప్రేమించి కరిగిపోవు హృదయములో కొలువైన మహాజ్యోతియే! ఇంద్రియములందుండి వృత్తిచేయువాడా! పంచభూతాత్మక శరీరముగాను, పంచభూత ప్రపంచముగాను, దానికి అతీతముగాను కొలువైనవాడా! నిన్ను కళ్లార చూచి, హృదయములో నుంచి ఉప్పొంగు చున్నాను.
(పంచ భూతములైన పృధివి, అప్పు, అగ్ని, వాయువు, ఆకాశము, అను ఐదు భూతములు, వాటి తన్మాత్రలు (సూక్ష్మీకరణము) మొత్తము పదింటి సమ్మేళనమే ఈ శరీర ఉత్పత్తికి కారణములు. పంచ భూతములు బాహ్యములోనూ, శరీరములోనూ వృత్తిచేయుచూ ఒకే గుణమును గలిగియున్నది.)
7. "నీ దివ్య అనుగ్రహము వలన నా అజ్ఞానము తొలగినది. నా మనస్సున ఉదయించిన భానుడవు నీవు. నిన్ను ఆధారముగా పొందియే అన్నియూ అమరినవి. అన్నింటిలోనూ నీవున్నావు. నీవు లేనిదేదియూ చలనము, చేతన పొందుట లేదు. ఈ సత్యమెరిగిన వారు జ్ఞానులు కారా?"
8. "ఎల్లచోట్ల, అన్నింటా నీ అనుగ్రహము నింపిన మహాజ్ఞానరూపా! నిర్మలా! (మలినములేని వాడు) భక్త ప్రేమికుల హృదయమున నుండు తేనె వంటి వాడా! మహానందజ్యోతీ! నాకు బంధువులు ఒక్కరు లేరు. శత్రువులు ఒకరు లేరు! ఈశ్వరా!"
9. "ఈశ్వరా! నీవు గురువుగా నా వద్దకు వచ్చి నీ దివ్యపాద పద్మములను నాకు అనుగ్రహించితివి. అనుగ్రహించిన పిదప నన్ను వదలి నీవు వెళ్లిపోవు మార్గము ఏదైన ఉన్నదో? చెప్పుమా!" (లేదని యే చెప్పవలెను)
10. ఈశ్వరా! దేవాలయ దైవమే ! నిన్ను నా కిచ్చితివి. నన్ను నీ వానిగా చేసుకొంటివి. అంతులేని మహానందమును నేను పొందితిని. నీవు నాయందు పొందినది ఏది? మన ఇద్దరిలో ఎవరికి ఎక్కువ శ్రేయస్సు గలిగినది? నా శరీరమును దేవాలయముగా చేసుకొన్న తండ్రీ! నీ ప్రేమకు తగినట్లుగా నేను దేనిని నీకు ప్రతి ఫలముగా ఇవ్వగలను?"

# 23. చావు వాంఛ (విరక్తి భావము)

కార్యహీనునిగా, ఏ లక్ష్యము లేక జీవించుట కంటే చావటమే మేలని తోచును. తిరుపెరుందురై శివుని నుండి వీడియుండు (ఎడబాటు) టను సహించలేక శ్రీ మాణిక్యవాచగర్ పాడిన దశక పద్యమాల.

1. "ఈశ్వరా! నాయకా! మాయా కార్యములకు వశమైన నేను నీ పాద పద్మములను వీడియు ఇంకా మరణించక యున్నాను. కళ్లుండియు లక్ష్యమును విడనాడిన వాడిని నేను. కరుణామూర్తీ! ఏది చేయవలెనని నే నెరుగుదును. కాని నా మనస్సు ఈ లౌకిక జీవితములో వాంచలను పెంచుకొని నాశనమగుచున్నది!"
2. దేవతలును, ఇతరులును, ఘోర తపస్సు చేసి పుట్టలై, చెట్టులైరి. నీటిని, గాలిని స్వీకరించి శరీరము సుష్కింప జేసియు నీ దివ్య పాదములను చూడ శక్యము కాలేదు. నీవు కోరి వచ్చి నన్ను ఆకట్టుకొని లయతత్వమును ఉపదేశించితివి. నేను తల్లడిల్లి పోలేదు. కరిగిపోలేదు. నీ ఎడబాటును సహించక చావ లేదు. నా శరీరముపై వాంఛతో నున్నాను."
3. "శరీర కాంక్షతో ఉన్న వాడైన, నన్ను ఒక మనిషిగా గుర్తించి ఆదుకొంటివి. కాని నేనో తల, తోక తెలియక గర్వపడితిని. కాలకూట విషమును త్రాగుట, శత్రువుల త్రిపురమును కాల్చుట అన్నియూ నీ లీలలే. ధనుస్సును పూనినవాడా! తిరుపెరుందురైలో కొలువైన ఈశ్వరా! నేను శీఘ్రముగా చావుటకు నీ వనుగ్రహింపుమా!"
4. నారాయణుడు, బ్రహ్మ, నీపై మహాప్రేమ సలిపి, నీ అనుగ్రహము పొందగోరి ఘోర తపస్సు చేసిరి. అగ్నిలో వేసిన మైనము వలె కరిగిపోయిరి. కాని నా మనస్సు కఱ్ఱదూలము వలె కఠినమైనది. కఱ్ఱతో పోలిన నా కళ్లు నిన్ను జూడ అర్హత లేనిది. నా చెవులు చాలా కఠిన ఇనుమువంటిది ఈశ్వరా!
5. "నేను ఇంద్రియములు ప్రేరేపించు దారిన వెళ్లలేను. లౌకికుల కర్మసిద్ధాంతముల తత్వములకు లోనుకాను. ముమ్మూర్తుల కర్మలకు కట్టుబడలేదు. జ్ఞానామృతడవైన ఓ పరమాత్మా! నా శరీర వాంఛలను తొలగించి, నిన్ను వీడని అనుగ్రహమును ప్రసాదించుదువుగాక! తిరుపెరుందురై పరమేశ్వరా!"
6. "అజ్ఞానముతో పుట్టిన ఈ జన్మము వద్దని నా శరీరమును ముక్కలుగా ఖండించలేను. అగ్నిలో పడి చావలేను. నీ అనుగ్రహమును ఎట్లు పొందుటయో తెలియజాలకున్నాను. ఈ శరీరగూటిని మోయుటకు సహించనైతిని. ఎచ్చట శరణుపొందవలెనని తెలియజాలకున్నాను. నిన్ను వీడి యున్నాను. దేనిని చేసినచో శాంతిపొందుదునో. "అది చేయుము" అని చెప్పి అనుగ్రహించుదువు గాక! ఈశ్వరా!"

7. "నెలవంక దాల్చిన మహామహా! (చంద్రశేఖరా!) నీ దాసుడైన నేను దూరమున నుండి వ్యథ పొందుట తగునా? అల్పుడైన నేను నిన్ను సర్వదా తలంచుటయు లేదు, ధ్యానించుటయు లేదు. పిశాచము వలె తిరుగాడుతున్న నన్ను చేరదీసి ముక్తికి మార్గమును చూపి అనుగ్రహించవయ్యా ఈశ్వరా!"
8. "పరమాత్మా! నిన్ను తలంచక, ఎడబాటుతో, ఏమి చేయవలెనని తోచక విచారించుచున్నాను. నీ దాసుడైన నేను కష్టపడుట తగునా? బ్రహ్మ, ఇంద్రాది, దేవతలు కూడ నీ దివ్య దర్శనము కోరి యుండగా, నా పాపములు తొలగించి నీ దర్శనము నాకు చూపి అనుగ్రహించితివి. నీ భక్తుల కూటమిలో నన్ను చేర్చుకొనుము!"
9. "ఇంద్రాది దేవతలు నీ దివ్యదర్శనము పొందక నిలుచున్నారు. యమునిని వధించిన ఓశివా! నీవు నన్ను ఆకట్టుకొంటివి! గంగాధరా! అగ్నిరూపా! నారాయణుడు కూడ చూడలేని నీ దివ్యపాదములను, చకితుడైన, వివేకములేని నాలాంటి వాడు నీ దరిచేరి, దాసుడై, నీసేవ చేయుటకు అనుగ్రహింపుమా!"
10. హిమవత్పుత యైన పార్వతి భాగస్వామియే! కైలాసమున నుండు కరుణాసముద్రమా! నీ దివ్యానుగ్రహ సముద్రమున మునిగి, భజించి, సుఖపడి నేను పరవశపడియుండవలె. కాని దానికి మారుగా లోక సుఖములందే మనస్సుంచి గర్వపడితిని. కాబట్టి దాని నుండి విమోచనము పొందలేనోనని జంకుతున్నాను. ఈశ్వరా! అనుగ్రహించవయ్యా!"

# 24. శరణాగతి దశకము

శివుని నుండి దూరముగా నుండుటచే తాను ఒంటరిగా ఉండుటను చింతించి, శరణాగతి పొందగోరి పాడిన పద్యదశకము.

1. "నాయకా! ఈశ్వరా! పరిపక్వమొందిన మనస్సు గలవారు నీ దివ్యపాద పద్మములను పొందిరి. మనోపక్వములేక, అజ్ఞానముతో నిండి, పురుగులకు సొంతమైన ఈ శరీరముతో, అవిద్యతో కూడిన మనస్సుతో నేను నీయందు శరణు వేడుచున్నాను."
2. "నీ దరి చేరుటచే పాముకి గొప్పతనము వచ్చినది, గంగకు వినయము వచ్చినది. నేను నీకు చిరాకు కల్పించు కార్యములనే చేయుచున్నాను. నా అల్పబుద్ధిని మన్నించి ఓర్చుకొనుము. నా జన్మను వేరుతో పెకలించివేయుము. నీయందు శరణు పొందియున్నాను."
3. దేవతలందరికి అనాదియైనవాడా! నన్ను జన్మరహితుని చేసి పరాఉన్మత్తు (భక్తిని) నొసగువాడా! దేనినైనా సాధించు నేర్పు గలవాడా! నా చిత్తములో కొలువైన వాడా! హరియు, అయ్యడు (బ్రహ్మ)లు ఎరుగలేనివాడా! నీయందే శరణు పొందగోరుచున్నాను. ఈశ్వరా!

4. "దుఃఖ సముద్రములో చిక్కుకున్న భక్తులు నీ దివ్య పాదములతో ఒడ్డుకు చేరుదురు. నేనో స్త్రీ వ్యామోహపు అలలో పడి కామమను సొర చేపకు చిక్కి నాశమగుచున్నాను. అయిననూ నన్ను నీకు అప్పగించి శరణు కోరుచున్నాను."
5. "నేను ఉంగరాల జుట్లు గల స్త్రీ వ్యామోహమను కుట్రలో పడి శుష్కించితిని. అజ్ఞానముతో ఏర్పడిన దేహము కామము చుట్టూ తిరుగుచున్నది. ఉమాదేవి భాగస్వామియైన నీ యందు నేను శరణు కోరుచున్నాను."
6. "స్త్రీలు కవ్వముతో పెరుగు చిలుకు నపుడు, కుండలోని పెరుగు నలుదిక్కులకు చెదరి తిరుగునట్లు నా జన్మకర్మల వలన మనస్సు ఏకాగ్రత కావడము లేదు. మంచిని ఎంచక ఛిద్రమగుచున్నది. దాని వలన మనోభ్రంశము పొంది నీయందు భక్తిలేక, నిన్ను స్తుతించలేకయున్నాను. ఈ స్థితి నుండి నన్ను రక్షింపగోరి నీ యందు శరణు పొందుచున్నాను."

(ఈశ్వరుని యెడ శరణుపొందినచో మన మనోభ్రంశము వీడి, మాయతొలగి, సుఖము ఏర్పడును.)

7. "మెరుపు గొలుపు కళ్లను, సన్నని నడుముతో కదలియాడు స్త్రీల సాంగత్యములో పడి సుఖమును పొందగోరి, దుఃఖమును కోరి తెచ్చుకొన్న వాడిని నేను. నా తప్పులను సహించి, మన్నించి, దుఃఖమునుండి కడతేర్చగోరి నీయందు శరణు పొందుచున్నాను."
8. "మామిడి టెంక చీలిక వంటి కళ్లు గలగిన ఉమాదేవి భాగస్వామి! నన్ను నీ దివ్య చరణములవద్దకు తీసుకు వెళ్లుదువో లేక నరకములో త్రోసివేయుదువో నాకు తెలియదు. నీవు నన్ను చీదరించుకొన్నచో నా మనస్సు చాలా విచారము చెందును. నన్ను నీ దాసునిగా చేసుకొనుమా!"
9. "పరమేశ్వరా! నీ భక్తులు నీయందు ప్రేమ సలిపి, నీ దివ్యపాదముల దరిచేరి, శాశ్వత సంపదయను ముక్తి పొందిరి. నేను వారి వలె ముక్తి పొంద గోరుచున్నాను. కాని దానిని పొందుటకు అవలంబించవలసిన ధర్మమార్గములు, పాటించవలసిన విధానములు నేనెరగకయున్నాను. నిన్ను తెలుసుకొనుటకు తగిన జ్ఞానము లేని మూర్ఖుడుగా యున్నాను. కావున నీవే నాకు నేర్పించవలెనని కోరి నీయందు శరణుపొందుచున్నాను."

(శ్రీ మాణిక్యవాచగర్ కొరకు దైవమే (ఈశ్వరుడే) మానవ రూపములో జ్ఞాన గురువుగా వచ్చి తనను ఆదుకొనెను. అట్లుండ 'ధర్మమార్గములు, పాటించవలసిన విధానములు' నేనెరగక ఉన్నాను అనడము ఎందులకని ప్రశ్న లేవచ్చును. తను సాధారణ ప్రజల మనోభావన స్థితి నుండి దైవమును కోరుకొనుట, గర్వము, అహంభావము వీడనాడి దైవమందు శరణు పొందమని ఆతను నొక్కి వక్కాణించుచున్నారు.)

10. ఈశ్వరా! నీ అనుగ్రహమను అమృతమును నేను కోరుకున్నట్లే నాకిచ్చి అనుగ్రహించితివి.

ఆ జ్ఞానామృతమును మ్రింగిన నేను అది నా గొంతుకలోనే నిలబడిపోయినది. దీనికి కారణము నాయందు సత్కర్మ ఫలములు లేనిదే. నేను విచారించుచున్నాను. ఈ సమయమున నీవే త్రాగుటకు నాకు నీరందిచ్చి ఆ జ్ఞానామృతము నాలో ఇముడునట్లు చేసి నన్ను అనుగ్రహింపుమా! నీ శరణు వేడుచున్నాను ఈశ్వరా! నా ప్రాణనాథా!

## 25. సంకల్పదశకము

పరమేశ్వరుని దివ్యపాదములందు మాత్రమే తాను మనిషినై ఉండవలెనని కోరి, శ్రీమాణిక్యవాచగర్ దీక్షభూని మహత్తరమైన ప్రేమానుబంధమును ఇచ్చుట ఈ క్రింది దశకములో వర్ణించియున్నారు.

1. కన్నము పొడవని ప్రకాశించు మాణిక్యము వంటి నీ దివ్యపాదములను నాకు ఇచ్చి అనుగ్రహించితివి. లోక జీవితమను అజ్ఞానచీకటిని పారద్రోలి నన్ను నీ ఉన్నత లోకమునకు (పరస్థితి) తీసుకు వెళ్లెదవని కోరుచున్నాను. (ఇహము, పరము అన్నట్లు )
2. అల్లికలతో కూడిన నరములు, మెదడు, ఎముకలు, మాంసము, కప్పియుంచిన చర్మము చొక్కా వలె ఉన్న శరీరములో నేను ఇమిడి ఇక ఉండలేను. అవన్నియూ క్షీణించవలసినవే. లోకాతీతమైనదిగా ఉండు నీ అమృత స్వరూపమునే వేడుకొని నేను దానిని పొందుటకు ఆశ పడుచున్నాను.
3. శరీరముపై విరక్తి చెంది ఆత్మ స్వరూపమునందు చిత్తమును ఉంచి ప్రయత్నము చేయునది సాధనకు ఆవశ్యకము. దేవాదిదేవా! గురుమాణిక్యమే! శరీరమును ఛిద్రింపజేసి నన్ను నీ యందు చేర్చుకొనుము. నా కొరకు నన్ను కరుణించి ఆదుకొనుమా!
4. దు:ఖమునకు, అల్పమునకు నెలవైన ఈ శరీర జీవితము నాకు ఇకవద్దు. ప్రేమానుభూతిని పొంది నీయందు కరిగి నీ అనుగ్రహ జ్యోతిని చూచి నీ దివ్య పాద పద్మములను చేరుటకు ఇష్టపడుచున్నాను.
5. పండిన చింత పండుకు ఎట్లు పెంకు అతకక యుండునో అట్లే నేను ఈ అల్ప శరీరముపై కాంక్ష లేక యుండవలె. నీ అనుగ్రహమునకు నేను పాతునని నన్ను గుర్తించి నీవు అందరికీ చెప్పవలె. ఇదే నా కోరిక! అనుగ్రహింపుమా!
(చింతపండు, పెంకుకు ఎట్లు అతకక ఉండునో అట్లే భక్తుడు అందరితో కలిసి యున్ననూ, కాంక్షలేక లౌకిక ఆశలకు అతీతుడై యుండవలెను.)
6. “ఈ శరీరమును మోసి శుష్కించితిని, కుక్కనైతిని, ఇకచాలు. ఈ లోకములో నుండజాలను. దీనిని తొలగింపుము. ఓ నిత్యముక్తా! ఇకపై నీ ముఖం జ్యోతిరూపములోను, నీ చిరునవ్వును చూడ గోరుచున్నాను. నాలాంటి వానిని అనుగ్రహింపుమా!”

7. "దేవలోకమువారు, భూలోకమువారు స్తుతించి నమస్కరించు ఓ ఉన్నతుడా! మహాదేవా! ముక్తినొసగి ఆదుకొనుము! నీ సహస్రనామములతో పాడి స్తుతించి నిన్ను కొలువ ఆశ పడుచున్నాను. నన్ను చూచి అనుగ్రహింపుమా!"
8. "నీ దివ్య స్వరూపమును నా చేతితో నిమిరి, దానిని నా శిరస్సుపై ఉంచుకొని, మహేశ్వరా! ఓ భక్తప్రియా! అని స్తుతించి, మైనము వలె హృదయము కరిగిపోవలెనని ఆశపడుచున్నాను."
9. స్వయంప్రకాశుడవైన ఓ దేవాది దేవా! శంకరా! మహాపాతకములతో నిండిన ఈ శరీర అవయవ కూర్పును త్యజించి, నిన్ను దర్శించి, నీ దివ్య భక్తానుగ్రేసరుల సమూహములో చేరుటకు నేను ఇష్టపడి, తపించిపోతున్నాను సుమీ!"
10. మీనము వంటి కళ్లు గల స్త్రీల సాంగత్య వలలో చిక్కి నేను కుక్కనై నశించితిని. ఉమాదేవిని ఒక భాగమున గలిగిన మహాదేవా! సిద్ధేశ్వరా! నీవుతప్ప వేరెవరు నాకు తోడు? "ఓరీ భయపడకుము" అని ఒక్క మాట నీ పగడము వంటి ఎర్రనైన నోటి నుండి వెలువడి, నేను వినగోరి ఆశపడుచున్నాను.

(ఈ దశకములో తను ఒక ప్రత్యేక సిద్ధ పురుషుడు, మహాయోగిగా, అనుగ్రహవంతుడుగా తలంచక ఒక సరాసరి మానవ మాత్రునిగా తలంచి వారికి ఏర్పడు అన్ని ఆటంకములు, చపల చిత్తములను పేర్కొని, దానినుండి విమోచనము పొంది, ముక్తి, మార్గము కొరకు దేవుని వేడుకొను రీతిలో తన 'ఆశలను' 'ఇష్టములను' 'కోరికలను' వర్ణించియున్నారు. దీనినే **సంకల్ప సిద్ధి** అందురు.)

## 26. ఆశ్చర్యదశకము

తాను అనర్హుడుగా ఉన్ననూ దైవము (ఈశ్వరుడు) తనను ఆతని భక్తకోటితో చేర్చుకొన్న రీతిని, కరుణకు విస్మయము చెంది ఈక్రింది దశకమును తిరుపెరుందురై లో పాడినది.

1. దేవుని తత్వమును ఒక కూడబెట్టిన సంపదగానో, లేక స్వయంప్రకాశ మణిగానో చూడనైతిని. యవ్వన స్త్రీల సాంగత్యముతో అల్ప సంతోషాదులనే కోరి వెళ్లితిని. అట్లున్ననూ సాటిలేని, ఉపమానము లేని ఆ దైవము! ఆ సర్వాత్ముడు! నన్ను తన భక్త కోటి సమూహమున చేర్చుకొనినది ఒక ఆశ్చర్యకరమైనదే కదా!"
2. "సన్మార్గము గురించి తలంచనైతిని. తలంచిన వారివద్దను చేరనైతిని. పాపములతో పుట్టి దుఃఖములతో నిండియున్న నన్ను ఆదైవము ఈశ్వరుడు! సర్వదాత! తన దాసునిగా చేర్చుకొనెను. ఇది ఆశ్చర్యకరమైనదే కదా!"
3. ప్రేమించిన వారికి సులభలభ్యుడు, సున్నితమైన వాడు, త్రినేత్రుడు! తల్లి వంటి ప్రేమ

సలుపు దయ గుణానిధి. నా పాప కర్మలను పోగొట్టి తన భక్తుల సమూహములో నన్ను చేర్చుకొన్నది ఒక ఆశ్చర్యకరమైన సంగతే కదా!"

4. దైవానుగ్రహముతో మనస్సంతోషముతో, ఉత్సాహములతో ఉండుటకు దారి తెలియక నరకము దారిలో వెళ్లుచున్న నన్ను ఈశ్వరుడు! కరుణామూర్తి! తన భక్తుల సమూహములో చేర్చుకొని కరుణించెను. దీని గురించి ఆశ్చర్య పడిన లౌకిక ప్రజలు నన్ను పిచ్చివాడనిరి. (శ్రీమాణిక్యవాచగర్ తన జీవితగాధలో: యుద్ధ గుర్రములు కొనుటకు గాను పాండ్యరాజు ఇచ్చిన ధనకనక భాండాగారమును దేవాలయము నిర్మించుటకు ఖర్చుచేసెను. దీని వల్ల రాజు యొక్క కోపాగ్రహమునకు లోనైన వాడయ్యెను. రెండవది సుఖభోగములతో అమరిన తన మంత్రి పదవిని వద్దని వీడి వెళ్లెను. ఈ కారణముల వల్ల లౌకిక ప్రజలు 'ఇచ్ఛలేని' వాడుకనుక 'పిచ్చివాడని' తలంచిరి.
"దైవత్వము నందున్న పిచ్చియే తనను (శ్రీ మాణిక్యవాచగర్‌ను) మృత్యుంజయుడుగా చేసినది.

5. స్తుతించు వారి సమూహములో చేరుటయో, పుష్పములతో నిన్ను అర్చించి పూజించుటయో చేయలేదు. కామవాంఛలతో చిక్కుకొని యున్నవాడను నేను. ప్రళయకాలములో జ్ఞానజ్యోతి ప్రకాశుడైన ఆ పరమాత్ముడు! ఆ సర్వగామి! పరమేశ్వరుడు! నన్ను తన భక్తుల సమూహముతో చేర్చుకోవడం ఎంత ఆశ్చర్యమో!
(శ్రీమాణిక్యవాచగర్ స్వతహాగా యోగివరుడు, కారణ జన్ముడు, జీవన్ముక్తుడు. సదాదైవమును పూలతోను, మనస్సుతోను అర్చించిన యోగి, త్యాగి, స్త్రీ సాంగత్యమును త్యజించినవాడు. తాను పై పద్యమున చెప్పినది ఒక సాధారణ లౌకికునకు ఏర్పడు కామ వాంఛలు, మనో చంచలములను చెప్పక చెప్పి, తనకు అవి ఏర్పడినట్లు చెప్పుకొని ఇతరులకు సన్మార్గమును ఉపదేశించిరి.
"దైవమును పుష్పములతో అర్చించినచో తగిన ఫలముండును. అట్లు అర్చించు వారితో చేరియున్ననూ ఫలముండును. **'నీ పాదకమల సేవయు నీ పాదార్చకులతోడి నెయ్యము'** అన్నట్లు. ఇతర స్త్రీలతో కలియిక చేటుకు దారి తీసి, ఇరు కుటుంబములు పాడగును.")

6. నా అజ్ఞానము వలన నీ దివ్య నామమైన 'పంచాక్షరీ' – '**నమశివయ**' పలకనైతిని. నా జన్మకర్మల వలన సత్సంగమైన శివజ్ఞానము పొందిన భక్తులతో చేరనైతిని. మట్టిలో జన్మించి మట్టిలోనే కలిసిపోవుటకు సిద్ధముగానుండు అల్పుడనై నన్ను దైవము కరుణించి తన వారితో చేర్చుకొనెను. ఇది ఎంత ఆశ్చర్యకరమైనదో!

7. "పలు రంధ్రములతో కూడి, పురుగులతో నిండినది, క్షీణించ దగినదియునైన ఈ శరీరమును సత్యమని నమ్మి, ఈ దుఃఖ సముద్రములో కొట్టు మిట్టాడుతున్న నన్ను నా తండ్రీ! శివ పురాంతకుడు (శివుడు) తన భక్త సమూహములో చేర్చుకొనినది ఎంత ఆశ్చర్యకరమైనదో!"

(నవరంధ్రములతో నిండినదై, పురుగులతో నిండిన కొన్ని అవయవముల కూర్పునైన ఈ శరీరము ఒకప్పుడు క్షీణించవలసినదే. అట్లుండ శాశ్వత, సత్యమైనదిగా చేయుట ఎట్లనగా ఈ శరీరమును దైవచింతనతో, దైవకార్యములకు, సేవకు ఉపయోగించుకొనుటయే!)

8. "నేను పరిపక్వమొందవలెనని ఎంచిన ఆ దైవము నాయందు అశాశ్వతమును విడదీసి, నా శరీరములో నాభిద్వారా ప్రవేశించిన ఆ మహాప్రభువు! మహాదేవుడు! నన్ను పక్వమొందించిన పిదప నన్ను తన స్వరూపముతో తన వానిగా చేసికొని ఆశీర్వదించినది ఎంతటి ఆశ్చర్యమో కదా!"
9. "పుష్పము యొక్క వాసన ఎట్లు కంటితో చూడలేమో అట్లే దైవమును కంటితో చూడజాలము. మానవ జన్మము దైవమును దర్శించుటకొరకే. కాని భోగ జీవితము పలు పాపకార్యములను పురికొల్పి దిశను మార్చి జీవితమును వ్యర్థముగా చేయుచున్నది. అట్లున్న నన్ను దైవము (శివుడు) తన దిక్కుగా మరిల్చి ఆదుకొన్నది ఆశ్చర్యకర విషయమే కదా!"
10. "నేను అజ్ఞానముతో నిండిన శరీరమును గొప్పదనుకొని నరకములో పడయుంటిని. అది ఒక అధర్మమైన, నరకము యొక్క వాకిలి. త్రిపురమును తన నవ్వుతో భస్మము చేసిన ఆ పరమేశ్వరుడు! నా అధర్మమైన మార్గము నుండి నన్ను మరిల్చి ధర్మమైన, శాశ్వతమైన మార్గమును నిర్దేశించినది ఒక ఆశ్చర్యమేకదా!

# 27. ఐక్యదశకము

'అద్వైతము' అనగా రెండు కాదు ఒక్కటే. వేరు వేరుగా తోడుగా ఉన్నది ఒక్కటై, ఐక్యమై, సంగమమై, ఒక దానిలో ఒకటి లీనమైన తత్వమును ఇచ్చట క్రింది దశకములో శ్రీ మాణిక్యవాచగర్ పరమాత్మయైన శివునిలో చేరిపోవుటకు (జీవాత్మ పరమాత్మతో కలియిక) పలు విధములుగా పరితపించి పోయి" "నీలో ఎపుడు చేరుదునా? నీలో ఎచ్చట చేరుదునో! నీలో ఎట్లు చేరుదునో?" అని ప్రతి పద్యము చివర తన మనో వాంఛను తెలుపుచున్నారు.

1. "అల్పుడైన నాకు అనుగ్రహము నొసగకోరిన ఆ కరుణామూర్తి, స్వయంప్రకాశుడైనవాడును, నారాయణుడు, బ్రహ్మ ఇరువురు పొందలేనిదైన అనుగ్రహమను దివ్య అమృత ఔషధమును, ఆ నిర్మలమైన మాణిక్యముతో కలిసిపోవుట ఏనాడో?"
2. "రాజధిరాజా! ఈ లౌకిక జీవితమును ఇక సహింపజాలను. ఇంద్రియములను ఊబిలో చిక్కుకొనక, శివపాదమందు శరణుపొంది, ఊట నీరు మట్టిని ఎట్లు చీల్చుకొని వచ్చునో అట్లు నా మనస్సు కరిగి, నిను పిలిచి, నీ అఖండమైన దివ్య జ్యోతిని పొందుట ఏరోజో?"

3. "గర్వము ఉన్నవారికి ఊహకు కూడ అందనివాడును, గర్వములేని వారి వద్దకు తానే స్వయముగా వచ్చి ఆకట్టుకొను మసిలేని మాణిక్యము, భక్తులు, దాసుల హృదయములో పరమానందము నింపువాడిని, నోటితో పాడి, స్తుతించి, సువాసన పుష్పములు చల్లి వానితో లయమగునది ఏరోజో?"

4. "శివుడు వాక్కులకు, మనస్సుకు, వస్తువులకు అందనివాడు. జ్యోతి స్వరూపుడు! తేనెగా, పాలుగా, అమృతమువంటి తీయనైనవాడు, శుభకరుడు గీటుపడని మాణిక్యము వంటి వానిని నేను పొందుట ఏరోజో!"

5. "ఊర్ధ్వలోకమంతా వెతికియు, భూమికి అధోఃలోకమంతా వెతికియు, నారాయణునికి, బ్రహ్మకి ఎరుగజాలని తత్వమై నిలచినది శివం. ఆ ఉత్తముడు నాపై కరుణబూని నన్ను ఆదుకొన్నది ఆహా! ఓహో! అని వాని మహిమను స్తుతించి వానిలో లయమగునది ఎపుడో?

6. "నాపై కనికరించి, దయజూపి, గురువుగావచ్చి నాకు పరమానందమును అనుగ్రహించెను. కాని నేనో వానిని వదిలి భూలోక వాసనలకు లోనైతిని. ఇక ఏడ్చియు, చింతించియు, భక్తి సలిపియు, మరలా ఆ మహత్వము నేను ఎపుడు పొందుదునో?"

7. "భక్తి సలపలేని వారికి ఊహకు కూడ అందజాలడు. పంచభూతములు (ఆకాశ, గాలి, నిప్పు, నీరు, భూమి) పరమాత్మయు వేర్వేరు కాదని ఎందరు ఎరుగుదురు? అనంతమైన ఆ పరబ్రహ్మమును దర్శించి శరీరము పులకరించి, గొంతుక పొడబారునట్లు శబ్దించి, కన్నీరు ఏరులవలె పారించి మనోః పుష్పములతో ఆ మనోమయుని అలంకరించి, అర్చించునది ఏనాడో?"

8. "భక్తి పరవశముతో హృదయము ద్రవించి, నిలుచున్నా, కూర్చున్నా, పడుకున్నా, లేచినా, ఎడతెరిపి లేక ఆ పశుపతిని స్తుతించి, నాట్యమాడి, శరీరము పులకరించి, వాని దివ్య శరీరమును దర్శించి, అందము చూచి వానిలో లయమగుట ఏనాడో?"

9. "అధోః, మధ్యమ; ఊర్ధ్వ; లోకములంతటికి తండ్రియు, తల్లియు తానే అగును. ఆ సర్వరూపియే నన్ను గొప్పమనస్సుతో ఆదుకొనెను. జన్మ సాఫల్యమునకు ఔషధము వాడే! అమృతధారయే! జ్ఞాన జ్యోతియే! అని ఎప్పుడు స్తుతించి ఆ దైవము దివ్యపాద పద్మములను నా శిరస్సుపై ఉంచి లయమగు రోజు ఏనాడో!"

10. "అన్నింటిని సృష్టించి, రక్షించి, లయపరచువాడా! సర్వత్ర సిద్ధ సంకల్పుడా! దేవతలకు ముందే ఉన్ననూ నవనూతన సనాతనా! నేను పరిపక్వము చెందుటకు ముందే వైదికుడవై వచ్చి నన్ను ఆదుకొన్న ఓ మూలపురుషా! ఉన్నతమైన నీ తత్వమును విడువక పాడి స్తుతించి నీ పాద పద్మములందు ఐక్యము పొందుట ఏనాడో?"

# 28. నిర్జీవన దశకము

ఆదుకొన్నవాడు వదిలివేసినచో జీవించ జాలమని ఎరిగి స్తుతించినది. ప్రతి పద్యములో తిరుపెరుందురైలో కొలువైన శివుని శివపురేశ్వరా! అని కొలిచి వేడుకొనుట.

1. "ఓ సర్వగామి! నాకు నీవు తప్ప వేరే ఆదరణ లేదు. అట్లుండగా నీవు నన్ను ఆదుకొని అనుగ్రహించక పోయినచో దాని గురించి నేనెచ్చట, ఎవరితో కొరతలు చెప్పుకొనను? ఇచ్చట జీవించ లేనివానినైన నన్ను నీవేకదా స్వీకరించి కరుణించవలె!"
2. "సాధనలో మనస్సు సలపని నన్ను ఆదుకొన్న మహా రత్నమా! ఓ కరుణామయా! దేవతలెరుగని పరమాత్మా! విష్ణువు, చతుర్ముఖులకు అందని జ్ఞానరూపి! నీవు తప్ప నాకెవరూ దిక్కులేదు. నన్ను పూర్తిగా నీకే సొంతము చేసుకొనుమా! ఓ శివపురేశ్వరా!
3. "నీ దివ్య పాదములు తప్ప వేరే గతిలేదు నాకు. నీయంతట నీవే వెతకి వచ్చి నన్ను ఆకట్టుకొన్న శివా! కృపానిధి! నేను కలిసియున్నది నీతోనే! సంతోషము పొందునది నిన్ను దర్శించియే! నా కోరికలు చెప్పునది నీవద్దనే! కృంగిపోయిన నేను ఈ లోకములో జీవింపజాలను. నీవు రమ్మని పిలచి నన్ను అనుగ్రహింపుమా!"
4. "ముల్లోకముల, ఎల్లలు దాటి, ఆదియు అంతములేనిదై, పాదము, శిరస్సు చూడశక్యముగానిదై, ఏడేడు పదునాలుగు లోకములకు వ్యాపించి నిలచిన దివ్యజ్యోతిర్లింగ స్వరూపా! సర్వాత్మా! అఖండములో నున్న పరలోక జీవితమే నేను పొందగోరుచున్నాను. నిన్ను వీడి నేను జీవించ లేను. నన్ను రమ్మని పిలిచి అనుగ్రహింపుమా!
5. "శివపురేశ్వరా! మృదువైన మాటలు గలిగిన ఉమాదేవి యొక్క భాగస్వామీ! పంచ కర్మేంద్రియములను, పంచజ్ఞానేంద్రియములను, మనస్సు నీయందు ఉంచివేసి ఈ భూలోకములో నేను జీవించలేను. నన్ను నీ యందు చేర్చుకొనుటకు, నన్ను రమ్మని పిలచి అనుగ్రహింపుమా!"
6. "ఓ తిరుపెరుందురైలో కొలువైన పరమేశ్వరా! శివపురశ్వేరా! నీ దివ్య అనుగ్రహమును నా మతిభ్రంశముతో మరచిన అల్పుడను. మరచిన నేను శరీరముతో కంపించి పోతిని. ఉన్ననూ నేను ఈ లోకములో జీవించజాలను. ఈ సత్యము ఎరిగి నీవు నాయందు అనుగ్రహించి రమ్మని చెప్పి నీలో చేర్చుకొనుమా!"
7. "ఓ భక్తప్రియా! ఓ సుఖదుఃఖరహితుడా! సూర్యునికి ప్రకాశము ఇచ్చి ప్రకృతిని రక్షించిన దివ్యప్రకాశా! లోకములోని ఏ వస్తువుని కోరక నీ ఆశీస్సులనే ఆశించి హృదయము కరిగి నీతో కలిసి యుండ గోరుచున్నాను. కావున నీవు నన్ను ఆదుకొని అనుగ్రహించవలె సుమా!"

8. “శాశ్వతముగా ఉండుటకు అమృతము వంటి వాడా! పొందదగిన పరమాత్మవునీవు! వెగటు పుట్టని ఆనందమా! నన్ను కరుణించి ఒకంత దాటించితివి. ఇక నిన్ను వీడి ఉండి జీవింపజాలను. రమ్మని పిలచి నన్ను అనుగ్రహింపుమా!”
9. “అఖండ జ్యోతిర్లింగమై నిలుచుండి, నారాయణుని, బ్రహ్మల గర్వమును అణచితివి. ఏనుగు చర్మమును ధరించిన నీవు అహంను జయించిన సూచనేకదా! అహంకారము లేనిచో పాపములు నశించును. పాపములు ఏవి లేకున్నచో ముక్తికి మార్గమే కదా! ధర్మస్వరూపా! అనుగ్రహింపుమా!”
10. “ఉమాదేవి భాగస్వామి! నీవు తప్ప నాకు వేరే ఆదరణ లేదు. మహా మహుడా! నిన్ను తప్ప వేరే దైవమును నేను స్తుతించియో, పూజించియో ఎరుగను. తోడుగాను వారిని కోరను. నిన్ను వీడి ఈ లోకములో జీవించలేను. నన్ను ఆదుకొని అనుగ్రహింపుమా!”

## 29. అనుగ్రహదశకము

కైలాసమున కేగుటకు తగిన మార్గములను చూపించగోరి వేడుకొనుట. ఈక్రింది పద్యములలో అమరినది. ప్రతి పద్యము చివర అదెందుకే అని తెలుగు పదమును వాడి ‘అదెందులకు?’ ‘అందులో ఏముంది?’ ‘నేనుండ భయమేల’ అను పలు అర్థములు వచ్చునదిగా శ్రీ మాణిక్యవాచగర్ వాడియున్నారు.

1. “బ్రహ్మాండమైన జ్యోతి స్వరూపా! ఉంగరాల జుత్తును, బలిసిన వక్షోజములు గలిగిన ఉమాదేవి భాగస్వామి! నారాయణునికి, బ్రహ్మకు అందనివాడా! ఆదిమూలమా! నిరంజనా! నిన్ను కోరి పిలుచు చున్నాను. అదెందులకు అని మారు ప్రశ్న వేయక అనుగ్రహింపుము!”
2. “నటరాజా! త్రినేత్రుడా! ప్రపంచములోని అన్ని వస్తువులను పనిచేయించు వాడా! సాటిలేనివాడా! చర్మచక్షువులకు దృగ్గోచరము కాని వాడా! నేను కోరి రమ్మన్నచో ఏమిటని అడుగు! ‘భయపడకుమని’ చెప్పుమా! నిజదర్శనమివ్వుమా!”
3. “నా నాయకుడా! నా జీవ మూలపురుషా! ఉమాదేవి, గంగాదేవి ఇరువురుకి నాయకుడా! కాముని (మన్మథుడు) కాల్చి భస్మము చేయుటకు త్రినేత్రమును తెరిచినవాడా! నీ దాసుడైన నేను నిన్ను రమ్మని పిలిచినచో ‘భయపడుకు’ మని చెప్పి దర్శన మివ్వుమా!”
(ఉమాదేవి, గంగాదేవి శివ స్వరూపములే. కామ(మన్మథుని) దహనము చేసినచో సాధకునకు అజ్ఞానము వీడి జ్ఞానము తేటనగును.)
4. “నారాయణుడు, బ్రహ్మయు చింతించి, కోరి ప్రార్థించినందులకు నిన్ను నీవు బహిరంగ పరచుకొన్న తండ్రీ! ఓ పురాణవేత్తా! నీవు నాకు దర్శన మివ్వవలె సుమా! ఓ నిర్మలా! మచ్చలేని మాణిక్యమా! నన్ను అనుగ్రహింపుమా!”

5. “డమరుకం వంటి నడుము, ఉంగరాల జుట్టును గలిగిన ఉమాదేవి నిన్ను ఆలింగనము చేయుటవలన ఆమె గట్టినైన చనుమొలలు గ్రుచ్చుకొని నీ చాతిపైన, వీపుపైన గాట్లు ఏర్పడినవి. పచ్చటి తోటలతో నిండిన తిరుపెరుందురై పరమేశ్వరా! నా భయమును పోగొట్టి నన్ను రమ్మని పిలచి అనుగ్రహింపుమా!”
6. “ఓ జ్ఞాన స్వరూపా! నిన్ను ధ్యానించు వారికి హృదయములో మహా తీపినిచ్చు, అరుదైనదియునైన అమృతం వంటి వాడవు. నిన్ను ప్రార్థించి, కోరి పిలుచు నన్ను కరుణించి, దర్శనమిచ్చి, అనుగ్రహింపుమా!”
7. “ఓ సర్వరూపి! ఓ వికృతా! (వేర్వేరు రూపములు ధరించువాడా!) మహామహుడా! మేరు పర్వతమును ధనుస్సుగా బూని త్రిపురములను కాల్చితివి. కాలితో యముని తన్నిన అగ్నివంటి శరీరముగల నాయకా! నిన్ను కోరి పిలుచుచున్నాను. ‘భయపడకు’ అని చెప్పి నన్ను అనుగ్రహింపుమా!”
8. ఓ కామ రహితా! త్రినేత్రా! మునులు, ఋషులు పూజించు ఓ మూలపురుషా! పరిపక్వ స్వరూపా! నిన్ను స్తుతించి, పాడు వారు పుణ్య పురుషులగుదురు. గురురాజా! సిద్ధపురుషా! నీ దాసుడైన నేను నిన్నుకోరి పిలుచున్నాను. ‘భయపడకుమీ’ అని చెప్పి అనుగ్రహింపుమా!
9. యవ్వనము, వయోధికములో ఏర్పడు వాంఛలను నిర్మూలించిన పవిత్రుడా! ఓ యోగి! నీవు సత్యస్వరూపివి! ధర్మాత్ముడవు. అనుగ్రహ కృపానిధి! నా పిలుపుకు చెవి చాచి మన్నించి అనుగ్రహింపుమా!
10. పచ్చటి తోటలతో నిండిన తిరుపెరుందురైలో నీవు కొలువైనప్పటి మహిమలు చూచిన దృశ్యములు తలంచుచున్నాను. మరలా వాటిని చూడ లేనందుకు చింతించు చున్నాను. నన్ను దాసునిగా చేసుకొన్న నాయకా! ఓ సిద్ధేశ్వరా! సుఖకరా! దుఃఖ సముద్రమను అలల నుండి రక్షించి జన్మపీడ నుండి నేను విడిపడు మార్గము జూపి నన్ను నీ వశము చేసుకొనుమా!

## 30. తిరుక్కయ్‌కుంద్ర దశకము

తిరు + కయుగు + కుంద్రము = దివ్య + గ్రద్ద + చిన్న పర్వతము; తిరుక్కయ్ కుంద్రము ఒక శివ క్షేత్రము. చెన్నై సమీపమున నున్న మహాబలిపురమునకు 15 కి.మీ దూరములో పర్వతముపై కొలువైనున్న శివక్షేత్రము. ఇచ్చటికి కాశీనుండి, రామేశ్వరము నుండి రెండు గ్రద్దలు ప్రతిరోజు మధ్యాహ్నము 12 గంటలకు కొండపైకి వచ్చి చేరునని ఐతీహ్యము. వచ్చిన గ్రద్దలకు దేవాలయపు అర్చకులు రోజూ దైవ ప్రసాదమును బంగారు గిన్నె, వెండి గిన్నె లోను తినిపించుదురు. ప్రసాదము స్వీకరించిన పిదప తలో దారిన ఎగిరిపోవును. ఈ కార్యక్రమమును దినము తిలకించుటకు వేలాది భక్తులు కొండపై

గుమిగూడెదరు. దీనినే ఆంధ్రులు "పక్షితీర్ధము" అని కూడ పిలుచుదురు ఈ శివక్షేత్రమున గురువుగా కొలువైన శివుని దర్శించిన పిదప శ్రీమాణిక్యవాచగర్ పాడిన ఈ దశకము. అన్ని పద్యముల చివర ఈ దివ్యక్షేత్రమున అనుగ్రహించితివి కదా! అని ముగియును.

1. "నీ దివ్య నామమైన పంచాక్షరీని (న,మ,శి,వా,య) జపించువారికి సాటిలేని సుఖము గలుగును. అచ్చట దుఃఖమునకు చోటుండదు. కాయ కాలేనిది విత్తనమవ్వదు. మూఢత్వము జ్ఞానముతో తొలగిపోవును. కర్మలు తీరిపోవును. ఈశ్వరుని లెక్కించలేని అనుగ్రహకోళమే దర్శనమగును."
2. "భక్తుల యెడ నీ కున్న ప్రేమానుబంధము, పిట్టుయను ముదుసలికి మట్టి తట్ట మోసి కూలి పొందిన తీరుతో నిరూపించితివి. నేను పాపిష్టిని, కొంచెము కూడ మార్పు పొందని నేరస్తుడను. నీ దరి చేరనైతిని, దుఃఖముతో కష్టపడుచున్న నన్ను ఆదుకొనినది నీ అనుగ్రహ నేర్పునే సూచించును! ఓ భక్త ప్రియతమా! ఈశ్వరా!"
3. "నా కన్నీళ్లు మార్చి, కలతను పోగొట్టిన తిరుపెరుందురై మహేశ్వరుని వీడి, మరచితిని. ఇక ఏమిచేయలేక పోతున్నాను. నీ దివ్య చరణములను పొందు భాగ్యము, నా హృదయమునకు అర్హత, లేదేమోనని శంకించితిని. అట్లున్ననూ ఈ తిరుక్కయిక్కుంద్రమ్‌లో నీ దర్శనమిచ్చి అనుగ్రహంచితివే! దేవాది దేవా! జ్ఞానేశ్వరా!"
4. "నీయందు ప్రేమానుభూతి పొందిన భక్తులు నిన్ను ప్రతిరోజు స్తుతించి, పూజించినది చూచియూ, నేను నిన్ను నమస్కరించక చపల చిత్తుడనైతిని. జన్మ కర్మలను సముద్రమున మునిగి యుంటిని. నీవో నీ దివ్యచరణములను తెప్పపై ఎక్కుటకు అర్హతలేని నన్ను ఎక్కించుకొంటివి. నిన్ను చూడ అర్హత లేని నాకు ఈ తిరుక్కయికుంద్రమ్‌లో దర్శన భాగ్యమిచ్చి అనుగ్రహించితివి! ఓ సర్వేశ్వరా!"
5. "బంగారువంటి దివ్యశరీరము నీది. నీవు అనుగ్రహ మేఘము. నా హృదయమున ప్రకాశించు శిరోమణి. కాల స్వరూపుడవు! నేను నిన్ను స్తుతించి పాడుటచే నాకు తిరుక్కయికుంద్రమ్‌లో దర్శనమిచ్చి అనుగ్రహించితివి ఓ జీవన్ముక్తా"
6. "అద్వైత జ్ఞానమును నాకు బోధించిన అనుగ్రహ సముద్రమే! నిన్ను పరాయివారు దూషించునట్లు నీవేమి చేసితివి? నిరంతరముగా, శాశ్వతమైన నీ చరణములందు శరణు పొందితిని. సాటిలేని ప్రేమతో నిన్ను స్తుతించి పాడినందుకు, తిరుక్కయికుంద్రమ్‌లో నీ దర్శన భాగ్యమిచ్చి అనుగ్రహించితివి! ఓ నీలకంఠా!"
   (అద్వైత సిద్ధాంతము నందు భేదములేదు. కనుక ఒకరిపై మరొకరు దూషనలు కూడ ఉండవు.)
7. "సంగీత విద్వాంసులైన అరువది నాలుగు స్త్రీలకు అష్టగుణములు (శుశ్రూష, శ్రవణం, గ్రహణం, ధారణం, ఊహ, అపోహ, అర్ధ విజ్ఞానము, తత్వ జ్ఞానము అష్టగుణములు)

ఇచ్చినది ఈశ్వరుడే! నేను గర్వము, కామము, మాయ అను త్రిమలములందు మునిగియున్నాను. నా చపలము తొలగించి నన్ను నీవు ఆదుకొంటివి. నీ అనుగ్రహ ఊటనీరును నాకు తిరుక్కయికుంద్రమ్‌లో త్రాగించి అనుగ్రహించితివి. ఓ కృపానిధీ!"

# 31. దర్శన దశకము

తిల్లై (చిదంబరము)లో పరమానందముతో నాట్యమాడు నటరాజస్వామియైన శివుని దివ్య అనుగ్రహముతో దర్శన భాగ్యము పొంది, మనస్సు కరిగి శ్రీ మాణిక్యవాచగర్ పాడినది ఈ దశకములో వర్ణించబడినది. తమిళ దేశమున గల పాండ్య, చోళ, చేర రాజ్యములలోనున్న పలు శివక్షేత్రములను దర్శించిన పిదప తను కడపటగా ఈ చిదంబరమునకు వచ్చినట్లునూ, శివుని దివ్య దర్శనముచే ఆతనికి దివ్యానుభూతిని పొందినట్లు మనకు తెలియుచున్నది.

1. "శరీర స్పర్శ, నేత్రము, నాలుక, నాసిక, చెవులైన పంచేంద్రియముల ముఖ్యత్వముతో జీవనము సాగించుట మరణమునకు, నరకమునకే దారితీయుచున్నది. నన్ను వాటి చేష్టలు నుండి రక్షించి, సాటిలేని అంతములేని పరమానంద మహాస్థితిని నాకు తిల్లైలో (చిదంబరములో) పొందు భాగ్యమైనది"
2. "జన్మపీడ దుఃఖము నందు చిక్కుకొని నిన్ను స్మరించక, తలంచక ఉండిపోతిని. నీ దివ్యానుగ్రహము వలన నా జన్మ కర్మపీడలనుండి విడిపించి నన్ను ఆదుకొన్న తీరును, అన్ని లోకములువారు మ్రొక్కు తిల్లై అంబళము (చంద్రుడు) ను దర్శించితిని."
3. "రూపు తెలియని (దైవము యొక్క ఆకార, నిరాకారములు) పిన్న వయస్సులో నా శరీరమును, మనస్సు, తన అధీనము చేసుకొని ఆదుకొన్న ఆ దివ్యధృతి, మధురమైన శివపదమను అనుగ్రహ జ్యోతి, దివ్య దర్శనమును తిల్లైలో చూచితిని."
4. "క్షణికానందముతో కుక్కవలె అల్పుడైన నన్ను, తెలివిని, జ్ఞానమును పొందినవానిగా చేసి నా అల్పవాంఛలు, జీవ ఉపాధిని పోగొట్టి ఆకట్టుకొన్న విధము తిల్లై శివపదమున చూచితిని."
5. "జాతి, కులము, జన్మములను అల్పమైన వాటిలో తబ్బిబ్బులైయున్న కుక్క వంటి నన్ను, అన్నింటికి కారణములైన మనోవాంఛలను నా నుండి తొలగించి, నన్ను ఆదుకొన్న అమృతుని ఈ తిల్లై అంబళములో దర్శించితిని."
6. "తమ యొక్క జన్మపీడ తొలగవలె; రోగము, వయోధిక అవస్థలు, బంధము తొలగవలె; నను భావనతో వేద పఠనులందరూ దేవతలందరూ నెలవంక గలిగినవాని (చంద్రశేఖరుడైన చిదంబరనాథుని) దరిచేరి స్తుతించుట నేను గాంచితిని."

7. జీవ ఉపాధి సాధనలు తొలగినచో మనస్సు శివబోధయందు లయమగును. తరవాత భక్తి, సాధనలు ఏమియూ అవసరముండదు. లోకము నన్ను పిచ్చివాడని పిలిచినను, అదే సమయములో నేను విడిపోకుండా ఉండునట్లు తన దివ్య స్వరూపమును దర్శించు భాగ్య మేర్పరచిన గొప్పతనము ఈ తిల్లైలో (చిదంబరములో) గాంచితిని.
(మన మనస్సులో ఏర్పడు కల్పిత కోరికలు, బంధముల తలంపులే జీవ ఉపాధి సాధనలు అందురు.)
8. లెక్కలేనన్ని కోరికలతో కప్పి వేయబడి నా తెలివిని కోల్పోయితిని. ఏమి జరుగబోతున్నదో ఏదీ ఎరుగక ఉంటిని. ఉపయోగ పడని స్థితిలో నున్న నాపై మహోన్నతమైన ప్రేమ కురిపించి తన వానిగా ఆదుకొన్న వాడిని ఈ తిల్లైలో (చిదంబరములో) దర్శించగలిగితిని.
9. వినయము, ఉపయోగము లేనివాడను నేను. నా హృదయములో తన దివ్యస్వరూప జ్యోతిని ప్రసరింపజేసి, నాపై ప్రేమ కురిపించెను. నా పాపకర్మలను స్వీకరించి, ప్రేమను ఏర్పరచిన వానిని వేదములే స్తుతించడము ఈ తిల్లై నాథునిలో (శివునిలో) చూచితిని.
10. పంచభూతములను రూపముగా చేసుకొన్నవాడు, పంచ ప్రజ్ఞలుగా వెలుగొందువాడు, అన్నింటా తానే నని దర్శనమిచ్చువాడు, దైవము (ఈశ్వరుడు) ఎప్పుడు, ఎల్లవేళలు, ఏకరూపిగా, సర్వవాపిగా నొప్పారు చున్నాడు. అటువంటి మహాత్ముని ఈ తిల్లైలో గాంచితిని.

## 32. ప్రార్థనా దశకము

దైవము నుండి (శివుని) ఎడబాటుని సహించజాలక మనో:వ్యధ చెందిన శ్రీ మాణిక్యవాచగర్ శివుని దివ్యానుగ్రహము పొంద వేడుకొని పాడిన దశకము.

1. "నాడు నేను నీ భక్త సమూహమున చేరక కాముకుడనై ఉంటిని. ఆకాలము గడచిపోయినది. ఎప్పుడు నీతో చేరుదునా అని దుఃఖపడి తపించుపోతున్నాను. అనుగ్రహచింతన నాలో వృద్ధి అగుటకు నాలో ప్రేమ ఊట పొంగునట్లు చేసి అనుగ్రహింపుమా!"
2. "భక్తాగ్రేసరులు నీపై ప్రేమ సలిపి నీ దరి చేరిరి. నేనో దుర్వాసనతో నిండిన శరీరముపై వాంఛలను ఉంచితిని. తీవ్రమైన నా పాపకార్యములను తొలగించి, నాలో అనుగ్రహవాంఛను నింపి ఆశీర్వదించుదువుగాక!"
3. "ఓ మహాదేవా! నీ అనుగ్రహ సముద్రములో భక్తులందరూ స్నానమాడి ఆనందపరవశు లైరి. నేనో ఈ క్షరమైన (క్షీణించదగిన) శరీరమును మోసి క్షీణించుచున్నాను. ఈ దివ్యదర్శన భాగ్యము దొరకనిచో లోకులు నన్ను పిచ్చివాడని తలంచి నానుండి వీడుదురు. ఆ స్థితి వద్దు సుమా!"

4. "నీ అనుగ్రహము పొందిన భక్తుల సమూహముతో నన్ను చేర్చుకొంటివి. నాకు జన్మరహితము చేసిన అఖండ జ్యోతివి నీవు. స్వయం ప్రకాశుడైన, మాసులేని (మచ్చలేని, మలినములేని) మాణిక్యము నీవు. నిన్ను పొందుటకు అర్హత కానిదేదియూ నాకు లేకుండా చేసి, నీ ప్రేమను మాత్రము నా కివ్వుము. ఓ మనోన్మయా!"

5. "నల్లకలువలు వంటి కన్నులు గల పార్వతిదేవి భాగస్వామి! నీ భక్తుల సమూహము నడుమ నేను ఉండుటకు కోరుచున్నాను. నా శరీరవాంఛలు, అల్పమైన ఇంద్రియ సుఖములు, గర్వమును, నానుండి తొలగించి నన్ను నీ దరి చేర్చ ప్రార్థించు చున్నాను. ఓ మహాదేవా!"

6. "శివానందము శాశ్వతమైనది, ఎల్లలు లేనిది, సర్వవ్యాపి, మరువలేనిది, పరమానంద సముద్రము. దీనిని శివభక్తులందరు పొందిరి. నిన్ను ప్రార్థించుచున్న నాకును నీవు ఇచ్చి అనుగ్రహించుదువుగాక!"

7. ఓ సర్వకాముడా! బ్రహ్మానందములో (దివ్యానందములో) నీ భక్తులందరు మునిగి తేలుచున్నారు. నేను దుఃఖము ఆవరించి ఇచ్చట వ్యధపడుట నీకు ఆనందమేనా? నీవే నన్ను రక్షించుదువని తలంచితిని. ఇప్పుడు ప్రార్థించుచున్నాను. ఇకనైన నన్ను ఆదుకొనుమా!"

8. "నీ భక్తులందరు పరిపక్వమొందిరి ఈశ్వరా! నేనో వెదురు కర్రవలె కరగని మనస్సు గలడను. ఓ శంకరా! నీవే త్వరగా వచ్చి నీ దివ్యచరణములు నాకిచ్చి నన్ను పరిపక్వమొందించు గాక!"

9. "నీ భక్తులందరికి పరమానందము ఎటువంటి కొరత లేకుండా దక్కినది. నేను మాత్రము మనోవ్యధతో ఉండిపోవలెనా? నన్ను సరిదిద్దుము. ఓ భక్తప్రియా! శివా! ఎప్పటికి మారిపోని పరమానందమును నాకిచ్చి అనుగ్రహించుదువు గాక!"

10. నీవు ఉమాదేవికి సగము భాగమిచ్చిన అర్ధనారీశ్వరుడవు! నిన్ను స్తుతించు వారికి మధురమైన (జ్ఞాన) ఫలము వంటివాడవు, ఎందులకో నన్ను ఉపయోగపడని (కన్నము పొడవని) ఎండు ఆనప కాయ అని తలంచి వదిలిపెట్టితివా? నీ అనుగ్రహము పొందుట ఎపుడు? నన్ను అనుగ్రహింపుము!"

11. "సర్వేశ్వరా! నీ భక్తాగ్రేసరులు నీతో ఆడి, పాడి, కీర్తించి పరమానందము పొందుచున్నారు. నేనో ఎండిన చెట్టువలె వాడిపోయి నిలుచుచున్నాను. నేను వారివలె ప్రేమతో ఆడి, పాడి, నిన్ను స్తుతించు నట్లు అనుగ్రహించుదువు గాక!"

# 33. పరిత్యాగ దశకము

## (ఆత్మ నివేదన)

దైవము మనల్ని ఆదుకొన్నచో ఆనందము. చేయి వదిలి పెట్టినచో దు:ఖము. చాలా మనోవ్యధతో శ్రీ మాణిక్యవాచగర్ పాడిన ఈ సర్వసంగ పరిత్యాగ దశకము. తన పాపములన్నింటికి పరిష్కారము కోరి త్యాగ శీలమును చాటి చెప్పునదిగా అమరినది.

1. "పాపకర్మముల వలన కలుగు రోగములు నన్ను బాధించునపుడు నీవే నన్ను రక్షించి అనుగ్రహించవలె. నా ప్రయత్నముతో జరుగునదేది? నేను తప్పు చేసినచో దానిని ఓర్చుకొన వలసి నది నీ కర్తవ్యము కాదా! నా మొరను ఆలకించ కుండినచో అది నీకు తగునా?"
2. "దుఃఖము లన్నియూ నీవలన తొలగునని నేనెరుగుదును (అవి ప్రారబ్ధ కర్మలైనచో ఎట్లు తొలగును?) అవి తొలగలేదు. విధి విన్యాసమైన ఈ శరీరమును ఇక కొనసాగించకు. నన్ను వెంటనే దండించి వేయుము."
3. "ఉమాదేవితో నున్న అర్ధనారీశ్వరా! ఓ ముక్కంటి! కుక్కనై అల్పుడనై నన్ను ఆదుకొని అనుగ్రహించిన కరుణ నేడు లేదా? నా తప్పులను నీవు స్వీకరించినచో నీకేదైన కొరత ఏర్పడునా? నాపై దయ చూసి అనుగ్రహింపుమా! సర్వేశ్వరా!"
4. "దేవతలు స్తుతించు ధర్మస్వరూపా! స్తుతించ దగ్గ నీ దివ్య స్వరూపమును మరిపించి ఈ శరీరముతో నన్ను ఉంచితివి. నన్ను కలత పొందించితివి. నా అజ్ఞానము తొలగించి, నీతో ఎప్పుడు చేర్చుకొని అనుగ్రహించెదవు? ఓ శివలోకేశా!
5. "మాట్లాడు నాలుక, బుద్ధి సామర్థ్యములు నీవే! మనస్సు, కారణములు, తెలివి, కలత, కీడు, మంచి మొదలగు అన్నియూ నీ ఆజ్ఞ ప్రకారము నడుచుచున్నవి. నాకు తగినంత బుద్ధినొసంగి నాఅజ్ఞానమను కలతను పోగొట్టుము ఓ శివలోకేశా!"
6. "ఈశ్వరా! నాకేమి కావలెయునన్నది నే నెరగను. నీవే ఎరుగుదువు నా జన్మపీడ తొలగించునది నీవే. రోగికి ఔషధము వైద్యుడెరుగునట్లు, నా జన్మపీడకు కారణము, తొలగించునది, రెండు నీవే ఎరుగుదువు. నారాయణుడికి బ్రహ్మలకు కూడా ఎరుగనిది నీ తత్వము. కావున నాకేది హితమో దానిని ఇచ్చు బాధ్యత కూడ నీదే సుమా!"
7. "ఓ సర్వాత్మా! నన్ను ఆదుకొన్నపుడు నా శరీరము, ఆత్మ, ఇతర వస్తువులన్నింటిని నీవు స్వీకరించితివి. ఇప్పుడు ఏవైన ఆటంకము ఉన్నదా? మంచి, చెడు చేయునది నీవే. నే నెందులోను కారకుని కాజాలను. ఓ అష్టభుజా! ఓత్రినేత్రా! ఏది జరిగినా అది నీదే అగును."

(సాధకుడు (భక్తుడు) దైవము నందు తనను సంపూర్ణముగా అర్పించుకొను స్థితి ఇది. దీనినే శరణాగతి తత్వమనబడును)

8. కుక్కకన్నా అల్పుడనైన నన్ను నీవు ఆకట్టుకొన్నపుడు నాకు ఉన్నతస్థితి గలిగినది. నా జన్మను నీకు అర్పించితిని. దేని యందు హక్కుగాని, అధికారము నాకు లేదు. నీ అనుగ్రహము పొందియున్న నాకు శరీర జీవనమును, నీ దివ్య చరణములు ఒక్కటే ఓ త్రినేత్రా!

9. ఓ త్రినేత్రా! నీ దివ్యదర్శన భాగ్యము వలన నేను మహానందము పొందితిని. రాత్రి, పగలు గాక నేనెపుడు నిన్ను మరువక యుంటిని. నీ పాద పద్మములు తప్ప నా శరీరమునకు వినాశమో, ఉన్నతమైన జీవనమో వాటి గురించి తలంచుట న్యాయమా? తగదు.”

10. ఎప్పటికి మారని నవ యవ్వన రూపములో గల అందగాడా! శివా! పరమాత్మ! నీ దివ్య శరీరము చూపి నన్ను ఏ మాయ చేసావో? మహోన్నతమైన రూపా! జ్ఞాన మూలమా! నాకు వ్యధ కల్పించునది నీ దివ్యలీలలే! అల్పుడైన నాకు ఉన్నత మనోపక్వము పొందినది నీవలనే! ఓ సిద్ధేశ్వరా!

# 34. శివాత్మదశకము

## (శివానంద ఉత్పన్నము)

శివుని దర్శనముచే మహానంద భరితమైన స్థితిలో పాడిన దశకము.

1. “అందమైన ఉమాదేవి యొక్క భాగస్వామీ! అన్ని పాపకర్మములను తొలగించువాడా? వృషభ వాహనా! ఓ తిరుపెరుందురై నాయకా! మహా మేధావులైన పండితులచే స్తుతించబడు ఓ మహామహుడా! నీ అనుగ్రహ పరవశములో మునిగిన నేనెపుడు నిన్ను కీర్తించవలె?”

2. “దైవము యొక్క దివ్యపాదములు పొందు భాగ్యము, అర్హత ఏట్లు కలుగును? నేనో కుక్క కన్నా అల్పుడనైనను, నాకు ఆసనమిచ్చి, నాకు ఆశ్రయమిచ్చి, ఈ శరీర, ఆత్మ, మనస్సుతో కలిసి, నాకు బ్రహ్మానందమొసెగెను. దాని కారణముగా నేను ఉన్నతుడైతిని.”

3. “మనస్సుకి, వాక్కునకు అందనివాడు! వృషభమును తన వాహనముగా చేసుకొన్నవాడు! అఖండ జ్యోతి రూపమై నిలచినవాడు! నన్ను పిచ్చివానిగా చేసినవాడు! తననెవరూ ఎరుగలేరు, మనల్ని భ్రమింప జేసి రాత్రి పగలుని కూడ ఎరుగక ఉన్నవాడు.”

4. ఆ దైవము ( ఈశ్వరుడు) నా హృదయములో చొచ్చుకుపోయి నన్ను ఆదుకొనెను. వాడే నా శరీరములో, ప్రాణముతో నిండినవాడు. కంటిలో దీపమైయున్నవాడు. మాటలో శబ్దించువాడు వాడే. వానివలె జన్మకర్మలను త్రెంచువారెవ్వరూ లేరు!

5. లౌకికవాంఛ కారణము వలన జన్మమెత్తి చెడిపోవు తత్వమున్నవారు! ఆ వాంఛలను విడనాడి దైవముపై కాంక్షను పెంచుకొనండి. మంచి, ధర్మమార్గము పొందవలెనన్న కోరిక ఉన్నచో పరుగెత్తిరండి. వాని మహిమలను స్తుతించండి. భక్త సత్సంగములో చేరిపోండి.
6. "నెలవంకతో దివ్య ఝటాధరుడైన వాడు, (చంద్రశేఖరుడు)! నాలో సముద్రపు అలలవలె ఉప్పొంగు కోరికలను త్రెంచి, విసరివేసి, నా శరీరము, ప్రాణముతో కలిసిపోయి విడదీయలేనట్లు నాలో నిలచిపోయెను."
7. "నేను ప్రశంసలను, వస్తువులను, వేరే జన్మమును, భూలోక జీవితమును కోరనివాడను. నాకు లౌకిక సంబంధములో కాంక్ష లేదు. శివుని కోరనివారితో చేరజాలను. వాని దివ్య పాదములను నా శిరస్సుపై మోసెదను. వాటిని ఎప్పటికీ విడచివెళ్లను."
8. "ఓ తిరుపెరుందురై దేవా! శివా! సంపూర్ణ విబూది ధారణా! ఓ నిర్మలా! కొండతేనెయు, పాల సముద్రపు అమృతమునకు సమానుడా! నా రాజాధిరాజా! ఓ ఔషధా! నేనెప్పుడు నిన్ను వీడి ఉండజాలను సుమా!"
9. ఏమి కావలెనో ఎరుగుదును. ఏది ఉన్నదో ఎరుగుదును. వాని దయవలన ఏ కొరత లేదని కూడ ఎరుగుదును. ఆకరుణామూర్తి నాలో ప్రవేశించి నా కన్నియూ సమకూర్చిన వాడు, ఆ తామర పుష్పము వంటి శరీర చాయగల మహామహుడు!
10. ఊర్ధ్వలోకములో నున్నవారు నిన్ను కోరి తపస్సు చేయుచున్నారు. నేనో శరీరము మోయుచు, అడవి చెట్టునైతిని. పాపకర్మములు చేసినవాడను. నీ అనుగ్రహము పొందుటకు అర్హత లేదన్ననూ, నీవు నన్ను ఆదుకొని తీరవలె సుమా!

# 35. భీతి దశకము

శ్రీ మాణిక్యవాచగర్ తాను శివైక్యము పొందగోరు ప్రయత్నములో పలురకములైన భీతిని అనుభవించి పాడిన దశకము ఇది.

1. "పుట్టలో జీవించు పామునకు భీతిల్లను, తప్పైన అర్థమును చెప్పువారికి భీతిల్లను. కాని అన్నింటికి మించిన దైవము ఒకడు కలడు అని ఎరుగక, ఆ దైవమే ఆ ముక్కంటి (త్రినేత్రుడైన శివుడు) అని ఎరుగక, వానిపై ప్రేమ, భక్తి లేకున్న వారిని చూచినచో భీతి చెందుదును."
2. "అత్యాశ వచ్చినను భీతిల్లను. జన్మ సముద్రమునందు మునిగి లేచిననూ భీతిల్లను. కాని దైవము, ఈశ్వరుని దివ్య రూపమును మాని వేరొక దైవమునుకోరి వెళ్లి స్తుతించు వారిని చూచి భీతిల్లుదును."

3. "భయంకరమైన శూలములతో వచ్చిన సైన్యమును చూచి భయపడను. చేతిగాజులుతో శబ్దం చేయుచు, వాలు కన్నులతో వచ్చు స్త్రీలకు భయపడను. కాని చంద్రబింబము వంటి చాయతో నాట్యమాడు నటరాజ స్వామి (శివుడు) పై ప్రేమ భక్తి చూపని వారి చూచి భీతి చెందుదును."

4. "చిలక పలుకులతో వేడుకొను స్త్రీలకు, వారి వంచనతో కూడిన చిరు నవ్వులకు నేను భీతిల్లను. తెల్లటి విభూది ధరించి వైదికుని రూపమున వచ్చిన శివుని పాదపద్మములందు హృదయమర్పించక, మనస్సు చలించిపోక, కరిగిపోనటువంటి వారిని చూచి నేను భీతిల్లుదును."

5. "ఎన్ని రోగములు వచ్చినను భీతిల్లను. ఎన్నో జన్మలు వచ్చిననూ భయపడను. కాని నెలవంక ధరించినవాని (చంద్రశేఖరుడు – శివుని) భక్త సమూహములో నుండి పరవశము చెందక, వానిని సేవించక తెల్లటి విభూతిధారణకు నోచక శంకించు వారిని చూచి నేను భీతి చెందుదును."

6. "భయంకరమైన అగ్ని జ్వాలలకు నేను భీతిల్లను. కొండలు బద్దలై దొర్లిననూ భీతిల్లను. కాని ఆ వృషభవాహుని (శివుని), ఆ తెల్లని విబూది ధారకుని స్తుతించి పాడక, వాని పాదములను పుష్పములతో అర్చించక వాని భక్తులతో కూడి దాసుడై సేవ చేయక నుండువారిని చూచి భీతి చెందుదును."

7. "సంబంధము లేకుండా ఏర్పడు నిందలకు నేను భీతిల్లను. కాలాను గుణముగా కాక, అపమృత్యువునకు కూడ నేను భీతిల్లను. కాని అగ్ని జ్వాలతో కూడిన ఘటమును చేతబూని చంద్రమండలములో నాట్యమాడు వాని (శివుని) యందు మనస్సు, భక్తి లేక, కరిగిపోక ఉండు వారిని చూచి భీతిల్లుదును."

8. "స్తంభమునకు కట్టివేసిరని మహాఉగ్రముతో రగిలిపోవు ఏనుగునకు భయపడను. కోపముతో ఏర్రనైన కళ్ళుగల పులికి భీతిల్లను. కాని తండ్రీ! శివుని పాద పద్మము దరిచేరి, స్తుతించి పాడని, మ్రొక్కని జ్ఞాన శూన్యుడుని చూచి నేను భీతి చెందుదును."

9. "ఉరుముల భీకర ధ్వనికి భీతిల్లను. గుమిగూడి కుట్రచేయు రాజునకు భీతిల్లను. కాని దైవము ఆ నీలకంఠడు! (శివుడు) మన కొరకు విషమును అమృతమువలె స్వీకరించెను. వాని స్తుతించని, దివ్య విబూది ధరించని వారిని చూచి నేను భీతిల్లుచున్నాను." (దీనినే 'అచంచల భక్తి' అందురు.)

10. "ప్రాణము తీయుటకు వదిలిపెట్టిన బాణమునకు నేను భీతిల్లను. కాలుని (యమధర్మరాజు) భయంకర కోపమునకు నేను భీతిల్లను. కాని ఆ చంద్రశేఖరుని స్తుతించని, పాడని, కన్నీరు కార్చని మనస్సు కరగని, ఆ కృతజ్ఞత లేని వాడు అసలు పురుషుడు కాదని తలంచి భీతి చెందుదును."

# 36. దివ్య పాండ్య దశకము

## (శివానంద ఫలితము)

మధురానగరిని అరిమర్తన పాండ్య రాజు పరిపాలించు కాలమున, అతని వద్ద ప్రధానమంత్రిగా కొలువైన శ్రీ మాణిక్యవాచగర్ శివ సాయుజ్యమునందు చిత్తముంచినది, యుద్ధ గుర్రములను కొనుగోలు ద్రవ్యమును దేవాలయ నిర్మాణమునకు వాడినది, గుర్రముల కాపరిగా శివుడే మారు రూపమున వచ్చి రాజునకు గుర్రములను అప్పగించినది, ఆపై శివబోధను శ్రీ మాణిక్యవాచగర్‌కు బోధించినది, ఇవియన్నియూ ఈ దశకములో కీర్తించబడి, బహురసవత్తరమైన ప్రాసలతో నిండిన తమిళ పద్యములతో కూడినదై, బడి తరగతుల పాఠ్య పుస్తకములలో ఈ దశకములోని కొన్ని పద్యములు కంఠస్థమునకు ముద్రించబడియున్నవి. అటువంటి రసవత్తరమైన తమిళ ప్రాసలతో నిండినదైన ఈ దశకములో శివునినే పాండ్యడుగా పిలువబడియున్నది.

1. "హిమవత్పుత్రయైన పార్వతీదేవికి భాగస్వామిగా నున్నవాడును. పాండ్యదేశరాజునకు అమృతమంటివాడును, గుర్రముపై ఎక్కి సేవకునిగా వచ్చి చూచు వారి మనస్సు కరుగునట్లు చేసినది, నేను దర్శించిన రూపము వేరేదియు కానిదియు, ఆ శివునికి నమస్కరించుచున్నాను.
2. "శివుని దర్శించువారు శివ సాయుజ్యము పొందుదురు. త్రిశూలముతో గుర్రముపై ఎక్కి మన మధ్యకు వచ్చిన అతన్ని చూచిన వారికి జన్మపీడ తొలగిపోవును. అట్లే మధురానగరి రాజు జన్మము తరించినది."
3. "నీటిలో ఈది స్నానమాచరించుట సుఖమగునట్లు ఈ సంసార సుఖములలో ఈది సుఖమని తలంచు ఈ లౌకికులకు, నీటి మీద బుడగవలె సుఖము అశాశ్వతమైనదని తెలియదు. పరమానందమైనదియు. శాశ్వతమైనదియునైన దైవ పాదములందు ఆశలు ఉంచెదము. అది ఆనంద భరితమైన మహానది. ఎల్లలులేని ఆనందము ఆది. దీనిని తెలియకనే మీరు అశాశ్వతమైన దాని మత్తులో మునిగి యున్నారు."
4. "జన్మదుఃఖమును సజ్జనులు ఓర్చలేరు. దాని విన్యాసములను కూడ భరించలేరు. మీ జన్మదు:ఖములను నరికి పారవేయగల ఆ మహామహుడు (శివుడు) చేతిలో కత్తిబూని గుర్ర మెక్కి వచ్చుచున్నాడు. దానిని గుర్తించు కాలమిది. దానిని గుర్తించి ఆ మహామహుని ఆశ్రయించి అనుగ్రహము పొందుదురు గాక!"
5. ఈ మానవ జన్మము చాలా అరుదైనది. కాలమున్నపుడే దైవమునందు భక్తి సలిపి ముక్తి పొందండి. కాదని ఈ జన్మము తప్పినచో మరొక జన్మము గురించి మనకు తెలియదు. నారాయణుడు, బ్రహ్మలు పొందలేనిదియు, తాను విషముత్రాగి మనలను రక్షించి

అనుగ్రహించిన వాడు ఆ పాండ్య మహానుభావుడు శివుడు. వాడు అనుగ్రహించి, జ్ఞానము పొంది ఈ జన్మములోనే తరించిపోవుదముగాక!"

6. "మానవుని మనస్సు మాయతో నిండినదై యున్నది. విచక్షణ జ్ఞానము అజ్ఞానమునకు లొంగి ప్రకాశము కోల్పోయి యున్న సమయమున పరమేశ్వరుడు తన దివ్య అనుగ్రహముచే జ్ఞానజ్యోతిని వెలిగించి, కాంతి ప్రసరింపచేసి, అన్ని సక్రమము చేయుచున్నాడని మత్స్యకారుడుగా వచ్చి చెప్పియున్నాడు. పంచేంద్రియములను నిగ్రహించు విధానము భోదించిన వాని యందు శరణు పొందండి. విధానమెరిగి, తగిన ధర్మమార్గమును ననుసరించి 'ముక్తి' యను బహుమతిని ఆపాండ్యమహామహుని (శివుని) నుండి పొందండి."

(అ మత్స్యకారుని రూపమున వచ్చిన శివుడు భీకరమైన, సొరచేపను వధించి అందరిని రక్షించి, మత్స్యకారులందరికి శివజ్ఞాన బోధన చేసి మత్స్యకారిణి అవతారములో నున్న పార్వతిని వివాహమాడెను. ఇది శివలీలలోని ఒక అవతారగాధ. దీనినే శ్రీ మాణిక్యవాచగర్ శివుని మత్స్యకారుడుగా వచ్చెనని చెప్పిరి.)

7. "గుర్రముపై వచ్చిన శివుడు మనల్ని తన వశము చేసికొని మన యొక్క జనన మరణములను మాయను తొలగించివేయును. వాని యందు శరణు పొందినచో అనుగ్రహ భాగ్యము లభించును. అదియే శాశ్వతమైనది. మహోన్నతమైనది. ఆపాండ్యుని (శివుని) సేవించ, వాని పాదములచెంతకు అందరు చేరండి."

8. "ఎప్పటికి క్షీణతలేని, శాశ్వతమైన సచ్చిదానందమను ఆనంద ప్రవాహమున నన్ను మునిగియున్నట్లు చేసెను. ఎల్లప్పుడు కరుణామయుడై యున్నందున నా జన్మ దుఃఖములకు కారణ భూతములైన ముమ్మలము (గర్వము, కామము, మాయ, అను ముమ్మలములు)లను బంధము, ప్రేమ యను కాంక్షలను త్రెంచి, ఆ దైవము పాండ్య రారాజు (శివుడు) నన్ను ఆదుకొనెను."

(యౌవ్వనములో లౌకిక సుఖములన్నింటిని అనుగ్రహించిన వాడే ముదిమిలో శివ సాయుజ్యమును అనుగ్రహించును. కావున వాటిని గైకొని ముందుకు వెళ్లండి. కాలము వెళ్లబుచ్చకండని శ్రీ మాణిక్యవాచగర్ నొక్కి వక్కాణించుచున్నారు)

9. "విధి విన్యాసములైన జన్మ పీడయను సముద్రమును వదిలింప గోరి దైవమును ప్రార్థించి, వారిని పరవశము చేయక పరమాత్ముడు పాండ్యుడు (శివుడు) గుర్రముపై వచ్చెనన్నది గ్రహించక, పాద పద్మములు పూలతో అర్చించక, చెట్లవలె మైమరచి నిలబడిపోయిరి."

10. "శివుడు యముని జయించి, పంచేంద్రియులను, రాజులను జయించెను. నందీశ్వరునిపై పార్వతి దేవి, సమేతముగా ప్రత్యక్షమై, మత్స్యకార రాజుకి, వాని శత్రువులను పారద్రోలి దర్శన మిచ్చి, వాని ప్రాణమును స్వీకరించెను (ముక్తి నొసగెను). ఇకనైనను ఆ

మహామహుని గుర్తించలేదనినచో ఏమి లాభము? వాని దివ్య పాదపద్మముల దరిచేరి గట్టిగా పట్టుకొనండి.”

# 37. దైవ పట్టు దశకము

## (ముక్తి కొరకు ప్రేలాపన)

ఈ దశకము తిరుత్తోని పురం (ఊరిపేరు: తిరు+త్తోని+పురం: దివ్యమైన+తెప్ప+పురము)లో కొలువైన శివుని ఆరాధించి పాడినది. ఈ శివ క్షేత్రము నందే నలుగురు మహాశివ భక్తులలో శ్రీ మాణిక్యవాచగర్, శ్రీఅప్పర్, శ్రీసుందరర్, మరొకరైన శ్రీతిరుజ్ఞాన సంభందర్ జన్మించిరి. వీరి నలుగురి శివస్తోత్రముల సంఖ్య కొన్ని వేలకు మించియున్నవి. మహోన్నత భక్తిభరితమైన జీవితగాధలు వీరివి. (వీరిని “నాల్వర్” అని తమిళమున పిలవబడుదురు) ప్రళయము నందు కూడ ఈ శివక్షేత్రము తేలియాడినట్లు ఐతీహ్యాము. తేలియాడిన క్షేత్రము కనుక తెప్ప అను పదమువాడిరి. కాలక్రమమున అది తెప్పపురము అయ్యెను.

1. “దేవతలందరికి నాయకా! ఈశ్వరా! అన్నింటా తానైయున్న సర్వగామీ! నా జీవి మత్తులనుండి విడిపించి నన్ను అనుగ్రహముతో జీవింపజేసిన అమృతమే! రక్షించిన ఔషధమా! ఎర్రనైన జ్యోతి నిండిన మార్గదర్శకా! నిన్ను నేను గట్టిగా పట్టుకొంటిని సుమా! ఇక నీ దాసుడైన నన్ను వీడి నీ వెచ్చుటకు వెళ్ళెదవు?”
2. “వృషభ వాహనుడా! ఈ పాపాత్ముని దాసునిగా చేసుకొన్న సత్య స్వరూపా! శరీరమను దుర్వాసన కట్టితో కట్టకుండా నన్ను రక్షించిన దైవమా! కరుణా సముద్రమా! ఎడతెరిపి లేక నీ దివ్య అనుగ్రహమును గట్టిగా పట్టుకొనియున్నాను సుమా! నన్ను విడచి నీ వెచ్చుట కొలువయ్యెదవు ?”
3. “మనస్సులో ప్రేమ నిండిన తల్లీ, తండ్రీ, సాటిలేని జ్ఞాన ప్రకాశా! అశాశ్వతమైన లౌకిక వస్తువులపై మమకారము పెంచుకొని, అదే శాశ్వతమని తలంచి వాంఛలు పెంచుకొని, కాలము వెళ్లబుచ్చుతున్న ఈ అల్పుడైన నాకు శివ ఆనంద తత్వము అనుగ్రహించిన పరమేశ్వరా! నిన్ను నేను గట్టిగా పట్టుకొంటిని సుమా! నీ దర్శనమిచ్చి అనుగ్రహింపుమా!”
4. “కరుణా జ్యోతిరూపా! జ్ఞానఫలమే! తపోధనులకు నాయకా! సత్య జ్ఞానమును వివరించి చెప్పు పండితా! స్తుతికి అతీతుడైన అమృతుడా! భక్తులకు సహకరించ నెంచి. వారియందు కొలువైన ఓ శివేశ్వరా! ఓ సంపన్నుడా! అజ్ఞానము నిండిన ఈ లోకములో నిన్ను గట్టిగా పట్టుకొంటిని సుమా! ఇక నీవెచ్చుట కొలువయ్యెదవు?”
5. “సరిసాటి లేని దైవమే! నా మనస్సులో కొలువైన జ్ఞానజ్యోతియే! సత్యజ్ఞానము తెలిసికొనలేని నాలాంటి వానికి చాలా ఉన్నతమైన స్థానములో ఉంచిన ప్రేమ స్వరూపీ! సర్వాత్మకా!

నేను శుష్కించియున్ననూ నిన్ను గట్టిగా పట్టుకొంటిని సుమా! నీ వెచ్చటికి వెళ్ళగలవు?"

6. దిక్కు లేక ఉండిన వాడను నేను. నీవు నన్ను నా కుటుంబమును ఆదుకొని, నా హృదయమునే నీ కోవెలగా చేసుకొంటివి. ఎల్లలు లేని పరమానందమును పొందితిని. నేను నీకు దాసుడైనందుకు నా జన్మపీడ తొలిగినది. నేను నిన్ను ప్రత్యక్షముగా చూచుచున్నాను. ఆఖరున నిన్ను గట్టిగా పట్టుకొంటిని. నీ వెపుడూ నా చూపులోనే ఉందువు గాక!"

7. లౌకిక వాంఛలైన ముమ్మలములు (అహంకారం, కామ్యము, మాయ) తొలగించగల మూలపురుషా! ప్రేమ చూపు విధానమును, నాకు అనుగ్రహించినవాడా! నా ఆచరణ విధానము నీకు నచ్చి నా హృదయములో ప్రవేశించిన జ్ఞానజ్యోతీ! శాశ్వతమైన సంపదా!

8. "ఓ తండ్రీ! లోక మూలకారకుడా! జ్ఞానరూపా! ముగింపులేని దివ్య (శివ) లీలలు ఆడించువాడా! ప్రేమ స్వరూపా! భక్తప్రియా! సకల జీవరాసులందు కలిసిపోయి, వాటికి అతీతముగాను, వాటి యందే ఉండి, నిలచి మాయ చేయువాడా! సర్వభూతేశ్వరా! నిన్ను నేను గట్టిగా, శాశ్వతమైన తోడుగా చేసుకొంటిని. ఇక నీ వెచ్చటకు వెళ్ళి అనుగ్రహించెదవు?"

9. "శిశువు యొక్క ఆకలి ఎరిగి ప్రేమతో పాలిచ్చు తల్లి కన్నా నీవు నన్ను ఆదుకొని, చాలా ఉదార భావముతో, కరుణతో, నా హృదయమును ద్రవింప జేసితివి. ఓ శివా! హృదయమునందు తెలివిని పెంపొందించి శివానందమను తేనెను తినిపించితివి. నేనే నిన్ను కోరి స్వీకరించితిని సుమా! నన్ను త్రోసివేయుకుమా!"

10. "పుండ్లు నిండిన మాంసపుముద్దలు, వెంద్రుకలతో కూడిన ఈ అల్ప శరీరమును ఒక బంగారు దేవాలయముగా చేసినది నీవు. అందు నివసింపజేసితివి. దీనిని తలచునపుడు. నా ఎముకలన్నీ కరుగుచున్నవి. ఏ మలినములేని మాణిక్యమా! జన్మ, మరణ జీవన దుఃఖము, అజ్ఞానమును తొలగించిన ఓ దివ్యఅనుగ్రహ జ్యోతియే! నిన్ను నేను గట్టిగా పట్టుకొంటిని సుమా! నీవు నాకు ఎప్పటికీ సొంతమై పోదువు గాక! ఇక నీ వెచ్చటికి వెళ్లెదవు? ఈశ్వరా!"

## 38. దివ్య క్షోభ

శివుడు తన వంతు కర్తవ్యముగా గుర్తించి అడవిలో నున్న పెక్కు నక్కలను యుద్ధ గుర్రములుగా రూపుమార్చి పాండ్యరాజు వద్దకు తీసుకొని వచ్చిన దివ్యత్వము తలంచి శ్రీ మాణిక్యవాచగర్ కోరి చింతించుట.

1. "ఇనుము కన్నా కఠినమైన నా మనస్సును నీవు కరిగించితివి. చెరకు కన్నా తీపియైన నీ దివ్యపాదములను చూపించి అనుగ్రహించితివి. గంగాదేవిని జటుయందు ధరించిన

ఓ గంగాధరా! నీ మహానుగ్రహము వలన కదా నక్కలన్నియూ గుర్రములైనవి!

2. ఉమామహేశ్వరా! నీ దాసానుదాసులకు నీవు అరుదైన అమృతము. అన్నింటికీ మూలపురుషా! భూలోకమునకు, పలువాంచలకు వశమైన నన్ను జన్మరహితునిజేసి నన్ను ఆకట్టుకొంటివి. నీ దివ్య పాదములను కళ్లార జూచి నేను ధన్యుడనైతిని!"

3. "లోకరక్షణార్థముగా మహా సముద్రమథనమందు వెలసిన విషమును త్రాగితివి. జనన, మరణములను కఠోర నరకములో నుండుకొని బంధువులు, ఇతరుల ఎవ్వరి సహాయము లేనివాడై, ఏడ్చుచున్న నాకు, నీవు దాక్షిణ్యుడవై నీ దివ్యపాదములను అనుగ్రహించినది ఓ ఆశ్చర్యకరమైనదే కదా! ఓ పరమాత్మా!"

4. "పచ్చనైన నాలుక గలిగిన పామును ఆభరణముగా పొందినవాడా! జటాధారణ గలిగి, లెక్కలేనన్ని పాపములన్ని నివర్తింపజేసి, నీ శివ భక్తులకు నీ దివ్యపాదములు జూపి అనుగ్రహించినవాడా! క్షుద్ర దేవతలను పూజించక నిన్నే స్తుతించునట్లు చేసినది నీ నేర్పరి తనమే కదా! ఓ భూతేశ్వరా!"

5. "గ్రంథపఠనమో, కళాజ్ఞానమో, మనస్సు ద్రవించి సేవించడమో తెలియని వాడను నేను. అనుగ్రహదాహము లేనివాడను. మరోదైవమును స్తుతించి ఎరుగను. నీ దరిచేరినందుకు నేను గర్వమొందితిని. ఓ సర్వేశ్వరా! నాకు నీ అనుగ్రహము దొరికినది కుక్కకు బంగారు గూడు దొరికినట్లే సుమా!

6. "సున్నితమైన నడక, వాలుకన్నుల జాడలు, విషపుమాటలతో నిండిన స్త్రీ సాంగత్యమునకు తబ్బిబ్బుడైన నేను, ఓ ధర్మస్వరూపా! అభయమిచ్చి "భయపడకుమా!" అని చెప్పినది, నీ యనుగ్రహమే నాకు యోగమైనదే! ఓ దివ్యనాట్యమాడు నటరాజా! అమృతమా!"

7. "దేవతులు కూడ ఎరుగలేనిదియూ, నీ దివ్య అనుగ్రహము ప్రేమ వలనే నాకు జన్మరహితము జేసి నన్ను ఆదుకొంటివి. నాపై నీవుంచిన కరుణా ప్రవాహమును ఏమని చెప్పుదును. తిరుపెరుందురై పరమేశ్వరా!"

8. "మహిమలన్నింటికి మూలపురుషా! ఎప్పటికీ నవయవ్వనుడా! వేదస్వరూపి! ఆది అంతము లేనివాడా! సృష్టించిన మూల ప్రకృతిలో రెండు స్థితుల్లోను నున్నవాడా! లౌకికములో భ్రమించుచున్న నన్ను నీ ధర్మమార్గమునకు త్రిప్పుకొన్నది ఆశ్చర్యమే కదా!"

9. "తిరువిడై మరుదూర్ దేవా! నీ దివ్యస్వరూపము నా హృదయములో శాశ్వతముగా ఉంచి కనికరించుదువు గాక! నీ కరుణా సముద్రములో నేను చొచ్చుకు వెళ్లునట్లు అనుగ్రహించుదువు గాక!"

10. "శివాయనమః" అను పంచాక్షరమును నీ అనుగ్రహముచే పొందితిని తప్ప, నా తపస్సు వల్ల కాదు కదా! తేనె, పాలువలె తీపిగొలుపు నీకు నీవే నాలో ప్రవేశించి అనుగ్రహించితివి.దాని కారణము గా నీ సేవకు సహకరించని ఈ శరీరమును నేను దండించి, ఛీదరించుకొన ప్రయత్నించితిని."

# 39. దివ్య ఘోష

## (శివానంద ముదురు)

శ్రీ మాణిక్యవాచగర్ తిల్లైకి (చిదంబరమునకు) వచ్చు దారిలో తిరువారూర్ అను శివక్షేత్రమును దర్శించిరి. అచ్చట శివుని అనుగ్రహము పొంది పరవశములో మునిగిపోయి ఘోషించినది.

1. "నారాయణుడు, చతుర్ముఖ బ్రహ్మయు పొందలేనిది, బ్రహ్మాండమైన జ్యోతి, అనుగ్రహము, జ్ఞాన, ధర్మములు గలిగినవాడా! కొండ జాతి పూలతో కప్పబడిన ఉప్పొంగిన వక్షోజము గల ఉమాదేవి యొక్క ఓ భాగస్వామి! తిరువారూర్ దేవా! నీ దివ్య పాదమును తప్ప మరేది నేను స్తుతించను ఓ పరమేశ్వరా!!"
2. "జటాధారి! అగ్నికంటితో (త్రినేత్రములోని జ్ఞానాగ్ని) నర్తనము చేయువాడా! శూలములు ధరించిన సైన్యము కలవాడా! అఖండజ్యోతిలో కొలువైనవాడా! జీవరాశులకు అధీశా! (ఓ పశుపతీ!) వృషభ వాహనా! శ్రీ తిరుపెరుందురైలో శయనించువాడా! నన్ను ఆదుకొన్న మహానుభావా! నాకు తగిన తోడుగా నిన్ను తప్ప నేనెవరిని ఎరుగను!"
3. "స్నేహితులను నేను కోరలేదు, బంధువులను కోరలేదు ఊరిని కోరలేదు, పేరు ప్రతిష్టలు నేను కోరనైతిని, శాస్త్ర పారంగతులను కోరలేదు. కుత్రాలములో ఇంపుసోంపులతో కొలువైన ఆదిపురీశ్వరా! నటరాజా! ఆవు తన దూడపై ఉంచిన వాత్సల్యము వలె నేను నీ దివ్యపాదముల దరి చేరి క్రుసించి కరిగిపోవలె సుమా!"

# 40. మహానంద దశకము

## (ఆటంకము లేని అనుభవ స్ఫూర్తి)

1. "నేను నా సొంతమని తలంచినది భిక్షాపెంకు, కౌపీనము (గోచి), కోరి వెతకు వస్తువు శివుని పాద పద్మములు మాత్రమే. నా దేహము ప్రాణము ఆనందమయకోశమగుటకు శివుని దివ్య పాదములను గట్టిగా వదలక పట్టుకొని నేను నాట్యమాడుదును."
2. "డమరుకం వంటి నడుము, తేనెవంటి తియ్యటి పలుకులు,స్పర్శ సుఖములు గల స్త్రీ సాంగత్యము తో ఎన్నో పాపములు నేను చేసియుండవచ్చును. కాని జనన, మరణ కర్మలు నాకు అంటవు. ఏలననగా ఆ తిల్లై (చిదంబరములోని శివుని) మహామహుని దివ్యపాద అనుగ్రహము పొందిన దాసుడను నేను."
3. "తిల్లై మహామహుడా! నా ద్వంద పాప కర్మములను తొలగించి. జన్మపీడలను తొలగించి వాంఛలను తొలగించి, సంచిత కర్మలను పూర్తిగా వీడునట్లు చేసి నాలో ప్రవేశించి

నన్ను ఆదుకొన్నది నీవే కదా ఓ సర్వేశ్వరా! నీ దాసుడను నేను సుమా!"

4. "ఓ సుఖదుఃఖరహితా! తిళ్లై ఈశ్వరా! నీ యందు ధ్యాస తప్ప వేరే లక్ష్యము, దారి, గుణములు, కాంక్షలు లేని వారు నీ భక్తులు. అటు వంటి వారిని నీవు విడచి వెళ్లడము లేదు. వారి హృదయములో నీవు అమృతుడవై, పరమానందమై జ్వలించుచున్నావు."

5. "పెట్టిన నామము, తోడువచ్చిన ముగ్గుణములు, వెంటాడిన వాంఛలు అన్నీ నశించునట్లు చేసి, ముమ్మలమును నివర్తిచేసి నీ భక్తులను శివానంద బోధయందు ముంచితివి. నేను అదే విధముగా కదా ! తిళ్లైలో నీ దరిచేరి నిన్ను గట్టిగా పట్టుకొంటిని."

6. "చెట్టులో ఒక లేత కొమ్మ ముదిరి, కొసకు మొగ్గతొడిగి, మొగ్గ పుష్పమై, పుష్పము కాయగా మారి, కాయ పండి నేలకు రాలిపోవునట్లు ఈ దేహము ముదిరి వ్యర్థమై నాశమై పోవును. ఆట్లు కాక శివుని దరిచేరి శివానుభవము పొంది, నేను నీ సాయుజ్యము పొందవలె !"

(శివానుభవము పొందని జీవితము అర్ధములేనిది. అర్ధము లేని జీవితము వ్యర్ధమని నొక్కి వక్కాణించుచున్నారు. శ్రీ మాణిక్యవాచగర్.)

7. "బలమైన, బహుసామర్థ్యమున్న రాక్షసుని భుజములను విరచిన నీ దివ్య పాదములను నా తలపై దాల్చితిని. దాని కారణముగా నాలో పురికొలుపు జీవన బంధములు తొలగిపోయినవి. నేను మహా సంతోషముతో ఆ తిళ్లై దేవుని (శివుని) వదలక పట్టుకొంటిని!"

8. "భూమిని త్రవ్వ నల్లనైన, క్రూరమైన, బలమైన కూర్మమును (పందిని) అడవిలో వెంటాడి వెళ్లిన ఆ దివ్యపాదములే (శివుని పాదములే) నా శిరస్సు పై మోపినది. మోపినందు వలన నాలో పురికొల్పు, ముళ్ళు వంటి, కీడుసలుపు పంచేంద్రియముల ఉత్కృష్టతను అణిచి నన్ను ఆ తిళ్లై దైవము (శివుడు) ఆదుకొనెను."

(అర్జునుడు అడవిలో పాశుపతాస్త్రము కొరకు తపస్సు చేయునపుడు ఒక రాక్షసుడు పంది రూపమున వెళ్లి చెఱపజూచెను. అప్పుడు శివుడేతెంచి ఆ పందిని వెంటాడి చంపెను.)

9. "పాడుపడి పోయిన బీడు భూములను త్రవ్వి, దున్నీ ఏ ఫలము పొందలేని నేను, నా పూర్వజన్మసుకృతము వలన దొరికిన బంగారుపొద (శివ సాయుజ్యము) వంటిది ఈ తిళ్లై నటురాజుని సన్నిధానము. నా శిరస్సు పై అందినది వాని అనుగ్రహము."

10. మాతృమూర్తియైన ఉమాదేవితో అర్ధనారీశ్వరునిగా వెలుగొందు వానిని నేను పూర్ణ మనస్సు తో చేసిన సేవలకు గాను నా ద్వంద్వకర్మ ఫలితములన్నింటిని ఇచ్చటనే ముగింపు పలికితిని. తల్లి వంటి దయగలిగిన తిళ్లై దైవమును (శివుని) నేను గాఢముగా పట్టుకొంటిని!"

# 41. అద్భుత దశకము

## (అనుభవ ఫలితము)

1. "మాయకులోనై ఆడించబడి, క్షీణించదగిన సంపద, యవ్వనము. శరీరములను నశించదని తలంచి, లౌకిక జీవన మను సముద్రములో మునిగి, అందులో స్త్రీ సాంగత్యమను కామ సుడిగుండములో చిక్కుకొని తల్లడిల్లు నన్ను దు:ఖ పడనీయక ఆ తిరుపెరుందురై దైవము (శివుడు) ఆదుకొని రక్షించెను. అంతేకాక లౌకిక జీవితమునకు కారణమైన వాంఛలను తొలగించి జ్ఞానమను అనుగ్రహజ్యోతిని నా పై ప్రసరింపజేసి, సామాన్యులు ఇతరులు దర్శింపజాలని అరుదైన తన దివ్యపాదములను జూపి, సత్య స్వరూపిగా కొలువై, తన నిజరూపముతో నా ముందు నిలచెను. ఇటువంటి అద్భుతము చెప్పుటకు పదములేవి?"
2. "అటువంటి దైవమునకు కృతజ్ఞత భావముగా స్తుతించి, మంత్రము జపించి, మంచి పుష్పములతో పూజింపక, స్త్రీ లోలుడనై, వక్షోజగంధపు సువాసనలకు లోనైన వాడైన నన్ను, దుఃఖపడనీయక తన స్వర్ణ పాదములను దర్శింపజేసి అనుగ్రహించి నన్ను రక్షించెను. ఇదొక అధ్భుతమైన విషయమే కదా !"
3. "నిలకడలేని ఈ లౌకిక జీవితము పొందుట కొరకు ఎన్నెన్నో చేసితిని. నేను, నాది అన్న మత్తు ఏర్పడినది. పామువంటి ఆ మాయ నా పూర్వజన్మ కర్మలను విషమును గ్రక్కినది. దాని వలన నేను కళంకితుడైతిని. ఏమీ అద్భుతమో! ఎచ్చట నుండియో ఒక వైదికుడు (శివుడు) నన్ను వెతికి వచ్చి, నన్ను అనుగ్రహించెను, నాకు పరమానందము గలిగెను, ఇది ఒక అద్భుతము సంభవించే కాదా?"
4. "జనన, మరణ ద్వంద కర్మలను తొలగించు (విధానము) తెలియక, స్త్రీల సంగతి కోరి వారి కనుసన్నలలో కొట్టు మిట్టాడుతున్నాను. అశాశ్వతమైనది, క్షరమైనదియునైన ఈ లోకమును శాశ్వతమని తలంచి మాట్లాడితిని. అటువంటి నన్ను, నా సహాయమునకు ఏతెంచి నన్ను వాని అనుగ్రహమునకులోను చేసి ఆదుకొన్నది ఒక వింతయే కదా!" (ఏది మరువవలెనో దానిని తలంచుదుము. ఏది తలంచవలెనో దానిని మరచెదము. ఇది మానవ నైజము. దీనికి కారణము పంచభూతాత్మకమైన శరీరపు నిర్మిత మాయ చేష్టలే. మాయ మనస్సున అజ్ఞానమును పురికొల్పి, కామముతో శరీరమును వశపరచుకొనుచున్నది. దీనిని జయించుటకు దైవానుగ్రహము ఆవశ్యకమే. వాని (దేవుని) నామస్మరణ, స్తుతించుట, పట్టు విడవని భావభక్తి-దైవానుగ్రహమునకు దారి చూపును.)
5. "సంపద, బంధువులు, భోగవస్తువులు, స్త్రీల సాంగత్యము, సంభోగము, వీటి తాకిడితో సంతసించి తిరుగుతున్న నన్ను, పాపకర్మములు నా నుండి తొలగించి, అనుగ్రహించి,

ఉన్నత స్థితిని నా కనుగ్రహించి నన్ను ఆదుకొన్నది ఒక అద్భుతమే కదా !"
(ప్రయోజనము లేని కార్యముల నుండి భక్తుని విడిపించి తనయొక్క (దైవము యొక్క) భక్తి పరవశమును భక్తునిలో ప్రవేశపెట్టి దానినే శాశ్వతము చేసిన తీరును తలంచి శ్రీ మాణిక్యవాచగర్ వాపోతున్నారు.)

6. "మారి, మారి ఏర్పడు జనన, మరణముల ప్రయాణములను అశాశ్వతమని తలంచక, అల్ప సంతోషాదులైన స్త్రీల వలయమను సముద్రపు అలలో చిక్కి కొట్టుమిట్టాడు వానిని, పరమేశ్వరుడు అందాల రాశియైన పార్వతి దేవితో వచ్చి నన్ను ఆదుకొని అనుగ్రహించిన విధమును ఏ మాటలతో చెప్పుదును ఆ అద్భుతమును!"

7. "అరుదైన మానవ జన్మమెత్తి, కొన్ని ఉత్తమ గుణములతో పుట్టిననూ దానిని మరచి దైవమునకు పుష్పములు జల్లి అర్చించక, పంచాక్షరీ మంత్రమును పఠించక, శివుని నమస్కరించక, నల్లటి కాటుక దిద్దిన స్త్రీల అల్ప సుఖములో లోనైయుండి పనికిరాని నన్ను ఆ తండ్రి దయతో స్వీకరించటము ఆదుకొన్న విధము ఒక అద్భుతమే కదా !"

8. ఉయ్యాలలో ఊగునపుడు పైకి క్రిందకు వెళ్లునట్లు ద్వంద కర్మలను (సంచిత, ఆగామి కర్మఫలితములు) ఊపును నా నుండి తొలగించెను. భాషా పాండిత్యము, కళాజ్ఞానముల ద్వారా వానిని వశపరచజాలము. అట్లుండ నాలో తనను తెలుసుకొను అవకాశమిచ్చి, నాలో తన జ్ఞాన జ్యోతిని ప్రవేశింపజేసెను. నా బంధములు పోగొట్టి, ఆశలను త్రెంచెను. తన భక్త సమూహముతో నన్ను చేర్చుకొనెను. దీనికంటే వేరొక అద్భుతము నేను జూడలేదు.
(ఉయ్యాల ఊగుట, క్రింద, మీదకు వెళ్లునట్లు మన జనన, మరణములు. జనన, మరణములకు కారణము మన కర్మలే. శరీరము,ప్రాణము ఉయ్యాలనగా దానిని ఆడించువాడు దైవము. జనన,మరణములు మారి మారి వచ్చును. మరి దైవము ఎట్లు ఆకట్టుకొనెను? ద్వంద కర్మములన బడు పాప, పుణ్యములు త్రెంచివేసినపుడే: సామర్థ్యముచే దైవమును పొంద గోరుట వీలుకాదు. అహంలేని, సత్యశీలునకు, నిరాడంబరునికి దైవము దిగివచ్చును. జ్ఞాన జ్యోతిని వృద్ధి చేయుట వలన బంధములను, ఆశలను, కాంక్షను త్రెంచుచున్నాడు. ఈ విధముగా జీవులు ఉన్నతిస్థితి పొందుటకు దైవము దారి చూపుచున్నాడు.)

9. "అడవి వంటి ఈ జన్మములో వ్యర్థముగా అటు,ఇటు తిరుగు కుక్కవలె నేను అల్లాడితిని. స్త్రీ వ్యామోహము లో పడిన వారికి తగినట్లు అనుకూలుడనై తిరుగాడితిని. అటువంటి నాకు నారాయణుడు బ్రహ్మలు కూడ దర్శించలేని తన దివ్యపాద పద్మములను నా తండ్రీ (శివుడు) నాకు చూపి నన్ను అనుగ్రహించినది ఒక అద్భుతమే కదా!"

10. "మరలా, మరలా వచ్చి నిర్బంధించు జనన, మరణములను నివర్తింపజేయు మార్గము వెతకక, దట్టమైన నల్లటి కురులు, తప్పు నడకలు గల స్త్రీ సాంగత్యములో మనస్సు

ఉంచిన నన్ను ఆ దైవము మహామహుడు (శివుడు) నన్ను కరుణించి తన విశ్వరూపము జూపించి, శివజ్ఞానము నాకు భోదించి, ఆదుకొన్నది మహా అద్భుతమే కదా!"

# 42. మేధో దశకము

## (శివ ఫలితము)

పరమేశ్వరుడు గురువుగా దర్శనమిచ్చి తన దివ్యపాదములను మోపినది తలంచి విస్మయము చెందినది.

1. "మహా దేవుడు సత్యపరిపాలకుడు! ముమ్మూర్తులకు (బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరుడు) కూడ అర్థము కాని వాడు! మహా ఆనంద స్వరూపి! భక్తుల యొక్క ప్రేమ, భక్తికే సులభలభ్యుడు. వాని పవిత్రపాద పద్మములు నా శిరస్సు పై ఉంచినది – శాశ్వతమైనది."
2. "పంచ భూతములు, సూర్యుడు, చంద్రుడు, జీవి అను అష్టరూపములలో కలిసి కొలువైన అందగాడు! శివలోకమునకు మొదటివాడు! శివలోక నాయకుడు! ఉమాదేవికి భాగస్వామియైన అందగాడు! వాడే సత్యతత్త్వము! వాని ఎర్రనైన దివ్యపాదపద్మములు నా చిత్తములో శాశ్వతమై కొలువగు గాక!"
3. "ఓ స్త్రీలారా ! మీరు నన్ను చూచుటకు ముందే మా నాయకుడు మమ్ములను తన కార్యములందు నిమగ్నులను చేసెను! తోటలతో నిండిన ఆ తిరుపెరుందురై దైవము (శివుడు)! మీ చేతులు గాజులు శబ్దించుట మాత్రము కాకుండా మా ప్రాణమును కూడ ఆకర్షించియున్నాడు. ఆ దివ్యపాద పద్మములు మన శిరస్సు పై కొలువు కావడము మనకి శ్రేయస్సేయగును!"
4. తిల్లైలో (చిదంబరములో) నాట్యమాడు శివుడు సిద్ధుల మధ్యను, భక్తుల మధ్యను ఆవరింప బడినవాడు, తానే బ్రాహ్మణుడై (వైదికుని రూపమున) వచ్చి మన కార్యములలో పాలుపంచుకొని మన పనిని స్వీకరించెను. వాని దివ్యపాదపద్మములు మన శిరస్సుపై శాశ్వతముగా కొలువై యుండుగాక !
5. "ఈ భూలోక జీవితము శాశ్వతమని తలంచియున్న నన్ను, ఇది శాశ్వతము కాదని నాకు బోధించిన మహామహుడు ఆ కృపానిధి! (శివుడు). ఉమాదేవిని భాగస్వామిగా గైకొనియున్న ఆ సర్వేశ్వరుడు నా శరీరములో అమృతమును ఊటవలె కారునట్లు అనుగ్రహించెను. వాని దివ్యపాద పద్మములు మన శిరస్సుపై పదిలము చేయుగాక!"
6. మన హృదయమును దేవాలయముగాచేసి మనలో ప్రవేశించెను. పాపములను తొలగించెను. భక్తిని పెంపొందించి ముక్తిని నొసెగెను. త్రిలోకములకు అతీతముగా పరమానందమును నొసగువాడు. భక్తప్రియుడు! (శివుడు) వాని దివ్యపాద పద్మములను

మన శిరస్సుపై కొలువగు గాక!

7. "జన్మమను మహా సముద్రమును ఈదించి, దాటించి మహానుగ్రహమును నొసెగెను. ఏ దిక్కులేక అనాథగా పడియున్న నన్ను భక్తులు, దాసులు సమూహములో చేర్చుకొనెను. ఈ అల్పుని అవరోధముల నుండి దాటించి ఆదుకొని అనుగ్రహించిన మహాదాత! వాని దివ్యపాద పద్మములను మన శిరస్సు పై ఉంచి శరణు పొందెదముగాక!"

8. "అశాశ్వతమైన శరీరమిది. పురుగులుతో నిండిన గూడు. శాశ్వతమైన జీవితమును గుర్తించగలిగిన ఆత్మజ్యోతి నా తండ్రి శివుడు! స్తుతించువారికి, కన్నీళ్లు కార్చువారికి, తన దాసులకు మార్పులేని ముక్తినొసగువాడు నా పశుపతి! మహామహుడు! వాని దివ్యపాద పద్మములను మన శిరస్సుపై దాల్చుదుము గాక!"

9. "వ్యర్థమైన చర్యలు చేయుచు కాలము వెళ్ల బుచ్చుచున్న నన్ను 'రా' అని పిలచి నా పాపకర్మములను పోగొట్టిన మహోన్నతుడు వాడు. లోకమంతట వ్యాపియై, దానికి అతీతముగాను ఉన్నవాడు అతను. తనపై ప్రేమ ఉంచిన వారికి లౌకిక సుఖమును, తన నిజదాసులకు విముక్తి (మోక్షము) ని నొసగువాడు అతను. వాని దివ్యపాదములందు మన శిరస్సును మోపెదము గాక!"

(దైవము జీవరాశులందు అమితమైన ప్రేమ చూపు దయాళుడు. లోక సుఖములందు మునిగించి, జన్మదు:ఖమును ఎరుగలేని జీవులను తన ప్రక్కకు లాగుకొని, పాపకర్మములను పోగొట్టుచూ, వారి వారి జన్మలను సాఫల్యము చేయుచున్నాడు.)

10. "స్వతహాగా తను (శివుడు) ప్రేమ బంధములకు అతీతుడు. ముక్కంటి తండ్రి! అన్నిటికి విత్తనము వంటి వాడు. వాని దివ్య నామమును పాడి స్తుతించు భక్తులారా రండీ ! మీ లౌకిక కాంక్షలు వీడ గోరి ఈశ్వరుని శరణునొందండి. ఆతని దివ్యపాదములు మీ శిరస్సులపై శాశ్వతముగా ఉండుగాక!"

# 43. దివ్యోపదేశము

## (ప్రకటించిన ప్రేమరూపము)

తిరుపెరుందురైలో దైవము తనకనుగ్రహించిన ఉపదేశమును క్రింది పద్యముల ద్వారా శ్రీమాణిక్యవాచగర్ బహిర్గతము చేసిరి.

1. "ఉమాదేవి యొక్క భాగస్వామీ! తన మాటలను వేదముగా చేసిన వాడు, సహస్రపటలములనందు వెలుగు జ్యోతియు, కరుణాకరుడును, ధర్మవంతుడు, నీతిమంతుడు, పరబ్రహ్మం. ఇటువంటి పుణ్యాత్ముడు భూమి పై మానవ రూపమెత్తి, వచ్చి, నన్ను ఆకట్టుకొని అనుగ్రహించెను.

(శబ్దము శివుని నుండి జనియించినది. వాని మాటలే వేద శబ్దము వాక్కులైనవి. ఆ వేద వాక్కు తగినట్లు మనము భేదముతో పలుకునది బ్రహ్మ, విష్ణువు, నారాయణుడు, శివుడు అని అన్నియూ మేలైన ఒక బ్రహ్మమునే గుర్తించును.)

2. "విష్ణువు, బ్రహ్మ,ఇంద్రుడు స్తుతించ అనుగ్రహించెను. ఈ లోకమునకు గురువు రూపమున వచ్చి జ్ఞాన మార్గమును జూపెను. తిరువిడై మదూర్‌లోని ఒక కన్యకు శీలవతిగా వర్ధిల్లమని ఆశీర్వదించి నందున, భక్తులందరికి తాను సహాయకుడునని బోధించెను. శివుని మహిమలను ఎరుగువారు ఆరాధ్యులగుదురు."

(వరగుణ పాండ్యరాజు తన వద్ద శ్రేష్టమైన వన్నింటిని ఆ పరంధామునికి అర్పించు గుణమున్న రాజశేఖరుడు. తాను పెండ్లాడిన ఓ కన్యను కూడ శివునికి అర్పించగా, శివుడు ఆ కన్యను తన స్వరూపములో స్వీకరించి, శీలవతిగా మరలా త్రిప్పిపంపెను.)

3. "జటాధారుడు, దేవదేవుడు, ఆనంద నటరాజు, ఆరుమతముల వారు స్తుతింప జన్మబంధములు త్రెంచువాడునైన, ఉత్తముడు, మత్స్యకారుని పుత్రిని వలపన్ని పట్టెను. ఆ మహామహుడే మన నాయకుడు అగును."

4. "దేవతలందరు కలిసి తమ తమ కోర్కెలు నెరవేరగోరి శివుని దరిచేరి నపుడు, శివుడు వారికి దర్శనభాగ్యమీయక మహేంద్ర గిరిపై వేటగాడి రూపము ధరించి కనుమరిగి యుండెను. కాని తన భక్తులను కాపాడుట కొరకు గుర్రముపై వచ్చి దర్శన భాగ్య మొసెగెను. వాని మహిమను ఎరుగువారు మన మెప్పుపొందిన వారగుదురు."

5. దేవతలు నమస్కరించి, స్తుతించ శివుడు వారికి కరుణ చూపించెను. భక్తుల దాసుల యొక్క బంధములు, ప్రేమలను త్రెంచి అనుగ్రహించెను. మహా అలలతో నిండిన సముద్రమును దాటి లంకకు వెళ్లి భక్తాగ్రేసరియైన మండోదరిని (రావణుని భార్య) అనుగ్రహించెను.ఇటువంటి శివుని మహిమ లెరిగిన వారే మన ఆరాధ్యతకు పూజ్యులగుదురు.

6. త్రిపురములను కాల్చి, కుప్పగా కూల్చినవాడును, తీవ్రమైన ధనుస్సును చేతబూనిన వాడునైన శివుడు వేటగాడి వేషములో వేట కుక్కల నడుమ దట్టమైన అడవిలో తిరుగాడు చుండ, ఒక తల్లి పంది తన బాణము తగిలి చనిపోయెను. పందిపిల్లలు తల్లి పాలు లేక అల్లాడుట చూచిన శివుడు తనను అన్ని దేవతలు సేవ చేయు సమయమున, వారి సమక్షమున తాను తల్లి పంది అవతారమెత్తి తల్లై పంది పిల్లలకు పాలు త్రావించిన ఆ కరుణామూర్తి! శివుని మహిమలు ఎవరు ఎరుగుదురో వారే మనకు పూజ్యులగుదురు.

7. శ్వేత పద్మమున కొలువైన సరస్వతియు, మహాలక్ష్మియు, పుష్పములు జల్లి, మంత్రము జపించి, స్తుతించు ఆ తిరుపెరుందురైలో కొలువైన నాయకుడు (శివుడు), గురువుగా రూపము దాల్చి ఏతెంచి అస్పృశ్యతను తొలగించి అందరిలోనూ సఖ్యతభావనను ఏర్పరచిన

ఆ మహామహుని కీర్తించు వారే మనకు పూజ్యులగుదురు."

8. కొండజాతి పుష్పములను దివ్యమాలగా ఛాతీన ధరించినవాడును, ఉగ్రమైన పులిని చంపిన వీరుడును, ఉమాదేవి భాగస్వామియునైన శివుడు, వరుణుడు చేసిన యాగాగ్ని గుండములో అవతరించిన స్త్రీలను తన వశము చేసుకొన్న ఆ మహామహుని స్తుతించువారే మనకు పూజ్యులగుదురు."
9. "దివ్యభస్మమును (విభూది) పూసుకొన్నవాడును, మహేంద్ర పర్వత నాయకుడును, దేవతలచే సదా స్తుతించబడువాని దివ్యపాదములు నా శిరస్సు పై మోపినవాడును ఐన శివుడు కరుణతో దర్శన మిచ్చెను! నా హృదయము ద్రవించునట్లు దుఃఖములను తొలగించెను! దీనిని ఎరిగినవారే మనకు పూజ్యులగుదురు."
10. "అనుగ్రహదృష్టి గలవాడు, భక్తులకు అమృతమైన వాడు, మా వాంఛలు తొలగించి యవ్వనములోను, ముదిమిలోనూ సుఖము నొసగి అనుగ్రహించిన వాడునైన ఆ పరమేశ్వరుడు! శంఖు గాజులు, గవ్వలు, అందమైన స్త్రీల ఆభరణ వస్తువులు మోసుకొని వ్యాపారివలె మదురానగరికి వచ్చెనే! ఆతను మహిమ లెరిగి, గుర్తించిన వారే మనకు పూజ్యులగుదురు."

# 44. దైవ చింతన

తిల్లైలో (చిదంబరం)లో అనుగ్రహించిన ఈ పధకములో శ్రీ మాణిక్యవాచగర్ తన తలంపులను బహిర్గతము చేసిరి. తనను దైవము ఆకట్టుకొనవలెననునదే ఆతని తుది కోరిక. అట్లే అమరినది.

1. "ఎర్రనైన దివ్యదేహము గలిగిన ఓ పరమేశ్వరా! లౌకిక జన్మలుమరి నాకు వద్దు. నాలో భక్తి పెంపొందించుదువు గాక! అరుదైన అమృతమా! నీ భక్తుల నడుమ నీ దివ్యానుగ్రహము చూపి నన్ను ఆదుకొందువు గాక!"
2. "ఈశ్వరా! నీ దాసుడగుటకు అర్హత నాకు లేకపోవచ్చు. కాని నిన్ను వీడి నేనుండలేను సుమా! దానికి కారణము నేనెరగను. పెద్దలు నీ పాద పద్మములను నాకు చూపిరి. నన్ను వీడి వెళ్లజాలనని నీవంటివే అది అసత్యమగునా? సర్వేశ్వరా!"
3. "ముందే తిరుపెరుందురైలో నన్ను ఆకట్టుకొన్న సిద్ధేశ్వరా! తపస్వరూపి! నా ఎముకలు కరుగునట్లు నాకు నీవు అనుగ్రహించితివి. ఇప్పుడు నాలో పరమానందము పొంగునట్లు నా అల్ప ప్రజ్ఞలను తొలగించుము. ఓ ప్రాణనాథా! నీ శుభమగు అనుగ్రహమును ఎల్లపుడు నాపై ఉంచుదువుగాక!"
4. "నేను భక్తి లేనివాడను. పూజించు విధానము తెలియనివాడను. నాలో దైవదాహము

లేదు. నిన్ను స్తుతించనైతిని. ఇలా ఉన్ననూ ఓ జన్మరహితము చేయువాడా! ఓ మాణిక్యమా! ఉన్నతమైన నీ దివ్య పాదములను జూడ కోరుతున్నాను. ఓ ముత్యమా! నిన్ను వీడి యుండుట నా వల్ల ఇక వీలుకాదు సుమా!"

5. "ఓ పరబ్రహ్మ! నీ దివ్యపాదములు దర్శించుట,స్తుతించుట,పాడుటను విడచితిని.శాశ్వతమైన వాడా! సర్వాత్మ! నేను అజ్ఞానుడను. భక్తులు నీ యందు లీనమైపోవుట చూడనైతిని. నీవే కోరి వచ్చిననూ నిన్ను నేను చూచుటకు, గుర్తించుటకు శంకించుదును."

6. "తెల్లనైన భస్మము (విబూది) పూసుకొన్న పరమాత్మా! భక్తులకు అనుగ్రహదారి చూపు జ్యోతిస్వరూపా! ధర్మము ఎరుగనినేను నిన్ను ఆహ్వానించి, నమస్కరించి, పూజించి, పాడి, స్తుతించి, పులకితుడనై మనస్సు పరిపూర్ణము పొందవలె,అందులకు నాయందు దయజూపి నీవు నాకు అనుగ్రహించెదవు గాక!"

# 45. యాత్ర దశకము

శ్రీ మాణిక్యవాచగర్ తను తిల్లై (చిదంబరము) నటరాజుని దర్శించి పాడిన యాత్ర దశకము. ఈ దశకములో దైవమును చూచిన వెంటనే తను పులకితుడై మైమరచి తన ప్రాణమే శివుని యందు పూర్తిగా లయమై పోయినట్లును, తన చుట్టూ గుమి గూడిన భక్త సమూహమును పిలచి ఆ మహామహుని దివ్యపాదములను చేరు సమయ మాసన్నమైనదని, అందరిని రమ్మని పిలచి వర్ణించి పాడియున్నారు.

1. "కొండజాతి పుష్పమాలను శిరస్సుపైన, సర్ప ఆభరణమును కంఠము చుట్టును ధరించిన వాడు పరమేశ్వరుడు. వాడు ఎప్పుడు మన హృదయమునందుండి మనల్ని కరుణించుచున్నాడు. మన అశాశ్వతమైన శరీరమును విడచి ఆ కరుణాకరునితో చేరు కాలము ఆసన్నమైనది. ప్రియులారా! మన మందరము ఒకటై వాని దివ్యపాదములను పొందెదము. దానికిదే మంచి తరుణము సుమా!"

2. "ఇంద్రియముల తీక్షణముతో అధములైన మనల్ని సర్పము ధరించిన ఈశ్వరుడు ఆదుకొనును. వానిని పొందుటకు ఉత్సాహముండవలె. ఇంద్రియములు వెళ్లు దారిన వాటిని విడువరాదు. లౌకిక, బాహ్య వాంచనలను విడనాడి, వాని దివ్యపాద పద్మములొక్కటి నే తలంచ కోరుకొందుము గాక!"

3. దైవము యొక్క దివ్యానుగ్రహమను తోడుతో భక్తులందరు తమకు తామే ఉద్ధరించు కొనవలెను. దైవమును మరచి అహంను పెంచు కొనుట ఒక మత్తువంటిదే. భక్తులతో, దాసాను దాసులతో మన మేర్పరచుకొను బంధము. జీవిత లక్ష్యమైన దైవము దగ్గరకు మనల్ని తీసుకు వెళ్లును. వాని స్వర్ణ పాదములు తప్ప ఈ లౌకిక అసత్య జీవితంమనకొద్దు!"

4. “ఓ భక్తులారా! ఈ లౌకిక జీవితమను ఆటను విడనాడండి. వాంఛ, కాంక్షలు విడనాడుటను ఉన్నతమైన లక్ష్యమును, ఆశయమును పొందండి. ఆ విడుపు, పరమానందమునకు కేంద్రమైన దైవము యొక్క దివ్యపాదముల దరికి చేర్చును. వాడు మన స్థూల శరీరమును తొలగించి పవిత్ర రూపము (శివసన్నిధి) మనకొసగును.”
5. “కోపము, కామ రోగమును విడచివేయండి. వాటిని వీడుటకుమేలైన కాలము మరొకటి లేదు. భక్తదాసుల సమూహముతో దైవ పాదముల దరి చేరుటకు నిర్ణయించండి. శివపురము యొక్క ద్వారము మనకని తెరచియున్నది. అది మూసుకొనుటకు ముందే వెళ్లి ఆ సర్పధారణతో నున్న శివుని సుత్తించుదుము గాక!”
6. “పరమేశ్వరుని దివ్యపాదములను పొగడి పాడి, నమస్కరించి పుష్పములతో అలంకరించండి.ఆ దివ్యపాదములను మనస్సున పదిలము చేయండి. కష్టములు దరిచేరవు. ఏ అడ్డంకులు ఏర్పడవు. మన శివపురమేతెంచి సత్యమైన ప్రేమికుల మధ్య వెళ్లి మనస్సు కరిగి నిలుచుందుము గాక!”
7. “నిలకడలేని ఈ లౌకిక జీవితమును శాశ్వతమని తలంచువారు అందులో నిమగ్నులైయుండనీ. మనల్ని పరిపాలించు దివ్య స్వరూపి, సర్పధారుడిని (శివుని) స్వర్ణ పాదముల చెంతకు పరుగిడి వెళ్లెదము. ఇప్పుడు, ఈ క్షణమే తీవ్రప్రయత్నము చేయని వారు తరువాతి కాలములో దాని గురించి విచారించునట్లు అగును.”
8. “దైవము యొక్క పరమానందములో ఎల్లపుడు మునిగియున్న భక్తులారా! మీరు దేని గురించియు లౌకిక జీవితములో మత్తు గలిగియుండకండి. శివపురము ఏతెంచుటకు ఇదే తగిన తరుణము. నారాయణుడు కూడ దర్శించలేని శివుని దివ్యపాదముల దరిని మనము చేరుదాము!”
(సందర్భములు ఎన్నో, లెక్కలేనన్నివి ఎర్పడును.మంచి సందర్భము ఎప్పుడో ఒక్కప్పుడు ఏర్పడును. కానీ శ్రేష్టమైన తరుణము ఒక్కసారే వచ్చును లేక ఏర్పడును. ఇహలోకమునైన సరే, పరలోకమునైనా సరే ఏర్పడిన మంచి సందర్భమును సద్వినియోగము చేసుకొన్న వారే బుద్ధిశాలి)
9. “శివుని పొందగోరు చిత్తమున్న వారు మనస్సును నిర్మలము చేసుకొని ఆలోచించవలె. శూలము వంటి కన్నులు గల ఉమాదేవి భాగస్వామియైన శివుడనుగ్రహించు అమృతమును పొందుటకు తీరని ఆశపొందండి. నిలకడలేని లౌకిక జీవితము వీడి, శివుని దివ్యపాదాల దరి చేరవలెనను మహోన్నతకోరిక కోరండి!”
(ఎంత దాహము వేసిననూ, వర్షపు నీటి కొరకు కాచుకొని, ఆ వర్షపు నీటి బిందువులనే త్రాగి దాహము తీర్చుకొనునవి చాతక పక్షులు. వేరే నీటి కొరకు అవి నోరు తెరవవు. అట్లే భక్తి, ముక్తి దాహము గొన్న పరమభక్తాగ్రేసరులు పరంధాముని తప్ప మిగత

లౌకికముల పై మనస్సు పెట్టరు.)

10. "భక్తి ఉన్నతమైనపుడు, పరవశించిపోవడమో, పూజించడమో, స్తుతించి పాడడమో చేయుటకు శంకించుట ఏల? వీటిని చేయకపోయినచో మాయమత్తులో చిక్కు కొందురు. బుద్ధి మందగించినచో ఎవరు గౌరవించెదరు? మీ బుద్ధి తేటయగుటకు సాధనలో నిమగ్నులు కండి! ఇట్లు చేయనిచో పరమాత్ముని అనుగ్రహము ఎట్లు పొందుదురు? మరలా, మరలా యోచించి చూచుదురు గాక!"

# 46. దివ్య సేనాయుత్తం

## (ప్రచండ యుద్ధము)

శ్రీ మాణిక్యవాచగర్ జన్మ పీడలను వదిలించుకొన, దివ్యానుగ్రహము తోడుతో జయింపగోరి, తానే సేనాధిపత్యము వహించి సైన్యము ఆయుత్తము చేసినట్లు ఈ పద్యములను తాను తిల్లైలో రచించిరి. (తిల్లై=చిదంబరము)

1. "శివజ్ఞానము అను ఖడ్గమును దివ్య హస్తమున బూని మన మహానాయకుని (శివుని) ప్రణవ నాద వాద్యమును మ్రోగించండి. వివేకమను శ్వేత ఛత్రమును పట్టండి. దివ్య భస్మము (విబూదిని) ను రాసుకోండి.
మాయాసైన్యమైన కామ క్రోధములు మనపై దండెత్తుటకు ముందే వాటిని అణచి ఊర్ధ్వలోకస్తుల ఊరైన శివలోకమును మను వశము చేసుకొందుము గాక!"
(అజ్ఞానమే మనకు తీవ్రమైన విరోధి, అదే అన్నిటికి దుఃఖ కారణము. జ్ఞానమే దాన్ని తొలిగించగలదు. దైవ నామ జపముతో జ్ఞానము పుట్టి, తోడగును. ఎండనుండి రక్షణకు ఛత్రమువలె, (గొడుగు) వివేకము మనకు రక్షణ అగును. దివ్య విబూది ధారణ వైరాగ్య చిహ్నము. బంధము తొలగించునదే వైరాగ్యము. అజ్ఞానము విడినచో శివలోకము మనదే!

2. "దాసులారా!మీరు ముందు విభాగములో ముందు చూచి వెళ్లండి, భక్తులారా! మీరు సైన్యము చుట్టూ వెళ్లండి. యోగులారా! మీరు సైన్యపు లోపలి విభాగమున వెళ్లండి. దృఢమైన సిద్ధులారా! మీరు వెనుక జట్టుతో కలిసి వెళ్లండి. మనము దు:ఖములకు చిక్కక శివలోకమును పాలింతుము గాక!"
(ఒక సైన్యమునకు సంఖ్యాబలము గొప్పదికాదు. కట్టు దిట్టమైన,వ్యూహ రచనతో పోరు సలుపు సైన్యమే జయించును. దీనినే యుద్ధ తంత్రమందురు. శ్రేష్టమైన వ్యూహం రచించువాడే గొప్ప సేనాధిపతి. యుద్ధరంగము నందు మాత్రము కాదు, జీవితములోను వ్యూహము అవసరమే!)

# 47. దివ్యవెన్బా

'వెన్బా' అనగా పద్యరచనలో గల పద్యశైలి 'ఆటవెలది.'

తిరుపెరుందురైలో పాడిన ఈ దశకము ద్విపదలతో కూడినదై రసవత్తరమైన పెక్కు ప్రాసలతో నిండి ఉన్నది. శ్రీ మాణిక్యవాచగర్ తాను పొందినది, పొంద మరచినది రెండు అనుభూతులను ఇతరులకు తన మాటలతో తెలియజేసిరి.

1. "జ్ఞానాగ్నియైన తిరుపెరుందురై మూల పురుషుని నా చిత్తములో పదిలము చేసుకోలేకుంటిని. వాని స్వరూపములో నన్ను చేర్చుకొనినచో ద్వంద కర్మఫలితములు తొలిగిపోవునే.పంచభూతాత్మకమైన ఈ అజ్ఞాన దేహము కాలిపోవును.దివ్యభస్మమే తుదకు శివ స్వరూముగా మిగిలి నిలుచును."
2. "మహాదేవా! దేవాదిదేవా! ఆనందమును, భక్తిని పెంపొందించ గలిగినది తిరుపెరుందురై తండ్రియేనని నాకెవరు చెప్పదురు? నేను ఒంటరిగా ఆర్తిపొంది, పులకరించి, ఆడి, పాడినచో నన్ను వాడు చూచునా? నేనేమి చేతును?"
(పరమానందమును ఒంటరిగా పొందగోరుట తగదు. సహ భక్తులతో పంచుకొనవలెను.)
3. "పామరుడైన నా హృదయములో జ్ఞాన శూలము గైకొని శివుడు గట్టిగా గ్రుచ్చివేసెను. నా తప్పులు నుండి నేను బయట పడకుండా ఉండి నందుకు కాబోలు. ఉన్ననూ వాడు గ్రుచ్చిన శూలము నా అజ్ఞానమను మత్తును విడిపించినది. సుమా!"
(ఒక పామరునికి నొప్పించి చెప్పించడము కొందరి నైజము. శ్రీ మాణిక్యవాచగర్ తాను పామరుడని చెప్పుకొని, శివుని చే తాను బలవంతముగా బోధింపబడినట్లును, దానితో తనకు తేటనైన జ్ఞానము గలిగినదని, దానితో తాను అన్నిటిని దాటితినని చెప్పుకొనుట.)
4. "తిరుపెరుందురై నిరంజనుడు! (శివుడు) అనుగ్రహదాత! నా పుణ్య పాప కర్మములు రెండింటిని వేరుతో పెకలించివేసి, నాకు దర్శనభాగ్య మొసగెను. ఇక వచ్చు జన్మలో గలుగు దుఃఖమును తొలగించెను. అరుదైన ఔషధమయ్యెను."
(ఎల్లలు లేని అపరిమితానందము నొసగునది శివజ్ఞానము.)
5. ప్రపంచమంతట వెదకిన నారాయణుడు, చతుర్ముఖుడు శివుని దర్శింప శక్యము కాలేదు. కాని అహంభావన (గర్వము) లేని హృదయమున మహాదేవుడు నెలకొనియున్నాడు.
(ఉన్నచోటును వదిలి లేనిచోటున వెతకకూడదు. గర్వమున్నవారు అట్లే లేనిచోట్లయందే వెతుకుదురు.)
6. "తిరుపెరుందురై తండ్రి రక్షించి, అనుగ్రహించు దాత! అమృతుడు! జ్ఞానపిచ్చిమనకు నొసగి, దాని ద్వారా పరమానందమును పొంది ఆశగొలుపునట్లు చేసెను. వాడు జన్మరహితులుగా చేయువాడు. మనస్సుకు మాటలకు అందని మహదానందమును స్వరూపముగా గలవాడు."

7. ఉన్నతమైన స్థానమొసగువాడు. అందమైన పెరుందురై నాయకుడు. నా హృదయములో అమరిన సాటిలేని వాడు. వాడు నాలో పెంపొందించినది ఇక జన్మరహితము చేసి, వెగటులేని అమృత జ్ఞానము.
(దైవము పరమానంద స్వరూపము. దానిని అనుభూతిలో (అనుభవములో) తెలుసుకొన్నచో జనన, మరణము లుండవు..)
8. "అన్నిటికి మూలపురుషుడు, అనాది, సనాతనుడు, ఎల్లలులేని శ్రేష్టుడు. అధముడైన నన్ను తన వశము చేసుకొనెను వానికి ఎట్లు కృతజ్ఞత తెలుపవలెనో నాకు తెలియలేదు."
9. "త్రిమూర్తులు, (బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరులు) ముప్పదిమూవురు దేవతలు దర్శింపలేని ఈశ్వరుడు గుర్రముపై ఎక్కి ఈ భూలోకమునకు వచ్చి తనను దర్శింపజేసినది తాను తన భక్తులపై ఉంచిన దయా హృదయమే కదా!"
(ముప్పది మూడు (33) దేవతలు: పదకొండు రుద్రులు, పన్నెండు ఆదిత్యులు, ఎనిమిది వసువులు, రెండు అశ్వనీ దేవతలు. మొత్తము ముప్పది మూడు.)
10. "తిరుపెరుందురై దైవము కోరినవన్నీ ఇచ్చువాడు. మనము వాని నుండి దేనినైనను పొందవచ్చును. మనము చేయవలసినది వాని దివ్య పాద పద్మములనందు ఎడతెరిపి లేని చిత్తముంచుటయే!
11. తిరుపెరుందురై మూలపురుషుడు మనల్ని జన్మరహితము చేసి, మహానందమొసగి, అజ్ఞానమను చీకటిని పారద్రోలి జ్యోతిని నింపువాడు. నా హృదయము వాని దేవాలయమాయెను."
(దైవము నిష్పక్షపాతిగా, అందరి హృదయములో ఉండి, ఆనందమును వారి వారి జీవితములో ఏర్పరచు కారణ భూతుడు.)

## 48. పురాతనమైన చతుర్వేదము

### (అనుభూతిని శంకించడమేల?)

1. "శివుని వేదముల వలన కూడ దరి చేరలేము. నారాయణుడు, బ్రహ్మ వానిని ఎరుగరైరి. ఉన్ననూ వాడు అధముడనైన నాపై కరుణ చూపెను. ఆ కరుణకు కృతజ్ఞతగా నేనేమి చేతును? (ఏమియూ జేయజాలను)"
2. "శివుడు బోధించు శివజ్ఞానమను తేనె ముమ్మలములైన అహంకారము, కామ్యము, మాయ (అజ్ఞానము) లను మూలముతో నశింపజేసి, జన్మతః వచ్చిన కర్మఫలములను వేరుతోపెకలించి వేయును. శివుడు తన భక్త ప్రేమికులకు సులభలభ్యుడు."
3. "అర్జునుడు కొరకు అడవిలో వేటగాడి రూపమునను, సముద్రమున వల పన్ను మత్స్యకారుని

రూపములో వచ్చిన పరమేశ్వరుడు, మన దేశమున (పాండ్యదేశమున) మన కొరకు గుఱ్ఱపు కాపరిగా అవతరించి దర్శన భాగ్యమొసగెను. వానిని స్తుతించి, నమస్కరించిన అన్ని పాపములు నశించి అజ్ఞానమను చీకటి తొలగును"

4. "తిరుపెరుందురైలో కొలచి, నమస్కరించి, స్తుతించు మనవారియొక్క తీవ్ర పాపములు తొలగి, పుట్టిన ఈ జన్మమందే మంచి ఫలములు పొందగలము. లోకమే వారిని ప్రేమతో చూచి స్తుతించు రీతిన జీవించనగును."
(ముక్తికి విత్తనము శివస్తుతియే.)

5. "ఉమాదేవి భాగస్వామిని , తిరువాడుదురై రారాజును, ఉత్తర కోశ మంగై మహాదేవుని దర్శించినచో అన్ని దోషము, దుఃఖములు నామ రూపములు లేక నశించును."
(మన మెంత వరకు శివశక్తికి తలొగ్గియున్నామో, అంతకుమించి మనకు కష్టములుండవు.)

6. "జ్ఞానము పొందుటకు అనుకూలించు కరణములన్నియూ శివుని పూజించుటలో పరమానంద భరితమగును. సుత్తించు భక్తుని యొక్క జన్మదుఃఖము తొలగును. వాని గొప్పమహిమ అటువంటిది. వానిని నోరార, మనస్ఫూర్తిగా స్తుతించెదము గాక!"
(మన తలంపులకన్నీ సాక్షిగా ఉన్నవాని పక్షమున మనము చేరియున్నంత వరకు మన జీవితము శ్రేష్టమగును.)

7. "జన్మ మను ముడిని పోగొట్టు అమృతుని యొక్క దివ్యపాదములను నా హృదయయున కొలువు జేసితిని. సత్యస్వరూపుని ఎల్లలు లేని సుఖమే! మాటలకు చోద్యము కాని మలినములేని మాణిక్యమా! పరబ్రహ్మస్వరూపమా! అని స్తుతించిన వైనమున నేను గట్టెక్కితిని.

# 49. దివ్య సేనతో పరిపాలన

దైవము తన్ను అనుగ్రహంచినందుకే తాను బాహ్యప్రవృత్తిని నిరోధించ గలిగితినని శివానంద భరితముగా ఉన్నట్లు పాడినది. దేవుని పొందగోరు వారికి ఆత్మ సాధనలు చాలా శ్రేష్ఠమైన సేనలే అగును.

1. మత్స్యకారుని రూపములోను, వేటగాడి రూపములోను వచ్చిన ఆ దైవము మనల్ని ఆదుకొనినందు వలన:-
వాని పాదపద్మములను తనివితీర చూచు భాగ్యము కలదో! కన్నులు మాత్రమే కాదు పంచేంద్రియములు నిష్కామ్యములు అగును! అజ్ఞానముతో నిండిన మనస్సులకు లౌకిక జీవితము తృప్తి నొసగునట్లుండును. జ్ఞానము పొందినవారికి తమ పూర్వపు అల్పచేష్టలు గుర్తు ఎరగని వారై యందురు! భూలోకములో ఇక మరు జన్మము పొందకుండా యుందురు!!

జీవన ఉపాధి తొలగిపోయినచో మ్రొక్కుట, మొక్కు దైవము అను భేదముండదు. స్తోత్రము పాడి స్తుతించుటకు సంగీతము, రాగతాళములు నేర్వనక్కర లేదు !
భక్తిపూర్వకముగా ఆడిపాడుట, పరవశపడటము ఇక ఉండదు.
దైవానుగ్రహముచే జన్మఫలము సార్ధకమైన పిదప మిగతవి ఏవియూ అక్కరకు రాజాలవు. (పరమాత్మునకు స్థానవత్యాసములు, కర్మ వత్యాసములు, పక్షపాతములు లేవు. దేవతలు సంతసించుటకు కారణభూతములు ఇవేనని వేరుచేసి చూపునది కూడ ఇక ఉండదు.)

2. లౌకిక జీవితములో దేహము, ప్రాణము అను తత్వము, పంచజ్ఞానేంద్రియములు, పంచ కర్మేంద్రియములు అను విధానము, జీవించడమను నియతి, గలవు. ఇవి బ్రహ్మాండములో లేవు. వృషభ వాహనుడు (శివుడు) నా బుద్ధిలో ప్రవేశించి నిరంతరముగా నిలచి పరమానందముతో మహా దివ్యత్వము అనుగ్రహించిన పిదప ఎటువంటి కర్మలు పనికిరావు. దూడను కోరివెళ్లుతల్లి ఆవువలె కరుణ చూపు పద్ధతి ఏర్పడదు! కారణభూతములైన త్రిగుణము ద్వారా ఏర్పడు ఫలితము లిక ఉండవు ! ఇది మంచిది, చెడ్డది అనునది, పాపపుణ్యములకు భయపడునది ఇక ఉండదు! సత్సంగముతో కలిసి ఉన్నతి పొందవలె నను కోరిక ఏర్పడదు! ఎప్పటికి నా ప్రేమకు పాత్రుడైన అమృతుని పొందినుండ వలెననునది కూడ ఏర్పడదు!!

3. దైవము నాముందు ప్రత్యేక్షమై నాలో లీనమైనందున: ప్రేమతో ఏర్పడు త్రిగుణములును పటాపంచలగును, భక్తితోదైవమును హృదయమున భావించుటలో ఏర్పడిన దృశ్యములు (భావ సమాధి) ఇక అవసరము ఉండదు. ఎల్లలులేని బ్రహ్మాండ స్వరూపమును సృజించడమనునది ఇక  ఉండదు. జన్మకు మూలమైన పరంజ్యోతిని చేరవలెననునది కూడ ఉండదు. ఎర్రపగడపు మోము గల స్త్రీల సాంగత్యము వలన గలుగు కామరోగము శివ స్వరూపములో ఐక్యమైన వారిని ఇక ఇబ్బంది పెట్ట జాలదు. చర్మచక్షువులు పరమాత్మను ధర్శింప జాలవు. అన్నిజన్మములందు దు:ఖము వెంటాడును. ఇంద్రజాలము వంటిది ఈ మాయా జన్మము దుఃఖమును ఏర్పరచునదే!
(సమాధి స్థితిలో మాత్రమే దుఃఖమునకు విమోచనము గలుగును.)

4. నన్ను బానిస చేసుకొన్న ఆ మహాదేవుని అనుగ్రహముచే విముక్తి (మోక్షము) పొందినందున: వాని దివ్యశరీరమును సృజించి సంతోషించడము ఇక ఉండదు. ఎల్లలులేని మహాకరుణా సముద్రమున మునిగి పరమానందము అనుభవించునది ఇక ఉండదు. యోగులకు అంతర్వాణిలో వినబడు అనాహతలు (నాదధ్వనులు – దశ రక శబ్దములు) ఇక వినబడవు. ప్రతిదినము దివ్యవిభూతి ధారణ ఉండదు. దివ్యానుగ్రహము వలన నా దినసేవలు కొనసాగుట జరుగదు. వేదములు  కూడ వివరించలేని పాదపద్మముల సేవ ఇక ఉండదు. ఎర్రని కలువ పూలతో అలంకరించ బడిన దేవుని దివ్యపాదములందు ఈ

అల్లుని శిరస్సు మోపడము ఇక ఉండదు.

5. శివబోధములో జీవబోధము కరిగి లీనమైనపుడు. జరుగునవి, జరగనవి: భూలోక జీవితములో మాయా కార్యములవలన ఏర్పడిన మత్తైన ప్రజ్ఞలు తెగిపోవును. పరమాత్ముని స్వరూపము, నమస్కరించ దగిన బాహ్యవస్తువుగా ఇక ఉండదు. జ్ఞానము లేక నున్నకాలములో నెలకొనిన చంచలములు ఇక ఉండవు. భక్తుల యెడ చూపించు ప్రేమ, దాని మూలమున ఏర్పడు ఆనందము సమాధి స్థితిలో మరిగిపోవును. ఆడ, మగ, నపుంసకము అను లింగభేదములు, ఉపాధులు నశించిపోవును. పలు జన్మములలో జీవించినపుడు జేసిన కల్పితములు ఇక జరగవు. లెక్కలేనన్ని సిద్ధులు నేను పొందుటనునది ఇక జరగదు.

6. నన్ను మున్ముందు ఆదుకొనిన ఆ మహదేవుడు నా తండ్రి! లేచి నన్ను అనుగ్రహించుటచే: బంగారు ఛాయ వంటి శరీరమునకు విబూది పూయుట ఇక జరగదు. మహాతపస్సులు నమస్కరించు దైవము యొక్క పాదపద్మములపై పూల వర్షము కురియుట ఇక జరగదు. మెరుపు తీగ వంటి సన్నని నడుము గల స్త్రీలు పరమాత్ముని మహానుగ్రహము గుర్తించు నపుడు తమ తమ శరీర అందములను చూచుకొనుట ఇక అర్థము లేని దగును. మానవుని పరమానందములో మునుగునట్లు చేయు వీణానాదము సమాధి స్థితిలో ఇక ఉండజాలదు. దివ్యపాద దీక్ష వలన లభించు జ్ఞానము ఇక సమాధిస్థితిలో ఉండజాలదు. దైవ భక్తాగ్రేసరుల మధ్య కొలువైన దర్శనము ఇక ఉండదు. దేవాలయపు పూజా కార్యములలో కొనసాగు నాదవాద్యశబ్ధములు ఇక వినబడజాలవు.

7. ఆ మహాదేవుడు (పరమేశ్వరుడు) చంద్రశేఖరుడు మనల్ని ఆకట్టుకొని మనలో లీనమైన స్థితిలో: నాలుకతో ఉచ్చరించుటలో ఏర్పడు అనాహత శబ్దములు ఇక ఉండవు. సత్వగుణములో నాలోదర్శనమైన కొన్ని ప్రకాశములు గుణాతీతమైన స్థితిలో ఇక ఏర్పడవు. సత్వ మనస్సుకు ఏర్పడు కొన్ని అద్భుత అనుభవములు మనోతీత పరిశుద్ధ స్థితిలో మరి ఏర్పడజాలవు. వంగిన ధనుస్సు వంటి నుదురు గలిగిన స్త్రీల సాంగత్య మత్తు ఇక ఏర్పడదు. దేవతలు కూడ గుర్తెరగని ఉన్నతమైన పరబ్రహ్మము ఒక్కటే అంతటా అవరించి యుండును. దేవుని అష్టగుణములు పొందుట అనునదికూడ ఇక ఉండదు. (దైవ అష్టగుణములు= 1.తన వశీకరత్వము 2. పరిశుద్ధ దేహము 3. సర్వజ్ఞత (పరిపూర్ణత) 4. నిర్మలత్వము 5. నిష్కామత్వము 6. మహానుగ్రహతత్వము 7. సర్వశక్తితత్వము 8. మహానంద తత్వము.)

8. ఆది అంతము లేని ఆ మహాదేవుడు వేదపురుషుడు శివుడు నన్ను ఆదుకొని నాలో లీన మగుటచే: శంఖనాదమునకు సమానమైన ఓంకార నాదము ఇక శబ్దించదు. త్రిగుణముల వలన ఏర్పడిన జాతిభేదములు బ్రహ్మాండములో ఉండజాలదు. మాయ కూర్పులైన

'మంచి, చెడు'లు, అతీతస్థితికి దాటి వెళ్లినపుడు 'మాయ' అధిపత్యము సద్దుమణిగిపోవును. వ్యవహార స్థితిలో ఉండు భక్తులు 'శరణు' పొందుట, దైవమునకు 'దైవసేవలు' చేయుట అనునవి నిర్వికల్ప సమాధి పొందిన పిదప ఉండజాలదు. సమాధి స్థితిలో జీవాత్మ యొక్క జ్ఞానము కనుమరుగై, అసలు మనస్సు లేకుండాపోవును.

(శ్రీ రమణ మహర్షికి ఆశ్రమ వాసములో తన భుజమున ఏర్పడిన తీవ్రమైన వ్రణమును, బాధను జూచిన తన శిష్యులు చాలా బాధపడి "గురునాథా! మీరు ఈ వ్రణమును క్షణములో మాన్పించుకో గలరు. దైవము వద్ద దీని గురించి కోరవచ్చును గదా" అని అడిగిరి. అందులకు రమణులు "దైవము వద్ద కోరుకొనుట, సంకల్పము అవి నాకు లేదే. మనస్సే నాకు లేదాయెనే !" నని అన్నారు.)

అత్యున్నత స్థాయిలో ఉన్నవారికి మనస్సు ఉనికిని కోల్పోవును. మనస్సు నశించును, భక్తాగ్రేసరుల శ్రేష్ఠమైన శివానుభవములు కూడ ఇదని, ఇంతేనని, విచారణ చేయజాలదు. ఆనందతత్వము ఎల్లలు దాటిన వాడు మరలా ఆనందమునకు తిరిగి వచ్చుట లేదు.

# 50. ఆనంద మాల

## (శివానుభవ ప్రీతి)

చిదంబరములో పాడినది ఈ దశకము.

1. "మెరుపుల వలె మెరియు దేవుని దివ్యపాదములు పొందినవారు లౌకిక వ్యవహారముల నుండి దాటిన వారే. ఊర్ధ్వలోకస్థులైన దేవతలు కూడ ఆతని స్వర్ణ పాదములకు పుష్పము అర్చించి స్తుతించుచున్నారు. రాతి వంటి హృదయము గల అల్పుడను నేను. బుద్ధిమంతులచే బహిష్కరించ బడిన వాడను. దుఃఖ సముద్రమున పడి కొట్టు మిట్టాడుటలో నాకు నేనే సరిపాటి. ఇక నేను నీ దరిచేరుటకు దారి చూపి అనుగ్రహింపుమా !"
2. అల్పుడైన నేను, గుర్తించుటకు కూడ వీలుకాని ఒక ఉన్నతమైన స్థానమును నాకు ఇచ్చితివి. దానిని కాపాడుకొనుటకు కూడ నాకు శక్యము కాక, చెడితిని. నీ తప్పు ఏదియూ లేదు. నేను నాకెవరు సహాయపడుదురో అని వాపోతిని. చాలా కాలముగా నిన్ను సేవించుచున్న భక్తులతో చేరక, పీడలకు స్థానములైన ఈ లౌకిక వాంచలను రోగమునకు దాసడనైతిని.
3. "సత్ప్రవర్తన లేనివాడను నేను.వ్రతమో, స్తుతించడమో, వివేకమో లేక కాముకుడనై స్త్రీలతో గంతులేసి, వృధాగా అల్లాడి తిరిగితిని. నా మత్తు వీడుటకు, నాకు ఉపాధి కల్పించి, సత్ప్రవర్తన కల్పించితివి. జన్మరహితమునకు దారి చూపించి, ముక్తిని నొసగువానిని నేనెపుడు వానితో కలియుదునునో తెలియకున్నదే !"

4. పలు విధములుగా చెడితిని, నాకు నేనే చెడు కోరి తెచ్చుకొంటిని. అలా ఉన్ననూ, నీవు నన్ను ఆదుకొన్న పిదప నేను చెడిపోవునట్లు చేసినచో ఆ నింద నీకే కదా మరల చుట్టుకొనును. నీ రక్షణతో ఏమి లాభము? కఠిన నరకములో నన్ను పడనీయక రక్షించి, నన్ను ఆకట్టుకొన్న నాయకా! శివా! నా మనస్సు స్థిరత్వము కోల్పోయినచో అది నీకు మంచిదా?”
5. “తల్లిగా స్తనము లిచ్చి పాలిచ్చువాడా! పాలు ఇవ్వనిచో సంరక్షణ లేని శిశువై పోవుదునో, అనాథగా అల్లాడి పోవుదునో! ఓ సర్వేశ్వరా కరుణాకరా! ఇక కరుణించి అనుగ్రహింపుమా! తల్లి ప్రేమ నీయందు లేదా? ఆదుకొన్న పిదప నన్ను నీవు త్రోసివేయుట న్యాయమా?”
6. “రాజాధిరాజా! నీవు అనుగ్రహించకూడదా? చెడినవాడు మరింత చెడి నాశన మగుట నీతియేనా? నీవు నాయందు దయ చూపనిచో నాయందు వేరెవరు ఆదరణ చూపుదురు? నేను బాగుపడక చచ్చుట ఏమీ న్యాయము? పూర్తిగా మతి భ్రంశము చెందిన నన్ను ఇక నీవు తేట పరచుదువు గాక!”
7. అడవిలోని నక్కలను అందమైన గుర్రములుగా రూపుమార్చి మదురానగరి జనులను ఆశ్చర్యపడునట్లు చేసితివి. ఓ తిరుపెరుందురై మహాదేవా! శివా! అందమైన సత్య స్వరూపివే! అవినాశీ! ఓ తండ్రీ! పాండ్యదేశపు కరుణాసముద్రమా! మహా జ్యోతి స్వరూపా! నేను అన్నీదాటి వచ్చుటకు దారి తెలియకున్నానే! అనుగ్రహింపుమా!”

## 51. అద్భుత దశకము

### (అనుభవ మార్గము)

తిల్లైలో (చిదంబరములో) పాడిన ఈ దశకము శ్రీ మాణిక్యవాచగర్ తనను ఒక అజ్ఞానిగా, సత్ప్రవర్తన లేని, నిర్మలము కాని మనస్సు గలిగిన వాడుగా అభివర్ణించుకొని, తిల్లై నాథుని అనుగ్రహముతో గట్టెక్కి, వానిని స్తుతించి, దైవమును పలువిధములుగా 1. తండ్రిగా 2. నటరాజుగా 3. గురువుగా 4. మహోన్నతుండుగా 5. ఆచార్యుడుగా 6. అనుగ్రహించువాడుగా 7. వేదికుడిగా 8. అన్నింటి సృష్టకర్తగా 9. తల్లిగా (ఉమాదేవి భాగస్వామిగా) వర్ణించి మోక్షమునకు దారి పొందినదై, ఇందు చక్కటి ఇంపైన ప్రాసలలో వర్ణించబడినది.

1. మూర్ఖులతో సహవాసము చేసి ముక్తికి మార్గము తెలియక పడియుంటిని. “నీవు ఉన్నత స్థితి పొందవలెనన్న భక్తియు, అనుగ్రహము కావలెను, నీ మనోకల్మషములు తొలగించవలెనని”, చెప్పి నాతండ్రి శివుడు నా పాపములు తొలగించి తన భక్తునిగా చేసికొనెను. ఇటువంటి అనుగ్రహము ఎవరు పొందగలరు? అద్భుతమేకదా!

(సహజ స్థితిలో కర్మించు మనస్సు సమాధి స్థితిలో ఉండజాలదు. సమాధిలో మనస్సులోని మలినములు తొలగి, కర్మములే లేకుండా పోవును. జన్మవాసనలు మనస్సుని పట్టుకొనియున్న మలినములలో ఒకటి. తన గుణమునకు తగినట్లు మానవులు మంచియో, చెడ్డయో, చేయుచున్నారు. ఆశ యున్నంత వరకు మనస్సును వశము చేసుకోలేము. అజ్ఞానమే ఆశకు స్థానము. బుద్ధితో ఆశను అణచవలెను. ఆశతో కూడిన కోరికలే మనో సంకల్పము. ఆశవీడినచో సంకల్పములు కూడ తొలగిపోవును.)

2. "చెడు దారినే నేను సన్మార్గమని తలంచితిని. అది అధమమైన మార్గమని నటరాజు (శివుడు) చెప్పి నన్ను అనుగ్రహించెను. ప్రేమ మార్గమే గొప్ప మార్గమని చెప్పి దారి చూపెను. నా పాపములు తొలగించి శివమయము చేసుకొన్న ఆ నటరాజు నన్ను దాసుగా చేసుకొన్న ఆ తీరు మరెవరైన పొందగలరా? ఈ అద్భుతమును!"
3. "అసత్యమునే సత్యమని ఎరిగి, స్త్రీల సాంగత్య మత్తులో ఇమిడిన నన్ను అందులో పడనీయక రక్షించి, ఉన్నత స్థితికి దారి చూపిన ఆ మహా గురువు! (శివుడు) అనుగ్రహించినది, తన భాగస్వామి ఉమాదేవితో దర్శన భాగ్యమొసగి, తన పాదములందు చేర్చుకొనినది మరెవరైన పొందగలరా ఈ అద్భుతమును!"
4. "భూమిపై జన్మమెత్తి ఏ ఉపయోగము లేక నశించి పోయుందును. కాని ఎల్లలు లేని కరుణయు, ప్రేమయు నాయందు చూపిన ఆ మహామహుని (శివుడు) కటాక్షమున వలన నా దశమారి, అనుగ్రహము పొంది, దివ్య విభూతి ధరించి, దైవ తత్వము పొందునట్లు చేసినది ఎవరికి దక్కును ఈ భాగ్యము?"
5. కామం కన్నులుతో నిండిన స్త్రీల సాంగత్యములోపడి ఉడుకుతున్న నన్ను విడిపించి, మనః కల్మషములు తొలగించి, సత్య స్వరూపమునకు దారి చూపిన ఆ ఆచార్యుడు (శివుడు)! "నీవు భయపడకుమా!" అని ధైర్యము చెప్పినది ఎవరు పొందగలరు ఈ అభయమును?"
6. ఇది మట్టిలో చేరు దేహము, ఉన్నంత వరకు మండించి, మండించి తుదకు అదే మాడి మసై పొవును. ఇది గ్రహించక, శాశ్వతమని యెంచి పలు పాప కార్యములు చేసియు, స్త్రీల కామవాంఛలో చిక్కి భోగములో మునిగితిని. ఆ సర్వగామి! ఆ సుఖకరుడు నన్ను లౌకిక బంధము, మృగతత్వము నుండి విడిపించి నా పాపములు పోగొట్టి, అనుగ్రహించి, శివపథమును నొసెగెను. ఈ అనుభవము వేరెవరైన పొందగలరా?"
7. "స్త్రీల అందచందములో నిమగ్నుడై, అల్పుడైన నాకు భోగము మరణ ద్వారమని దైవమే బోధించి, ప్రేమయను తాళము తీసి, దారి జూపి నన్ను గట్టెక్కించెను. "ఓం" కార తత్వమును నాకు వైధికునిగా వచ్చి బోధించెను. మరెవరికి ఈ అనుగ్రహము గిట్టును?"
8. "జనన, మరణములను సుడిగుండములో చిక్కుకొని కొట్టు మిట్టాడుతూ, స్త్రీల వలలో,

కామములో చిక్కి తడబాటు నైజము తో ఉన్న నన్ను ఉమాదేవి భాగస్వామియైన ఆ మూలపురుషుడు! (శివుడు) ఆ సర్వవ్యాపి! తన దివ్యపాదములను చేర అనుగ్రహించెను. ఇంతటి అవకాశము వేరెవరైనా పొందగలరా?"

9. "విద్యావినయములు లేని మూర్ఖులతో ఏ యొక్క లక్ష్యము లేక తిరుగుచున్న అధముడైన నన్ను సత్క్రమ మార్గములో నడిపింప నెంచి, ముమ్మలములను నివారించి, నా పాపములు నివర్తింపజేసి, తన వశము చేసుకొని, ఉన్నత స్థానమొసగి, తల్లిగా కరుణించినది ఆ అర్ధనారీశ్వరుడే! ఈ అద్భుతము వేరెవరికి దక్కునా?"

**"తిరువాచగమునకు కరగని వారు మరే వాచకమునకు కరగజాలరు"**

**ఓం తత్సత్**

**సర్వం శివార్పణమస్తు**

**- సమాప్తం -**

# క్లుప్తముగా శివతత్వము

శివతత్వము లన్నియూ మానవుని ఔన్నత్యము కొరకు సూచించునదియే

| | | |
|---|---|---|
| 1. శివం | = | మంగళం, శుభం, శుద్ధం, శాంతం నకు ప్రతీకలు |
| 2. త్రినేత్రుడు | = | కుడికన్ను = సూర్యుని ప్రతీక ఆరోగ్యప్రాప్తికి<br>తిలక స్థానం = అగ్నికి ప్రతీక, జ్ఞాన, తేజోశక్తి చూచించునది.<br>ఎడమకన్ను = చంద్రుని ప్రతీక, జీవకళలకు ఆనందమునకు |
| 3. నీలకంఠుడు | = | లోక రక్షణార్థము కొరకు తాను విషము త్రాగుటచే కంఠము నీలమాయెను. ఇతరులు శ్రేయస్సు, రక్షణ కొరకు తాను కష్టాలు భరించెననుటకు ప్రతీక. |
| 4. అర్థనారీశ్వరుడు | = | స్త్రీ, పురుష సమ్మేళనమే సృష్టికి మూలము. స్త్రీతత్వము, ప్రేమకు, పవిత్రతకు, జీవిత భాగస్వామి ముఖ్యత్వమే ప్రతీకలు. |
| 5. భస్మధారి | = | ప్రతి జీవి, వస్తువులకు జన్మము, ఉత్పత్తి ఉన్నట్లే మరణము, ముగింపు కలదు. అన్నియూ అగ్నికి ఆహుతియైన పిదప ఇక మిగులునది భస్మమే. అందులకే తాను భస్మదారి అయ్యెను. |
| 6. శ్మశాన వాసి | = | ప్రతి జీవికి అంతిమ యాత్ర శ్మశానమునకే. ఆ శ్మశానమే ఆఖరి కనుక తాను శ్మశానవాసి అయ్యెను. |
| 7. చంద్రశేఖరుడు | = | చంద్రకళలు, జీవితకళలు ఆనందము వాటి ప్రకాశమే జీవిత ఔన్నత్యమునకు ప్రతీకలు. కావున తను నెలవంక ధరించెను. |
| 8. గంగాధరుడు | = | స్వచ్ఛతకు, పవిత్రతకు, ప్రవాహమునకు గంగయే ప్రతీక. గంగను జటయందు ధరించి దాని ప్రవాహమును సక్రమ మార్గములో నియత్రించి లోక కల్యాణము నెలకొల్పెను. |
| 9. నటరాజు | = | జనన, మరణములకు మధ్యనున్న కాలములో ఆనందమయముగా జీవితము సాగవలెనను కాంక్షతో తాను నటరాజుగా, తాండవ ప్రియుడుగా నాట్యమాడెను. |
| 10. సర్ప, కపాలధారి | = | అన్ని అరిష్టములకు భయపడక ఎదురొడ్డి పోరాడవలెనను తత్వము భోదించుటకు తాను విష సర్పములను ఆభరణములుగాను, కపాలములను మాలగా ధరించెను. |

11. ధ్యానశీలి = లోక కల్యాణార్థము కొరకు ఏ పని చేసినను పట్టుతో, దీక్షతో చేయవలెనను తత్వమును బోధించుటకే తాను తపస్వీ అయ్యెను.

12. పశుపతి = జగజ్జీవన వైవిధ్యమును నెలకొల్పిన మహామహుడు శివుడు. మానవులకే కాక పశు, పక్షాదులు, జంతువులకు తుదకు కీటకములకు తాను కరుణామూర్తి అని చాటుకొనెను. చిత్తశుద్ధితో, అచంచల భక్తితో చేసిన పూజలందుకొని భక్త కన్నప్పకు, ఏనుగునకు, పామునకు, సాలెపురుగునకు తన దివ్య దర్శనమిచ్చి, శివ సాయుజ్యము (ముక్తిని) నొసగి తాను సులభలభ్యుడని పేరు గాంచెను.

ఇట్లు శివతత్వములు అనేకము. వీటిని సగటు మనిషి అవలంబించి తమ తమ జీవిత ఔన్నత్యము కొరకు పాటుపడి ముక్తికి సుగమనము చేసుకొనవలెను. శివతత్వములన్నియూ దర్శనియతి, ఆనందము, ధైర్యము, కర్తవ్యము, విరక్తి భావన, విచారణ, సృష్టితత్వము, జీవఈశ్వర ఐక్యమును బోధించునవే.

## సర్వం శివార్పణమస్తు

# స్వీయ పరిచయము



శెవ్వాన రంగనాయకులు కృష్ణారావు M.Com., P.G.D.C.A, (ICWA) పుట్టి పెరిగినది, చదువుకున్నది మద్రాసులో. తండ్రి, తాతగార్లు శ్రీకాకుళము జిల్లాలోని హిరమండల తాలూక సువలై గ్రామస్తులు, పిదప మద్రాసుకు వలస. నా ఉద్యోగము Binny Ltd. మద్రాసు, కోయంబత్తూరులోను, కాస్ట్ అక్కౌంటింగ్ సీనియర్ మేనేజర్‌గా పనిచేసి పదవి విరమణ అనంతరము విశాఖపట్టణములో స్థిర నివాసము. పెద్దలు వంద సం॥ల పైగా మద్రాసులో నివాసము వలన తమిళ భాషలో పట్టుతో, అచ్చుతేనె తెనుగుపై ప్రేమతో, మాతృభాషాభిమానము వలన, తెలుగువారికి సాహితి రంగమున చేయదగిన సహాయము చేయగోరి, నేను చేసిన చిన్న ప్రయత్నము. ఇది వరకే మా గురువుగారి ఆనతి ప్రకారము, తను రచించిన తమిళములోని **"సాంఖ్యయోగము"**ను మరియు **తిరుక్కురళ్, తిరుప్పావై-తిరుపల్లాండు,** ప్రస్తుతం **తిరువాచకం** నాచే తెలుగున అనువదించబడినదని సవినయముగా తెలియజేస్తున్నాను.

E-mail ID: sevvanakrishna@yahoo.com

Cell: 9704655002